సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 192
బుధవారం 2-10-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'



ధనాధన్ గెలుపు
రెండో టెస్టులోనూ బంగ్లాదేశ్‌ను ఓడించి సిరీస్‌ను 2-0తో నెగ్గిన భారత్ -16లో



ఈ-టూ వీలర్‌కు 10వేల సబ్సిడీ
కిలోవాట్ అవర్‌కు 5 వేలు. పీఎం ఈ-డ్రైవ్‌కు రూ.10,900 కోట్లు -17లో




తుపాకీ పేలి గోవిందాకు గాయం
నటుడు గోవిందా కాలికి బుల్లెట్ గాయమైంది. ఉదయం చేతిలో ఉన్న రివాల్వర్ అనుకోకుండా పేలిందని పోలీసులు తెలిపారు.
వివరాలు 6లో ▸



రజనీకాంత్‌కు స్టెంట్
రజనీకాంత్ అనారోగ్యం కారణంగా చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరారు. రక్త నాళంలో స్టెంట్ వేసినట్లు వైద్యులు తెలిపారు.
వివరాలు 6లో ▸



మూడో విడతలో 68.72%
జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడో విడతలో జరిగిన పోలింగ్‌లో 68.72 శాతం ఓటింగ్ నమోదైందని ఈసీ తెలిపింది.
వివరాలు 6లో ▸



బాపూ సమరం.. తెరపై చూపుదాం
మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గాంధీపై వచ్చిన కొన్ని సినిమాలు. అలాగే గాంధీగారి వల్ల వచ్చిన సినిమాలపై కథనం
వివరాలు 15లో ▸



అక్రమమైనా జనావాసాల
జోలికి వెళ్లం
హైడ్రా కమిషనర్ రంగనాథ్
'మీతో సాక్షి' సందేహాలకు, ప్రశ్నలకు సమాధానాలు 2లో

'బుల్డోజర్' ప్రభుత్వంగా
మారొద్దు!
సామాన్యులపై కొరడా ఝళిపించి పార్టీకి చెడ్డపేరు తేవొద్దు
- అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై సంయమనంతో వ్యవహరించండి
- సీఎం రేవంత్‌రెడ్డికి మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ హితోపదేశం

- వివరాలు 2లో


జెరూసలేంపై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను తిప్పికొడుతున్న ఇజ్రాయెల్

మధ్యప్రాచ్యంలో యుద్ధ భేరి
6లో

ఇజ్రాయెల్‌పై ఇరాన్ భారీ దాడులు
వందలాది బాలిస్టిక్ క్షిపణులు, రాకెట్ల ప్రయోగం

- టెల్ అవీవ్, జెరూసలేంల్లో విధ్వంసం
- విమానాశ్రయాల మూత, సైరన్ మోతలు
- జనం కకావికలు, బంకర్ల దిశగా పరుగులు
- హనియా, నస్రల్లా మృతికి ప్రతీకారం: ఇరాన్
- ఇది ఆరంభం మాత్రమేనని ప్రకటన
- జోర్డాన్ రాజధాని అమ్మాన్‌పైకీ మిసైళ్లు
- భారీ మూల్యం తప్పదన్న అమెరికా
- ఇజ్రాయెల్‌కు దన్నుగా నిలుస్తాం: బైడెన్
- లెబనాన్‌పై ఇజ్రాయెల్ భూతల దాడులు
- పూర్తిస్థాయి యుద్ధం దిశగా పరిణామాలు

గోల్నాకలో మూసీ నిర్వాసితులకు భరోసా ఇస్తున్న మాజీ మంత్రి కేటీఆర్


కాంగ్రెస్‌కు ఓటు వేయనందుకే కూల్చివేతలు
- నగర ప్రజలపై పగబట్టిన సీఎం రేవంత్‌రెడ్డి
- పేదల ఇళ్లు కూలుస్తామంటే చూస్తూ ఊరుకోం
- గోల్నాకలో మూసీ బాధితులకు కేటీఆర్ భరోసా

8లో

నిత్యం ప్రజాక్షేత్రంలోనే..!


- కార్యాచరణపై బీఆర్ఎస్ కసరత్తు
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా ముందుకు
- దసరా తర్వాత ఆరు గ్యారంటీల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి

8లో


మహేశ్వర్‌రెడ్డికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న కర్ణాటక ఎమ్మెల్యే అభయ్‌పాటిల్. చిత్రంలో ఈటల, ధర్మపురి అర్వింద్, పొంగులేటి

ప్రజలను ఏడిపించి ఆనందిస్తున్నారు
- రైతు హామీల సాధన దీక్ష ముగింపులో సీఎం రేవంత్‌పై బీజేపీ ఎంపీ ఈటల ధ్వజం -8లో

అక్రమమైనా జనావాసాల జోలికి వెళ్లం

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాజధాని చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న జలవనరులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈ ప్రత్యేక విభాగం కార్యకలాపాలపై సామాన్యులను అనేక సందేహాలు వెంటాడుతున్నాయి. ఎప్పుడు, ఎక్కడ నుంచి, ఏ బుల్డోజర్ వస్తుందో అనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని కొన్ని విభాగాలతో పాటు కొందరు వ్యక్తులూ రెచ్చిపోతున్నారు. 'సందట్లో సడేమియా'లా నోటీసులు, బెదిరింపులతో లబ్ధి పొందే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 'మీతో సాక్షి' సామాన్యుల్లో ఉన్న అనేక అనుమానాలను నివృత్తి చేసే ప్రయత్నం చేసింది. వాట్సాప్ ద్వారా అనేకమంది పంపించిన ప్రశ్నలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లింది. వీరిలో అత్యధికులు తమ పేర్లు గోప్యంగా ఉంచాలని కోరడం గమనార్హం. కాగా ఆయా ప్రశ్నలకు రంగనాథ్ చెప్పిన సమాధానాలు ఇలా ఉన్నాయి..

మీతో సాక్షి

ప్రకృతిని రక్షిస్తేనే.. మన హైదరాబాద్‌కు భవిష్యత్తు. ప్రకృతిని కాపాడే దిశగా ప్రభుత్వం, మీరు తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. అయితే ప్రస్తుతం ఉన్న చట్టాలే గతంలోనూ ఉన్నాయి. చెరువులు, కుంటల్లో పట్టా ల్యాండ్‌లు ఉంటే నిర్మాణాలకు అనుమతులు ఇవ్వవద్దని చట్టంలో ఉంది. అయినా రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటీ అధికారులు అన్ని అనుమతులు ఇచ్చేశారు. దీంతో నాతో పాటు అనేక మంది మధ్య తరగతికి చెందినవారం ఈఎంఐ లోన్లతో ఇళ్లు కట్టుకున్నాం. వాటిని ఇప్పుడు మీరు కూల్చేస్తామంటే ఎలా? తొలుత మాకు అనుమతులు ఇచ్చిన అధికారులందరినీ శిక్షించి, ఆ తర్వాత మా వద్దకు రావడం న్యాయం కదా!

- జయంత్‌నాథ్, ముషీరాబాద్

జవాబు: అక్రమ నిర్మాణం అయినప్పటికీ ఇప్పటికే ప్రజలు నివసిస్తుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ వాటి జోలికి వెళ్లం. ఈ విషయంలో ప్రభుత్వం కూడా స్పష్టంగా సామాన్యుడికి అండగా నిలవాలనే చెప్తోంది. అవసరమైన, చెల్లుబాటు అయ్యే అన్ని అనుమతులు ఉన్న కమర్షియల్ భవనాలనూ కూల్చం. జలవనరుల పరిరక్షణలో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న వాటి పైనే కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా నిర్మించిన లేదా అనుమతులు రద్దు చేసిన నిర్మాణాలను మాత్రమే కూల్చేస్తాం. ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టిన బిల్డర్లపై మాత్రం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. ఆ అనుమతులు మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి లేదా సంబంధిత శాఖకు నివేదిస్తాం. ఎవరైనా ప్లాట్, ఫ్లాట్ ఖరీదు చేసుకునే ముందు పూర్తి వివరాలు సరిచూసుకోండి.

హైదరాబాద్ నగరాన్ని కాపాడేందుకు మీరు తీసుకుంటున్న చర్యలు భేష్. కానీ పెద్దలకు, పేదలకు ఒకే న్యాయం అమలు చేయాలి. పెద్దలకు నోటీసులు ఇస్తున్నారు. పేదలకు మాత్రం నోటీసు లేకుండానే కూల్చేస్తున్నారు. ముఖ్యంగా దుర్గంచెరువు, రామాంతపూర్ చెరువు విషయంలో అదే జరిగింది. పేదలు లక్షల రూపాయలు వెచ్చించి కోర్టులకు వెళ్లలేరు. పెద్దలు మాత్రం వెళ్లి తమ అక్రమాలను కప్పిపుచ్చుకుంటున్నారు. అందరికీ ఒకే న్యాయం మీరు అమలు చేయగలరా?

- జీవానందరెడ్డి, బంజారాహిల్స్

జవాబు: హైడ్రా ఎలాంటి నోటీసులూ ఇవ్వదు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం జలవనరుల్లో ఉన్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడానికి ఎలాంటి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ మేం అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. హైడ్రా పేద ప్రజల వైపే ఉండాలని ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. ఎన్‌-కన్వెన్షన్, జవహర్‌నగర్ చెరువు వద్ద ఇదే సూత్రాన్ని పాటించాం. సరైన అనుమతులు లేకుండా నిర్మించిన ఎన్‌-కన్వెన్షన్‌ను కూల్చినప్పటికీ.. అదే చెరువు కట్టపై మరోపక్క ఉన్న పేదల ఇళ్ల జోలికి వెళ్లలేదు. జవహర్‌నగర్ చెరువు దగ్గర ఉన్న నివాసాలను కూడా ముట్టుకోలేదన్నది గమనించాలి.

మేడ్చల్‌లోని గాలిల్లాపూర్ గ్రామానికి సంబంధించి ఎఫ్‌టీఎల్స్, బఫర్ జోన్లపై అనేక అనుమానాలు ఉన్నాయి. వీటిపై స్పష్టత ఇవ్వగలరా?

- శ్రీనివాస్

జవాబు: మీ గ్రామంలో ఉన్న చెరువు, కుంట పేరు చెప్తే అవకాశం ఉంటుంది. లేదంటే స్థానిక ఇరిగేషన్ అధికారులను సంప్రదించినా, లేదా హెచ్‌ఎండీఏకు చెందిన అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించినా మీకు సమాచారం లభిస్తుంది.

శంషాబాద్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. గత నెల్లో హైడ్రాకు ఫిర్యాదు చేశాం. దానిపై త్వరగా చర్యలు తీసుకోండి.

- ప్రకాశ్‌కుమార్, శంషాబాద్

జవాబు: హైడ్రాకు సిబ్బంది కేటాయింపు ప్రక్రియ పూర్తికాలేదు. ప్రస్తుతం అతికొద్ది మందితోనే పని చేస్తున్నాం. ఫిర్యాదులు మాత్రం దాదాపు ఐదు వేలకు పైగా వచ్చాయి. ఈ కారణంగానే విచారణ పూర్తి చేసి, చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోంది. అయితే ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటాం.



ప్రజల ప్రశ్నలకు బదులిస్తున్న కమిషనర్ ఏవీ రంగనాథ్

జల్‌పల్లి పెద్ద చెరువులో అక్రమంగా అనేక నిర్మాణాలు చేపడుతున్నారు. మిషన్ భగీరథకు సంబంధించిన వాటర్‌ట్యాంక్‌ను రోడ్డుకు అడ్డంగా కట్టారు. దీన్ని ఆధారంగా చేసుకునే ఓ కంపెనీ రోడ్డును ఆక్రమిస్తోంది. వీటిపై చర్యలు తీసుకోండి.

- పేరు గోప్యంగా ఉంచాలని కోరిన వ్యక్తి

జవాబు: హైడ్రా బృందాన్ని త్వరలో ఆ ప్రాంతానికి పంపిస్తాం. పెద్దచెరువుతో పాటు శ్రీరామ కాలనీ చుట్టు పక్కల ప్రాంతాలపై అధ్యయనం చేయిస్తాం. ఎలాంటి ఆక్రమణలు, అతిక్రమణలు ఉన్నా చర్యలు తీసుకుంటాం.

కొందరు రాజకీయ నాయకులకు చెందిన విద్యాసంస్థల్ని కూల్చడానికి ఎందుకు వెనకాడుతున్నారు? మీ దృష్టిలో అవి అక్రమ నిర్మాణాలు కావా?

- రాజేంద్రకుమార్, నారాయణగూడ

జవాబు: అలాంటి అక్రమ నిర్మాణం ఎవరిదైనా ఉపేక్షించం. అయితే ఇల్లు అనేది ఓ కుటుంబానికి సంబంధించిన అంశం. వాణిజ్య సముదాయం కొందరికే సొంతమైన వ్యవహారం. కానీ విద్యా సంస్థల విషయం అలా కాదు... దాని కూల్చివేత ప్రభావం వందలు, వేల మంది విద్యార్థులు, వారి భవిష్యత్తుపై ఉంటుంది. అందువల్ల వీటిపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటాం.

దుర్గం చెరువులో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటికి నోటీసులు ఇచ్చి ఊరుకున్నారు. ఎందుకు కూల్చట్లేదు? ఇప్పుడు మూసీ పరీవాహక ప్రాంతంపై ఎందుకు పడ్డారు?

- పేరు చెప్పని 'సాక్షి' పాఠకుడు

మూసీ పరీవాహక ప్రాంతంలో జరుగుతున్న సర్వే, కూల్చివేతలతో హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదు. హైడ్రా ఇప్పటివరకు ఎవరికీ, ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. దుర్గం చెరువు సహా నగరంలోని 11 చెరువులను పునరుద్ధరించి, పరిరక్షించాలని కోరుతూ 2007లో హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై కోర్టు అడ్వకేట్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ చర్యల్లో భాగంగా రెవెన్యూ అధికారులు ఆయా చెరువుల పరిధిలో నివసిస్తున్న వేల మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆ 11 చెరువుల అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది.

బతుకులకుంట చెరువు సమీపంలో ఆరేళ్ల క్రితం ఓపెన్ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నా. ఆ సమయంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లకు సంబంధించిన గుర్తులు లేవు. అది పక్కా పట్టా భూమి అని చెప్పి అమ్మారు. ఇద్దరు ఆడపిల్లలపై చదువులు, పెళ్లిళ్లు దృష్టిలో ఉంచుకుని ఆ ప్లాట్ కొన్నా. ఇప్పుడు నా పరిస్థితి ఏంటి?

- నాగిరెడ్డి, హయత్‌నగర్

జవాబు: ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోనూ పట్టా భూములు ఉంటాయి. అయితే అది ఏ తరహా పట్టా అన్నది తెలుసుకోవాలి. కొన్ని భూముల్ని కేవలం వ్యవసాయం కోసం మాత్రమే వినియోగించాలి. ఆయా పట్టాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

అమీన్‌పూర్‌లో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నాలుగు నెలల క్రితం ఓ ఫ్లాట్ బుక్ చేసుకున్నా. బంధంకొమ్ము చెరువు ప్రాంతంలో ఉన్న ఆ అపార్ట్‌మెంట్ ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. అది అక్రమ కట్టడమా? సక్రమ కట్టడమా? ఎలా తెలుసుకోవాలి?

- పేరు వెల్లడించని వ్యక్తి

జవాబు: అమీర్‌పూర్ ప్రాంతంలోనే కాదు.. ఎక్కడ స్థిరాస్తి కొనుగోలు చేస్తు న్నా 3 అంశాలు సరిచూసుకోండి. ఆ నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? అవి ఇవ్వాల్సిన విభాగాలే ఇచ్చిన అనుమతులేనా? ఆ అనుమతుల్ని రద్దు చేయడం వంటివి జరిగాయా? అనేది చూసుకోండి. అమీన్‌పూర్‌లో కొన్ని నిర్మాణాలకు హెచ్‌ఎండీఏకు బదులు పంచాయతీ సెక్రటరీ, ఆర్‌ఐలు అనుమతులు మంజూరు చేశారు. వీటిని గతంలోనే రద్దు చేసిన ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకున్నారు. ఇలాంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ముందుకు వెళ్లండి.

మేము 2010లో ప్లాట్ కొనుక్కుని అన్ని అనుమతులతో ఇల్లు కట్టుకున్నాం. కానీ ఇప్పుడు మీ ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందంటూ స్థానిక నాయకులు బెదిరిస్తున్నారు. వాస్తవానికి మా ఇంటి పరిధిలో ఎలాంటి చెరువు, కుంట ఉన్న ఆనవాళ్లు లేవు. ఎప్పుడు వరద, నీళ్లు రాలేదు. కానీ రికార్డుల్లో కుంట ఉందని, ఎఫ్‌టీఎల్‌లో మీ ఏరియా వస్తుందని అంటున్నారు. ఇప్పుడు మమ్మల్ని ఏం చేయమంటారు?


- ఎం.సంజీవరెడ్డి, బోడుప్పల్

ప్రస్తుతం ఆ ప్రాంతంలో కుంట, చెరువు కనిపించకపోయినప్పటికీ ఒకప్పుడు ఉండి ఉండొచ్చు. అందుకే రికార్డుల్లో జలవనరు ఉన్నట్లు నమోదైంది. ఇప్పటికే నిర్మాణం పూర్తయి, అందులో నివాసం ఉంటున్న ఇల్లు చెరువులో ఉన్నప్పటికీ భయపడాల్సిన పని లేదు. అలాంటి వాటి జోలికి వెళ్లం. వీటిపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరతాం. ప్రస్తుతం ఉన్న చెరువులు, కుంటల్ని పూర్తి స్థాయిలో పరిరక్షణ చేయడానికే కట్టుబడి ఉన్నాం. ఎవరైనా ఇలాంటి బెదిరింపులకు దిగితే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయండి.

'బుల్డోజర్' ప్రభుత్వంగా మారొద్దు!

సామాన్యులపై కొరడా ఝుళిపించి పార్టీకి చెడ్డపేరు తేవొద్దు

- రాష్ట్రంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై సంయమనంతో వ్యవహరించండి
- సీఎం రేవంత్‌రెడ్డికి మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ హితోపదేశం
- ఏఐసీసీకి ఇప్పటికే ఫిర్యాదులు అందినట్లు వెల్లడి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 'బుల్డోజర్ సంస్కృతి'పై కాంగ్రెస్ పోరాడుతున్న విషయం గుర్తుచేసిన నేతలు
- దసరాకు ముందే నామినేటెడ్ పదవుల భర్తీ, మంత్రివర్గ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మూసీ సుందరీకరణ, చెరువుల పరిరక్షణ, హైదరాబాద్ అభివృద్ధి పేరిట అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో కూలి్చవేయడంపై ఆచితూచి వ్యవహరించాలని కాంగ్రెస్ అధిష్టానం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హితోపదేశం చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పౌరుల హక్కులను హరించి వారిని రోడ్డుపాలు చేసేలా అమానవీయంగా వ్యవహరించొద్దని, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా అధికార కొరడాను సామాన్యులపై ఝుళిపించవద్దని ఏఐసీసీ పెద్దలు సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనుసరిస్తున్న బుల్డోజర్ సంస్కృతిపై రాజకీయ, న్యాయ వేదికలపై కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తున్న పోరాటాన్ని ముఖ్యమంత్రికి గుర్తుచేశారు. అదే తరహా బుల్డోజర్ విధానాన్ని కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో అమలు చేయడం పార్టీ ప్రతిష్టకు భంగకరమని వ్యాఖ్యానించారు. ఇటీవల జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించడంతో పాటు రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై పెద్దలతో చర్చించేందుకు సోమవారం రాత్రి ఢిల్లీ వచ్చిన రేవంత్‌రెడ్డి మంగళవారం ఖర్గేతో పాటు పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో విడివిడిగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పరిస్థితులు, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలపై చర్చించారు.

ఆ చెడ్డపేరు మనకొద్దు..

హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొనసాగుతున్న హైడ్రా కూల్చివేతలు, నిర్వాసితుల నిరసనలు, ప్రతిపక్షాల ఆందోళనలు ఆయా భేటీల్లో చర్చకు వచ్చినట్లు తెలిసింది. మూసీ పరీవాహక అభివృద్ధి విషయంలో ప్రభుత్వ లక్ష్యం, దానికోసం తీసుకున్న కార్యాచరణ, నిర్వాసితులకు ప్రభుత్వ పరంగా అందజేయనున్న మద్దతు వంటి అంశాలను సీఎం వివరించారు. ఈ సందర్భంగా ఖర్గే స్పందిస్తూ.. 'అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ప్రభుత్వం తీసుకునే కార్యాచరణలో ముందుగా నష్టపోయేది, రోడ్డున పడేది నిమ్న వర్గాల ప్రజలే. అక్రమ నిర్మాణాల కూల్చివేతలు వంటి కార్యక్రమాల్లో నిందితులు ఒకరైతే, బాధితులు ఇంకొకరు ఉంటారు. నిమ్న వర్గాల పట్ల ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరిస్తోందనే అపవాదును ఒకసారి మూటగట్టుకుంటే దానిని తుడిచెయ్యడం అంత సులభం కాదు. అందుకే సంయమనంతో వ్యవహరించండి. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూల్చివేతలపై కాంగ్రెస్ పక్షాన నేనూ, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నాం. బుల్డోజర్ పాలసీని వ్యతిరేకిస్తూ మన పార్టీ నేతలు, క్షేత్రస్థాయి కార్యకర్తలు ఆందోళనలు చేస్తున్నారు. కోర్టుల్లోనూ కొట్లాడుతున్నాం. ఇలాంటి నేపథ్యంలో మనది కూడా బుల్డోజర్ ప్రభుత్వం అనే చెడ్డపేరు రాకూడదు..'అని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ అంశంలో ఇప్పటికే ఏఐసీసీకి ఫిర్యాదులు అందాయని, సొంత పార్టీ నేతలు సైతం ప్రభుత్వ విధానాన్ని తప్పుపడుతూ తమకు లేఖలు రాసినట్లుగా ఖర్గే చెప్పినట్లు సమాచారం. కాగా పునరావాసం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు వంటి వాటిద్వారా నిరాశ్రయులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నామని రేవంత్‌రెడ్డి వివరించినట్లుగా సమాచారం. కాగా ఖర్గే తరహాలోనే కేసీ వేణుగోపాల్ సైతం ఈ వ్యవహారంపై స్పందించినట్లు ఏఐసీసీ వర్గాలు వెల్లడించాయి.

దసరాకు ముందే..

మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపై కూడా చర్చించినట్లు తెలిసింది. నామినేటెడ్ పదవుల భర్తీపై పీసీసీ అధ్యక్షుడితో సహా ఇతర సీనియర్లను సంప్రదించి నియామకాలు చేసుకోవచ్చని పెద్దలు సూచించినట్లు సమాచారం. ఇతర పార్టీల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలకు కూడా నామినేటెడ్ పదవుల్లో కీలక కార్పొరేషన్లు ఇచ్చేందుకు వారు అంగీకరించినట్లు తెలిసింది. దసరాకు ముందే 25కు పైగా కార్పొరేషన్ చైర్మన్ పదవులు భర్తీ చేసే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. ఇక మంత్రివర్గ విస్తరణపై ఈ నెల 5 తర్వాత మరోమారు చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ఏఐసీసీ పెద్దలు చెప్పినట్లు తెలిసింది. దసరాకు ముందే విస్తరణ ఉంటుందనే సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. కాగా రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీతో కూడా భేటీ అయిన రేవంత్, అనంతరం హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.

ఎంఎస్ఎంఈ పాలసీలో బీసీలకు సబ్సిడీలు

- మార్పుచేర్పులకు మంత్రి పొన్నం మేథోమథన సదస్సు
- ఇతర వర్గాలకు ఇచ్చినట్లే బీసీలకూ ప్రయోజనాలు కల్పించాలని సూచనలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఎంఎస్ఎంఈ– 2024 పాలసీలో ఇతర వర్గాలకు ఇచ్చిన మాదిరిగా బీసీలకూ ప్రయోజనాలు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి బీసీ సంక్షేమ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ క్రమంలో మంగళవారం సెక్రటేరియట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావుతో కలిసి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మేధావులు, రిటైర్డ్ ఐఏఎస్‌లు, బీసీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, పారిశ్రామికవేత్తలతో మేథోమథన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఎంఎస్ఎంఈ రిటైర్డు జాతీయ డైరెక్టర్ ఆఫ్ జనరల్ చుక్కా కొండయ్యతో పాటు రిటైర్డు ఐఏఎస్‌లు, మేధావులు, పారిశ్రామికవేత్తలతో కలిపి కమిటీ వేయాలని నిర్ణయించారు. ఎంఎస్ఎంఈలో బీసీలకు సంబంధించిన అంశాలను చేర్చేందుకు వారి సలహా సూచనలు తీసుకొని అందులో చేర్చాల్సిన అంశాలపై కమిటీ నిర్ణయం తీసుకోనుంది. కేశవరావు మాట్లాడుతూ బీసీలకు సబ్సిడీలు కల్పిస్తే వారితో పారిశ్రామికాభివృద్ధి సాధించవచ్చని సూచించారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈ పాలసీలో బీసీలకు సబ్సిడీలు ఇతర అంశాలు చేరిస్తే లక్షలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు దొరకడంతో పాటు స్వతహాగా కులవృత్తులు ఆధునిక సాంకేతికతతో ఆర్థికవృద్ధి సాధించేందుకు ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతి బీసీ కుటుంబం ఒక సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమ అని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అన్నారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, వీర్లపల్లి శంకర్, కమిషనర్ బాల మాయాదేవి, రిటైర్డు ఐఏఎస్‌లు చిరంజీవులు, చొలేటి ప్రభాకర్, దినకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో సమూల మార్పులు

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విద్యారంగ వ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నామని, బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలను ప్రతి ఐఏఎస్, ఐపీఎస్, ఎమ్మెల్యేలు సందర్శించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంగళవారం సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించి బీసీ సంక్షేమ శాఖలో ఉన్నా సమస్యలపై చర్చించారు. బీసీ సంక్షేమ శాఖలో ఉన్న సమస్యలపై చర్చించారు. అధికారులు నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. నవంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గురుకులాలు సందర్శిస్తానని తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కమిషనర్ బాల మాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వలేం: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: హైడ్రాను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోపై ఎలాంటి వాదనలు వినకుండా, స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేస్తూ, ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం అలియాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 119/21, 22 ఉన్న తమ నిర్మాణాలను కూలగొట్టడంపై డి.లక్ష్మి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైడ్రా ఏర్పాటు చేస్తూ చట్టవిరుద్ధంగా జారీ చేసిన జీవో 99 కొట్టివేయాలని, దానికి ఎలాంటి చట్టబద్ధత లేదన్నారు. నోడల్ ఏజెన్సీ అయిన హైడ్రా విశేషమైన అధికారాలు చెలాయించడం చెల్లదని, జీవోలోని నిబంధనలను ఉల్లంఘించేలా అధికారులు వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎలాంటి నోటీసు లేకుండా పట్టా భూముల్లోని నిర్మాణాలను కూల్చడం అన్యాయమన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. జీవోపై స్టే ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ వాదనలు వినకుండా జీవోను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇవ్వలేమని న్యాయమూర్తి చెప్పారు.

ఇదం జగత్



మన పార్టీలోనే మన మీద ఇంత వ్యతిరేకత ఉంటే.. బయట ఇంకెంత ఉన్నదో సార్!


SMART BAZAAR
పండుగ కొనుగోలు పూర్తి చేసుకోవటానికి, స్మార్ట్ బజార్ కు విచ్చేయండి
దసరా రెడీ సేల్
2nd - 6th Oct
రుచికరమైన వంటకం చేసుకోండి
₹209
పారిస్ వైట్ లేబుల్ సల్ఫర్ ఫ్రీ చక్కెర 5 kg
గుడ్ లైఫ్ డైలీ రైస్ 26 kg
₹1359
గుడ్ లైఫ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ / ప్రియ డబుల్ ఫిల్టర్డ్ వేరుశెనగ ఆయిల్ 1 L
₹117/ ₹156
₹365/ ₹459
గుడ్ లైఫ్ ఆల్మండ్ / జీడిపప్పు (W320) 500 g
పండుగలోని మాధుర్యం పెంచుకోండి
BUY ANY 1 GET ANY 1 FREE
BUY ANY 2 GET ANY 1 FREE
చాకొలెట్ హోమ్ ప్యాక్ (క్యాడ్బరీ పర్క్ / డైరీ మిల్క్ / జెమ్స్ / 5 స్టార్ / నెస్లే కిట్‌కాట్ / మంచ్) 115.5 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
పక్కి / ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ వీట్ ఆటా 5 kg
₹199/ ₹295
విజయా ఘీ 1 L
₹559
₹189
అమూల్ కాజు కత్లి 200 g / 500 g
₹80
టాటా టీ చక్ర గోల్డ్ ప్రీమియం టీ 500 g
బిస్కెట్స్ 275 g మొదలుకుని / లోట్టే చోకో పై 336 g (12 Pcs) (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 2 GET ANY 1 FREE
BUY ANY 3 GET ANY 1 FREE
స్ప్రైట్ / కోకో-కోలా / థమ్సప్ / మాజా 600 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
అందంగా పండుగ జరుపుకోండి
ప్రతిఒక్కరికి తగిన గిఫ్ట్
₹4999
బ్రాండెడ్ 3 పీసెస్ ట్రాలీ సెట్ (ఎంపిక శ్రేణి)
₹699
LA OPALA ఓపల్ వేర్ డిన్నర్ సెట్ 12 యూనిట్స్
BUY 1 GET 2 FREE
కాటన్ డబుల్ బెడ్ షీట్ (సెలెక్ట్ వేరియంట్స్)
₹99
దీపావళి ఎల్ఈడీ లైట్ రేంజ్
BERGNER 3 పీసెస్ స్టెయిన్ లెస్ స్టీల్ ట్రైప్లీ కుక్‌వేర్ సెట్
₹1799
స్పెషల్ ఫ్యాషన్ ఆఫర్లు
₹199 లో ఫ్యాషన్ ప్రారంభం
₹799
₹499
₹3000-₹4999
₹5000
₹149
₹1500-₹2999
పండుగ వేడుకలు చేసుకోండి
మెన్స్ అండ్ ఉమెన్స్ డియో 135 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 1 GET ANY 1 FREE
BUY 1 GET 1 FREE
బ్యూటీ ఎసెన్షియల్స్ 0.35 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
40%
డవ్ / పియర్స్ / ఫియామా జెల్ బార్ 125 g x 4 +1 / లక్స్ సోప్ 150 g x 3 మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
డవ్ / పాంటీన్ / హెడ్ అండ్ షోల్డర్ / ట్రెసెమె షాంపూ 580 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
₹399
33%
సర్ఫ్ / రిన్ / టైడ్ డిటర్జెంట్ పౌడర్ 5 kg / ఏరియల్ / సర్ఫ్ మ్యాటిక్ లిక్విడ్ 3 L మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
10% INSTANT DISCOUNT* SBI card
#Min. Trxn.: ₹3,000; Max. Discount: ₹500 Per Credit Card Trxn. Validity: 02 Oct - 06 Oct 2024. T&C Apply.
వద్ద కూడా లభ్యం
JioMart
fresh Signature
SMART SUPERSTORE
SMART BAZAAR
SMART SUPERSTORE
హైదరాబాద్: అరిహంత్ టవర్ సంతోష్‌నగర్, క్రాస్ రోడ్ దగ్గర. ఇన్నర్ రింగ్ రోడ్ ఆరాధన 70mm థియేటర్ ఎదురుగా. కొంపల్లి: రన్‌వే 9 దగ్గర, కుత్బుల్లాపూర్, కొంపల్లి రోడ్. మాదాపూర్: ఇనార్బిట్ మాల్, ఎల్ 1. కాచిగూడ: మహేశ్వరి పరమేశ్వరి టవర్స్, కాచిగూడ ఎక్స్ రోడ్. గుడిమల్కాపూర్: కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ పక్కన, గుడిమల్కాపూర్ రోడ్. తిరుమలగిరి: మిలటరీ డెయిరీ ఫామ్ రోడ్ సుభాష్‌నగర్ బస్టాప్. టోలీచౌకి: సలార్‌పురియా సత్వ మాగ్నస్, బ్లాక్ A, టోలిచౌకి రోడ్ షేక్‌పేట ఫ్లైఓవర్ కింద. గచ్చిబౌలి: గచ్చిబౌలి ఫ్లైఓవర్ పక్కన. పాత అల్వాల్: IG విగ్రహం దగ్గర, CYSR గార్డెన్స్. కూకట్‌పల్లి: యశోద గార్డెన్స్, శాంతినగర్. చాంద్రాయణగుట్ట: బార్కాస్ రోడ్ భారత్ పెట్రోల్ పంప్ దగ్గర. శంషాబాద్: బస్టాండ్ కాలనీ, RB నగర్. బండ్లగూడ: HP పెట్రోల్ బంక్ దగ్గర, చేవెళ్ల రోడ్డు. నిజాంపేట్: గోకుల్స్ ప్లాజా, నిజాంపేట్ రోడ్. బాచుపల్లి: కేపీఆర్ ప్యారడైజ్ కాలనీ దగ్గర, మల్లంపేట రోడ్డు. కొత్తపేట: మోహన్ నగర్, ఎస్బీఐ కాలనీ, గడ్డిఅన్నారం: ఏషియన్ శివ గంగా రోడ్డు. బోడుప్పల్: విల్కానగర్ మెయిన్ రోడ్ SSS గార్డెన్ ఎదురుగా. నాచారం: ESI హాస్పిటల్ ఎదురుగా. ఫిల్మ్ నగర్: రోడ్ నం. 3, ఫిల్మ్ నగర్



బలహీనులు ఎప్పటికీ క్షమించలేరు.
క్షమ అనేది బలవంతుల లక్షణం.
– మహాత్మా గాంధీ

సాక్షి

బుధవారం, 2 అక్టోబర్ 2024

ప్రాణాలతో చెలగాటమా?

దేశంలోని అత్యున్నత కేంద్రీయ ఔషధ నియంత్రణ అధారిటీ తన తాజా నివేదికలో వెల్లడించిన అంశాలు సంచలనం రేపుతున్నాయి. మనం తరచూ వాడే మందుల్లో 50కి పైగా ఔషధాల నమూనాలు 'నిర్ణీత నాణ్యతాప్రమాణాలకు తగినట్టు లేనివి'(ఎన్ఎస్‌క్యూ) అంటూ నివేదిక వెల్లడించింది. జ్వరం, కడుపులో పూత లాంటి వాటికి వాడే ప్యారాసెటమాల్, పాన్–డి మందులతో సహా విటమిన్ సప్లిమెంట్లు, షుగర్ వ్యాధి మాత్రలు, యాంటీ బయాటిక్స్ సైతం ఆ జాబితాలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. నాసిరకం మందులను ఉత్పత్తి చేసినవాటిలో కొన్ని పేరున్న సంస్థల పేర్లూ ఉండేసరికి ఆందోళన రెట్టింపవుతోంది. అమాయక ప్రజల ఆరోగ్యభద్రతకై అత్యవసర చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. అదే సమయంలో ఔషధాల తయారీకి ప్రధాన కేంద్రంగా, అంతర్జాతీయంగా ఔషధాల ఎగుమతిలో అగ్రగామిగా, 'ప్రపంచానికే మందుల అంగడి'గా భారతదేశానికి గుర్తింపున్న నేపథ్యంలో నాణ్యతపై మనం మరింతగా దృష్టి పెట్టాల్సి ఉందని అర్థమవుతోంది.

గత ఏడాదీ 51 ఔషధాలు నాణ్యతా పరీక్షలో విఫలమయ్యాయి. ప్రభుత్వ ఔషధ విభాగం నిరుడు 1,306 నమూనాలను పరీక్షించినప్పుడు, అది బయటపడింది. నిజానికి, భారతదేశంలో ఔషధాలు, సౌందర్య ఉత్పత్తుల నాణ్యత అంశం '1940 నాటి ఔషధ, సౌందర్య ఉత్పత్తుల చట్టం' కిందకు వస్తుంది. ఆ చట్టం ప్రకారమే వీటి పర్యవేక్షణ, నియంత్రణ సాగుతుంది. ఔషధ నియంత్రణ అధికారులు క్రమం తప్పకుండా మార్కెట్ నుంచి ఔషధ నమూనాలను సేకరించి, పరీక్షలు చేస్తుంటారు. చట్టప్రకారం నిర్దేశించిన ప్రమాణాలను పాటించని ఉత్పత్తుల గురించి ప్రతి నెలా నివేదిక విడుదల చేస్తారు. కేంద్రీయ ఔషధ నాణ్యతా నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) సర్వసాధారణంగా ఇలా పరీక్షలు జరపడం, వాటి ఫలితాలనూ – ఆ పరీక్షల్లో తప్పిన మందుల జాబితానూ ఎప్పటికప్పుడు వెల్లడించడం కచ్చితంగా మంచిదే. అన్ని వర్గాలూ అప్రమత్తమయ్యే వీలు చిక్కుతుంది. అయితే, సామాన్య జనం నిత్యం వాడే యాంటీ బయాటిక్స్, షుగర్, బీపీల మందులు కూడా నిర్ణీత నాణ్యతా ప్రమాణాల్లో విఫలమవుతున్నట్టు ఇటీవలి నివేదికల్లో వెల్లడవడం ఆందోళన రేపుతోంది. పైగా, ప్రమాణాలు పాటించని జాబితాలోని మందులు ఎక్కువవుతూ ఉండడం గమనార్హం.

తాజాగా ఈ ఆగస్టులో చేసిన పరీక్షల్లో కొన్ని రకాల సీ విటమిన్, బీ కాంప్లెక్స్ మందులూ నాసిరకమేనని తేలింది. భారతీయ ఔషధ ప్రబంధం నిర్దేశాలకు అనుగుణంగా కొన్ని మందులు 'విలీన పరీక్ష'లో, మరికొన్ని 'నీటి పరీక్ష'లో విఫలమైనట్టు అధికారిక కథనం. నాణ్యత మాట అటుంచితే, కొన్ని బ్యాచ్‌ల ఔషధాలు అచ్చంగా నకిలీవట! ఇది ప్రజల ఆరోగ్యానికి హానికరమే కాక, విశ్వవేదికపై ఔషధ సరఫరాదారుగా భారతదేశ పేరుప్రతిష్ఠలకు భంగకరం కూడా! సహజంగానే పలు మందుల కంపెనీలు తాము తయారు చేస్తున్నవి అన్ని రకాలుగా నాణ్యమైనవేనంటూ ప్రతిస్పందిస్తున్నాయి. నాణ్యత లేకపోవడానికీ – నకిలీ మందులకూ చాలా తేడా ఉందనీ, దాన్ని స్పష్టంగా గుర్తించాలనీ పేర్కొంటున్నాయి. అది నిజమే కానీ, అసలు అనుమానాలే రాని రీతిలో, లోపరహితంగా మందుల తయారీ బాధ్యత ఆ రంగంలో ఉన్న తమదేనని ఆ సంస్థలు మరువరాదు. ఆ మాటకొస్తే, ఈ రంగానికి ఉన్న ప్రతిష్ఠను కాపాడేందుకు ముందుగా అవే చొరవ తీసుకోవాలి.

ఔషధ రంగం మన దేశానికి అత్యంత కీలకమైనది. దేశంలో కనీసం 10 వేల దాకా ఔషధ తయారీ యూనిట్లున్నాయి. దాదాపు 200కు పైగా దేశాలకు భారత్ నుంచి మందులు సరఫరా అవుతుంటాయి. మన ఔషధ విపణి పరిమాణం దాదాపు 5 వేల కోట్ల డాలర్లు. పైగా సరసమైన ధరలకే మందులు అందిస్తున్న పేరున్న మన మార్కెట్ ప్రస్తుతం రెండంకెల వృద్ధి రేటుతో పురోగమిస్తోంది. కోవిడ్ సమయంలోనే కాక, విడిగానూ అనేక రోగాలకు టీకాలు అందించడంలో భారత్ అగ్రశ్రేణిలో నిలిచిందని పాలకులు పదే పదే చెప్పుకొస్తుంటారు. అలాంటప్పుడు మన దగ్గర తయారయ్యే ఔషధాల నాణ్యతపై మరింత అప్రమత్తత తప్పనిసరి కదా! దురదృష్టవశాత్తూ, అందులోనే మనం వెనుకబడుతున్నాం. గ్యాంబియా, ఉజ్బెకిస్తాన్ తదితర దేశాల్లో సంభవించిన బాలల మరణాలకు భారతీయ తయారీ ఔషధాలే కారణమంటూ ఆ మధ్య అంతర్జాతీయ వివాదాలు తలెత్తిన సంగతి విస్మరించలేం. అంటే బయటపడ్డ కొన్ని మందుల విషయంలోనే కాదు... మొత్తంగా ఔషధతయారీ, నాణ్యత, నియంత్రణ వ్యవస్థపై లోతుగా దృష్టి పెట్టాల్సి ఉంది.

ఎగుమతి మాట దేవుడెరుగు... ముందుగా ప్రభుత్వాలకైనా, ఔషధ తయారీ సంస్థలకైనా ప్రజారోగ్య భద్రత ముఖ్యం కావాలి. అందులో ఎవరు రాజీపడినా అమాయకుల ప్రాణాలతో చెలగాటమే. అది సహించరానిది, భరించ లేనిది. అందువల్ల నాసిరకమనీ, నకిలీవనీ తెలిసిన మందులను మార్కెట్ నుంచి వెంటనే వెనక్కి రప్పించాలి. అందుకు చట్టం, తగిన విధివిధానాలు లేకపోలేదు. కానీ, వాటిని ఏ మేరకు అమలు చేస్తున్నారన్నది చెప్పలేని పరిస్థితి. అది మారాలి. అలాగే, నాణ్యతా పరీక్షల్లో లోటుపాట్లు లేకుండా చూడడం కీలకం. పరీక్షల కోసం నమూనాలను ఎప్పుడు తీసుకున్నదీ, ఎన్ని తీసుకున్నదీ ప్రకటించడం వల్ల మరింత పారదర్శకత నెలకొంటుంది. కొత్త అనుమానాలకు ఆస్కారమివ్వకుండా పోతుంది. విదేశాల్లోనే కాక, ప్రస్తుతం స్వదేశంలోనూ ఔషధాలపై సందేహాలు ముసురుకుంటున్న వేళ ప్రపంచస్థాయి ప్రమాణాలు అందుకొనేలా మన మందుల తయారీ సాగాలి. అవసరమైతే అందుకు అంతర్జాతీయ నియంత్రణ సంస్థలతో కలసి అడుగులు వేయాలి. ఇంటా బయటా మన ఔషధాలు ఆరోగ్యభద్రతకు చిరునామా కావాలే తప్ప రోగుల నమ్మకాన్ని వమ్ము చేయకూడదు. ఎందుకంటే, మందుల విలువ కన్నా మనుషుల ప్రాణాల విలువ ఎక్కువ!

రైతుల ఆదాయం పెంచే 'మౌలిక నిధి'

విశ్లేషణ



శివరాజ్ సింగ్ చౌహాన్

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి రైతుల పట్ల గల అమిత శ్రద్ధ, వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్న తాపత్రయం ఆయన రైతుల కోసం తీసుకున్న నిర్ణయాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అన్నదాతల జీవితాలను మార్చడమే ప్రధాని మొదటి, అత్యంత ప్రాధాన్య లక్ష్యం. అందుకే ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి 100 రోజుల్లో వ్యవసాయం, రైతులకు అధిక ప్రాధాన్యం కొనసాగించారు. రైతుల ఆదాయాన్ని పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. 'వ్యావసాయిక మౌలిక సదుపాయాల నిధి' (ఏఐఎఫ్), 'పీఎం ఆశా' వంటి పథకాలలో ఈ నిబద్ధత స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా ఏఐఎఫ్ రూపంలో సుస్థిర పరిష్కారాన్ని అందించడం ద్వారా రైతుల సాధికారతకు ప్రభుత్వం గణనీయమైన సహకారం అందిస్తోంది.

దేశంలో పంట కోత అనంతర నష్టాలు ఒక పెద్ద సవాలు. ఇది వ్యవసాయ రంగ ఉత్పత్తిని ప్రభావితం చేస్తోంది. లక్షలాది రైతుల శ్రమను నీరుగారుస్తోంది. తాజా అంచనాల ప్రకారం, దేశంలో ప్రతి ఏటా మొత్తం ఆహార ఉత్పత్తిలో 16–18% ఈ విధంగా నష్టపోతున్నాం. పంట కోత, నిల్వ, రవాణా, ప్రాసెసింగ్ వంటి వివిధ సందర్భాల్లో ఈ తరహా నష్టాలను చూస్తున్నాం. సరైన నిల్వ, శీతలీకరణ సదుపాయాలు లేకపోవడం, తగిన శుద్ధి యూనిట్ల కొరత, సమర్థమైన రవాణా సదుపాయాలు లేని కారణంగా ఈ భారీ నష్టాలు ఎదురవుతున్నాయి. ఇది మొత్తం ఆహార భద్రతపై దుష్ప్రభావం చూపిస్తోంది.

నిల్వ సదుపాయాలు పెరిగాయి

మోదీ సమర్థ నాయకత్వంలో శాస్త్రజ్ఞుల పరిశోధనలను ప్రయోగశాల నుంచి వ్యవసాయ క్షేత్రాలకు తీసుకువెళ్లడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమంలో భాగంగా 2020 జూలైలో 'ఏఐఎఫ్'ను ప్రధాని ప్రారంభించారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, పంట తరువాతి నిర్వహణ సమస్యలను పరిష్కరించడం, తద్వారా ఆహార నష్టాన్ని తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం. కొత్త ప్రాజెక్టులు, కొత్త తరం సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం ద్వారా ఈ సవాళ్లను ఎదుర్కోవాలి. ఏఐఎఫ్ కింద బ్యాంకులు 9 శాతం వడ్డీ పరిమితితో ఏడాదికి 3 శాతం వడ్డీ రాయితీ రుణాలు, 'సీజీటీఎంఎస్ఈ' (క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్ ప్రైజెస్) కింద ఆర్థిక సంస్థలు రూ. 2 కోట్ల వరకు రుణాలు అందిస్తాయి. ఈ పథకంలో భాగంగా గత ఆగస్టు వరకు మంజూరు చేసిన మొత్తం రూ. 47,500 కోట్లు దాటింది. ఇందులో రూ. 30 వేల కోట్లకు పైగా ఇప్పటికే వివిధ ప్రాజెక్టులకు కేటాయించారు. మంజూరైన ప్రాజెక్టుల్లో 54 శాతం... రైతులు, సహకార సంఘాలు, వ్యవసాయ ఉత్పత్తి సంస్థలు, స్వయం సహాయక సంఘాలకు అనుసంధానం కావడం విశేషం. ఇది పొలాల వద్దే మౌలిక సదుపాయాలను అందించడంలో రైతుల బలమైన భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుంది.

పంట నష్టాల నుంచి రైతులను కాపాడటానికి నిల్వ (డ్రై, కోల్డ్ స్టోరేజీలు), రవాణా మొదలైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రధాని ప్రాధాన్యమిస్తున్నారు. డ్రై స్టోరేజ్ పరంగా చూస్తే, దేశంలో 1,740 లక్షల మెట్రిక్ టన్నుల పంటను నిల్వ చేసే సదుపాయాలు మాత్రమే ఉన్నాయి. ఇంకా 44% కొరత ఉంది. ఇది ఆందోళన కలిగించే విషయం. ఉద్యాన ఉత్పత్తుల కోసం, దేశంలో సుమారు 441.9 లక్షల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజీ అందుబాటులో ఉంది. ఈ సామర్థ్యం దేశంలోని పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో 15.72% మాత్రమే. ఈ పరిస్థితుల్లో ఏఐఎఫ్ వల్ల సుమారు 500 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్య అంతరాన్ని తగ్గించడానికి వీలైంది. దీనివల్ల



పంట కోత అనంతర నష్టం రూ. 5,700 కోట్లు ఆదా అవుతుంది. సరైన కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలను అభివృద్ధి చేయడం వల్ల ఉద్యాన ఉత్పత్తుల నష్టం 10% తగ్గింది.

పాతిక లక్షల మందికి ఉపాధి

వ్యవసాయ మౌలిక సదుపాయాల వృద్ధి, అభివృద్ధికి ఏఐఎఫ్ కొత్త ఉత్తేజాన్ని అందిస్తోంది. గత ఆగస్టు నాటికి దేశవ్యాప్తంగా 74,695 వ్యవసాయ మౌలిక సదుపాయాలకు సంబంధించిన కార్యక్రమాలకు ఏఐఎఫ్ కింద ఆమోదం లభించింది. వీటిలో 18,508 కస్టమ్ హైరింగ్ సెంటర్లు, 16,238 ప్రాథమిక ప్రాసెసింగ్ సెంటర్లు, 13,702 గోదాములు, 3,095 సార్టింగ్ అండ్ గ్రేడింగ్ యూనిట్లు, 1,901 కోల్డ్ స్టోర్స్, కోల్డ్ చైన్లు, 21,251 ఇతర రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు 2015 నుంచి వ్యవసాయ రంగంలో రూ. 78,702 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. ఇది ఈ రంగంలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది.

ప్రభుత్వ చర్యల వల్ల యువత కూడా వ్యవసాయం వైపు ఆకర్షితులవుతున్నారు. దేశంలో సుమారు 50,000 కొత్త వ్యవసాయ సంస్థలు ఏర్పాటయ్యాయి. ఇది రైతుల స్వావలంబనకు దారి తీస్తోంది. వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఈ ప్రయత్నాలు 8 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలను సృష్టించడానికి దోహదపడ్డాయి. భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా 25 లక్షల ఉద్యోగాల సృష్టికి దారితీస్తుంది. పొలాల్లో అధునాతన మౌలిక సదుపాయాల కల్పన వల్ల రైతులు తమ పంటలను నేరుగా ఎక్కువమందికి అమ్ముకోవడానికి వీలు కలిగింది. ఆధునిక ప్యాకేజింగ్, స్టోరేజీ వ్యవస్థల కారణంగా రైతులు మార్కెట్లలో తమ ఉత్పత్తులను మరింత సమర్థంగా అమ్ముకోగలుగుతారు. ఫలితంగా మంచి ధర దక్కుతుంది. ఈ యత్నాలు రైతుకు సగటున 11–14% అధిక ధరలను పొందడానికి వీలు కల్పిస్తున్నాయి.

పూచీకత్తు భరోసా, వడ్డీ రాయితీ ద్వారా రుణ సంస్థలు తక్కువ రిస్క్‌తో రుణాలు ఇచ్చి, తద్వారా తమ వినియోగదారులకు సాయపడతాయి. నాబార్డ్ రీఫైనాన్స్ సదుపాయంతో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని భాగస్వామ్యం చేయడం వల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) వడ్డీ రేటును ఒక శాతానికి తగ్గించడం గమనార్హం. దీంతో ఇలాంటి పీఏసీఎస్‌లతో సంబంధం ఉన్న వేలాది మంది రైతులకు గణనీయమైన ప్రయోజనాలు చేకూరాయి. ఏఐఎఫ్ కింద 9,573 పీఏసీఎస్ ప్రాజెక్టులకు నాబార్డ్ ఇప్పటి వరకు రూ. 2,970 కోట్ల రుణం మంజూరు చేసింది.

ఆరు సూత్రాల వ్యూహం

వ్యవసాయాన్ని లాభసాటి వ్యాపారంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఉత్పత్తిని పెంచడం, వ్యవసాయ వ్యయాన్ని తగ్గించడం, ఉత్పత్తికి గిట్టుబాటు ధరలు కల్పించడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తగిన ఉపశమనం కల్పించడం, వ్యవసాయం, ప్రకృతి సేద్యాన్ని వైవిధ్యపరచడం వంటి ఆరు సూత్రాల వ్యూహంతో ముందుకు వచ్చాం. హైడ్రోపోనిక్ వ్యవసాయం, పుట్టగొడుగుల పెంపకం, వెర్టికల్ ఫామింగ్, ఏరోపోనిక్ వ్యవసాయం, పాలీహౌస్, గ్రీన్ హౌస్ వంటి ప్రాజెక్టులను రైతు సమూహాలు, సంఘాలకు మాత్రమే కేటాయించారు. వాటి పరిధిని విస్తరించడం ద్వారా వ్యక్తిగత లబ్ధిదారులు ఇప్పుడు ఈ ప్రాజెక్టులను చేపట్టడానికి ఏఐఎఫ్ కింద అనుమతులు పొందడానికి అర్హులయ్యారు.

దీనికి అదనంగా, 'పీఎం–కుసుమ్' యోజనలోని 'కాంపోనెంట్ ఎ'... బంజరు, బీడు, సాగు, పచ్చిక బయలు లేదా చిత్తడి భూములలో రెండు మెగావాట్ల వరకు సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసే సదుపాయాన్ని కల్పిస్తుంది. దీనిని సులభంగా ఏఐఎఫ్ పథకంతో అనుసంధానించవచ్చు. ఈ వ్యూహాత్మక సమ్మేళనం రైతులకు వ్యక్తిగతంగా సహాయపడుతుంది. రైతు సమూహాలను సాధికారం చేస్తుంది. 'అన్నదాత' నుండి 'ఉర్జాదాతా' (ఇంధన ప్రదాత) వరకు వారి పాత్రను పెంచుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో విశ్వసనీయమైన ఇంధన మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

విస్తృత స్థాయిలో మెరుగు పడిన సమాచార వ్యవస్థ, సమష్టి కృషితో రైతు సంక్షేమంలో కొత్త వెలుగులు ప్రసరిస్తున్నాయి. 'వికసిత భారత్'లో భాగంగా అభివృద్ధి చెందిన వ్యవసాయ రంగ కలలను సాకారం చేయడంలో ఇదొక కీలక మైలురాయిగా నిలుస్తుంది.

వ్యాసకర్త కేంద్ర వ్యవసాయం, రైతుల సంక్షేమం; గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి; మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాటలు తాజాగా ఇలా...!

సింధూ టెక్నాలజీ



గుజరాత్‌లోని లోథాల్ వద్ద సింధు లోయ నాగరికత డ్రైనేజీ వ్యవస్థ బయట పడింది. చెక్కు చెదరకుండా ఉన్న ఈ డ్రైనేజీ వ్యవస్థ, పైపులు క్రీ.పూ. 2,500 ఏళ్ల నాటివి. దీన్ని బట్టి మన పూర్వీకులు మనకన్నా ఎంత ముందున్నారో అర్థమౌతోంది.

– డా॥ సుష్మా పల్లకౌల్, పురావస్తు ప్రేమిక

పర్యాటక నిర్లిప్తత



ప్రపంచాన్ని నేను ఎంత ఎక్కువగా పర్యటిస్తానో అంత ఎక్కువగా మన భారతదేశంలో పర్యాటక నిర్లిప్తత కనిపిస్తుంటుంది. చారిత్రక స్థలాలను పరిరక్షించటంలో, విదేశీ పర్యాటకులను ఆకర్షించటంలో మనం పూర్తిగా వెనుకబడి పోయాం. ఆఖరికి అతి చిన్న, పేద కరీబియన్ ద్వీపాలు సైతం మనకంటే బాగా తమ చరిత్రను మెరుగ్గా ఉంచుకుంటున్నాయి.

– గౌరవ్ సబ్నిస్, యాత్రికుడు

బ్రాండ్ ప్రభావం



'ప్రేమంటే గౌరవం' అని విరాట్ కోహ్లీ తన 'రోన్' కంపెనీ బ్రాండ్ ప్రచారంలో భాగంగా చెప్పారు. అనుదినం మహిళలపై జరుగుతున్న క్రూరమైన హింసకు సంబంధించి చాలా దారుణమైన వార్తలు విన వస్తున్న ఈ రోజుల్లో ఇలాంటి బ్రాండ్–మార్కెటింగ్ సందేశాలు మరింతగా అవసరం.

– కార్తీక్, కమ్యూనికేషన్స్ స్ట్రేటజీ కన్సల్టెంట్

నేటి కార్టూన్



ఇన్ బాక్స్

కరచాలనం – ఆ తృప్తే వేరు!

కరచాలనం అంటే... 'షేక్ హ్యాండ్' నాకు ఇష్టమైన పలకరింపు విధానం. నమస్కారం పెట్టడంలో భక్తి, గౌరవం ఉండగా, కరచాలనంలో దగ్గరితనం, స్నేహం ఉంటాయి. ఈ పురాతన ప్రక్రియ అన్ని దేశాల్లో ఉంది. జపాన్‌లో ఉందో లేదో డౌటు. వాళ్లయితే వంగి పలకరించుకుంటారు. క్రీస్తు పూర్వం ఐదో శతాబ్దం తాలూకు చిత్రాల్లో కూడా కరచాలనం చేస్తున్న బొమ్మలు కనబడతాయి. వ్యాపార వ్యవహారాల్లో, క్రీడల్లో, వివిధ అధికారిక, అనధికారిక కార్యక్రమాల్లో; కలిసినప్పుడో, విడిపోయేటప్పుడో, సంధి కుదిరినపుడో, పరిచయం అవుతూనో షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడం కనబడుతూ ఉంటుంది.

అయితే బహుశా కరోనా తర్వాత ఆ అలవాటు పబ్లిక్‌లో తగ్గిపోతున్నట్టు అనిపిస్తోంది. జలుబు, కళ్ల కలక, కరోనా లాంటి సాంక్రమిక వ్యాధుల్ని దృష్టిలో పెట్టుకున్నపుడు ఆరోగ్య రీత్యా కరచాలనం బదులు నమస్కారంతో సరిపెట్టడం మంచిదే కావచ్చు. కానీ ఇద్దరు కలవడం, కరచాలనం చేసుకోవడం లోని ఆ 'ఫీల్' మాత్రం రాదు. టెన్నిస్‌లో గెలిచిన నాదల్‌ని, ఓడిపోయిన ఫెదరర్ షేక్ హ్యాండ్ ఇవ్వడం చూస్తే ఎంత బాగుంటుంది! అలాగే అమెరికా అధ్యక్ష పీఠం కోసం వాదులాడు కొనే ముందు ట్రంప్ దగ్గరకు వెళ్లి ఆయన ప్రత్యర్థి కమలా హ్యారిస్ కరచాలనం చెయ్యడం కూడా.

పరిచితులైనా, అపరిచితులైనా కలిసినప్పుడు నా చెయ్యి ముందుకు పోతుంది. పబ్లిక్ లైఫ్‌లో కారు కదిలిపోతున్నా, ముందుకు నడిచిపోతున్నా పరిగెత్తుకు వచ్చి కరచాలనం చేస్తుంటారు. క్షణమే అయినా అదో తృప్తి. మనం పెద్దవాళ్ల దగ్గర నుండి అందుకున్నపుడు ఆ ఫీల్ వెంటనే పోదు. నాకైతే వాజ్‌పేయి, కలాం, కెఆర్ నారాయణన్‌లను తలుచుకున్నప్పుడు వారిచ్చిన షేక్ హ్యాండ్ తాజాగా ఫీల్ అవుతాను. నాకు షేక్ హ్యాండు ఇచ్చిన అత్యంత పవర్ ఫుల్ వ్యక్తి ఎవరో తెలుసా! వ్లాదిమిర్ పుతిన్. నేను ఎంపీగా ఉండగా ఆయనో సారీ, క్లింటన్ ఓసారీ పార్లమెంట్‌ను విజిట్ చేశారు. క్లింటన్ ఇప్పుడు మాజీ కదా!

– డా॥ డి.వి.జి. శంకరరావు
పార్వతీపురం మాజీ ఎంపీ, విజయనగరం

ప్రజలను పేదరికంలో ఉంచడమే వారి ఎజెండా!

అభిప్రాయం



డా॥ బూర నర్సయ్య గౌడ్

ఈ మధ్యనే ఒక దళిత విద్యార్థి ఐఐటీలో సీటు వచ్చినా ఫీజు చెల్లించ లేక సీటు కోల్పోయిన ఉదంతం చూసిన తర్వాత నేను 1976లో ఎంబీబీఎస్ సీటు వచ్చిన తర్వాత అడ్మిషన్ ఫీజు కట్టడానికి పడ్డ శ్రమ గుర్తుకు వచ్చింది. అంటే గత 50 ఏండ్లలో పేదరికం అనే సమస్య అలానే ఉందన్నమాట!

'ధనం మూలం ఇదం జగత్' అని మన పూర్వీకులు ఎప్పుడో చెప్పారు. మనం ఎన్ని చెప్పినా, మనిషి పుట్టినప్పటి నుండి ధనం తమకు సౌకర్యాలు చేకూర్చడమే కాకుండా, ఇతరులను లేదా సమాజాన్ని శాసించటానికి ప్రధాన ఆయుధంలా మారింది.

చివరికి ఆదాయం ఉన్న దేవాలయాలకే ఎక్కువ మంది భక్తులు వెళ్తూ ఉండటమూ తెలిసిందే కదా. భారత దేశ ఫ్యూడల్ రాజకీయ వ్యవస్థ ఈ అంశాన్ని బాగా ఆకళింపు చేసుకొని, తాము శాశ్వతంగా అధికారంలో ఉండాలంటే ప్రజలను శాశ్వతంగా పేదరికంలో ఉంచడమే ప్రధాన పాలసీగా ఎంచుకుంది. అందుకే 'గరీబీ హఠావో' అనేది ఫ్యూడల్ రాజకీయ నాయకులకు బాగా కలిసివచ్చిన నినాదం. ఎందుకంటే పేదరికం ఉన్నంత కాలం రాజకీయ ఫ్యూడల్స్ పవర్లో ఉండటం ఖాయం కనుక.

'విద్య లేకుంటే వివేకం లేదు, వివేకం లేకుంటే ధనం లేదు, ధనం లేకుంటే గౌరవం లేదు' ఇది రాజకీయ ఫ్యూడల్స్ ఆచరిస్తున్న పాలసీ. ''కులం గల్గువాడు, గోత్రంబు కలవాడు, విద్యతో విర్రవీగువారు, పసిడికల్గువాని బానిస కొడుకులు, విశ్వదాభిరామ వినుర వేమా'' అన్నాడు వేమన. ఈ మధ్య జరిగిన అంబానీ ఇంట్లో పెళ్ళికి సెలబ్రిటీలు అందరూ తమ ఇంట్లో పెళ్లిలాగ గంతులు వేశారంటే, వేమన చెప్పిన మాటలు అక్షర సత్యమనే కదా అర్థం. చదువుకోనిస్తే కేవలం ప్రశ్నిస్తాడు, ఆర్థికంగా ఎదగనిస్తే ఎదిరిస్తాడు అనే నిజాన్ని గమనించిన ఫ్యూడల్ నాయకులు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూనే, మెజారిటీ ప్రజలు ఆర్థికంగా ఎదగకుండా జాగ్రత్త పడుతున్నారు. అది గమనించక అమాయక ప్రజలు చిల్లరకు ఆశపడి శాశ్వత బానిసలుగా మారుతున్నారు. ఇక రాజకీయ ఫ్యూడల్ నాయకులు ప్రజలను ఎలా పేదరికంలో ఉంచుతున్నారో విశ్లేషిద్దాం.

సంక్షేమ పథకాలు మాత్రమే కానీ సంపద పథకాలు ఉండవు. ఆసరా పెన్షన్స్ లాంటివి తాత్కాలిక ఉపశమనం కల్గిస్తాయి కానీ సంపద సృష్టించడంలో ఏ మాత్రం దోహదపడవు. అందుకే పేదరికాన్ని ఆసరాగా తీసుకొని, కేవలం సంక్షేమ పథకాలకే పెద్దపీట వేస్తారు. కూడు, గూడు, విద్య, వైద్యం, ఉపాధి అనే పంచ రత్నాలు వారికి ఆదాయ వజ్రాలుగా మార్చుకుంటారు. ఉచితంగా వచ్చే బియ్యాన్ని కొని పాలిష్ చేసి మళ్ల అధిక ధరలకు అమ్ముతారు. భూమి ధర అమాంతంగా పెంచి మధ్య తరగతికి అందకుండా చేస్తారు. తెలంగాణ రాష్ట్రంలోనే సామాన్య ప్రజలు ఏడాదికి 75,000 –



80,000 వేల కోట్ల విద్య, వైద్యానికే ఖర్చు పెడుతున్నారంటే అర్థం చేసుకోగలరు. ఒకసారి ఒక ప్రముఖ నాయకుడు, అనేక విద్య, వైద్య సంస్థల అధిపతి నాతో 'డాక్టర్ గారూ నాకు ఏడాదికి కనీసం 500 కోట్లు కాష్ వస్తది. అంత డబ్బు ఏమి చేయాలో, ఎక్కడ పెట్టాలో అర్థం కావట్లేద'ని వాపోయాడు.

మధ్య తరగతి వర్గాలు ఆర్థికంగా ఎదగటానికి ఉన్న వ్యాపార మార్గాలను మూసి వేసి ఆర్థిక దిగ్బంధం చేస్తారు. ఉదాహరణకు ధరణి, ఎల్ఆర్ఎస్ మధ్య తరగతి రియల్ ఎస్టేట్ డెవెలపర్స్‌పై అనేక ఆంక్షలు విధించడం. బడ్జెట్ హాస్పిటల్స్, స్కూల్స్, మీద ఉన్న ఆంక్షలు. గతంలో ప్రభుత్వం ఇచ్చే అనేక కాంట్రాక్టులల్లో పాల్గొనడానికి చిన్న, పెద్ద, మధ్య స్థాయి కాంట్రాక్టర్లకు అవకాశం ఉండేది. కొత్తగా 'ఒక ప్రభుత్వం–ఒకే కాంట్రాక్టర్' అనే నూతన ఒరవడి మొదలు పెట్టారు. అలా చాలా మంది చిన్న, మధ్య స్థాయి కాంట్రాక్టర్లకు అసలు పాల్గొనడానికే అర్హత లేకుండా చేసి, మధ్య తరగతి ప్రజలను కూడా పేదరికంలోకి నెడుతున్నారు.

అధికారం ఆధారంగా ఆర్థిక వనరులను నియంత్రణ చేయగల రెవిన్యూ, పోలీసు, మునిసిపల్, ఇరిగేషన్, రోడ్లు, భవనాలు ఇలా అన్నిటిలో వారి బంధు మిత్రులను ఆయుధాలుగా వాడుకొని ఆర్థిక వనరులు మొత్తం కైవసం చేసుకుంటారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో చేతి, కులవృత్తుల ద్వారా దాదాపు 10 లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఆ వృత్తులను బలోపేతం చేస్తూ, కోఆపరేటివ్ సొసైటీ, స్కిల్ ట్రైనింగ్ చేయడం, వాటిని ఒక కుటీర పరిశ్రమలుగా మార్చే అవకాశం ఉన్నా, అన్ని రకాలుగా దిగ్బంధం చేసి, నిర్వీర్యం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఫ్యూడలిస్టులు పనిగా పెట్టుకున్నారు. మద్యపానం వంటి అనేక వ్యసనాలను ప్రోత్సహిస్తూ ఎన్నటికీ పేదవాళ్లు పేదవాళ్లుగానే ఉండేలా చేస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మార్చి, ప్రజలు డబ్బులు తీసుకోకుండా ఓటువేస్తే అదొక నేరంగా భావించే స్థాయికి తెచ్చి, పేదరికాన్ని ఆసరాగా చేసుకొని, పోల్ మ్యానేజ్మెంట్ ద్వారా అధికారాన్ని చేపట్టారు. అధర్మ కుల రాజకీయాలు చేస్తున్నందువల్ల ప్రతి పాలసీలో పాలనా కులం, పాలనా వర్గం తప్ప... ఇతర వర్గాల వారు ఆర్థికంగా ఎదగొద్దనే సంకుచిత స్వభావం ఉంది. ఇందువల్ల అన్ని వర్గాలు నష్ట పోతున్నాయి.

నాకున్న రాజకీయ అనుభవంతో ఒక టర్మ్‌లో (5 ఏండ్లలో) తెలంగాణలో ఉన్న కోటి కుటుంబాలలో కనీసం 10 లక్షల కుటుంబాలను కోటీశ్వరులను చేయవచ్చు.

5 ఏండ్ల ఉద్యమ అనుభవం, 10 ఏండ్ల రాజకీయ అనుభవంతో... భారత దేశం నరేంద్ర మోదీ అనుకున్నట్లు 2047లో ప్రపంచంలో ఆర్థిక అగ్రగామిగా ఎదగాలంటే ఒకటే మార్గం: ప్రజలను ధనవంతులు చేయడం ఎలా అని ఆలోచించాలి. ప్రణాళికలు, పాలసీలు మొత్తం... పేద, మధ్య తరగతి వర్గాల ఆర్థిక అభివృద్ధి దిశగానే జరగాలి.

వ్యాసకర్త భువనగిరి మాజీ ఎంపీ

నిజమైన భక్తి

హనుమంతుడికి రాముడిపై ఉన్న భక్తి ఇంతా అంతా కాదు. ఆ భక్తిని ఏదో ఒక్క మాటలో చెప్పి సరిపెట్టుకోవడం అనేది కుదరని పని. మాటలకూ, అనుభూతులకూ అతీతుడు హనుమంతుడు. అతని ఆనంద స్థితి అపారం. శ్రీరాముడి నామం హనుమంతుడికి శ్వాసైంది. ఊతకర్ర అయింది. అతనికి సర్వమూ శ్రీరామ నామమే. అతనికి రాముడి నామం ఊపిరి అనడానికి ఓ సంఘటనను చెబుతారు. అది అతని అంతులేని భక్తికి గొప్ప నిదర్శనం.

జ్యోతిర్మయం

రావణ సంహారం అనంతరం అయోధ్యకు చేరుకున్న రామచంద్ర మూర్తికి పట్టాభిషేకం కోలాహలంగా సాగింది. ఆ రోజు అరుదైన ముత్యాల దండను హనుమంతుడికి కానుకగా ఇచ్చింది సీతమ్మతల్లి. ఆ దండలోని ముత్యాలను ఒక్కొక్కటిగా తీసి దంతాలతో కొరికి పక్కన పడేస్తున్నాడు హనుమంతుడు. ఈ చర్యను చూసి సభలో ఉన్నవారందరూ ఆశ్చర్యపోయారు. ఈ విషయాన్ని గ్రహించిన సీతమ్మతల్లి ఈ ప్రవర్తనకు కారణం చెప్పమని అడిగింది.

దీనికి హనుమంతుడు జవాబిస్తూ 'పూజ్యనీయురాలైన అమ్మవు నువ్వు. ఈ ముత్యాల దండ అమూల్యం. వెల కట్టలేనిది. కారణం, ఇది మీ అత్యంత పవిత్రమైన చేతుల మీదుగా నేనందుకున్నాను. అయినప్పటికీ ఈ ముత్యాల దండలో నా శ్రీరాముడు ఉన్నాడా అనేది నేను చూడాలి కదా! శ్రీరాముడు లేని ఏ ఒక్క వస్తువూ నేను నా దగ్గర ఉంచుకోవడం లేదు. ఇప్పటి వరకూ ఏ ఒక్క ముత్యంలోనూ నా ప్రియమైన శ్రీరాముడు కనిపించలేదు' అన్నాడు.

అంతట సీతాదేవి 'నీలో రాముడు ఉన్నాడా' అని అడిగింది. వెంటనే తన హృదయాన్ని చీల్చి చూపించాడు. అతని హృదయంలో శ్రీరాముడు సీతమ్మతల్లితో ఉండటాన్ని అక్కడున్న వారందరూ చూసి ఆశ్చర్యపోయారు. శ్రీరాముడు హనుమంతుడిని దగ్గరకు తీసుకుని గాఢంగా హత్తుకున్నాడు.

భగవంతుడిపై భక్తిప్రపత్తులు గాఢాతిగాఢంగా ఉండాలి. అప్పుడే దైవసాన్నిధ్యం శాశ్వతంగా లభించేది. అంతేకాని భక్తుని వేషభాషలు, ఆడంబరాలు అతడిని దేవునికి దగ్గర చేయలేవు అని ఈ కథ చెబుతుంది.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** అమావాస్య రా.10.45 వరకు, తదుపరి ఆశ్వయుజ మాస శుక్ల పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తర ప.12.24 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.9.43 నుండి 11.27 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.28 నుండి 12.16 వరకు, **అమృత ఘడియలు:** లేవు, మహాలయ అమావాస్య ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 5.48.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



తెలంగాణ మహిళల సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ పర్వదిన ముందస్తు వేడుకల్లో భాగంగా మంగళవారం జనగామ జిల్లా దేవరుప్పులలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో భారీ బతుకమ్మలను ఏర్పాటు చేశారు. బాలికలు, ఉపాధ్యాయినులు ఆటపాటలతో అలరించారు.
– దేవరుప్పుల

నేటినుంచి దసరా సెలవులు

సాక్షి, హైదరాబాద్: అక్టోబర్ 2 నుంచి ఈనెల 14 వరకు పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు కూడా ఈ ఆదేశాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. విద్యాశాఖ ఆదేశాలను పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెలంగాణ నాబార్డు సీజీఎంగా ఉదయ్‌భాస్కర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం)గా బి.ఉదయ్‌భాస్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాకు చెందిన భాస్కర్‌కు డెవలప్‌మెంట్ బ్యాంకింగ్‌లో 31 ఏళ్ల అనుభవం ఉంది. భాస్కర్ జార్ఖండ్, కర్ణాటక, ఏపీ, ముంబైలలో పలు హోదాల్లో పనిచేశారు. జిల్లాల్లో వాటర్‌షెడ్, గిరిజన అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, గ్రామీణ జీవనోపాధి వంటి కార్యక్రమాలను భాస్కర్ నిర్వహించారు.

'నల్లమల' రాష్ట్రానికి తలమానికం

● వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సఫారీ వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

అమ్రాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు తెలంగాణ రాష్ట్రానికే తలమానికమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. మూడు నెలల తర్వాత నల్లమల జంగిల్ సఫారీని పునఃప్రారంభించేందుకు మంగళవారం వచ్చిన ఆయన.. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి మన్ననూర్‌లోని వనమాలికలో మూడు నూతన సఫారీ వాహనాలకు పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నల్లమల ప్రాంతం జీవ వైవిధ్యానికి, పర్యావరణానికి జీవనాడిగా నిలుస్తుందన్నారు. నల్లమల ప్రాంతం పర్యాటకంగా ఎంతో ప్రసిద్ధిగాంచిందని, ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేల బృందం ఇప్పటికే సందర్శించారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చెందితే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, ఫీల్డ్ డైరెక్టర్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


రేపట్నుంచి ఉచిత చేప పిల్లల పంపిణీ

● తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించిన మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి అన్ని చెరువుల్లో ఉచిత చేప పిల్లలు పంపిణీ చేయనున్నామని, చేప పిల్లల పంపిణీ కార్యక్రమం గ్రామాల్లో పండుగ వాతావరణంలా జరగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని చెరువులు నిండాయని, ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశామని, దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. చేప పిల్లల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయాలని మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి సబ్యసాచి ఘోష్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక అలాకు మంత్రి ఆదేశించారు. అదేవిధంగా నాణ్యమైన చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా మంత్రులు, విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రభుత్వ సలహాదారులు, మత్స్య కార్మిక కుటుంబాలు పాల్గొనాలని కోరారు.

భవిష్యత్ ఆర్థిక వ్యవస్థలో మహిళలే కీలకం

● నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం
● విమెన్ ఆంట్రప్రెన్యూర్స్ ప్లాట్‌ఫామ్ హైదరాబాద్ చాప్టర్ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: దేశ భవిష్యత్ ఆర్థిక వ్యవస్థలో మహిళా వాణిజ్యవేత్తలే కీలకమని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. తెలంగాణలో మహిళా వాణిజ్యవేత్తల కోసం నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన 'విమెన్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫామ్' తెలంగాణ చాప్టర్‌ను మంగళవారం ఆయన హైదరాబాద్‌లో ప్రారంభించారు. వీ-హబ్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించే ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా మహిళలకు అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. డబ్ల్యూఈపీ రాష్ట్ర చాప్టర్ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు చేయూత అందించడంతోపాటు అత్యుత్తమ నాణ్యతగల బ్రాండ్లను తయారు చేసే అవకాశం లభిస్తుందన్నారు. మహిళా వ్యాపారవేత్తల కోసం సింగిల్ విండో వేదికగా 'వీ-బ్రిడ్జ్' పనిచేస్తుందని.. వీ-హబ్ సీఈవో సీతా పల్లచొల్ల డబ్ల్యూఈపీ తెలంగాణ చాప్టర్ మిషన్ డైరెక్టర్‌గా పనిచేస్తారని ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ప్రకటించారు. సమావేశంలో డబ్ల్యూఈపీ కో-చైర్మన్ సంగీతారెడ్డి, నీతి ఆయోగ్ ముఖ్య ఆర్థిక సలహాదారు అన్నారాయ్ పాల్గొన్నారు.

ఏడేళ్లలో విద్యుదాఘాతంతో 4,420 మంది బలి

● 'సాక్షి'కథనానికి స్పందించిన దక్షిణ డిస్కం

సాక్షి, హైదరాబాద్: గత ఏడేళ్లలో రాష్ట్రంలో విద్యుదాఘాతంతో 4,420 మంది మృత్యువాత పడ్డారు. ఏటా సగటున 700 మందిని కరెంట్ కబలిస్తోంది.అత్యధికంగా 2019-20లో 754 మంది మరణించారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎన్పీడీసీఎల్) పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో అత్యధికంగా 2,757 మంది మరణించగా, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో మరో 1,663 మంది మృత్యువాత పడ్డారు. మృతుల కుటుంబాలకు గత ఏడేళ్లలో రూ.177.09 కోట్ల ఎక్స్‌గ్రేషియాను రెండు డిస్కంలు చెల్లించాయి. ఇక రెండు డిస్కంల పరిధిలో గత ఏడేళ్లలో 1,002 పశువులు విద్యుదాఘాతంతో మరణించగా, రూ. 38.27 కోట్ల పరిహారం చెల్లించాయి. 'కరెంట్ కాటుకు 644 మంది బలి'పేరుతో గత నెల 22న 'సాక్షి'లో వచ్చిన కథనంపై స్పందిస్తూ టీజీఎస్పీడీసీఎల్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రమాదాల నివారణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో గతంతో పోల్చితే ఈ ఏడాదిలో విద్యుదాఘాతం మరణాలు గణనీయంగా తగ్గాయని పేర్కొంది. అనధికారిక వ్యక్తులు విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేయడం, నాసిరకం వైర్ల వినియోగం, పొలాలకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడం వంటి కారణాలతో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపింది. విద్యుదాఘాతంతో మరణిస్తే రూ.5 లక్షలు, గాయపడితే తీవ్రత ఆధారంగా రూ.4 లక్షల వరకు పరిహారాన్ని కుటుంబ సభ్యులకు చెల్లిస్తున్నామని తెలిపింది. పశువులు మరణిస్తే రూ.40 వేలు, మేకలు, గొర్రెలు మరణిస్తే రూ.7 వేలు చెల్లిస్తున్నామని వెల్లడించింది. బాధిత కుటుంబ సభ్యులు పరిహారం కోసం సంబంధిత డిస్కం వెబ్‌సైట్‌కు గానీ, స్థానిక విద్యుత్ శాఖ ఏడీఈకి గానీ దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఎఫ్ఐఆర్, పంచనామా, పోస్టుమార్టం రిపోర్టులు, లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌ను దరఖాస్తుతోపాటు జతచేయాలని కోరింది.

ఓయూలో హాస్టల్ ప్రవేశాలు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ కాలేజీలతో పాటు నిజాం, సికింద్రాబాద్, సైఫాబాద్ కాలేజీల్లో ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం పీజీ విద్యార్థులకు (బాలురు, బాలికలు) హాస్టల్ ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈ విద్యా సంవత్సరానికి ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ నెల 10 వరకు హాస్టల్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్‌రావు మంగళవారం తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి హాస్టల్ సీటు సాధించిన విద్యార్థుల జాబితాను విడుదల చేసిన తర్వాత.. డిపాజిట్ చెల్లించి గదుల్లో చేరాలని స్పష్టం చేశారు. ద్వితీయ సంవత్సరం పీజీ కోర్సుల విద్యార్థులు ఈ నెల 3 నుంచి హాస్టల్ ప్రవేశాలను మెస్ బకాయిలు చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు. దసరా సెలవుల అనంతరం ఈ నెల 16 నుంచి మెస్సులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాలకు స్పెషల్ ఆఫీసర్లు

● పది మంది ఐఏఎస్‌ల నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల్లో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేలా ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకునేందుకు పది మంది ఐఏఎస్ అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. కె.ఇలంబరితి (ఆదిలాబాద్), ఆర్.వి.కర్ణన్ (కరీంనగర్), అనితా రామచంద్రన్ (నల్లగొండ), ఎ.శరత్ (నిజామాబాద్), డి.దివ్య (రంగారెడ్డి), రవి (మహబూబ్‌నగర్), టి.వినయ్‌కృష్ణారెడ్డి (వరంగల్), దాసరి హరిచందన (మెదక్), కె.సురేంద్రమోహన్ (ఖమ్మం), కాటా అమ్రపాలి (హైదరాబాద్)లను స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మధ్యప్రాచ్యంలో యుద్ధ భేరి


టెల్ అవీవ్‌పైకి దూసుకెళ్తున్న ఇరాన్ క్షిపణి


దాడులతో టెల్ అవీవ్‌లో విమానాశ్రయానికి, నగరానికి మధ్య ఎగసిపడుతున్న మంటలు

ఇజ్రాయెల్‌పై ఇరాన్ భారీ క్షిపణి దాడులు ● మూల్యం తప్పదు: ఇజ్రాయెల్, అమెరికా

జెరుసలేం/టెహ్రాన్/వాషింగ్టన్: మధ్యప్రాచ్యం అగ్నిగుండమైంది. దాడులు, ప్రతిదాడులు, ప్రతీకార దాడులతో భగ్గుమంటోంది. లెబనాన్‌ను కొద్ది రోజులుగా వైమానిక దాడులతో బెంబేలెత్తిస్తున్న ఇజ్రాయెల్ మంగళవారం భూతల దాడులను తీవ్రతరం చేసింది. లెబనాన్‌కు దన్నుగా నిలుస్తున్న ఇరాన్ కూడా కాసేపటికే ప్రతీకారేచ్ఛతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. అమెరికా నిఘా విభాగం హెచ్చరికలను నిజం చేస్తూ మంగళవారం రాత్రి పెద్దపెట్టున వైమానిక దాడులకు దిగింది. ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ లక్ష్యంగా భారీ సంఖ్యలో బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. నిమిషాల వ్యవధిలో వందలాది మిసైళ్లు, రాకెట్లు దూసుకొచ్చాయి. టెల్ అవీవ్‌తో పాటు సమీపంలోని జెరుసలేం తదితర ప్రాంతాలు భారీ పేలుళ్లతో దద్దరిల్లిపోయాయి. పలు భవనాలు దెబ్బతిన్నాయి. ఇరాన్‌కు దన్నుగా హెజ్‌బొల్లా కూడా టెల్ అవీవ్‌పైకి మిసైళ్లు ప్రయోగించింది. దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ దేశవ్యాప్తంగా విమానాశ్రయాలన్నింటినీ మూసేసింది. ప్రజలందరినీ అప్రమత్తం చేసింది. బంకర్ సైరన్లు నిరంతరాయంగా మోగాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు జనం బంకర్లు, సురక్షిత ప్రాంతాలకేసి పరుగులు తీశారు. జోర్డాన్ రాజధాని అమ్మాన్‌పైకి కూడా మిసైళ్లు దూసుకెళ్లి కలకలం రేపాయి.

రంగంలోకి అమెరికా యుద్ధనౌకలు

ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రంగా ఖండించారు. స్వీయరక్షణ చేసుకునేందుకు ఇజ్రాయెల్‌కు అన్నివిధాలా అండగా నిలుస్తామని ప్రకటించారు. ఇరాన్ మిసైళ్లను నేలకూల్చడంలో ఇజ్రాయెల్‌కు సహకరించాల్సిందిగా సైన్యాన్ని ఆదేశించారు. దాంతో మధ్యధరా సముద్రంలోని అమెరికా యుద్ధనౌకలు కూడా రంగంలోకి దిగి పలు ఇరాన్ క్షిపణులను అడ్డుకుని కూల్చేశాయి. ఇరాన్ దాడులకు తెగబడితే ఇజ్రాయెల్‌కు దన్నుగా రంగంలోకి దిగాల్సి వస్తుందని అమెరికా ఇప్పటికే హెచ్చరించడం తెలిసిందే. మధ్యప్రాచ్యంలో మోహరించిన అమెరికా యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు ఆ దిశగా రంగంలోకి దిగే సూచనలు కన్పిస్తున్నాయి. ఇరాన్ తాజా దాడులపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్రంగా స్పందించారు. మధ్యప్రాచ్యంలో తాము చేరలేని చోటంటూ ఏదీ లేదని పునరుద్ఘాటించారు. మొత్తానికి హమాస్‌ను ఏరివేసేందుకు గాజాపై ఏడాది క్రితం ఇజ్రాయెల్ తెరతీసిన దాడులు చివరికి లెబనాన్, ఇరాన్‌తో పూర్తిస్థాయి యుద్ధం దిశగా దారి తీసేలా కన్పిస్తున్నాయి. ఈ పరిణామంపై ప్రపంచ దేశాలన్నీ ఆందోళన చెందుతున్నాయి. గత ఏప్రిల్లో కూడా ఇజ్రాయెల్‌పై ఇరాన్ అనూహ్యంగా దాడికి దిగడం తెలిసిందే. అయితే అది ప్రయోగించిన క్షిపణులన్నింటినీ ఇజ్రాయెల్ మధ్యలోనే అడ్డుకుంది.

ప్రతిదాడులకు దిగారో...: ఇరాన్

ఇజ్రాయెల్‌పైకి భారీగా మిసైళ్లు ప్రయోగించినట్టు ఇరాన్ సైన్యం 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)' ప్రకటించింది. ''గత జూలైలో హమాస్ అగ్ర నేత ఇస్మాయిల్ హనియాను, తాజాగా హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లాను, తమ జనరల్ అబ్బాస్ నిల్ఫొరుషన్‌ను హతమార్చినందుకు, అసంఖ్యాకులైన అమాయక లెబనీస్, పాలస్తీనా ప్రజలను పొట్టన పెట్టుకుంటున్నందుకు ప్రతీకారంగానే ఇజ్రాయెల్‌పై దాడులకు దిగాం'' అని పేర్కొంది. ''ఇది ఆరంభం మాత్రమే. మాపై ప్రతి దాడులకు దిగితే మరింత భారీగా విరుచుకుపడతాం'' అని హెచ్చరించింది. ఇజ్రాయెల్ సైన్యం కూడా ఇరాన్ దాడులను ధ్రువీకరించింది. వాటిని అడ్డుకునేందుకు భారీగా ఇంటర్‌సెప్టర్ మిసైళ్లు ప్రయోగించింది. ఇరాన్ దాడులు విస్తరించవచ్చని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి డేనియల్ హగరీ అభిప్రాయపడ్డారు. తమ ఎయిర్ డిఫెన్స్ సిస్టం పూర్తిస్థాయిలో రంగంలోకి దిగిందని ప్రకటించారు. ఇరాన్ దాడులు ఆగాయని. ప్రస్తుతానికి ముప్పు లేనట్టేనని పేర్కొన్నారు.

హెచ్చరించి మరీ లెబనాన్‌లోకి...

ఇజ్రాయెల్, లెబనాన్ సరిహద్దు ప్రాంతాలు కూడా బాంబుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. హెజ్‌బొల్లా మిలిటెంట్ల ఏరివేతే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం సోమవారం అర్ధరాత్రి నుంచే లెబనాన్‌లోకి చొచ్చుకుపోవడం మొదలుపెట్టింది. సరిహద్దు గ్రామాల్లోని లెబనాన్ ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు తరలాలని ముందుగానే హెచ్చరించి మరీ రంగంలోకి దిగింది. దక్షిణ సరిహద్దుకు, లితానీ నదికి మధ్యన 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో ఉన్నవారంతా తక్షణం ఇళ్లు ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీ చేసింది. అనంతరం ఇజ్రాయెల్ దళాలు భారీ సంఖ్యలో సరిహద్దు దాటి కిలోమీటర్ల కొద్దీ చొచ్చుకెళ్లాయి. లెబనాన్‌పై లక్షిత భూతల దాడులు మొదలైనట్టు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ''అక్కడి హెజ్‌బొల్లా స్థావరాలను లక్ష్యం చేసుకున్నాం. మిలిటెంట్లు భారీగా ఆయుధాలను దాచిన బంకర్లు, టన్నెళ్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నాం'' అంటూ వీడియోలు విడుదల చేసింది. ఇరు పక్షాల మధ్య భారీగా కాల్పులు, రాకెట్ దాడులు జరుగుతున్నాయి. ఒక రాకెట్ బీరూట్‌లో ఇరాన్ దౌత్య కార్యాలయానికి అతి సమీపంలో పడింది. దాంతో పలు భవనాలు కుప్పకూలాయి. ఎర్రసముద్రంలోని హొడైడా నగరానికి 110 కిలోమీటర్ల దూరంలో మంగళవారం ఉదయం వేళ ఇజ్రాయెల్ తొలి దాడి జరిగినట్టు తెలుస్తోంది. తర్వాత కాసేపటికే అక్కడి ఉత్తర దిశగా రెండో దాడి జరిగిందని బ్రిటన్ సముద్ర వర్తక కార్యకలాపాల కేంద్రం పేర్కొంది. ఈ క్రమంలో లెబనాన్‌లోని అతి పెద్ద శరణార్థుల శిబిరాల్లో ఒకటైన సిడాన్‌లోని ఎన్ ఆల్ హిల్వే శిబిరంపై జరిగిన బాంబు దాడిలో ఆరుగురి దాక మరణించినట్టు చెబుతున్నారు. వీరిలో పాలస్తీనా ప్రెసిడెంట్ మహమ్మద్ అబ్బాస్‌కు చెందిన ఫతా గ్రూప్ సారథి జనరల్ మునీర్ మగ్డా కొడుకు, కోడలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది.


జెరూసలేం సమీపంలో దాడుల భయంతో నేలపై పడుకున్న ప్రజలు

లెబనాన్‌లో 900 మంది భారత సైనికులు!


లెబనాన్ దక్షిణ సరిహద్దుల వద్ద ఐరాస శాంతి పరిరక్షక దళంలో 900 మంది దాకా భారత సైనికులున్నట్టు తెలుస్తోంది. అక్కడ యుద్ధమేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో వారి భద్రతపై ఆందోళలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఐరాస దళంలో భాగంగా ఉన్న దృష్ట్యా వారిని ఇప్పటికిప్పుడు వెనక్కు పిలవడం సరైన చర్య కాబోదని కేంద్రం అభిప్రాయపడుతోంది. ''మన సైనికులంతా సురక్షితంగా ఉన్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం'' అని తెలిపింది.

ఉగ్ర కాల్పుల్లో ఆరుగురి మృతి

యుద్ధజ్వాలల నడుమ ఇజ్రాయెల్‌లో భారీ కాల్పులు చోటుచేసుకున్నాయి. జెరూసలేంలో ఇద్దరు ఉగ్రవాదులు విచ్చలవిడి కాల్పులకు తెగబడ్డారు. దాంతో ఆరుగురు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, సైన్యం హుటాహుటిన రంగంలోకి దిగి ముష్కరులిద్దరినీ మట్టుబెట్టారు.

సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు స్టెంట్

నిలకడగా ఆరోగ్యం... రెండు రోజుల్లో ఆసుపత్రి నుంచి ఇంటికి



సాక్షి, చెన్నై: ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ అనారోగ్యం కారణంగా సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరారు. డా.సాయి సతీష్ నేతృత్వంలో వైద్య బృందం ఆయనకు అత్యవసర వార్డులో చికిత్స అందించింది. రజనీకాంత్ ఆరోగ్య పరిస్థితిపై మంగళవారం ఉదయం వైద్యులు ఒక బులెటిన్ విడుదల చేశారు. రజనీకాంత్ ఆరోగ్యంగానే ఉన్నారని, ఆయనకు అత్యవసర వార్డులో చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆ తర్వాత రెండో బులెటిన్ విడుదల చేశారు. రజనీకాంత్ హృదయంలోని ప్రధాన రక్తనాళంలో వాపు ఉందని, అయితే శస్త్ర చికిత్స అవసరం లేకుండానే అత్యాధునిక విధానంలో వైద్య చికిత్స అందించినట్టు పేర్కొన్నారు. రక్తనాళంలో స్టెంట్ వేసినట్లు తెలిపారు. రజనీకాంత్ నిరంతరం ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నారని వివరించారు. చికిత్స అనంతరం ఆయన తమతో మాట్లాడారని, చికిత్స అందించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారని చెప్పారు. రజనీకాంత్ ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, రెండు రోజుల్లో ఇంటికి చేరుకుంటారని స్పష్టంచేశారు. వైద్యుల ప్రకటనతో రజనీకాంత్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. రజనీకాంత్ క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఫోన్‌లో అపోలో ఆసుపత్రి డాక్టర్లతో మాట్లాడారు. రజనీకాంత్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడు విజయ్ సైతం స్పందించారు. రజనీకాంత్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా ఇంటికి తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు.

తుపాకీ పేలి.. గోవిందా కాలికి గాయం



ముంబై: బాలీవుడ్ నటుడు గోవిందా(60) కాలికి బుల్లెట్ గాయమైంది. ముంబైలోని జుహూ ప్రాంతంలోని ఆయన నివాసంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతుండగా ఉదయం 4.45 గంటల సమయంలో చేతిలో ఉన్న లైసెన్స్‌డ్ రివాల్వర్ అనుకోకుండా పేలిందని పోలీసులు తెలిపారు. 'వైద్యులు గోవిందా కాలిలోని బుల్లెట్‌ను తొలగించారు. ఎడమ మోకాలి దిగువన 8–10 కుట్లు పడ్డాయి. ఆయన కోలుకుంటున్నారు'అని పోలీసులు తెలిపారు. ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. రివాల్వర్‌ను స్వాధీనం చేసుకుని, దర్యాప్తు చేపట్టామన్నారు. 'అభిమానులు, తల్లిదండ్రులు, ఆ దేవుని ఆశీర్వాదంతో గాయం నుంచి కోలుకుంటున్నాను. నాకు తగిలిన బుల్లెట్‌ను వైద్యులు తొలగించారు'అంటూ గోవిందా ఒక ఆడియో సందేశం విడుదల చేశారు. మంగళవారం కోల్‌కతాలో జరిగే ఓ షోలో గోవిందా పాల్గొనాల్సి ఉందని ఆయన మేనేజర్ శశి సిన్హా తెలిపారు. రివాల్వర్‌ను కప్‌బోర్డులో ఉంచే సమయంలో పొరపాటున ట్రిగ్గర్‌పై వేలు పడి, పేలి కాలికి తగిలిందని సిన్హా వివరించారు. రివాల్వర్‌ను చెక్ చేస్తుండగా చేతుల్లో జారి అనుకోకుండా పేలిందని గోవిందా సోదరుడు కృతి కుమార్ చెప్పారు.

కశ్మీర్ మూడో విడత పోలింగ్‌లో 68 శాతం ఓటింగ్

బారాముల్లా, సొపోర్‌లలో 30 ఏళ్లలోనే అత్యధికం

జమ్మూ/శ్రీశ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడో విడతలో మంగళవారం జరిగిన పోలింగ్‌లో 68.72 శాతం ఓటింగ్ నమోదైందని ఎన్నికల కమిషన్(ఈసీ) తెలిపింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు మించి జనం ఓటేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏడు జిల్లాల్లో 66.78% ఓటింగ్ నమోదైంది. ఎప్పుడూ ఎన్నికలను బహిష్కరించే బారాముల్లా, సొపోర్ అసెంబ్లీ స్థానాల్లో 30 ఏళ్లలోనే అత్యధికంగా ఈసారి జనం పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారని ఈసీ తెలిపింది. అత్యంత కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య జమ్మూకశ్మీర్‌లోని 40 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. ముఖ్యంగా పశ్చిమ పాకిస్తానీ శరణార్థులు, వాల్మీకి సమాజ్, గూర్ఖా వర్గం ప్రజలు పెద్ద సంఖ్యలో కనిపించారు. అత్యధికంగా సాంబాలో 73.45%, ఉధంపూర్‌లో 72.91% మంది ఓటేయగా, కథువాలో 70.53%, జమ్మూలో 66.79%, బందిపొరాలో 64.85%, కుప్వారాలో 62.76%, బారాముల్లాలో 55.73% మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. జమ్మూ జిల్లాలోని ఛాంబ్ నియోజకవర్గంలో అత్యధికంగా 77.35 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఈసీ వివరించింది. సొపోర్ నియోజకవర్గంలో 41.44%, బారాముల్లా అసెంబ్లీ స్థానంలో 47.95% మంది ఓటు వేశారు. గత 30 ఏళ్ల ఎన్నికల చరిత్రలోనే ఇది అత్యధికమని ఈసీ తెలిపింది. గతంలో ఇక్కడ తరచూ ఎన్నికలను బహిష్కరించే ఆనవాయితీ నడిచిందని పేర్కొంది. జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా మూడు విడతల్లో కలిపి ఓటింగ్ శాతం 63.45 అని ఈసీ పేర్కొంది. మూడో విడత పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని, పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఈసీ పేర్కొంది. ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదని, రీపోలింగ్ అవసరం కూడా లేదని వివరించింది. ఈ నెల 8వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు కోసం అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

తప్పుడు హామీలే కాంగ్రెస్ రాజకీయం

హరియాణాలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ధ్వజం

చండీగఢ్: విపక్ష కాంగ్రెస్ రాజకీయాలు తప్పుడు హామీలకే పరిమితం అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. బీజేపీ రాజకీయాలు మాత్రం ప్రజా శ్రేయస్సు కోసం కష్టపడి పనిచేసేలా ఉంటాయని అన్నారు. నిస్వార్థమైన శ్రమపై, ఫలితాలపై తాము దృష్టి పెట్టామని వెల్లడించారు. మంగళవారం హరియాణాలోని పాల్వాల్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. రాష్ట్రంలో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో బీజేపీ ప్రభంజనం కనిపిస్తోందన్నారు. తమ ప్రచార సభలకు జనం భారీ సంఖ్యలో హాజరై తమను ఆశీర్వదిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌లో చివరి దశ పోలింగ్‌లో జనం పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, ప్రజాస్వామ్య వేడుకలో పాలుపంచుకుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఓటర్లంతా తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.



హరియాణాలో గత పదేళ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ ఈసారి కచ్చితంగా గెలుస్తామని ఆశలు పెట్టుకుందని ప్రధాని మోదీ చెప్పారు. మధ్యప్రదేశ్‌లోనూ ఇలాగే ఆశలు పెంచుకొని భంగపడిందని గుర్తుచేశారు. రాజస్తాన్‌లో రైతులను, యువతను బీజేపీకి వ్యతిరేకంగా రెచ్చగొట్టడానికి ప్రయత్నించిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. హరియాణాలోనూ కాంగ్రెస్‌కు అలాంటి పరాభవం తప్పదని తేల్చిచెప్పారు. ఆ పార్టీని జనం మట్టికరిపిస్తారని స్పష్టం చేశారు. కష్టపడి పని చేయాలనే సందేశాన్ని హరియాణా గడ్డపైనుంచి భగవద్గీత తమకు అందిస్తోందని ప్రధాని మోదీ వివరించారు. పని చేయకు, చేయనివ్వకు అనేది కాంగ్రెస్ ఫార్ములా అని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీయే హరియాణాలో అధికారంలో ఉండడం ఆనవాయితీగా వస్తోందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఈ నెల 5న అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నెల 8న ఫలితాలు వెలువడుతాయి.

సంపన్నుల సేవలో మోదీ సర్కారు

- జనం సొమ్ముతో వైభవంగా అంబానీ కుమారుడి పెళ్లి
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపాటు

సోనిపట్: నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ రాజ్యాంగంపై దాడి చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. మోదీ సర్కారు కేవలం కొద్దిమంది ధనవంతుల సేవలో తరిస్తూ పేదలను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. అంబానీకి, అదానీకి మేలు చేయడానికే ప్రధాని నరేంద్ర మోదీ నోట్ల రద్దు, జీఎస్టీ విధానాలు తీసుకొచ్చినట్లు హరియాణాలో ఓ వ్యాపారి తనతో చెప్పాడని అన్నారు. మంగళవారం హరియాణాలోని సోనిపట్, బహదూర్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ''ఇటీవల జరిగిన అంబానీ కుమారుడి పెళ్లి చూశారా? ఈ పెళ్లి కోసం అంబానీ వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఆ సొమ్మంతా ఎవరిది. అది ముమ్మాటికీ ప్రజలదే. మీ బిడ్డల పెళ్లి చేయాలంటే బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఓ రైతు తన బిడ్డ పెళ్లి జరిపించాలంటే అప్పులపాలు కావాల్సిందే. కానీ, దేశంలో పిడికెడు మంది బడా బాబులు పెళ్లి కోసం వేల కోట్ల రూపాయలు మంచినీళ్లలా ఖర్చుచేసేలా వారికి అనుకూలంగా నరేంద్ర మోదీ ఓ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సంపన్నుల సేవలో ఆయన తరిస్తున్నారు. ఇది రాజ్యాంగంపై దాడి కాక మరేమిటి?'' అని నిలదీశారు. ఇద్దరు ముగ్గురు శ్రీమంతుల కోసం కేంద్రంలో మోదీ ప్రభుత్వం, హరియాణాలో బీజేపీ ప్రభుత్వం పని చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరిస్తోందని రాహుల్ గాంధీ విమర్శించారు. ఇప్పుడు ఎక్కడ చూసినా అంబానీ, అదానీ పేర్లే కనిపిస్తున్నాయని ఆక్షేపించారు. రక్షణ రంగ బడ్జెట్‌ను అదానీకి కట్టబెట్టడానికి అగ్నిపథ్ పథకం తీసుకొచ్చారని ఆరోపించారు. రక్షణ శాఖకు విక్రయిస్తున్న ఆయుధాలపై అదానీ కంపెనీ సొంత స్టిక్కర్లు వేసుకుంటోందని, వాస్తవానికి వాటిని విదేశీ కంపెనీలే తయారు చేస్తున్నాయని చెప్పారు.



ఈడీ కేసు ఎలా పెడుతుంది?

- కోల్పోయిన భూమికి పరిహారంగా ప్లాట్లు కేటాయించారు
- మనీలాండరింగ్‌కు ఆస్కారం ఎక్కడిది: సిద్ధరామయ్య



బెంగళూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ప్లాట్ల కేటాయింపు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనపై మనీలాండరింగ్ కేసు నమోదు చేయడంలో ఔచిత్యం ఏమిటని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశ్నించారు. 'దేని ఆధారంగా మనీలాండరింగ్ కేసు పెట్టారో నాకైతే అర్థం కావడం లేదు. మా నుంచి సేకరించిన భూమికి పరిహారంగా ప్లాట్లు కేటాయించారు. అలాంటప్పుడు మనీలాండరింగ్ కేసుకు ఆస్కారం ఎక్కడిది? నాకు తెలిసి మనీలాండరింగ్ దీనికి వర్తించదు' అని సిద్ధరామయ్య మంగళవారం అన్నారు. మైసూరులో సిద్ధరామయ్య భార్య పార్వతికి చెందిన 3.16 ఎకరాల భూమిని సేకరించిన ముడా పరిహారంగా 50:50 నిష్పత్తిలో ఖరీదైన ప్రాంతంలో 14 ప్లాట్లకు ఆమెకు కేటాయించింది. ఇందులో అధికార దుర్వినియోగం, అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. కోర్టు ఆదేశాల మేరకు సిద్ధరామయ్య, పార్వతిలపై లోకాయుక్త పోలీసులు కేసు నమోదు చేశారు. దీని ఆధారంగా ఈడీ సోమవారం సిద్ధరామయ్యపై మనీలాండరింగ్ కేసును నమోదు చేసిన విషయం విదితమే. ఈడీ కేసు నమోదైన కొద్దిగంటల్లోనే 14 ప్లాట్లను వెనక్కి ఇచ్చేస్తానని పార్వతి ముడా కమిషనర్‌కు లేఖ రాశారు. తన భర్త పరువుప్రతిష్టలు, మానసిక ప్రశాంతత కంటే ఏ ఆస్తి కూడా తనకు ఎక్కువ కాదని ఆమె పేర్కొన్నారు. తనపై ద్వేష రాజకీయాలకు పార్వతి బాధితురాలుగా మారారని సిద్ధరామయ్య అన్నారు. తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదన్నారు.

14 ప్లాట్లు వెనక్కితీసుకున్న ముడా

మైసూరు: పార్వతి అభ్యర్థన మేరకు ఆమెకు కేటాయించిన 14 ప్లాట్లను మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) మంగళవారం వెనక్కి తీసుకుంది. పార్వతితో చేసుకున్న సేల్‌డీడ్లను రద్దు చేస్తూ ఆదేశాలు జారీచేసింది. పార్వతి తనయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్ర తమకు లేఖను అందించారని, దాన్ని పరిశీలించి ప్లాట్లను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించామని ముడా కమిషనర్ ఎ.ఎన్.రఘునందన్ వెల్లడించారు. ఎవరైనా స్వచ్ఛందంగా ప్లాట్లను వదులుకుంటే.. వెనక్కి తీసుకోవచ్చనే నిబంధన ముడా చట్టంలో ఉందన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉంటే దర్గా, గుడి.. ఏదైనా కూల్చాల్సిందే

- మార్గదర్శకాలు జారీచేస్తాం
- అప్పటిదాకా సుప్రీంకోర్టు అనుమతి లేకుండా కూల్చివేతలు చేపట్టకూడదు

న్యూఢిల్లీ: ప్రార్థనా స్థలం రోడ్డు మధ్యలో ఉంటే.. అది దర్గా అయినా, గుడి అయినా తొలగించాల్సిందేనని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ప్రజా ప్రయోజనాలే సర్వోన్నతమని స్పష్టం చేసింది. కూల్చివేతలకు సంబంధించి దేశవ్యాప్తంగా ఏకీకృత మార్గదర్శకాలను రూపొందిస్తామని తెలిపింది. నిందితుడైనంత మాత్రాన ఇళ్లు కూల్చలేరని, ఒకవేళ దోషిగా తేలినా.. వారికి సంబంధించిన నిర్మాణాలను కూల్చడానికి అది భూమిక కాబోదని పేర్కొంది. పలు రాష్ట్రాల్లో బుల్డోజర్ న్యాయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మంగళవారం జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. అనధికారిక నిర్మాణం ఎవరు చేపట్టినా.. వారి మతం, విశ్వాసాలతో సంబంధం లేకుండా దాన్ని కూల్చివేయాల్సిందేనని పేర్కొంది. సెప్టెంబర్ 17న విచారణ సందర్భంగా ధర్మాసనం దేశవ్యాప్తంగా బుల్డోజర్లకు బ్రేక్ వేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు అనుమతి లేకుండా అక్టోబర్ 1వ తేదీదాకా ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ విచారణ ముగిసేదాకా అవే ఆదేశాలు అమలులో ఉంటాయని మంగళవారం తేల్చిచెప్పింది. 'మనది లౌకిక రాజ్యం. ప్రజలందరిని దృష్టిలో పెట్టుకొని మార్గదర్శకాలు రూపొందిస్తాం. ఏదో ఒక వర్గం కోసం కాదు. కేసు విచారణలో తొలిరోజే చెప్పాం. రోడ్డు మధ్యలో ఏదైనా ప్రార్థనా స్థలం ఉంటే.. అది దర్గా అయినా, గుడి అయినా దాన్ని తొలగించాల్సిందే. ప్రజల భద్రత, ప్రజా ప్రయోజనాలే అన్నింటికంటే ముఖ్యం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రత్యేకించి ఒక మతానికి వేరుగా చట్టం ఉండకూడదని అభిప్రాయపడింది. ప్రభుత్వ ఆస్తులు, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, అడవులు, చెరువుల ఆక్రమణలకు తాము రక్షణ కల్పించబోమని స్పష్టం చేసింది. తాము జారీచేసే మార్గదర్శకాలు దేశమంతటికీ వర్తిస్తాయని చెప్పింది. కూల్చివేతలకు సంబంధించిన నోటీసులను రిజిస్టర్డ్ పోస్టులో యజమానులకు పంపాలని, అలాగే ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రదర్శించాలని.. అప్పుడు దానికి సంబంధించిన డిజిటల్ రికార్డు ఉంటుందని పేర్కొంది. కూల్చివేతకు సంబంధించిన ఆదేశాలు వెలువడ్డాక 10 లేదా 15 రోజుల సమయం ఇవ్వాలని, అప్పుడు ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటారని సూచించింది. 'మహిళలు, పిల్లలు రోడ్డున పడితే చూడలేమని పేర్కొంది. తీర్పును రిజర్వు చేసింది.

సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహారదీక్ష

- లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్
- లేహ్ నుంచి ఢిల్లీకి పాదయాత్ర; అరెస్టు



న్యూఢిల్లీ: లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ లేహ్ నుంచి ఢిల్లీకి పాదయాత్ర చేపట్టిన పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు సోమవారం రాత్రి ఢిల్లీ సరిహద్దుల్లో నిలువరించి.. అరెస్టు చేశారు. దాంతో ఆయన పోలీసుస్టేషన్‌లోనే ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. ఢిల్లీ చలో పాదయాత్ర నెలరోజుల కిందట లేహ్‌లో ప్రారంభమైంది. వాంగ్‌చుక్ 120 మందితో కలిసి ఈ పాదయాత్ర చేపట్టారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని, లేహ్, కార్గిల్ జిల్లాలకు వేర్వేరుగా రెండు లోక్‌సభ స్థానాలుండాలని, లద్దాఖ్‌కు పబ్లిక్ సర్వీసు కమిషన్ ఉండాలనే డిమాండ్లతో గత నాలుగేళ్లుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. లేహ్ అపెక్స్ బాడీ (ఎల్‌ఏబీ), కార్గిల్ డెమొక్రాటిక్ అలయన్స్ (కేడీఏ) ఈ ఆందోళనలకు నేతృత్వం వహిస్తున్నాయి. ఐదుగురికి మించి గుమిగూడదనే నిషేధాజ్ఞలు విధించిన ఢిల్లీ పోలీసులు వాంగ్‌చుక్, ఆయన సహచరులను రాజధాని సరిహద్దుల్లో అదుపులోకి తీసుకున్నారు.

పదవి వదిలేందుకూ సిద్ధం: చిరాగ్

పట్నా: పదవినైనా వదులుకుంటాను గానీ విలువలు, సిద్ధాంతాల విషయంలో రాజీపడబోనని కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన సోమవారం పార్టీ ఎస్సీ, ఎస్టీ విభాగం సమావేశంలో మాట్లాడారు. ''నా తండ్రి దివంగత రామ్‌విలాస్ పాశ్వాన్ విలువలు, సిద్ధాంతాల విషయంలో ఏనాడూ రాజీపడలేదు. కేంద్రంలో యూపీఏ హయాంలో దళితుల ప్రయోజనాలు దెబ్బతీసే చర్యలకు వ్యతిరేకంగా సంకీర్ణం నుంచి బయటకు వచ్చారు'' అన్నారు. చిరాగ్ వ్యాఖ్యలు రాజకీయ రగడకు దారితీశాయి. అయితే తాను ఎన్డీయేలోనే ఉంటానని, నరేంద్ర మోదీ తమ ప్రధానమంత్రి అని ఆయన తేల్చిచెప్పారు. దళితుల సంక్షేమం విషయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం చక్కగా పనిచేస్తోందంటూ కితాబిచ్చారు.



స్కూల్ బస్సుకు మంటలు.. 20 మంది విద్యార్థులు సహా 23 మంది ఆహుతి

థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్ శివారులో ఘటన

బ్యాంకాక్: విహార యాత్రకు పాఠశాల విద్యార్థులు, టీచర్లతో వెళ్తున్న బస్సు మంటల్లో చిక్కుకుంది. ఈ విషాద ఘటనలో 20 మంది విద్యార్థులు సహా 23 మంది సజీవ దహనమయ్యారు. థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్ శివారులో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. సెంట్రల్ ఉథాయ్ థని ప్రావిన్స్‌కు చెందిన స్కూల్ విద్యార్థులు, టీచర్లు కలిపి మొత్తం 44 మందితో అయుథ్థయ, నొంతబురి ప్రావిన్స్‌ల్లో విహారయాత్రకు బస్సులో బయలుదేరారు. నొంతబురి వైపు వెళ్తుండగా బస్సు ముందు టైరు పగిలి, అదుపుతప్పి రోడ్డుపక్క రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఒక్కసారిగా మంటలు చెలరేగి, అందులోని 20 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్లు ఆహుతయ్యారు. గాయపడిన ముగ్గురు విద్యార్థులు సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని, ఘటనపై దర్యాప్తు ముగిశాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని ప్రభుత్వం తెలిపింది.

అన్నారం బరాజ్‌లో ఇసుక తొలగింపు

- వాటర్ ఫ్లషింగ్ టెక్నిక్ వాడుతున్న అధికారులు



అన్నారం బరాజ్ గేట్ల వద్ద వాటర్ ఫ్లషింగ్ చేస్తున్న దృశ్యం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం బరాజ్‌లో భారీ వర్షాల కారణంగా గేట్ల కింది భాగంలో ఇసుక నిల్వలు పేరుకున్న విషయం తెలిసిందే. దీంతో ఇంజనీరింగ్ అధికారులు వాటర్ ఫ్లషింగ్ టెక్నిక్‌తో గేట్ల ముందు, కింది భాగంలో ఉన్న ఇసుకను తొలగిస్తున్నారు. బరాజ్ పొడవునా గేట్ల ముందు, కింది భాగంలో సుమారుగా 5 నుంచి 8 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక.. ఐదు నుంచి ఆరు మీటర్ల ఎత్తులో మేటలు వేసింది. దీంతో ఇంజనీరింగ్ అధికారులు ఇసుకను తొలగించడానికి కొత్త ఆలోచన చేశారు. బరాజ్‌లోని 66 గేట్లలో ఒక్క గేటును తెరిచి మిగతా గేట్లను మూసుకుంటూ వాటర్ ఫ్లషింగ్‌తో ఇసుకపై ఒత్తిడితెచ్చి వరద ప్రవాహం గుండా దిగువకు తరలిస్తున్నారు. అలా బరాజ్‌లోని అన్ని గేట్ల కింది భాగంలో పేరుకున్న ఇసుకను తొలగిస్తున్నారు. ప్రస్తుతం ఆ పద్ధతి ప్రకారం కొంతమేర ఇసుక దిగువకు తరలిపోయిందని ఇంజనీరింగ్ వర్గాలు తెలిపాయి. గేట్లకింది భాగంలో ఇసుక వరదతో కలిసి పోతుండడంతో గేట్లు ఎత్తడం, దించడం సులువుగా చేయవచ్చని వారు పేర్కొన్నారు.

మేడిగడ్డ ఇంజనీర్లపై చర్యలకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ నిర్మాణం పూర్తికాక ముందే పూర్తైనట్లు ధ్రువీకరిస్తూ నిర్మాణ సంస్థకు వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్లు జారీచేసిన నాటి రామ గుండం ఎస్ఈ బి.వెంకటరమణారెడ్డి, మహదేవ్‌పూర్ డివిజన్-1 ఈఈ సీహెచ్ తిరుపతిరావులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. వీరిద్దరిపై చర్యలు తీసుకోవడానికి వారి సర్వీసు వివరాలను సమర్పించాలని నీటి పారుదలశాఖ ఈఎన్‌సీ (జనరల్)ను ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఇటీవల ఆదేశించారు. మేడిగడ్డ బరాజ్ రేడియల్ గేట్లు, గేట్లను పైకి ఎత్తే వ్యవస్థ, నదికి ఇరువైపులా గైడ్ బండ్ల ఏర్పాటు వంటి పనులు పూర్తికాకముందే వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు తన లేఖలో రాహుల్ బొజ్జా తెలిపారు.

కింకర్తవ్యం!?

సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలతో చంద్రబాబు అంతర్మథనం



సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ''జంతు కొవ్వు'' ప్రకటనను సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించడం.. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలంటూ అత్యున్నత న్యాయస్థానం ఘాటుగా హెచ్చరించిన నేపథ్యంలో టీడీపీ శ్రేణులు గప్‌చుప్ అయ్యాయి. అసలు వాడని కల్తీ నెయ్యిని వాడినట్లుగా చిత్రీకరించి తమ అధినాయకత్వం తప్పు మీద తప్పు చేసిందనే అభిప్రాయం టీడీపీ శ్రేణుల్లో బలంగా వ్యక్తమవుతోంది. శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారనేందుకు ప్రస్తుతం ప్రాథమికంగా ఎలాంటి ఆధారాలు లేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో లడ్డూలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారంటూ సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలనే విషయం ప్రజల్లో మరింత బలపడుతోందని టీడీపీ సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు. నష్ట నివారణ చర్యల్లో భాగంగా సుప్రీం కోర్టు వ్యాఖ్యలను తప్పుపట్టేలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడినా ఫలితం లేదని టీడీపీ శ్రేణులు వాపోతున్నాయి. ఇదొక్కటే కాకుండా గత ఐదేళ్లలో తిరుమల, ఇతర దేవాలయాలలో జరిగిన ఘటనలపై ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నానంటూ జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెబుతున్న మాటలను ప్రజలు ఏమాత్రం విశ్వసించడం లేదని పేర్కొంటున్నారు. ప్రజల మనోభావాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు విసిరిన పాచిక పారకపోగా మైనారిటీలను పార్టీకి మరింత దూరం చేసిందని టీడీపీ సీనియర్ నేత ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో అధినాయకత్వం అత్యుత్సాహమే కొంపముంచిందనే అభిప్రాయం టీడీపీ శ్రేణుల్లో గట్టిగా వ్యక్తమవుతోంది.

తప్పులు చెప్పించారని సన్నిహితులతో ఈవో ఆవేదన!

వనస్పతి ఆయిల్ మాత్రమే కల్తీ అయినట్లు ఎన్‌డీడీబీ రిపోర్టులో వచ్చిందని.. ఆ రిపోర్టు వచ్చిన రోజే సీఎం చంద్రబాబుకు తాను చెప్పానని.. అయినా తన మాట పట్టించుకోలేదని ఈవో శ్యామలరావు వాపోతున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఎన్‌డీడీబీ రిపోర్టులో జంతువుల కొవ్వు కలిసినట్లుగా ఎక్కడా స్పష్టంగా లేదని.. కల్తీ నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపామని.. ఆ నెయ్యిని లడ్డూల తయారీలో వాడలేదని సీఎం చంద్రబాబుకు తాను పదే పదే చెప్పానని.. అయినా తన మాట వినిపించుకోలేదని ఈవో ఆవేదన చెందుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో తనతో కూడా తప్పులు చెప్పించారని ఈవో శ్యామలరావు నొచ్చుకున్నట్లు ఆయన సన్నిహితుడొకరు పేర్కొన్నారు.

తప్పు మీద తప్పు..

ఎన్నికల్లో కూటమి గెలుపొందిన అనంతరం జూన్ 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయగా జూన్ 14న టీటీడీ ఈవోగా జె.శ్యామలరావును ప్రభుత్వం నియమించింది. టీటీడీకి ఓ సంస్థ సరఫరా చేసిన రెండు నెయ్యి ట్యాంకర్లలో వనస్పతి ఆయిల్ కల్తీ జరిగినట్లు తేలిందని.. అయితే ఆ రెండు ట్యాంకర్లను వెనక్కి పంపామని, వాటిని అసలు వాడలేదని జూలై 23న తిరుమలలో ఈవో జె.శ్యామలరావు మీడియా సాక్షిగా ప్రకటించారు. అనంతరం రెండు నెలల తరువాత సెప్టెంబరు 18న కూటమి శాసనసభా పక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వును వాడి అపచారం చేశారంటూ దారుణమైన ఆరోపణలు చేశారు. ఆ తర్వాత సెప్టెంబరు 20న టీటీడీ ఈవో తిరుమలలో మీడియాతో మాట్లాడుతూ.. తమిళనాడు డెయిరీ సరఫరా చేసిన నాలుగు ట్యాంకర్ల నెయ్యిలో కల్తీ జరిగిందని ఎన్‌డీడీబీ రిపోర్టు ఇచ్చిందని.. అయితే ఆ నాలుగు ట్యాంకర్లను వెనక్కి పంపేశామని.. ఆ నెయ్యిని తిరుమల లడ్డూ తయారీలో వాడలేదని స్పష్టం చేశారు. ఈ మేరకు సెప్టెంబరు 22న సీఎం చంద్రబాబుకు ఆయన నివేదిక కూడా ఇచ్చారు. కానీ.. సీఎం చంద్రబాబు మాత్రం సెప్టెంబరు 22న జంతువుల కొవ్వు కలిసిన నెయ్యిని తిరుమల లడ్డూ తయారీలో వాడారంటూ అబద్ధాలు పునరుద్ఘాటించారు. కల్తీ నెయ్యిని లడ్డూ తయారీలో వాడలేదని టీటీడీ ఈవో పదే పదే స్పష్టం చేస్తున్నా... ఆ నెయ్యిని వాడారంటూ చంద్రబాబు పునరుద్ఘాటించడం ద్వారా తప్పు మీద తప్పు చేశారని టీడీపీకి చెందిన మాజీ మంత్రి ఒకరు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

సిట్ విచారణ నిలిపివేత

తిరుమల: తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ అంటూ అసత్య ఆరోపణలు చేసిన చంద్రబాబు.. ఆ ఆరోపణలపై విచారణ కోసం ఆయనే ఏర్పాటు చేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) విచారణ నిలిచిపోయింది. డీజీపీ ద్వారకా తిరుమలరావు తిరుమలలో మంగళవారం ఈ మేరకు ప్రకటించారు. తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ ఆరోపణలపై సిట్ దర్యాప్తును నిలిపివేస్తున్నామని.. సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండటం వల్ల దర్యాప్తును ఆపుతున్నామని తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పోలీస్, టీటీడీ విజిలెన్స్ అధికారులతో తిరుమలలో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డులో కల్తీ నెయ్యి వాడిన కేసు తీవ్రత వల్లే సిట్ వేశామని.. 3 రోజుల పాటు టీటీడీలో సిట్ దర్యాప్తు సాగిందన్నారు. ప్రస్తుతానికి సిట్ విచారణను తాత్కాలికంగా నిలిపివేస్తున్నా మన్నారు. ఈ నెల 3వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చే ఆదేశాల ప్రకారం దర్యాప్తుపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

రూ. 2 లక్షలకు పైబడిన రుణాలకు ప్రత్యేక షెడ్యూల్: తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రూ.2 లక్షలకుపైబడి ఉన్న రైతు రుణాలకు ప్రత్యేకంగా షెడ్యూల్ ప్రకటిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ షెడ్యూల్‌ప్రకారం రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులు పైమొత్తాన్ని చెల్లిస్తే వారికి రూ. 2 లక్షలు మాఫీ చేస్తామని చెప్పారు. తాము రుణమాఫీ చేస్తుంటే ప్రతిపక్షాలకు వచ్చే నష్టమేంటని తుమ్మల ప్రశ్నించారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షల లోపు రుణాలున్న రైతుల ఖాతాల్లో మాఫీ సొమ్ము వేస్తామన్న హామీకి కట్టుబడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందులున్నా రుణమాఫీని అమలు చేస్తున్నారని.. ప్రతిపక్షాలు దాన్ని ఓర్వలేకపోతే ఎలాగని నిలదీశారు. బీజేపీకి చేతనైతే ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రుణమాఫీ ప్రకటించి, మాఫీ చేశాక తమను వేలెత్తి చూపించాలని సవాల్ విసిరారు. రైతులను తొక్కించి చంపినోళ్లు తమకు నీతులు చెబుతున్నారంటూ ఫైర్‌అయ్యారు. బీజేపీ రైతుల గురించి మాట్లాడటం అంటేనే వింత అని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు మూడు విడతలుగా రూ.18 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేసిన ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. రూ.31 వేల కోట్ల పంట రుణాలను ఈ ఏడాదిలోనే మాఫీ చేసి తీరుతామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. తామెప్పుడూ 42 లక్షల మందికి రుణమాఫీ చేస్తామని చెప్పలేదన్నారు. రాష్ట్రంలో 69.70 లక్షల మంది రైతులు ఉండగా... 2018 డిసెంబర్ 11 నుంచి 2023 డిసెంబరు 9 వరకు కటాఫ్‌తేదీపెట్టి బీఆర్ఎస్‌కాలంలోని పంట రుణాల ఖాతాలకు సైతం మాఫీ చేయాలని బ్యాంకులను సమాచారం అడిగినట్లు వివరించారు. గత ఐదేళ్లలో పంట రుణం తీసుకున్న రైతుల రూ. 31 వేల కోట్ల రుణాలకు సంబంధించిన 42 లక్షల ఖాతాలను బ్యాంకులు ప్రభుత్వానికి పంపించాయని తెలిపారు. కేవలం 26 రోజుల్లోనే 22 లక్షల మంది రైతు ఖాతాల్లో రూ. 18 వేల కోట్లను జమ చేశామన్నారు.

43 లక్షల మందిలో 40 మందికి అవకాశమిచ్చాం

- మీరు ఆశించిన స్థాయిలో పనిచేస్తున్నారో లేదో ఆత్మవిమర్శ చేసుకోండి
- పనిచేయకపోతే భవిష్యత్‌లో నష్టపోతారు
- కార్పొరేషన్ చైర్మన్లకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ క్లాస్



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో 43 లక్షల మందికి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాలున్నాయి. అందులో కార్పొరేషన్ చైర్మన్లుగా 40 మందికి అవకాశమిచ్చాం. సామాజిక, ప్రాంతీయ సమీకరణలతో పాటు సీనియారిటీ, శ్రమ ఆధారంగా అనేక వడపోతల తర్వాత మీకు చైర్మన్ పదవులొచ్చాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరంతా బాగా పనిచేశారు. మీలో ఎంపీలు, ఎమ్మెల్యేలు కావాల్సిన వారు కూడా ఉన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చాక కాస్త విశ్రాంతి తీసుకుంటున్నట్టు కనిపిస్తోంది. మీరు ఎలా పనిచేస్తున్నారో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోండి. పార్టీ కోసం మీరేం చేస్తున్నారన్న సమాచారం ఎప్పటికప్పుడు మాకు వస్తోంది. పనిచేయకపోతే భవిష్యత్‌లో మీరే నష్టపోతారు.'అని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. 10 మంది చైర్మన్లు మాత్రమే చురుగ్గా పార్టీ కోసం పనిచేస్తున్నారని, సీఎం, మంత్రులు రోజుకు 18 గంటల పాటు విశ్రాంతి లేకుండా పనిచేస్తుంటే మీరెంతసేపు పనిచేస్తున్నారంటూ మంగళవారం గాంధీ భవన్‌లో రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్లతో జరిగిన సమావేశంలో ఆయన క్లాస్ తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పనిచేస్తుంటే ప్రతిపక్షాలు పనికట్టుకొని బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని, ఆ దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భాగంగా ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన పనులేంటి? బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలేంటి? ఆ ఆరోపణలను ఎలా తిప్పికొట్టాలన్న అంశాలను వివరిస్తూ కార్పొరేషన్ చైర్మన్లకు సమాచారంతో కూడిన రిపోర్టులు అందజేశారు. సమావేశంలో భాగంగా పలువురు కార్పొరేషన్ చైర్మన్లు మాట్లాడుతూ తమ సమస్యలను పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ముందు ఏకరువు పెట్టారు. తమకు గన్‌మెన్లను ఇంకా ఇవ్వలేదని, అటు శాఖాపరంగా, ఇటు నియోజకవర్గాల్లోనూ ప్రొటోకాల్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనం సరిపోవడం లేదని కొందరు, బీఆర్ఎస్ హయాంలో పెట్టిన కేసులను ఎత్తివేయించాలని మరికొందరు ఫిర్యాదు చేశారు. చైర్మన్ల సమస్యలు విన్న మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందిస్తూ అన్ని అంశాలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణ డీజీపీకి సుప్రీంకోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ డీజీపీకి దేశ అత్యున్నత న్యాయ స్థానం నోటీసులు జారీ చేసింది. వట్టి జానయ్య కేసును విచారించిన సుప్రీంకోర్టు ఈనెల 4వ తేదీన వ్యక్తిగతంగా లేదా వర్చువల్‌గా తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. తాను బీఆర్ఎస్ పార్టీని వీడి బీఎస్పీలో చేరిన తర్వాత అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తనపై పెద్ద సంఖ్యలో కేసులు పెట్టడాన్ని సవాల్ చేస్తూ.. గతేడాది సెప్టెంబర్ 20న సూర్యాపేటకు చెందిన వట్టి జానయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం (గత బీఆర్ఎస్ సర్కార్) తనపై పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసిందంటూ ఆరు స్పెషల్ లీవ్ పిటిషన్లు (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై 2023 అక్టోబర్ 6న జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్.భట్టిలతో కూడిన ధర్మాసనం విచారించింది. జానయ్యపై నమోదు చేసిన 13 ఎఫ్ఐఆర్‌లలో అరెస్టు చేయొద్దంటూ ఆదేశాలు జారీ చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. తాజాగా మంగళవారం మరోసారి ఈ పిటిషన్లు బెంచ్ ముందుకొచ్చాయి. చార్జిషీట్ దాఖలు చేసిన సమయానికి సంబంధించి వ్యత్యాసం ఉందని, ప్రాసిక్యూషన్ మరియు ప్రభుత్వ న్యాయవాది మధ్య డిస్‌కనెక్ట్ స్పష్టంగా కనిపిస్తుందంటూ కోర్టు పోలీసుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తాము లేవనెత్తిన అంశాలకు రాష్ట్ర ప్రభుత్వ అడ్వొకేట్ సమాధానం చెప్పలేకపోతున్నందున, తమ ముందు హాజరుకావాలని డీజీపీకి నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 4న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లేదా వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది.

పెరిగిన పామాయిల్ గెలల ధర

ఇది రైతులకు దసరా కానుక: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: పామాయిల్ గెలల ధర పెరిగిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ముడి పామా యిల్‌పై దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీనివల్ల ముడి పామాయిల్ గెలల ధర టన్నుకు రూ. 14,392 నుంచి రూ. 2,651 పెరిగి ప్రస్తుతం రూ. 17,043 చేరుకుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపా రు. పెరిగిన ధరలు ఈ నెల నుంచే అమలులోకి రానున్నాయన్నారు. దీనివల్ల రైతు లకు ఈ నెలలో అదనంగా రూ. 12 కోట్లు లబ్ధి చేకూరనుందని మంత్రి వెల్లడించా రు. పెరిగిన ధరలు పామాయిల్ రైతులకు దసరా కానుకగా ఆయన అభివర్ణించారు. పామాయిల్ రైతులకు అధిక ధరలను అందించి, రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును లాభసాటిగా చేసి కొత్త రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముడి పామ్ ఆయి ల్‌పై దిగుమతి సుంకాన్ని తిరిగి విధించి దేశీయ పామాయిల్ రైతులను ఆదుకొనే విధంగా చర్యలను తీసుకోవాలని తాను ఇటీవల కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరినట్లు తెలిపారు. ఆ మేరకు ఈ నిర్ణయం జరిగిందన్నా రు. గతంలో ముడి పామాయిల్ దిగుమతిపై సుంకం ఎత్తివేయడం వల్ల ఆయిల్ పామ్ గెలల ధర తగ్గి రైతులు నిరాశ పడడమే కాకుండా, కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేయాలనుకున్న రైతులపై ప్రతికూల ప్రభావం చూపించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 31 జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగువిస్తరణ చేపట్టేందుకు 14 కంపెనీలకు అనుమతులిచ్చిందని, ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 2.23 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగు కిందకు తీసుకువచ్చామని తుమ్మల తెలిపారు.


స్వయం సహాయక బృందాలను 75 లక్షలకు పెంచాలి : మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వయం సహాయక బృందాల మహిళల కోసం ఏర్పాటు చేయనున్న మినీ పారిశ్రామిక పార్కులకు స్థలాల సేకరణ ప్రక్రియను ప్రారంభించాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఒక్కో పార్కుకు 2 నుంచి 3 ఎకరాల స్థలం ఉండేలా చూడాలని సూచించారు. రెండంతస్తుల భవనాలు నిర్మించి 30 నుంచి 50 స్వయం సహాయక బృందాలకు ప్లగ్ అండ్ ప్లే రీతిలో వసతి అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ప్రస్తుతం ఉన్న 64 లక్షల స్వయం సహాయక బృందాల సంఖ్యను 75 లక్షలకు పెంచేందుకు మార్గదర్శకాలను రూపొందించాలని ఆదేశించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడం తేలికేనని, వారి ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకెళ్లడం సవాలుతో కూడుకున్న అంశమని అన్నారు. దీని కోసం పరిశ్రమల శాఖ అవసరమైతే ఒక సప్లయ్ చెయిన్ కన్సల్టెంటును నియమించాలని ఆదేశించారు. ప్రతి మహిళ కోటీశ్వరురాలిగా ఎదగాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష అని శ్రీధర్‌బాబు వెల్లడించారు. సమావేశంలో సెర్ప్ సీఈవో దివ్య, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, పరిశ్రమల డైరెక్టర్ డా.మల్సూర్, ఎలీప్ వ్యవస్థాపకురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పొలంలోనే ప్రాణాలు వదిలిన రైతు

- వికారాబాద్ జిల్లా ఎన్కేపల్లిలో ఘటన



అంజనేయులు (ఫైల్)

బొంరాస్‌పేట: ఓ రైతు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం ఎన్కేపల్లిలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సంగెం వెంకటయ్య, లక్ష్మమ్మ పెద్ద కొడుకు ఆంజనేయులు (35) వ్యవసాయంతోపాటు కొడంగల్‌లోని ఓ రైస్‌మిల్‌లో ఆపరేటర్‌గా పనిచేసేవాడు. రోజూ మాదిరిగానే ఉదయాన్నే పొలానికి వెళ్లాడు. పనుల్లో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తూ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మృతుడు గతంలో వార్డు సభ్యుడిగా సేవలందించాడు. ఇతనికి భార్య లక్ష్మీనర్సమ్మ, కొడుకు, కూతురు, తమ్ముడు రవి ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. లక్ష్మీనర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎండీ రవూఫ్ చెప్పారు.

క్లుప్తంగా...

మూసీ ప్రక్షాళన మొదలుపెట్టిందే బీఆర్ఎస్

● మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 2017లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మూసీ రివర్ బెడ్‌లో అక్రమ కట్టడాల లెక్కలు, బఫర్ జోన్ ఫిక్స్ చేయాలని గత ప్రభుత్వంలోనే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. స్వయంగా అప్పటి మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ మూసీలో అక్రమ కట్టడా లు కూల్చడానికి లిస్టు తయారు చేయమని అధికారులను ఆదేశించారని, దానికి సంబంధించిన మినిట్స్ ఉన్నాయని చెప్పారు. అలాగే మూసీకి ఇరువైపులా 50 మీటర్ల వరకు బఫర్ జోన్‌గా పరిగణనలోకి తీసుకోవాలని, మూసీ ప్రాంత ప్రజలను అక్కడి నుంచి తరలించి నష్ట పరిహారం ఇవ్వాలని కూడా గత ప్రభుత్వమే నిర్ణయించిందన్నారు. మూసీలోకి 1.50 లక్షల క్యూసెక్కులకన్నా ఎక్కువగా నీళ్లు వస్తే ఆ పరీవాహక ప్రాంత ప్రజలకు ప్రమాదం అని సర్వేలు చెప్తున్నాయని వివరించారు. గత ప్రభుత్వం ఆలోచన చేసిన నిర్ణయాలను తాము అమలు చేస్తే తప్పు చేసినట్లా? అని ప్రశ్నించారు. ప్రజల మద్దతుతోనే మూసీ ప్రక్షాళన చేస్తామని, సోషల్ మీడియాలో ప్రభుత్వంపై బీఆర్ ఎస్ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని చెప్పారు.

కవితకు వైద్య పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బెయిల్‌పై విడుదలై కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మంగళవారం వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వెళ్లారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం ఉదయం చేరిన కవిత పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో తిహార్ జైలు లో ఉన్న సమయంలో కవిత.. పలు సమస్యలను ఎదుర్కొనడంతో పాటు తీవ్ర జ్వరంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో గతంలో వైద్య పరీక్షలు కూడా చేయించుకున్నారు. తాజాగా ఆస్పత్రిలో చేరిన ఆమెకు పరీక్షలు చేసిన వైద్యులు.. గైనిక్ సమస్యలతో బాధపడుతున్నందున మూడు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

సోషల్ మీడియాను అదుపులో పెట్టుకోండి


కేటీఆర్, హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలి: రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: తల్లి, అక్క, చెల్లి మధ్య ఉండే సంబంధంపై బీఆర్ఎస్ సోషల్ మీడియా లో సంస్కారహీనంగా పోస్టులు పెట్టారని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు ఆవేదన వెలిబుచ్చారు. 'మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొండా సురేఖ అక్క వస్తే చేనేత సమస్యలు ఆమె దృష్టికి తీసుకెళ్లేలా.. ఒక తమ్ముడి గా ఆమెను అడిగి మరీ నూలు పోగు దండ వేశాను'అని ఆయన తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...పోస్టు పెట్టిన అకౌంట్ డీపీ బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావుల ఫోటో తో ఉంది. బీఆర్ఎస్‌కు సోషల్ మీడియా మీద నియంత్రణ లేదా.? కేటీఆర్, హరీశ్‌రావు దీనిపై స్పందించి సోషల్ మీడియాను కంట్రోల్ చేసుకుని క్షమాపణ చెప్పాలి'అని డిమాండ్ చేశారు. 'పోస్టులు పెట్టిన వారు మీ వాళ్లు అయితే తీసుకొచ్చి పోలీసులకి అప్పగించండి. మీకు సంబంధం లేని, మీరు జీతం ఇవ్వని వ్యక్తులైతే మీరు కూడా కంప్లైంట్ ఇవ్వండి. సోషల్ మీడియాలో ఇంత సంస్కారహీనంగా, సభ్యత లేకుండా మాట్లాడతారని అనుకోలేదు. అక్కకు జరిగిన అవమానానికి ఓ తమ్ముడిగా చింతిస్తూ తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నానని రఘునందన్ తెలిపారు.

కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ బోగస్

ఎమ్మెల్సీ మధుసూదనాచారి విమర్శ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, బీసీలను కూడా మోసగించే ఎత్తుగడలు వేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, శాసనమండలిలో విపక్ష నేత సిరికొండ మధు సూదనాచారి విమర్శించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో మాజీ మంత్రులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు సమావేశమయ్యారు. కామారెడ్డి కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను ఎగ్గొట్టే కుట్రలు పన్నుతోందని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ఆరు నెలల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చడం లేదన్నారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశానుసారం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుకు త్వరలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు.

నిత్యం ప్రజాక్షేత్రంలోనే..!

కార్యాచరణపై బీఆర్ఎస్ కసరత్తు
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా ముందుకు
- దసరా తర్వాత ఆరు గ్యారంటీల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి
- హైడ్రా, మూసీ బాధితులు, రుణమాఫీపై ఇప్పటికే జనంలోకి..
- నవంబర్ 10 తర్వాత బీసీ డిక్లరేషన్ అమలు కోసం ఉద్యమం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని భారత్ రాష్ట్ర సమితి భావిస్తోంది. ప్రజా సమస్యలే ఎజెండాగా అనునిత్యం ప్రజాక్షేత్రంలో ఉండేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రైతులకు రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమల్లో వైఫల్యాన్ని బలంగా ఎత్తిచూపుతున్న బీఆర్ఎస్.. ఇతర వైఫల్యాలపైనా ఫోకస్ పెంచాలనుకుంటోంది. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు తదితర అంశాలపై వివిధ రూపాల్లో నిరసన తెలిపిన పార్టీ.. ప్రస్తుతం హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ పేరిట నిర్వాసితులను బలవంతంగా తరలించడం వంటి అంశాలపై దృష్టి పెట్టింది. ఇదే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయిన నేపథ్యంలో, ఆరు గ్యారంటీల అమలు కోసం ఒత్తిడి పెంచే యోచనలో బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఉన్నారు. దసరా పండుగ తర్వాత ఆరు గ్యారంటీల అమలు కోసం పార్టీ పరంగా చేపట్టాల్సిన ఆందోళనలు, నిరసన కార్యక్రమాలపై కసరత్తు జరుగుతోంది. క్షేత్ర స్థాయిలో పార్టీ యంత్రాంగం, ఆరు గ్యారంటీల లబ్ధిదారులను భాగస్వాములను వీటిల్లో భాగస్వాముల్ని చేయాలని భావిస్తున్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు కోసం ..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీల కోసం కాంగ్రెస్ ప్రకటించిన 'కామారెడ్డి డిక్లరేషన్' అమలుకు నవంబర్ 10వ తేదీని గడువుగా బీఆర్ఎస్ విధించింది. ఆ లోపు కాంగ్రెస్ స్పందించని పక్షంలో బీసీ వర్గాలను కలుపుకొని ఉద్యమించాలని భావిస్తోంది. బీసీ సామాజికవర్గానికి 42 రిజర్వేషన్ల పెంపు, బీసీ కులగణన వంటి అంశాలపై ఇప్పటికే బీఆర్ఎస్ బీసీ నేతలు వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీసీల రిజర్వేషన్లపై అధ్యయనం కోసం ఇటీవల తమిళనాడులో రెండురోజుల పర్యటనకు వెళ్లిన వచ్చిన బృందం త్వరలో కేసీఆర్‌కు నివేదిక ఇచ్చేందుకు సన్నద్ధమవుతోంది. బీసీలకు రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌ను మరింత గట్టిగా విన్పించనుంది. మరోవైపు కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు చేపట్టాల్సిన ఉద్యమ రూపాలపైనా బీసీ నేతల భేటీల్లో చర్చ జరుగుతోంది. ఉత్తరాది రాష్ట్రాల్లో 'జాట్‌లు' తమ హక్కుల కోసం చేపట్టిన నిరసన రూపాలను అధ్యయనం చేస్తున్నారు. ఢిల్లీ శివార్లలో నెలల తరబడి రైతులు చేసిన ఉద్యమ తీరుతెన్నులు కూడా పరిశీలిస్తున్నారు.

స్థానిక సమస్యలపైనా..

స్థానిక సమస్యలపైనా ఆందోళనలు నిర్వహించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. నియోజకవర్గ స్థాయిలో అధికార పార్టీ ఎమ్మెల్యేల వైఫల్యాలను ఎండగట్టేలా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని యోచిస్తోంది. పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్య నేతలను భాగస్వాములుగా చేస్తూ క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని పార్టీ నేతలు చెప్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసేందుకు ఈ తరహా కార్యక్రమాలు ఉపయోగపడతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పట్టణాలు, పంచాయతీలకు నిధుల కొరత, గతంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడం, పారిశుధ్య లోపం, ప్రజారోగ్యం, వైద్యం, అధికారుల పనితీరు, అధికార పార్టీ దాడులు, అక్రమ కేసులు వంటి అనేక అంశాలపై స్థానికంగా ఉద్యమించాలని నేతలకు పార్టీ సూచిస్తోంది. జిల్లా కలెక్టర్లు, తహసీల్దార్ ఆఫీసులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, ధర్నాలు తదితర రూపాల్లో నిరసన తెలిపేలా కార్యాచరణ రూపొందించుకోవాలని నేతలకు చెప్తోంది. స్థానికంగా జరిగే ఆందోళన కార్యక్రమాల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర ముఖ్య నేతలు పాల్గొనేలా చూడటం ద్వారా పార్టీ యంత్రాంగంలో ఉత్సాహం నింపాలని భావిస్తోంది.

కాంగ్రెస్‌కు ఓటు వేయనందుకే కూల్చివేతలు

నగర ప్రజలపై పగబట్టిన సీఎం రేవంత్‌రెడ్డి
- పేదల ఇళ్లు కూలుస్తామంటే చూస్తూ ఊరుకోం... గోల్నాకలో మూసీ బాధితులకు కేటీఆర్ భరోసా



గోల్నాకలో మూసీ నిర్వాసితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్



కేటీఆర్ కాన్వాయ్‌ని అడ్డుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

అంబర్‌పేట (హైదరాబాద్): కాంగ్రెస్‌కు ఓటు వేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నగర ప్రజలపై కక్ష కట్టి వారి ఇళ్లు కూల్చివేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు ధ్వజమెత్తారు. అడ్డి మార్ గుడ్డి దెబ్బగా సీఎం అయిన రేవంత్‌రెడ్డి కనీస అవగాహన లేకుండా అడ్డగోలు పాలన చేస్తూ ఆక్రమణలంటూ పేదలను రోడ్డు పాలు చేయడం అన్యాయమన్నారు. పేదల నివాసాలను కూలుస్తామంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఉరుకోదన్నారు. మంగళవారం నగర ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, కార్పొరేటర్లతో కలసి అంబర్‌పేట నియోజకవర్గంలోని మూసీ పరీవాహక ప్రాంతంలో ఆయన పర్యటించారు. గోల్నాక డివిజన్‌లోని న్యూ తులసీరామ్‌నగర్, లంకబస్తీ లు, అంబేడ్కర్‌నగర్ ప్రాంత బాధితులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.

భయపెడుతున్నారు

'తమ ప్రభుత్వ హయాంలో కూడా మూసీ సుందరీకరణకు ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి దానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని చైర్మన్‌గా నియమించాం. మూసీ అభివృద్ధికి కసరత్తు చేసి నివేదిక తయారు చేశాం. కానీ ఇది అమలు చేస్తే మెజార్టీ ప్రజలు నష్టపోతారనే విషయాన్ని అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాం. పేదలకు నష్టం వాటిల్లే అభివృద్ధి మనకు వద్దని ఆయన చెప్పడంతో విరమించుకున్నాం. బతుకమ్మ, దసరా పండుగ సంబురం లేకుండా కూల్చివేతలతో పేదలను సీఎం భయపెడుతున్నారు' అని కేటీఆర్ మండిపడ్డారు. పేదల గూళ్లను తొలగించి మాల్స్ కట్టే కార్యక్రమాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 50 కిలోమీటర్ల మూసీ నది అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 లక్షల కోట్లతో అంచనాలు రూపొందించడం ఎవరి జేబులు నింపడానికని ప్రశ్నించారు.

కిషన్‌రెడ్డి ఎక్కడికి పోయిండు..

ఎంపీగా ఓట్లు వేయించుకున్న కిషన్‌రెడ్డి పేదలు భయాందోళనకు గురవుతుంటే ఎక్కడికి పోయిండని కేటీఆర్ నిలదీశారు. అంబర్‌పేట పేదల ఓట్లతో ఎంపీ అయి పదవులు అనుభవిస్తున్న కిషన్‌రెడ్డికి, పేదల ఇళ్లు కూలుస్తామంటే భరోసా ఇవ్వాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డి, మాగంటి గోపీనాథ్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, నేతలు బాల్క సుమన్, గంద్ర వెంకటరమణారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్, చెరుకు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాన్వాయ్ అడ్డగింతతో ఉద్రిక్తత

నల్లకుంట: బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తనను కించపరుస్తూ ఇష్టానుసారంగా పోస్టులు పెడుతున్నారంటూ మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో.. గ్రేటర్ హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతా రోహిత్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు విద్యానగర్ హిందీ మహావిద్యాలయ చౌరస్తా వద్ద కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. సురేఖకు క్షమాణలు చెప్పాలంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త హుస్సేన్ చేతికి గాయాలయ్యాయి. అయితే నల్లకుంట పోలీసులు అందరినీ చెదరగొట్టారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హుస్సేన్ నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో జగదీశ్వర్ రావు తెలిపారు.



మంగళవారం ఇందిరాపార్క్ వద్ద రైతు దీక్ష విరమణ అనంతరం అభివాదం చేస్తున్న బీజేపీ నేతలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, పాంగులేటి సుధాకర్ రెడ్డి, ఈటల రాజేందర్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి,అర్వింద్, మర్రి శశిధర్ రెడ్డి తదితరులు

ప్రజలను ఏడిపించి ఆనందిస్తున్నారు

- రైతు హామీల సాధన దీక్ష ముగింపు సందర్భంగా బీజేపీ ఎంపీ ఈటల ధ్వజం
- బేషరతుగా రూ.2 లక్షల మాఫీసొమ్ము రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్
- 9 నెలల పాలనలోనే సీఎం అందరినీ మోసగించారు: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/కవాడిగూడ: 'ఎవరి మాట వినని సైకో... ప్రజలను ఏడిపించి ఆనందించే శాడిస్ట్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి'అని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే రేవంత్ ప్రభుత్వానికి పడుతుందని... రూ. 2 లక్షల చొప్పున రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో బేషరతుగా జమ చేయకుంటే రైతులే ఈ ప్రభుత్వాన్ని బొందపెడతారు'అని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన గ్యారంటీలు, ఇతర హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నేతలు 24 గంటలపాటు చేపట్టిన రైతు హామీల సాధన దీక్ష మంగళవారం ముగిసింది. ఏలేటి, ఈటల సహా ఇతర నేతలకు కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర సభ్యత్వ ఇన్‌చార్జి అభయ్ పాటిల్ నిమ్మరసం అందించి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే సత్తా, శక్తి బీజేపీకే ఉందన్నారు. గురువారం ఇందిరాపార్క్ వద్ద రింగ్‌రోడ్డు అంశంపై ధర్నా నిర్వహిస్తామన్నారు.

సీఎం రాజీనామా చేయాలి..

'సీఎం మానసపుత్రిక హైడ్రా, మూసీ ప్రక్షాళనపై హైకోర్టు చీవాట్లు పెట్టింది. మొట్టికాయ వేసింది అధికారులను కాదు.. రేవంత్‌రెడ్డినే. నిజంగా రేవంత్‌కు చట్టంపై నమ్మకం ఉంటే వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలి. కోర్టులు, జడ్జీలంటే లెక్కలేదా?'అని నిలదీశారు. రోజుకో మాటతో అధికారులు తప్పించుకుంటున్నారంటే హైడ్రా ఎంత పేలవంగా ఉందో అర్థం అవుతుందన్నారు. ఓడ దాటే దాక ఓడమల్లయ్య, ఓడ దాటాక బోడి మల్లయ్య మాదిరిగా రేవంత్ చేసిన మోసానికి ప్రజలే భరతం పడతారన్నారు.

రైతులకు అండగా నిలుస్తాం: ఏలేటి

ఏలేటి మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ హామీలు అమలు చేసేదాకా రైతులకు అండగా నిలబడతామని మాట ఇస్తున్నామన్నారు. 'అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో అన్ని సామాజికవర్గాలను సీఎం మోసం చేశారు. హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆ డబ్బును ఢిల్లీకి కప్పం కడుగుతున్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని ప్రధాని మోదీ ఎక్కడ రెట్టింపు చేశారని ప్రశ్నిస్తున్న వ్యవసాయ మంత్రి తుమ్మల.. 2014లో మోదీ ప్రధాని అయ్యా క కనీస మద్దతు ధర ఎంత ఉందో ఇప్పుడెంత ఉందో తెలుసుకోవాలని సూచించారు. మోదీ 22 పంటలను జాతీయ పంటలుగా గుర్తించారని.. పసుపు ధర రెట్టింపు పలుకుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గోడం నగేశ్, ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, దన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ నేతలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పరామర్శించరా..?: హరీశ్‌రావు

- హోమ్‌గార్డులు అంటే పోలీసు అధికారులకు చులకనా?
- హైడ్రా కూల్చివేతలో గాయపడిన హోమ్‌గార్డుకు పరామర్శ



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ చెరువులో నిర్మాణాలను హైడ్రా కూల్చివేసే క్రమంలో హోమ్‌గార్డ్ గోపాల్ తీవ్రంగా గాయపడినా పోలీసు ఉన్నతాధికారులు పరామర్శించకపోవడాన్ని మాజీమంత్రి హరీశ్‌రావు ఖండించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోమ్‌గార్డ్ గోపాల్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పార్టీ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డితో కలసి మంగళవారం హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం వైద్య ఖర్చులు భరించకపోవడంతో ఇప్పటివరకు గోపాల్ కుటుంబం చికిత్స కోసం రూ.లక్ష ఖర్చు చేసిందని నాలుగు నెలలుగా జీతం ఇవ్వడం లేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హోమ్‌గార్డులు అంటే అంత చులకనా అని ప్రశ్నించారు. గోపాల్ తలకు దెబ్బ తగిలి మాట పడిపోయిందని నాలుగు నెలల పాటు స్పీచ్ థెరపీ అవసరమని వైద్యులు చెప్తున్నారని వివరించారు. డిటోనేటర్లతో పేలుళ్లు చేసినప్పుడు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే గోపాల్ ప్రమాదానికి గురయ్యారని ఇందుకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని తెలిపారు. ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేయకుండా గోపాల్‌ను ఆదుకోవాలి అని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ప్రజాపాలన కాదు రౌడీ రాజ్యం

కేటీఆర్ కాన్వాయ్‌పై దాడిని ఖండించిన బీఆర్ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజాపాలన కాదని, రౌడీ రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ పార్టీ నేతలు మండిపడ్డారు. మూసీ నది పరీవాహక ప్రాంతంలో పర్యటిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కాన్వాయ్‌పై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని పార్టీ నేతలు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. 'నఫ్రత్ కే బజార్ మే ముహబ్బత్ కా దుకాన్'అని రాహుల్ గాంధీ చెప్తుంటే కాంగ్రెస్ రౌడీ మూకలు మాత్రం కేటీఆర్ కాన్వాయ్‌పై దాడి చేశాయి. ప్రజా సమస్యల మీద పోరాటం చేస్తున్న ప్రతిపక్షాల మీద దాడులు చేయడమేనా ప్రజా పాలన'అని మాజీమంత్రి హరీశ్‌రావు నిలదీశారు. కేటీఆర్‌పై దాడికి తెగబడిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మాజీమంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి తదితరులు కూడా కేటీఆర్ కాన్వాయ్‌పై జరిగిన దాడిని ఖండించారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే సమాధానాలు చెప్పుకోలేక ప్రత్యక్ష దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు రాజీవ్‌సాగర్, దేవీప్రసాద్, పల్లె రవికుమార్, బాలరాజుయాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ తదితరులు కూడా కేటీఆర్ కాన్వాయ్‌పై జరిగిన దాడిని ఖండించారు.

రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు

- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం
- గ్రీన్ హైడ్రోజన్‌కు చిరునామాగా తెలంగాణ నిలవాలని ఆకాంక్ష
- జపాన్ రాజధాని టోక్యోలో పర్యటన.. యమానాషీ గ్రీన్ హైడ్రోజన్ కంపెనీ సందర్శన



యమానాషీ గ్రీన్ హైడ్రోజన్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. తెలంగాణలో నీటి లభ్యత, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలకు లోటు లేనందున రాష్ట్రమంతా గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లను ఏర్పాటు చేయవచ్చన్నారు. దేశంలో గ్రీన్ హైడ్రోజన్‌కు చిరునామాగా తెలంగాణ నిలవాలని ఆకాంక్షించారు. జపాన్ పర్యటనలో భాగంగా రాజధాని టోక్యోకు 100 కి.మీ. దూరంలో ఉన్న యమానాషీ గ్రీన్ హైడ్రోజన్ కంపెనీని ఆయన సందర్శించారు. గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, ఇతర పునరుత్పాదక విద్యుత్ సాంకేతికతలను పరిశీలించి అక్కడి శాస్త్రవేత్తల బృందంతో మాట్లాడారు. సౌర విద్యుత్ వినియోగించి నీటిని ఎలక్ట్రోలైజింగ్ ప్రక్రియ ద్వారా హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడగొట్టే యంత్ర విభాగాలను ఈ సంస్థ తయారు చేస్తోంది. ఇలా ఉత్పత్తి చేసిన హైడ్రోజన్‌ను రేసింగ్ కార్లకు ఇంధనంగా, సూపర్ మార్కెట్లలో ఫ్యూయల్ సెల్స్‌గా, ఫ్యాక్టరీల్లో బాయిలర్లకు ఉష్ణాన్ని అందించేందుకు ఇంధనంగా వినియోగిస్తున్నారని నిర్వాహకులు భట్టికి వివరించారు. ఈ ప్రక్రియలో సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో దీన్ని గ్రీన్ హైడ్రోజన్‌గా పేర్కొంటున్నామని వివరించారు. రాష్ట్రంలో ఉత్పత్తి కానున్న గ్రీన్ హైడ్రోజన్‌ను స్థానిక ఎరువుల కర్మాగారాలు, ఆర్టీసీ, ఇతర పరిశ్రమలకు సరఫరా చేయొచ్చని భట్టి అన్నారు. థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక విద్యుదుత్పత్తిని ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్రంలో సౌర విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు.

ఉమ్మడిగా ప్లాంట్ల ఏర్పాటుకు కలిసిరండి..

కంపెనీ తయారు చేస్తున్న 'బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం'బ్యాటరీల తయారీ విభాగాన్ని భట్టి విక్రమార్క పరిశీలించారు. సోలార్ విద్యుత్ ప్లాంట్లు పగటిపూట ఉత్పత్తి చేసే విద్యుత్‌లో మిగులు విద్యుత్‌ను నిల్వ చేయడానికి ఈ బ్యాటరీలను ఉత్పత్తి చేస్తున్నారు. సింగరేణి ఏర్పాటు చేసిన 245 మెగావాట్ల సామర్థ్యంగల సోలార్ ప్లాంట్లతోపాటు త్వరలో ఏర్పాటు చేయనున్న మరో వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్లకు ఈ సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందని భట్టి అన్నారు. తెలంగాణలో గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం ప్లాంట్లను ఉమ్మడి భాగస్వామ్యంతో ఏర్పాటు చేసేందుకు తమతో కలిసి రావాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. దీనిపై యమానాషీ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఉన్నత స్థాయిలో చర్చించి నిర్ణయిస్తామన్నారు. ఈ పర్యటనలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పాల్గొన్నారు.

నల్లగొండపై విషం చిమ్ముతున్న బీఆర్ఎస్

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు జిల్లా ప్రజలంటే ఎందుకు అంత కోపం?
- వీరిలో ఎవరైనా ఒకరు మూసీ ఒడ్డున నెలరోజులు ఉంటే తెలుస్తుంది
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలు నల్లగొండ జిల్లాపై విషం చిమ్ముతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మాది బుల్డోజర్ పాలన కాదు.. ప్రజాపాలన. మూసీ సుందరీకరణతోపాటు శుద్ధీకరణ చేస్తున్నాం. నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ ప్రజలు నరకయాతన పడుతుంటే.. కేసీఆర్ కుటుంబసభ్యులు రాక్షసానందం పొందుతున్నారు. నల్లగొండ జిల్లా పోరాటాల గడ్డ. రజాకార్లు, సీమాంధ్రులతో పోరాడినట్టే మూసీ వ్యతిరేకులతో పోరాడాల్సి వస్తోంది. ఈసారి అసెంబ్లీకి కేసీఆర్ వస్తే నల్లగొండ సమస్యలపై నిలదీస్తాం. మూసీ ప్రక్షాళన పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేసి, కాంగ్రెస్ శాసన సభ్యుడిని చైర్మన్ చేసిన కేసీఆర్ ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు. నేను రెండు దశాబ్దాలుగా ఫ్లోరైడ్, మూసీ శుద్ధీకరణ మీద పోరాటం చేస్తున్నా. ప్రధానితోపాటు కేంద్రంలో ఎందరో మంత్రులను కలిసి మూసీ శుద్ధీకరణకు నిధులు కేటాయించాలని వినతులు ఇచ్చా. వారు మూసీ బాధితులను తెలంగాణభవన్‌కు పిలిపించుకొని జనతా గ్యారేజీ అని సోషల్ మీడియాలో తిప్పుకుంటున్నారు. మీది జనతా గ్యారేజ్ కాదు.. జనాన్ని ముంచే గ్యారేజీ, జనాల్ని వంచించే గ్యారేజీ.. అందుకే మీ కారు గ్యారేజీకి పరిమితమైంది'అని ఆరోపించారు. 'నల్లగొండ ఫ్లోరైడ్ కష్టం చెప్పుకుంటే తీరేది కాదు..ఇక్కడ భూగర్భ జలాలను కాకుండా భూఉపరితలంపై ప్రవహించే జలాలను మాత్రమే శుద్ధి చేసి వాడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ, కేంద్ర జలశక్తి సంస్థ చెప్పింది. కానీ గత ప్రభుత్వం దాన్ని అమలు చేయలేదు. ఇది అత్యంత బాధాకరం. ఉమ్మడి ఏపీలోనే తెలంగాణ నిర్లక్ష్యానికి గురైందని ఉద్యమం చేసి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకుంటే.. ఈ పదేళ్లలోనూ నల్లగొండకు తీరని అన్యాయం జరిగింది. మూసీ పరీవాహక ప్రాంత పరిధిలో వివిధ కంపెనీలు రసాయన వ్యర్థాలను వదిలిపెడుతుండటంతో నది అంతా కాలుష్యంగా మారి నల్లగొండ ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది'అని కోమటిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

నిరాశ్రయులయ్యే వారికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుంది

మూసీ శుద్ధిపేరు చెప్పి రూ.వెయ్యి కోట్లు మింగిన బీఆర్ఎస్ ఇప్పుడు నీతులు చెబుతోందని కోమటిరెడ్డి విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులలో ఒకరు మూసీనది ఒడ్డున నెల రోజుల పాటు నివాసం ఉంటే.. ఆ బాధ ఏంటో తెలుస్తుందన్నారు. మూసీ కాలకూట విషం మీద వాస్తవాలు కావాలనుకుంటే.. సీఎం కేసీఆర్‌కు ఓఎస్డీగా పనిచేసిన ప్రియాంక వర్గీస్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఆమె ఇటీవల మూసీపై పీహెచ్‌డీ చేసిందన్నారు. మూసీ అంటే.. ఒకప్పుడు రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాలకు జీవనాడి, కానీ ఇప్పుడు మూసీ అంటే ఓ విషమని చెప్పారు. మూసీ ప్రక్షాళనకు కమిటీ వేస్తామని, అందులో బీఆర్ఎస్ నేతలకు కూడా చోటు కల్పిస్తామన్నారు. ఎస్టీపీలు కట్టామని ప్రచారం చేస్తున్నారు.. కానీ కేవలం ప్రతిపాదనలు మాత్రమే తయారు చేసి కాలక్షేపం చేశారని చెప్పారు. అగ్గిపెట్టె హరీశ్‌రావు మళ్లీ రెచ్చగొట్టే పనులకు దిగుతున్నాడని ఆరోపించారు.

23 సార్లు ఢిల్లీ వెళ్లినా.. గల్లీలో సమస్యలు తీరలేదు


సీఎంనుద్దేశించి కేటీఆర్ ఎద్దేవా

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ పర్యటనలకు 23 సార్లు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ గల్లీల్లో సమస్యలు చూసే ఓపిక మాత్రం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ఐదు లక్షల మంది రైతులు రూ.2 లక్షల రుణమాఫీ, 67 లక్షల మంది రైతులు రైతుబంధు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వ్యవసాయశాఖ నిర్లక్ష్యంతో 43 లక్షల మంది పత్తి రైతులు దళారుల చేతిలో దగా పడ్డారని చెప్పారు. రేవంత్ రైతు వ్యతిరేక పాలనతో తెలంగాణలో దసరా పండుగ వాతావరణమే లేకుండా పోయిందన్నారు. అదానీని ఓ వైపు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శిస్తుండగా, సీఎం రేవంత్ మాత్రం దావోస్‌లో దోస్తీ చేస్తున్నాడని తెలిపారు.



సిటీలో డీజేలు బ్యాన్
నగర పోలీసు విభాగానికి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు, ఇటీవలి కాలంలో చోటు చేసుకున్న ఉదంతాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో డీజేలను నిషేధించారు.

-10లో



బ్యూటిఫుల్ బోన్సాయ్..
బోన్సాయ్..మరుగుజ్జు వృక్షాలు..వామన వృక్షాలు..పేరేదైనా ఇంటికి అలంకరణ తేవడంలో ఇవి రారాజు మొక్కలు అని చెప్పొచ్చు. చిన్ని చిన్ని కుండీల్లో మహా వృక్షాలను తలపిస్తున్నాయి.

- సిటీప్లస్‌లో..

గరిష్టం/కనిష్టం
33.0/24.0

వాతావరణం
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఉరుములు మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశముంది. రాత్రికి వాతావరణం చల్లబడుతుంది.

బాపూఘాట్ ముస్తాబు



బాపుధ్యాన మందిరంలో పూల అలంకరణ

లంగర్‌హౌస్: గాంధీ జయంతి వేడుకలకు బాపూఘాట్ అందంగా ముస్తాబైంది. బుధవారం గవర్నర్, ముఖ్యమంత్రితోపాటు పలువురు వీవీపీలు, ప్రజలు హాజరై మహాత్మా గాంధీకి నివాళులర్పించనున్నారు. ఉదయం 6.30 గంటలకు బాపూ సమాధి వద్ద గవర్నర్ జిష్ణుదేవ్, 10.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుష్ప గుచ్ఛాలు వుంచి.. బాపూ ధ్యాన మందిరంలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొంటారు. వీవీపీల పర్యటన నేపథ్యంలో డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్‌లు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

హైడ్రా సరే..లోపాలు సరిచేయండి
'ఎక్స్' ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చిన నెటిజనుడు

సాక్షి, సిటీబ్యూరో: జలవనరులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా చేస్తున్నది మంచి పనే అయినప్పటికీ.. వ్యవస్థాగతంలో అనేక లోపాలు ఉన్నాయని ఓ నెటిజనుడు అభిప్రాయపడ్డారు. ఈ కారణంగానే ఆ విభాగంతో పాటు ముఖ్యమంత్రి ప్రతిష్ట కూడా మసకబారుతోందిన ఆవేదన వ్యక్తం చేశారు. వీటి పరిష్కారం కోసం కొన్ని సూచనలు, సలహాలు ఇస్తూ మంగళవారం 'ఎక్స్'లో ముఖ్యమంత్రితో పాటు హైడ్రాను ట్యాగ్ చేశారు. ' హైడ్రా చర్యలకు పూర్తి మద్దతు ఇస్తున్నప్పటికీ.. తీవ్రమైన లోపాలు ఉన్నాయి. ఇదే ప్రజా వ్యతిరేకతకు దారి తీస్తోంది. ఫలితంగా మీ ప్రతిష్టతో పాటు హైడ్రా ప్రతిష్టను దెబ్బతీస్తోంది. కొన్ని లోపాలు మీరు (ముఖ్యమంత్రి) వెంటనే సరిదిద్దాలని కోరుకుంటున్నా. కబ్జాదారులు, అక్రమ బిల్డర్ల నుంచి కొని మోసపోయిన బాధితులకు చట్ట పరమైన, పోలీసు శాఖ నుంచి సహకారం అందించండి. బిల్డర్ల వల్ల నష్టపోయిన మొత్తం తిరిగి పొందడంలో వారికి సహాయం చేయండి. జలవనరుల్లో ఏళ్లుగా ఉన్న అక్రమ నిర్మాణాల క్రమ విక్రయాలు, ఆస్తి బదిలీలు జరుగకుండా నిలిపివేయాలి.' అని నెటిజన్ పేర్కొన్నాడు.

హైకోర్టు ఆదేశాల మేరకు 'నిథమ్'లో కూల్చివేతలు



నిథమ్‌లో ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాన్ని తొలగించిన దృశ్యం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. నిథమ్‌లో పురాతన రామమ్మ కుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో తరగతి గదుల కోసం భవన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ అంశం హైకోర్టుకు వెళ్లడంతో..ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాన్ని తొలగించాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పర్యాటక శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉన్న 'నిథమ్' హైకోర్టు ఆదేశాన్ని పాటించి ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాన్ని కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కూల్చివేతలకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న కట్టడాన్ని తొలగించారు.

వీడని వాన



బంజారాహిల్స్‌లో..



ఖైరతాబాద్..

మహానగరాన్ని ఇంకా వర్షాలు వదలడం లేదు. మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సగటున నాలుగు నుంచి ఐదు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచి ట్రాఫిక్ జామ్ అయ్యింది. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మాదాపూర్, జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, బంజారా హిల్స్, పంజగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట్, ఎస్‌ఆర్ నగర్, టోలిచౌకి, మెహిదీపట్నం, షేక్ పేట్, అత్తాపూర్, లంగర్ హౌస్, మణికొండలో వర్షం దంచి కొట్టింది. కాగా జంట జలాశయాలకు భారీగా వరద వచ్చి చేరుతోంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నీటిమట్టాలు పూర్తి స్థాయికి చేరుకున్నాయి. దీంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. హిమాయత్ సాగర్ ఒక గేటు ఒక అడుగు మేర ఎత్తి 348 క్యూ సెక్కుల నీటిని, ఉస్మాన్ సాగర్ 6 గేట్లు 2 అడుగుల మేర ఎత్తి 1428 క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

- సాక్షి, సిటీబ్యూరో



అమీర్‌పేటలో..

పనులు చేయిస్తారా.. పైసలు తగ్గిస్తారా?



ఇందిరాపార్కు వద్ద అసంపూర్తిగా ఫుట్‌పాత్ పనులు

గ్రేటర్‌లో అసంపూర్తిగా సీఆర్ఎంపీ పనులు

రోడ్ల రీ కార్పెటింగ్ తప్ప మిగతావి పూర్తికాని వైనం

కాంట్రాక్టు ఏజెన్సీలను ఉపేక్షించొద్దని సీఎం ఆదేశాలు

చర్యలకు యోచిస్తున్న అధికారగణం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రధాన మార్గాల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, నిర్వహణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి కావడం లేదు. వీటి కోసం ఉద్దేశించిన సీఆర్ఎంపీ (కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రాం) పనులు నత్తనడకన సాగాయి. దీంతో కాంట్రాక్టు ఏజెన్సీలపై ఎలాంటి చర్యలు ఉంటాయన్నది ఇప్పుడు తేలాల్సి ఉంది. నగరంలో దాదాపు 811 కిలోమీటర్ల మేర రహదారుల రీకార్పెటింగ్, నిర్వహణ పనుల్ని సమగ్ర రోడ్ల నిర్వహణ పథకం కింద ఐదేళ్ల పాటు పేరెన్నికగన్న పెద్ద కాంట్రాక్టు ఏజెన్సీలకు టెండర్ల ద్వారా అప్పగించారు. వచ్చే డిసెంబర్‌తో ఆ గడువు ముగిసిపోనుంది. ఒప్పందం మేరకు రోడ్లను ఎప్పుడూ గుంతలు లేకుండా సాఫీ ప్రయాణానికి అనువుగా ఉంచడంతోపాటు వాటికి రెండు వైపులా ఫుట్‌పాత్‌లు, కెర్బ్‌ల నిర్మాణం, స్వీపింగ్ మెషిన్ల ద్వారా రోడ్లను శుభ్రపరచడం, సెంట్రల్ మీడియన్లలో పచ్చదనం పెంపు, సైన్‌బోర్డులు, లేన్‌మార్కింగ్‌ల పనులు కూడా ఏజెన్సీలే చేయాలి. కాగా రోడ్లపై గుంతలు లేకుండా చూడటం తప్ప ఏజెన్సీలు మిగతా పనుల్ని పట్టించుకోవడం లేదు.

మూడేళ్ల లోపే పూర్తవ్వాలి..

ఒప్పందం మేరకు మొదటి మూడేళ్లలోపునే ఆ పనులన్నీ పూర్తికావాలి. ఆ తర్వాత రెండేళ్ల వరకు నిర్వహణ బాధ్యతలు కూడా నిర్వర్తించాలి. కానీ..త్వరలోనే ఐదేళ్లు ముగియవస్తున్నా ఈ పనులు పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో పనులు చేయని ఏజెన్సీలను ఉపేక్షించవద్దని, వాటి కాంట్రాక్టు గడువు ముగిసేలోగా అన్నీ పనులు చేయించాలని ఇటీవల అధికారులతో సమీక్ష సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పూర్తికాని పనులు వెంటనే పూర్తి చేయాల్సిందిగా మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ సైతం కాంట్రాక్టు ఏజెన్సీలను దాదాపు నెల క్రితమే ఆదేశించారు. అధికారులు సైతం క్షేత్రస్థాయిల్లో పర్యటించి ఎక్కడైతే పనులు చేయాల్సి ఉందో వాటిని పూర్తి చేయించాలన్నారు. ఈ నేపథ్యంలో సీఆర్ఎంపీ మార్గాల్లో రోడ్ల పరిశీలనకు జోన్‌కు ఒక అడిషనల్ కమిషనర్‌ను ఇన్‌ఛార్జి ఆఫీసర్‌గా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి నియమించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న వారికి పలు ప్రాంతాల్లో పరిస్థితులు అధ్వానంగా ఉండటం తెలుస్తోంది. చేయాల్సిన పనులన్నీ చేయాల్సిందిగా ఏజెన్సీలకు సూచిస్తున్నారు. కానీ గడువులోగా ఆ పనులన్నీ పూర్తి కాగలవా అన్నదే అంతు పట్టడం లేదు. దీంతో పనులు పూర్తికాకపోతే ఆ మేరకు చెల్లింపులు తగ్గిస్తారా..లేక పనులన్నీ పూర్తి చేశాకే చెల్లింపులు చేస్తారా అన్నది తెలియాల్సి ఉంది.



కవాడిగూడలో ఫుట్‌పాత్ దుస్థితి

మరో విడత ప్రైవేటుకు..

సీఆర్ఎంపీలో భాగంగా ఫుట్‌పాత్‌లు, పారిశుధ్యం, గ్రీనరీ పనులు పూర్తి కానప్పటికీ, రోడ్లపై గుంతలు లేకపోవడం ప్రజలకు కొంత ఉపశమనంగా మారింది. ఈ పనుల్ని ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వకముందు ఐదేళ్ల క్రితం ఎప్పుడు చూసినా రోడ్లు గతుకుల మయంగా ఉండేవి. మరమ్మతుల పేరిట ఏటా రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేసినప్పటికీ పరిస్థితి షరామామూలుగానే ఉండేది. ఈ నేపథ్యంలో, ప్రైవేటు ఏజెన్సీలకివ్వడం వల్ల ప్రధాన రహదారులు గతంలో కంటే బాగు పడటంతో గడువు ముగిశాక కూడా మరోమారు ప్రైవేటు కంపెనీలకే ఇచ్చేందుకు జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అయితే తిరిగి తాజాగా టెండర్లు పిలిచి పనులు అప్పగిస్తారా..లేక ప్రస్తుతం పనులు నిర్వహిస్తున్న ఏజెన్సీలకే గడువు పొడిగింపునిస్తారా అన్నది త్వరలో వెల్లడి కానుంది. రెండో దశలో మరికొన్ని మార్గాలను కూడా సీఆర్ఎంపీ పరిధిలోకి తెచ్చేందుకు అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించారు.



ముషీరాబాద్‌లో శిథిలమైన రోడ్డు

చికున్‌గున్యా నివారణకు స్పెషల్ డ్రైవ్
అధికారులకు ఆమ్రపాలి ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో చికున్‌గున్యా కేసుల నివారణకు ఈ నెల 3వ తేదీ నుండి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. చికున్‌గున్యా కేసులు నమోదైన ఇళ్ల చుట్టుపక్కల 50 నుండి వంద 100 ఇళ్ల వరకు సర్వే చేసి దోమల ఉత్పత్తి జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ నీరు నిల్వ ఉన్నట్లయితే యాంటీ లార్వల్ ఆపరేషన్, ఫాగింగ్ చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో చికున్ గున్యా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అన్నారు. నీటి నిల్వలున్న తొట్లు, డ్రమ్ములు, కూలర్లలో నీటిని తొలగించి శుభ్రం చేయాలని, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు తొలగించాలని, చిన్న చిన్న నీటి గుంతలను పూడ్చాలని, నీటినిల్వలున్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ఫ్రెష్ వాటర్ లో గంబూషియా చేపలు వదలాలని కమిషనర్ సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో చికెన్ గున్యాకు సంబంధించిన బాధితుల వివరాలు అడ్రస్‌తో సహా విధిగా నమోదు చేయాలని ఆదేశించారు. క్షేత్ర పరిధిలో చికెన్ గున్యాను నియంత్రించేలా ఎంటమాలజీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

ఎంఎంటీఎస్ సర్వీసులు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: సాంకేతిక కారణాల దృష్ట్యా బుధవారం (అక్టోబర్ 2వ తేదీ) పలు మార్గాల్లో ఎంఎంటీఎస్ సర్వీసులను రద్దు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉందానగర్-లింగంపల్లి మధ్య నడిచే 6 సర్వీసులను రద్దు చేయనున్నారు. అలాగే మరో రెండింటిని లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వరకు పరిమితం చేయనున్నారు.



ఆపరేషన్ 'మూసీ' షురూ!



శంకర్‌నగర్‌లో ఇంటి రేకులను తీసుకెళ్తున్న మహిళ

అప్పగించిన ఇళ్ల నేలమట్టం
- రెవెన్యూ అధికారుల సమక్షంలో కూల్చివేత
- తొలిరోజు ఓల్డ్ మలక్‌పేట శంకర్‌నగర్‌లో ప్రయోగం
- ఇక దశల వారీగా నివాసాల కూల్చివేత ప్రక్రియ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఆపరేషన్ 'మూసీ' ప్రక్రియ ప్రారంభమైంది. పరీవాహకంలోని ప్రజలు అప్పగించిన ఇళ్లను రెవెన్యూ యంత్రాంగం అడ్డా కూలీలతో కూల్చివేసింది. దీంతో హైడ్రా బుల్డోజర్లకు పనిపడలేదు. మంగళవారం రెవెన్యూ అధికారులు ప్రయోగాత్మకంగా స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో మూసీ పరీవాహకంలోని ఓల్డ్ మలక్‌పేట శంకర్‌నగర్, మూసానగర్‌లో ఖాళీగా ఉన్న ఇళ్లను కూల్చివేశారు. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలోనే పెద్దఎత్తున పోలీసు బలగాలు, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, విద్యుత్ అధికారులు సుమారు 80 మంది కూలీలతో కలిసి అక్కడికి చేరుకున్నారు. పునరావాసానికి తరలిన కుటుంబాలు అప్పగించిన ఇళ్లను నేలమట్టం చేశాయి. వాస్తవంగా సైదాబాద్, హిమాయత్‌నగర్ మండలాల్లో మూసీ పరీవాహకం నదీగర్భంలో సుమారు 330 గృహాలకు గాను, 300 గృహాలకు రెడ్ మార్క్ వేసి అందులో సానుకూలత వ్యక్తం చేసిన కుటుంబాలకు పునరావాసం కింద డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించి తరలించారు. కుటుంబాలు అప్పగించిన గృహాలను స్వాధీనం చేసుకొని తాళం వేసి సీజ్ చేసింది. ఇళ్ల కూల్చివేత బాధ్యత హైడ్రాకు అప్పగించినప్పటికీ మూసీ వ్యవహారం వివాదాస్పదంగా మారడంతో నేరుగా కూలీలను రంగంలోకి దింపి సుమారు 20 శాతం ఇళ్లను కూల్చివేసింది. ఇళ్ల కూల్చివేతలో తలుపులు, కిటికీలు, ఇతర నిర్మాణ సామాగ్రి దెబ్బతినకుండా తొలగిస్తూ వాటిని యాజమానులకు అప్పగిస్తూ మన్ననలను చూరగొనేందుకు అధికారులు ప్రయత్నిడం విశేషం.

- మూసీ రివర్ బెడ్‌లో ఇప్పటివరకు 163 ఇళ్లను ఖాళీ చేయించినట్లు హైదరాబాద్ జిల్లా యంత్రాంగం ప్రకటించింది. మరో 700 నివాసాలను ఖాళీ చేయించాల్సి ఉందని పేర్కొంది. మొత్తం నివాసాలను ఖాళీ చేయించడానికి మరో వారం నుంచి పది రోజుల సమయం పట్టే అవకాశం ఉందని వెల్లడించింది. ఇళ్లను ఖాళీ చేసిన వారిలో 15 కుటుంబాలను జియాగూడకు, 136 కుటుంబాలను పిల్లిగుడిసెలకు, 16 కుటుంబాలను ప్రతాపసింగారం, 7 కుటుంబాలను నార్సింగిలోని డబుల్ బెడ్‌రూమ్ నివాస సముదాయాలకు తరలించి పునరావాసం కల్పించినట్లు వివరించింది. ఇళ్లు ఖాళీగా ఉంటే వాటిలోకి మళ్లీ వేరే వాళ్లు వచ్చి ఉండే అవకాశం ఉండడంతో కూల్చివేస్తునట్లు తెలిపింది.
- అదేవిధంగా రంగారెడ్డి జిల్లా పరిధిలో మూసీ నిర్వాసితుల్లో 23 కుటుంబాలు, మేడ్చల్ జిల్లా పరిధిలో మూసీ నిర్వాసితుల్లో 33 కుటుంబాలను తరలించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.





శంకర్‌నగర్‌లో ఇళ్ల కూల్చివేత దృశ్యాలు

కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్

మూసీ పరీవాహక ప్రాంతం నుంచి పునరావసం కింద డబుల్ బెడ్ రూమ్ భవన సముదాయంలోనికి వెళ్లిన వారి సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్, నీటి సరఫరా మరే ఇతర ఏమైనా సమస్యలు ఉంటే హైదరాబాద్ కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

జల సంరక్షణ.. ముురుగు కట్టడి!

ఈ రెండింటికి ఇక ప్రాధాన్యం
- ఇంకుడు గుంతల నిర్మాణం.. సీవరేజీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- మూడు నెలల పాటు స్పెషల్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో భూగర్భ జలాల సంరక్షణ, సీవరేజీ ఓవర్ ఫ్లో కట్టడికి జలమండలి నడుం బిగించింది. 90 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు కోసం స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైంది. ఈమేరకు గాంధీ జయంతి రోజున బుధవారం ఈ రెండు కార్యక్రమాలు లాంఛనంగా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. వీలైతే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాలను పారంభించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత..

మహానగరంలో వాన చినుకు నేలలో ఇంకే పరిస్థితి లేకపోవడంతో ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలను పెంపొందించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. ఇటీవల వేసవిలో భూగర్భ జలాలు పడిపోవడంతో గృహ అవసరాలకు సైతం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా భారం మోయక తప్పలేదు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ముందు జాగ్రత్తగా 'ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత'అనే పేరుతో స్పెషల్ డ్రైవ్ సిద్ధమైంది. ప్రతి ఇంటా భూగర్భ జలాలను రీస్టోర్ చేసుకునే దిశగా ఇప్పటికే నల్లా కనెక్షన్ ఉన్న వారితో పాటు కొత్త కనెక్షన్ తీసుకోవాలనుకునే వారి ఇంటి ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల ఏర్పాటు తప్పనిసరి చేసింది. ఇంటి ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించకోకుంటే వచ్చే ఏడాది జనవరి నుంచి వాటర్ ట్యాంకర్ బుక్ చేసుకునే వినియోగదారుల నుంచి రెట్టింపు ఛార్జీలు వసూలు చేయాలని నిర్ణయించింది.



ఇంకుడు గుంత

సీవరేజీ సమస్యలు ఇక రోజువారీగా..

మహానగరంలో నిత్యం డ్రైనేజీ మ్యాన్ హోళ్ల ఓవర్ ఫ్లోను పూర్తి స్థాయిలో నివారించి 'సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ'గా మార్చేందుకు జలమండలి ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. రోజువారీగా సీవరేజి సమస్యను ఎప్పటికప్పుడు తాత్కాలికంగా పరిష్కరించడం కంటే పూర్తి స్థాయిలో శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగాంగా ప్రధాన, అంతర్గత రోడ్లపై నిత్యం మురుగు పరుగుల కట్టడికి మూడు నెలల్లో కనీసం 30 శాతానికి తగ్గించే విధంగా స్పెషల్‌డ్రైవ్ నిర్వహించనుంది. ప్రతి నిత్యం సెక్షన్ల వారీగా సీవరేజీ జెట్టింగ్, ఎయిర్ టెక్, సిల్ట్ మిషన్లతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఫిర్యాదులతో సంబంధం లేకుండా పైప్‌లైన్ల క్లీనింగ్ పనులు నిర్వహించనుంది.

జానీ మాస్టర్ మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై వాదనలు పూర్తి

3న తీర్పు వెలువరించనున్న న్యాయస్థానం

రంగారెడ్డి కోర్టులు: లైంగిక దాడి ఆరోపణల నేపథ్యంలో చంచల్‌గూడా కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న నృత్య దర్శకుడు జానీ మాస్టర్ ఈ నెల 6నుండి 10వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని చేసిన పిటిషన్‌పై విచారణ పూర్తయ్యింది. తనకు ఉత్తమ నృత్య దర్శకుడి అవార్డు వచ్చిందని, ఆ గౌరవప్రదమైన అవార్డు అందుకునేందుకు తాను ఢిల్లీ వెళ్లాల్సి ఉందని పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టు, 9వ అదనపు జిల్లా కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం సదరు పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించనుంది.

ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ 15కు వాయిదా

ముగ్గురిని కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

సిటీ, కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మంగళవారం నాంపల్లి కోర్టులో జరిగింది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావులను పోలీసులు ఎస్కార్ట్ సహాయంతో కోర్టులో హాజరుపర్చారు. వైద్య పరీక్షల కోసం మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై బయటికి వచ్చిన భుజంగరావును కోర్టుకు హాజరకావాలని గత విచారణలో కోర్టు పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఆయన కోర్టుకు గైర్హాజరు కావడంతో ఆయన తరుపు న్యాయవాది సెక్షన్ 317 పిటిషన్ దాఖలు చేశారు. అదే విధంగా ఆయనకు సంబంధించిన సాధారణ బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. అయితే నాంపల్లి అదనపు సెషన్స్ జడ్జి ఆదేశాల ప్రకారం.. సాధారణ బెయిల్ పిటిషన్‌ను పరిష్కరించే వరకు మధ్యంతర బెయిల్‌ను పొడిగించినట్లు 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ తెలిపింది. ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌కుమార్ రావుల తదుపరి విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్‌బీడబ్ల్యూ ఇంకా పెండింగ్‌లో ఉన్నదని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ముగ్గురికి అక్టోబర్ 10 వరకు కస్టడీని పొడిగిస్తూ తదుపరి విచారణను ఆ రోజుకు వాయిదా వేస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది.

బాలిక ఆత్మహత్య



శివాని కుమారి మీనా మృతదేహం

మల్కాజిగిరి: ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కొండలు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..రాజస్థాన్‌కు చెందిన రాజేష్‌కుమార్ మీనా రైల్వేలో ఉద్యోగం చేస్తూ దుర్గానగర్‌లో నివాసముంటున్నాడు. అతని కుమార్తె శివాని కుమారి మీనా(14) రాజస్థాన్‌లో నానమ్మ వద్ద ఉంటూ చదువుకుంటోంది. ఇటీవల రాజేష్‌కుమార్ ఆమెను నగరానికి తీసుకుని వచ్చాడు. గత నెల 30న ఆమె తల్లి బెడ్ తయారీ కోసం తన పాత బట్టలను చింపుతుండగా శివాని తల్లిని ప్రశ్నించింది. ఆ తర్వాత కొద్దిసేపటికి బెడ్‌రూమ్‌లోకి వెళ్లిన శివానీ చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనారిటీ గురుకుల విద్యార్థులకు మెడికల్ సీట్లు

సాక్షి,సిటీబ్యూరో: మైనారిటీ గురుకుల విద్యార్థులు 22 మంది తొలివిడత మెడికల్ కౌన్సెలింగ్‌లో సీట్లు సాధించినట్లు తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ప్రెసిడెంట్, వైస్ చైర్మన్ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నీట్ -2024 పరీక్షకు 206 మంది విద్యార్థులు హాజరు కాగా, 137 మంది అర్హత సాధించారన్నారు. రెండు, మూడో దశల్లోనూ సుమారు 50 మంది విద్యార్థులు సీట్లు సాధించే అవకాశాలున్నట్లు ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఫ్యాకల్టీని ఆయన అభినందించారు.

సిటీలో డీజేలు బ్యాన్



- ఊరేగింపుల్లో నిషేధిస్తూ నిర్ణయం
- పటాసుల పైనా ఆంక్షలు
- ఉత్తర్వులు జారీ చేసిన కొత్వాల్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగానికి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు, ఇటీవలి కాలంలో చోటు చేసుకున్న ఉదంతాలను దృష్టిలో ఉంచుకుని నగర కొత్వాల్ సీవీ ఆనంద్ డీజేలను నిషేధిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ప్రకారం మతపరమైన ఉరేగింపుల్లో డీజేలు వినియోగించకూడదని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశానికి సంబంధించి ఆయన ఇటీవల బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీ సీసీసీ) కీలక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. అందులో వర్తకులు, వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు సూచనల ఆధారంగా కొత్వాల్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆయా ఊరేగింపుల్లో డీజేకు బదులుగా వినియోగించే ఉపకరణాలు వెలువరించే శబ్దాలకు పరిమితులు విధించారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు, సుప్రీం కోర్టు ఆదేశాలు వర్తిస్తాయన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల మధ్య మాత్రమే ఈ సౌండ్ సిస్టమ్స్ వాడాలని సీపీ స్పష్టం చేశారు. ఇటీవల మిలాదున్నబీ ర్యాలీ నేపథ్యంలో చార్మినార్ వద్ద చోటు చేసుకున్న అగ్నిప్రమాదం తీవ్ర కలకలం సృష్టించింది. దీంతో భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండటంతో పాటు ప్రమాదాల నిరోధం కోసం ఈ తరహా ఊరేగింపుల్లో పటాసులు కాల్చడాన్ని నిషేధిస్తూ కొత్వాల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని అతిక్రమించిన వారిపై నేరం నిరూపణ అయితే కోర్టులు ఐదు నుంచి ఏడేళ్ల జైలు లేదా రూ.లక్ష వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. పదే పదే ఉల్లంఘనలకు పాల్పడితే ఈ శిక్షలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. డీజేల నిషేధానికి సంబంధించిన ఉత్తర్వులు నగరంలోని అందరు నిర్వాహకులకు అందించాలని కమిషనర్ అధికారులు ఆదేశించారు.

నగరంలో శబ్ద పరిమితులు ఇలా...

ప్రాంతం	పగలు	రాత్రి
పారిశ్రామిక	75	70
వాణిజ్య	65	55
నివాస	55	40
నిశ్శబ్ద	50	40

(శబ్ద పరిమితి డెసిబుల్స్‌లో)

బైక్‌పై తిరుగుతూ పోకిరీ వేషాలు!

- ఇంటి ముందు ఫోన్ మాట్లాడుతున్న మహిళతో అసభ్యకర ప్రవర్తన
- నంబర్ ప్లేట్, ముఖం కనిపించకుండా మాస్క్
- సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు
- నిందితుడి అరెస్టు



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: గల్లీల్లో బైక్‌పై తిరుగుతూ ఒంటరి మహిళలను అసభ్యకరంగా తాకుతూ పోకిరి వేషాలు వేస్తున్న ఆకతాయికి రాచకొండ పోలీసులు అరదండాలు వేశారు. ఇంటి ముందు నిల్చొని ఫోన్‌లో మాట్లాడుతున్న ఓ మహిళతో హెల్మెట్ పెట్టుకుని బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె రాచకొండ షీ టీమ్స్‌కు 8712662111 వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసింది. సీసీటీవీ ఫుటేజీను జత పరిచింది. వెంటనే కమిషనర్ జీ సుధీర్ బాబు స్పందించి, నిందితుడి కోసం షీ టీమ్స్, ఐటీ సెల్, స్థానిక పోలీసులతో 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఘటనా స్థలంలోని వంద సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. బైక్ నంబరు ప్లేట్ కనిపించకుండా మాస్క్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆయా మార్గంలోని 300 బైక్‌లను పరిశీలించి, నిందితుడ్ని గుర్తించారు. అతని సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా అతడిని అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

నెల రోజుల్లో 283 మంది అరెస్టు..

రాచకొండలో ఆకతాయిల వేధింపులు పెరిగిపోతున్నాయి. నెల రోజుల వ్యవధిలో షీ టీమ్స్‌కు 343 ఫిర్యాదులు అందాయి. ఇందులో 283 మంది పోకిరీలను అరెస్టు చేశారు. వీరందరికీ మంగళవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫిర్యాదులు వచ్చిన వాటిల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా.. 107 మందిపై పెట్టీ కేసులు, 174 మందికి కౌన్సెలింగ్ ఇచ్చామని షీ టీమ్స్ డీసీపీ టీ ఉషా విశ్వనాథ్ తెలిపారు.

గంజాయి మత్తులో వీరంగం

పలువురిపై దాడి

మణికొండ: కొందరు యువకులు గంజాయి మత్తులో వీరంగం సృష్టించిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడలో మంగళవారం ఉదయం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పుప్పాలగూడలోని శ్రీ అనంత పద్మనాభస్వామి దేవాలయ ఆవరణలో మంగళవారం ఉదయం నలుగురు యువకులు కారులో వచ్చి మద్యం, గంజాయి సేవిస్తుండటంతో ఆలయ కమిటీ నాయకులు వారిని మందలించారు. దీంతో ఆగ్రహానికి లోనైన వారు తమనే మందలిస్తారా అంటూ తమ కారుతో ఢీకొట్టి ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా స్థానికులైన శ్రీనివాస్, కిరణ్, రాములు, గోపాల్ తదితరులపై దాడికి దిగారు. దాంతో వారు నార్సింగి పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

సికింద్రాబాద్: బ్యాంక్ పరీక్ష కోసం కోయంబత్తూర్ వెళ్లిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో రైలు పట్టాలపై శవమై కనిపించిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, మాలోత్‌తండాకు చెందిన మాలోత్ దేవేందర్ (30) గత నెల 27న బ్యాంక్ పరీక్ష రాసేందుకు కోయంబత్తూర్ వెళ్లాడు. పరీక్ష అనంతరం యశ్వంతాపూర్ వెళ్లిన అతను తన సోదరి, బంధువులను కలిశాడు. గత నెల 30న యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరిన దేవేందర్ కాజీపేటకు వెళ్లాల్సి ఉంది. అయితే అతను మంగళవారం ఉదయం మేడ్చల్ రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫామ్ సమీపంలో శవమై కనిపించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. తాను వెళ్లాల్సిన రైలుకు బదులు మరో రైలు ఎక్కి తిరిగి దిగే ప్రయత్నంలో కిందపడి మృతి చెందడా..? లేదా మేడ్చల్ మార్గంలో దేవేందర్ ఎందుకు వెళ్లాల్సి వచ్చిందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

రూ.1.21 కోట్ల హవాలా నగదు స్వాధీనం

ముగ్గురు వ్యక్తుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగదు



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

సుల్తాన్‌బజార్: హవాలా మార్గంలో అక్రమంగా రూ.1.21 కోట్ల నగదును తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన సుల్తాన్‌బజార్ పోలీసులు వారి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లక్ష్మణ్, వసంత్ అనే వ్యక్తులు మంగళవారం రాత్రి హనుమాన్‌టేక్డీ నుండి బొగ్గుల కుంటకు వెళుతుండగా ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు బైక్‌ను ఆపి వారిని విచారించగా పొంతనలేని సమాధానాలు చెబుతూ... తప్పించుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారిని వెంబడించి పట్టుకున్న పోలీసులు వారి వద్ద ఉన్న బ్యాగ్‌ను సోదా చేయగా పెద్ద మొత్తంలో నగదు ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా హనుమాన్‌టేక్డీలోని శివ టవర్స్‌లో ఉంటున్న హవాల ఏజెంట్ తరుణ్ సూచన మేరకు నగదు తీసుకెళుతున్నట్లు తెలిపారు. దీంతో అతడి ఆఫీస్‌పై దాడి చేసిన పోలీసులు అతడి వద్ద రూ.21 లక్షల నగదు, రెండు కౌంటింగ్ మిషన్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముంబైకి చెందిన బబ్లు ముఖ్య సూత్రదారిగా ఈ హవాలా దందా నడిపిస్తున్నట్లు తెలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రూ.1.21 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ నర్సయ్య, సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన జాజిబ్ ఇక్బాల్(25) శామీర్‌పేట్‌లోని ఐపీఈ కళాశాలలో చదువుతున్నాడు. మంగళవారం అతను హైటెక్ సిటీ నుంచి బైక్‌పై శామీర్‌పేట్‌లోని కళాశాలకు వస్తుండగా మునీరాబాద్ సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొడంతో తీవ్రంగా గాయపడిన ఇక్బాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కుటుంబం ఆత్మహత్యాయత్నం ఘటనలో..

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చైతన్యపురి: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కథనం మేరకు కర్నూలు జిల్లాకు చెందిన వెంకటేశ్వరరావు, భార్య లత, కుమారులు సందీప్, సాయిస్వరూప్, వంశీకృష్ణ తో కలిసి నగరానికి వలసవచ్చారు. కోదండరాం నగర్‌లో ఉంటూ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. కుటుంబ ఖర్చుల నిమిత్తం పెద్ద మొత్తంలో అప్పు చేసిన వీరు వాటిని తీర్చే దారిలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇంట్లో గడి పెట్టుకుని ఐదుగురూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.ఈ విషయాన్ని కింది పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న రాజశేఖర్‌కు ఫోన్ చేసి చెప్పడంతో అతను పోలీసులకు, 100 నంబర్‌కు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా వారిలో చిన్న కుమారుడు వంశీకృష్ణ (26) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆహార పదార్థాల తయారీ పరిశ్రమపై దాడి



స్వాధీనం చేసుకున్న కల్తీ ఆహార పదార్థాలు

శంషాబాద్: కల్తీ ఆహార పదార్థాలు తయారు చేస్తున్న ఓ పరిశ్రమపై శంషాబాద్ ఎస్ఓటీ, ఆర్జీఐఏ పోలీసులు మంగళవారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పట్టణంలోని సింప్లెక్స్ సమీపంలోని బాలాజీ ఇండస్ట్రీపై దాడి చేసిన పోలీసులు భారీగా సింథటిక్ రంగులు, 35 కేజీల నకిలీ పసుపు పౌడర్, 44 లీటర్ల నకిలీ చిల్లి సాస్, ఏడు లీటర్ల టమోటా సాస్‌తో పాటు నాణ్యత లేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. శివరాంపల్లికి చెందిన రాజేష్ ఉపాధ్యాయ, బేగం బజార్‌కు చెదిన శ్రీరాం తివారీ ఈ పరిశ్రమను నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ్‌ను పరామర్శించిన గుత్తా



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మంగళవారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని పరామర్శించారు. గచ్చిబౌలిలోని నివాసంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

విత్తన తయారీ పరిశ్రమపై దాడి

- నిర్వాహకులపై కేసు నమోదు
- 4 వేల కిలోల విత్తనాలు స్వాధీనం

మేడ్చల్‌రూరల్: వ్యవసాయ శాఖ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా విత్తనాలు తయారు చేస్తున్న కంపెనీపై వ్యవసాయాధికారులు, పోలీసులు దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు. మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎల్లంపేట్ గ్రామంలో సమృద్ధి అగ్రిటెక్ పేరుతో ఏర్పాటు చేసిన కంపెనీలో అనుమతులు లేకుండా కరోనా సీడ్స్ టాప్-55 పేరిట మొక్కజొన్న విత్తనాలు తయారు చేసి ప్యాకెట్లుగా మార్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మేడ్చల్ మండల వ్యవసాయాధికారి అర్చన ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కరోనా సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట మేడ్చల్ పట్టణంలోని ఎన్‌జేఆర్-కేఎల్ఆర్ నగర్‌లో ఆఫీసు ఏర్పాటు చేసి విత్తనాల విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించారు. సదరు కార్యాలయంపై దాడి చేశారు. ఈ సందర్భంగా 4 వేల కిలోల విత్తన ప్యాకెట్లను సీజ్ చేశారు. ఈ మేరకు సమృద్ధి అగ్రిటెక్ కంపెనీపై, నిర్వాహకులపై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేలో ఉద్యోగాల పేరుతో రూ.87 లక్షలు స్వాహా

- బాధితుల్లో ముఖ్యమంత్రి కార్యాలయ ఉద్యోగి
- కేసు నమోదు చేసిన సీసీఎస్ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: రైల్వేలో క్లర్క్, కమర్షియల్ క్లర్క్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నగరానికి చెందిన పలువురి నుంచి రూ.87 లక్షలు స్వాహా చేసిన ముఠాపై సిటీ సీసీఎస్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. బాధితుల్లో ముఖ్యమంత్రి కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగి సైతం ఉన్నారు. బాగ్ అంబర్‌పేటకు చెందిన ఎల్.మధు సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఇతడి సోదరుడు ప్రశాంత్‌కు కొన్ని రోజుల క్రితం అదే ప్రాంతానికి చెందిన బి.రామ్ కుమార్‌తో పరిచయమైంది. తాను చెన్నైలో ఉంటున్నానని, రైల్వేలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్నట్లు నమ్మబలికాడు. తన పలుకుబడి వినియోగించి దొడ్డిదారిన రైల్వేలో క్లర్క్, కమర్షియల్ క్లర్క్ ఉద్యోగాలు ఇప్పిస్తానన్నాడు. ఇతడి మాటలు నమ్మిన ప్రశాంత్ తన బంధువు మధుతో పాటు మరికొందరికీ పరిచయం చేశాడు. వీరందరూ కలిసి రామ్ కుమార్‌తో పాటు అతడి బంధువులైన మరికొందరికి రూ.87 లక్షలు చెల్లించారు. కొన్నాళ్లకు మధుతో పాటు మరికొందరికి క్లర్క్ ఉద్యోగాలు ఇస్తున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించిన రామ్ కుమార్ తదితరులు ఈ-మెయిల్ చేశారు. ఎట్టకేలకు మోసపోయినట్లు గుర్తించిన బాధితుల్లో ఒకరైన మధు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సంబరాల్లో సీడీపీఓ రేణుక తదితరులు

రహమత్‌నగర్ (బోరబండ): అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక సదుపాయాలు కల్పించడం జరిగిందని గర్భిణులు, బాలింతలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ రేణుక అన్నారు. పర్వత్‌నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణమాస సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతంలో ఎంతో పోషక విలువలు కలిగి ఉంటాయని తెలిపారు. అదే విధంగా గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ టీచర్ల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కష్టపడే వారికి సముచిత స్థానం



లక్ష్మిని ఘనంగా సన్మానిస్తున్న బీజేపీ నేతలు

శ్రీనగర్‌కాలనీ: బీజేపీలో కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుందని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన లక్ష్మికి రాష్ట్ర మహిళా మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బాధ్యతలను అందించి ఆమెను ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతానికి, మహిళలను సంఘటితం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేతలు అట్లూరి రామకృష్ణ, బంగారు ప్రశాంత్, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కుంబాల గంగరాజు, ఈదులగంటి రాజేష్, సునీ, చిన్నశ్రీను, లక్ష్మణ్, గణేష్, రాజుసింగ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు



వాహనాలను తీసుకెళ్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: పాదచారులకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యాపార సముదాయాల ముందు వాహనాలను పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఇందిరానగర్‌లోని సాయి వైన్స్ వద్ద ఫుట్‌పాత్‌లపై నిలిపిన వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుకు అడ్డంగా, ఫుట్‌పాత్‌లపై వాహనాలు ఇష్టారీతిన పార్కింగ్ చేస్తున్న వాహనదారులతో పాటు వాణిజ్య సముదాయ యజమానులకు కూడా నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు గోపీ, అశోక్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రిషికేశ్ రెడ్డి

వెంగళరావునగర్: సమాజంలో ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని జవహర్‌బాల్ మంచ్ చైర్మన్ రిషికేశ్‌రెడ్డి తెలియజేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలోని గుడ్ సిటిజన్ కాన్సెప్ట్ స్కూల్‌లో మంగళవారం జవహర్‌బాల్ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుండెపోటు వస్తున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీపీఆర్ విధానాన్ని చేసి చూపారు. సీపీఆర్ చేయడం వల్ల గుండెపోటుకు గురైన వారిని 90 శాతం ప్రాణాలు కాపాడటానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జవహర్‌బాల్ మంచ్ సంస్థ స్టేట్ కో ఆర్డినేటర్లు వెంకటేశ్వర్లు, డాక్టర్ రవికుమార్, స్కూల్ కరస్పాండెంట్ నసీం ఉన్నీసాబేగం, ప్రిన్సిపాల్ ఆయుఖాన్‌లతో పాటుగా టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రాన్ని అందుకుంటున్న సూర స్రవంతి

లక్డీకాపూల్: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా సూర స్రవంతి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతాయుతమైన పదవిలో నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మహిళా శక్తిని మేల్కొలుపుతూ సమాజంలో జరుగుతున్న అవినీతిని అంతమొందించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సముచిత స్థానం రావడానికి సహకరించిన జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు, జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు ఎలిగేండ్ల వెంకటేష్‌లకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, వరంగల్ జిల్లా కన్వీనర్ విజయలత, మహేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నమిండ్ల హరీష్, అక్కెల్లి పవన్ కళ్యాణ్, అక్కెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తుగా దసరా వేడుకలు

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

పాఠశాలల్లో బతుకమ్మ సందడి

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ, దసరా పర్వదిన వేడుకలను పలు పాఠశాలల్లో మంగళవారం కనులపండువగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు అటు బతుకమ్మ పండుగను, ఇటు దసరా నేపథ్యంగా సాంస్కృతి ప్రదర్శనల్లో పాల్గొని విశేషంగా ఆకట్టుకున్నారు. బతుకమ్మలు పేర్చి ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా గడిపారు. దసరా సెలవుల నేపథ్యంలో మంగళవారమే అన్ని పాఠశాలల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. –బంజారాహిల్స్



బీవీబీపీ స్కూల్లో









జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్లో...





బీవీబీపీ స్కూల్లో...

బీవీబీపీ స్కూల్లో...

ఫిలింనగర్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్‌లోని బీవీబీపీ స్కూల్‌లో దుర్గాదేవి నేపథ్యంగా చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆటపాటలతో విద్యార్థులు దసరాను కళ్లముందుకు తీసుకువచ్చారు. 10 రోజుల ముందుగానే దసరా వచ్చిందా..? అన్న రీతిలో ఈ వేడుకల్లో ఆడుతూ పాడుతూ సందడి చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దసరా నేపథ్యంగా సాగిన పాటలు, ఆటలు సహచర విద్యార్థులను ఉర్రూతలూగించారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్లో...

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో దసరా నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, నాటికలు అబ్బురపరిచాయి. ఆనాటి ఎన్నో సంఘటనల ఆధారంగా విద్యార్థులు తమ నైపుణ్యంతో పాత్రలను మూర్తీభవిస్తూ చేసిన నాటకీయ ప్రదర్శనలు కనులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటారని తెలిపారు. సంప్రదాయబద్ధమైన ఇలాంటి పండుగల విశిష్టతను, విలువలను, విశేషాలను నేటితరం విద్యార్థులకు తెలియపర్చాల్సిన అవసరం ఉందన్నారు.



ఆత్మకూరి రామారావు స్కూల్లో..



సైఫాబాద్ సైన్స్ కాలేజీలో..

భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో...

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో చిన్నారులు బతుకమ్మ పండుగను కనులపండువగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలను ఎత్తుకొని స్కూల్ ఆవరణలో తిరుగుతూ సందడి చేశారు. విద్యార్థులతో పాటు టీచర్లు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆవరణ అంతా పూల సోయగాలతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ కూడా పాల్గొన్నారు. ప్రీ ప్రైమరీ విద్యార్థినులు బతుకమ్మ ఆడగా విద్యార్థులు కోలాటాలతో ఆకట్టుకున్నారు. ఆటా పాటలతో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఖాళీలు భర్తీ చేయాలి

లిబర్టీ: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డి. ప్రేమ్‌సింగ్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో జనాభాకు అనుగుణంగా మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది లేరని ఆయన పేర్కొన్నారు. మంగళవారం లిబర్టీ వద్ద ఉన్న యూనియన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ శివారు జనాభా కలిపి కోటికి పైగా ఉందని జనాభాకు అనుగుణంగా రెగ్యులర్ మున్సిపల్ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య సిబ్బంది లేరని ఫలితంగా ప్రస్తుతం ఉన్న సిబ్బందిపై అధిక భారం పడుతుందన్నారు. ఇప్పటికైనా అన్ని జోన్ల పరిధిలో రెగ్యులర్ సిబ్బందిని నియమించి గ్రేటర్‌లో పచ్చదనం, పరిశుభ్రతను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధు తదితరులు పాల్గొన్నారు.

జీటీఎస్ ఈఓను కలిసిన నేతలు

వెంగళరావునగర్: కూకట్‌పల్లి, అల్లాపూర్, మూసాపేటకు చెందిన హిందూవాహిణి, బీజేపీ నేతలు మంగళవారం స్థానిక జీటీఎస్ టెంపుల్ ఈ.ఓ.ను కలిసి సమస్యలను తెలిపారు. గతంలో ప్రతి గురువారం అన్నప్రసాద వితరణ, ధూప, దీప, నైవేద్యాల విషయంలో ఎలాగైతే జరిగిందో దానిని కొనసాగించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఈ.ఓ.సుధాకర్ మాట్లాడుతూ దేవాదాయశాఖ మంత్రి, కమిషనర్ల దృష్టికి తీసుకెళ్ళి భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ పాల్గొన్నారు.

మహేష్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు

రహమత్‌నగర్: టీపీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్ కుమార్‌గౌడ్‌ను రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని తనకు సూచించినట్లు సీఎన్ రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా. రోహిణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎన్ రెడ్డి

మహిళ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

సీసీ ఫుటేజీ, కాల్‌డేటాలను పరిశీలిస్తున్న పోలీసులు



హత్యకు గురైన మర్లు సుధారాణి

బంజారాహిల్స్: ఆర్ఎంపీ వైద్యుడి భార్య దారుణ హత్య ఘటనలో నిందితుడి కోసం జూబ్లీహిల్స్ పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ఎల్లారెడ్డిగూడ సమీపంలోని నవోదయ కాలనీలో నివాసం ఉండే ఆర్ఎంపీ వైద్యుడు ఉమామహేశ్వర్‌రావు భార్య మర్లు సుధారాణి (44) సోమవారం సాయంత్రం తన ఇంట్లోనే గుర్తు తెలియని వ్యక్తి చేతిలో దారుణంగా హత్య చేయబడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆగంతకుడు ప్రవేశించి ఆమె మెడ కోసి పరారైనట్లుగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఘటనపై మృతురాలి భర్త ఉమా మహేశ్వర్‌రావును పోలీసులు పలు కోణాల్లో ప్రశ్నించారు. అయితే భార్యాభర్తలు ఇద్దరూ అన్యోన్యంగానే ఉండేవారని, ఈ హత్య చేసింది బయట నుంచి వచ్చిన వ్యక్తేనని పోలీసులు భావిస్తున్నారు. ఇక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలించగా సాయంత్రం ఓ వ్యక్తి వెనుకాల బ్యాగ్ వేసుకుని ఇంట్లోకి వెళ్లి 20 నిమిషాల తర్వాత తిరిగి బయటకు వచ్చినట్లు గుర్తించారు. అయితే సీసీ ఫుటేజీల్లో ఫొటోలు స్పష్టంగా లేకపోవడంతో గుర్తించడంలో ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. దీని ఆధారంగానే పోలీసులు మరిన్ని సీసీ కెమెరాలను పరిశీలించే పనిలో పడ్డారు. మృతురాలి ఫోన్ కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు. ఆమె ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడుతుందని తెలుసుకున్న పోలీసులు ఆ మేరకు సోమవారం రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎవరెవరితో మాట్లాడిందో కాల్‌డేటా సేకరిస్తున్నారు. నిందితుడిని ఒకట్రెండు రోజుల్లో పట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆమె ఫోన్ కాల్‌డేటా ఆధారంగానే నిందితుడిని గుర్తించే అవకాశాలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ పోలీసులు కేసులో పురోగతి కోసం ఒక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఒకవైపు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూనే ఇంకోవైపు వీరికి పరిచయం ఉన్నవారి కదలికలపై దృష్టిపెట్టారు. కాగా మృతురాలి భర్త ఉమా మహేశ్వర్‌రావు ఇంట్లో ఉన్న సుమారు 15 తులాల బంగారం కూడా మాయమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బంధువులా ఫోన్ చేసి రూ.50 వేలు కాజేసిన మహిళ

వెంగళరావునగర్: బంధువులా ఫోన్ చేసి వృద్ధురాలి నుంచి ఓ మహిళ రూ.50 వేలు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే నిర్మలాదేవికి గతనెల 29న తన సమీప బంధువులా ఓ మహిళ ఫోన్ చేసింది. అత్తమ్మ నాకు ఆన్‌లైన్ ప్రాబ్లంగా ఉంది, రూ.50 వేలు గూగుల్ పే చేయాలని కోరింది. ఫోన్ చేసిన వ్యక్తి తన సమీప బంధువులా ఉండటంతో ఆమెకు ఎలాంటి అనుమానం రాలేదు. ఆమె కోరిన విధంగా రూ. 50 వేలు పంపింది. అనంతరం కొద్దిసేపటికి తన బంధువుకు ఫోన్ చేసి నగదు వచ్చాయా అని ప్రశ్నించింది. తన బంధువులు తాము ఫోన్ చేయలేదని చెప్పడంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలి

తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి అధ్యక్షుడు గుండా యాదగిరి



సమావేశంలో మాట్లాడుతున్న గుండా యాదగిరి తదితరులు

కాచిగూడ: తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల చొప్పున ఇంటి స్థలం, పెన్షన్, ఉచిత బస్ పాసులు అందజేయాలని తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గుండా యాదగిరి, ప్రధాన కార్యదర్శి బి.సాయిబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2008 ఫిబ్రవరి 11న సైకిల్ యాత్ర ప్రారంభించి 4వేల కి.మీ.కొనసాగించామని అన్నారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టామని, ధర్నాలు, అసెంబ్లీ ముట్టడి చేపట్టామన్నారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ చాలీచాలని జీవితాలను గడుపుతున్న ఉద్యమకారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.12 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ సమావేశంలో సమితి చైర్మన్ డాక్టర్ ఎం.భాగయ్య, ఎం.రాంచందర్, ఆర్.వీరస్వామి, జి.గణేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో వ్యభిచార గృహంపై దాడి

వెంగళరావునగర్: మధురానగర్‌లో వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి ఆర్గనైజర్లను అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక మధురానగర్ కాలనీలోని జీ–బ్లాక్‌లో వ్యభిచారం జరుగుతుందని మధురానగర్ పీఎస్‌కు ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు మంగళవారం ఆ కాలనీలోని జీ–బ్లాక్‌లో ఉన్న ఇంటిపై దాడి చేశారు. ఈ సమయంలో బి.వరలక్ష్మి అనే మహిళ ఇంట్లో ఉంది. పోలీసులు ఇంటిని సోదా చేసి ఆమెను వివరాలు అడగ్గా ప్రభాకర్‌రెడ్డి అనే వ్యక్తితో కలిసి ఓ యువతి ద్వారా వ్యభిచారం చేయిస్తున్నట్లుగా అంగీకరించింది. కలకత్తాకు చెందిన రాజు స్థానికంగా ఉండే సబ్ ఆర్గనైజర్ ప్రభాకర్‌రెడ్డిలు సదరు యువతికి ప్రతినెల రూ.60 నుంచి రూ.70 వేలు ఇస్తారని, తనకు రూ.2 వేలు ప్రతి రోజూ ఇస్తారని పేర్కొంది. కాగా ప్రభాకర్‌రెడ్డి తాను ఇద్దరూ కూడా సినిమా ఇండస్ట్రీలో పని చేస్తుంటామని పేర్కొంది. పోలీసులు ఇంటిని సోదా చేయగా యువతి మినహా, పురుషులు కనిపించలేదు. గదిలో ఉన్న కండోమ్ పాకెట్లు, ఫోన్‌ను సీజ్ చేసి వ్యభిచారం చేయిస్తున్న ఆర్గనైజర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు విక్రయిస్తానని మోసం

వెంగళరావునగర్: ఫ్లాట్ విక్రయిస్తానని మహిళను నమ్మించి నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తులపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... కళ్యాణ్‌నగర్‌లో అద్దెకు ఉండే జి.అఖిల ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. ఆమె సొంతింటి కోసం కొంత డబ్బులు దాచుకుంది. ఈ క్రమంలో నాగేశ్వరరావు అనే బ్రోకర్‌కు తనకు ఇల్లు కావాలని తెలియజేసింది. అతను ఓ ఇంటిని చూపి రూ.కోటి 30 లక్షలకు విక్రయిస్తారని, ఇందుకోసం ఓనర్ లోన్ కూడా ఇప్పిస్తాడని చెప్పాడు. దీంతో ఆమె తన తండ్రి కృష్ణాచారితో కలిసి బ్రోకర్ చూపిన ఇంటికి వెళ్ళి ఓనర్ గిరీష్‌ను కలవగా అతడు రూ.90 లక్షల నుంచి కోటి వరకు రుణం ఇప్పిస్తానని తెలిపాడు. ఓనర్ గిరీష్ తనకు రూ.25 లక్షలు టోకెన్ నగదు ఇస్తే 30 రోజుల్లో రుణం మంజూరు చేయిస్తానన్నాడు. ఆమె నమ్మి మే 25న తన తల్లిదండ్రులతో కలిసి గిరీష్ ఇంటికి వెళ్ళి అశోక్ చౌదరి, సామల నాయక్, బ్రోకర్ నాగేశ్వరరావుల సమక్షంలో నగదు ఇచ్చింది. ఆ సమయంలో గిరీష్ అగ్రిమెంట్ కూడా రాశాడు. అయితే ఎన్నిరోజులు గడచినా రుణం ఇప్పించలేదు. అనుమానం వచ్చి ఆమె సదరు ఇంటి పత్రాలు తీసుకుని బ్యాంక్‌కు వెళ్లి మేనేజర్‌ను కలువగా ఆ ఇంటిని అనుమతి లేకుండా నిర్మించారని, రుణం మంజూరు చేయడం కుదరదని చెప్పారు. దీంతో బాధితురాలు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధికారిని అడ్డుకున్న డబుల్ ఇళ్ల బాధితులు

రహమత్‌నగర్: కమలానగర్ డబుల్ బెడ్ రూం ఇళ్ల నివాసాల వద్దకు వచ్చిన జీహెచ్‌ఎంసీ అధికారులకు బాధితులు అడ్డుకున్నారు. తమకు ఇళ్లను కేటాయించిన తరవాతే మిగతా వారికి కేటాయించాలని ఆందోళన దిగారు. వివరాల ఇలా ఉన్నాయి. మూసీ పరీవాహక ప్రాంతాల బాధితులకు ఇళ్లను కేటాయించాలన్న సీఎం ఆదేశాల మేరకు పరిశీలించేందుకు ఎస్పీఆర్‌హిల్స్ కమలానగర్ డబుల్‌బెడ్‌రూం నివాసాల వద్దకు జీహెచ్‌ఎంసీ సర్కిల్ –19 ప్రాజెక్ట్ అధికారి వెంకట కృష్ణ తమ సిబ్బందితో కలిసి మంగళవారం మధ్యాహ్నం వచ్చారు. అప్పటికే పెద్దఎత్తున అక్కడ గుమికూడిన బాధితులు తమకు ఇళ్లను కేటాయించాలని అధికారిని అడ్డుకున్నారు. దీంతో దాదాపు అర్ధగంట సేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ హైదర్ అధికారికి తమకు ఇళ్లు కేటాయించాలని, తాను మంత్రులు, అధికారులకు చేసిన విజ్ఞప్తులు, కోర్టు కేసు వివరాలు తెలియజేశారు. సమాచారం అందుకున్న బోరబండ పోలీసులు అక్కడికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

నివేదికలు రూపొందించేందుకు వచ్చాం: వెంకట కృష్ణ జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ అధికారి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమలానగర్ డబుల్ బెడ్ రూం ఇళ్లలో మూసీ నది పరీవాహక ప్రాంతాల బాధితుల కోసం నివేదికలు రూపొందిచేందుకే మేము వచ్చాం. ఇళ్ల కేటాయింపులు సంబంధిత అధికారులు పరిధిలోకి వస్తుంది. నివేదికలు రూపొందించి అధికారులకు అందజేస్తాం.



అధికారితో వాగ్వాదం చేస్తున్న బాధితులు



ఒకవైపు ఎండ.. మరోవైపు వాన..!

రెండు, మూడు రోజులుగా విచిత్ర పరిస్థితి

బంజారాహిల్స్: ఒక వైపు ఎండ...మరో వైపు చిరు జల్లులు గడిచిన రెండు, మూడు రోజులుగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. మంగళవారం జూబ్లీహిల్స్‌లో ఉదయం నుంచి ఉక్కపోత ఉండగా మధ్యాహ్నం తర్వాత ఒక వైపు తీవ్రమైన ఎండ కొడుతూనే మరో వైపు భారీ వాన జూబ్లీహిల్స్ వాసులను పలకరించింది. సుమారు 15 నిమిషాల పాటు ఎండలోనే వాన కొట్టడంతో స్థానికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. మరో వైపు బంజారాహిల్స్, ఫిలింనగర్, శ్రీనగర్ కాలనీ, పంజగుట్టలలో చుక్క వర్షం లేకపోవడం గమనార్హం.

బాచుపల్లి నారాయణ కాలేజీలో
ఆకస్మిక తనిఖీ

- పరిస్థితిపై ఆరా తీసిన రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ నేరెళ్ల శారద
- నాసిరకమైన ఆహారం, సౌకర్యాలపై నిర్వాహకులపై ఆగ్రహం
- యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హామీ



బాచుపల్లి నారాయణ జూనియర్ కళాశాలను సందర్శించిన రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ నేరెళ్ల శారద

నిజాంపేట్: బాచుపల్లిలోని నారాయణ కాలేజీలో పరిస్థితిపై రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ నేరెళ్ల శారద సీరియస్ అయ్యారు. కొన్ని రోజులుగా కాలేజీలో చదువుతున్న విద్యార్థినులకు సంబంధించిన సమస్యలపై మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో నారాయణ కళాశాలలో మంగళవారం రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ నేరెళ్ల శారద ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో కళాశాల విద్యార్థినుల హాస్టల్ గదులను, మెస్‌ను ఆమె పరిశీలించారు. నాసిరకమైన ఆహారంతో పాటు సౌకర్యాలు సరిగ్గా లేవని నిర్వాహకులపై ఆమె సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఆమె ఫుడ్‌సేఫ్టీ పాటించి నాణ్యమైన ఆహారం, వసతులు కల్పించేలా కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

ఐకియాలో పండుగ సీజన్ ఆఫర్లు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ గృహోపకరణాల విక్రయ షోరూమ్ ఐకియా.. రానున్న పండుగ సీజన్‌ను పురస్కరించుకుని కొనుగోలుదారులకు పలు రకాల ఆఫర్లను అందిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. తమ దగ్గర హోమ్ ఫర్నిషింగ్స్ కొనుగోలు నుంచి ఇంటిని మెరిపించే డిజైనింగ్ ప్లాన్ల వరకు విభిన్న రకాల సేవలు అనూహ్యమైన డిస్కౌంట్ రేట్లతో అందుబాటులో ఉన్నాయని, డెలివరీ ఛార్జీల్లోనూ 50శాతం తగ్గింపు ఇస్తున్నామన్నారు. తమ రెస్టారెంట్స్‌లో రూ.750 బిల్ చేసిన వారికి రూ.150 వరకూ రాయితీ సహా మరెన్నో ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తున్నామన్నారు. ఈ ఆఫర్లు నవంబరు 3వ తేదీ వరకూ మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు.

పండగ వేళ.. సూత్ర ఎగ్జిబిషన్ షురూ



సాక్షి, సిటీబ్యూరో: ఆధునికత.. సంప్రదాయ మేళవింపు కలగలిపిన సూత్ర ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను సామాజికవేత్త సుశీల బొకాడియ మంగళవారం ప్రారంభించారు. బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్‌కృష్ణ వేదికగా ఏర్పాటు చేసిన ఈ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా పలు నగరాల నుంచి మహిళా వ్యాపారవేత్తలు, ఫ్యాషన్–జ్యూవెలరీ డిజైనర్లు తమ డిజైన్లను ప్రదర్శించారు. ఈ నెల 3వ తేదీ వరకు కొనసాగుతున్న స్పెషల్ ఫెస్టివ్ ఎడిషన్‌లో 70 స్టాల్స్‌లో 25 వేలకు పైగా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు ఉమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నమిత జైన్, కంచన్ అగర్వాల్, మంజు అగర్వాల్, కవితా జైన్, మమత గుప్తా, పాయల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రిజమ్ నవరాత్రి ఉత్సవ్



సాక్షి, సిటీబ్యూరో: ప్రిజం అవుట్‌డోర్స్, ఆల్వేస్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో హైటెక్‌సిటీలోని నోవోటెల్‌లో ప్రిజం నవరాత్రి ఉత్సవ్ వేడుకలను ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. నోవోటెల్ లాన్ వేదికగా సినీ నటుడు, బిగ్‌బాస్ ఫేమ్ సన్నీ ఈ 'ప్రిజం నవరాత్రి ఉత్సవ్ 2024' వేడులకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిజమ్ క్లబ్ వ్యవస్థాపకుడు ప్రణీత్‌గౌడ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని సంస్కృతి, సంప్రదాయాలతో నగరాన్ని ఆకట్టుకునేలా 'ప్రిజమ్ నవరాత్రి ఉత్సవ్' ఉండబోతుందన్నారు. సాయంత్రం 7 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో ఆహ్లాదకరమైన గార్బా సంగీతం, లైవ్ బ్యాండ్, డీజే, స్థానిక వంటకాలు, ఆశ్చర్యకరమైన బహుమతులతో ఈ 10 రోజుల పండుగ అందరికీ మరపురాని అనుభూతిని కలిగిస్తుందన్నారు.

సౌదిలోని ఎడారి నుంచి
క్షేమంగా ఇంటికి..

నగరానికి చేరుకున్న నిర్మల్ జిల్లావాసి నామ్‌దేవ్ రాథోడ్

- అక్కడే ఉంటే చనిపోయేవాడినంటూ ఆవేదన
- సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన కుటుంబం



కుటుంబసభ్యులతో నామ్‌దేవ్ రాథోడ్

శంషాబాద్: ఇటీవల వచ్చిన గోట్‌లైఫ్ సినిమాను ప్రతిబింబించేలా ఓ యథార్థ ఘటన వెలుగులోకి వచ్చింది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువి గ్రామవాసి నామ్‌దేవ్ రాథోడ్‌ను కువైట్‌లో హౌస్ కీపింగ్ పని కోసం ఏజెంటు తీసుకెళ్లాడు. ఆ దేశం బార్డర్ దాటించి సౌదిలోని ఎడారిలోకి తీసుకెళ్లి ఒంటెల కాపరిని చేశారు. దీనిపై నామ్‌దేవ్ రాథోడ్ తాను పడుతున్న ఇబ్బందులను తెలియజేస్తూ ఓ వీడియోను సీఎం రేవంత్‌రెడ్డికి పంపారు. వెంటనే తనను ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని మొర పెట్టుకున్నారు. అప్రమత్తమైన ప్రభుత్వం విదేశీ వ్యవహారాల శాఖతో సంప్రదించి కువైట్, సౌదిలో విదేశీ ఎంబీసీలను అప్రమత్తం చేశారు. వివిధ ప్రక్రియల అనంతరం ఎట్టకేలకు ఆయన మంగళవారం ఉదయం రియాద్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా నామ్‌దేవ్ రాథోడ్ మీడియాతో మాట్లాడారు. కువైట్‌లో నెల రోజులున్న తర్వాత తనను అక్రమంగా బార్డర్ దాటించి సౌదిలోని ఏడారికి తీసుకెళ్లారు. అక్కడ ఒంటెలను మేపడంతో పాటు వాటికి సంబంధించిన సేవలను చేయించుకున్నారు. తీవ్రమైన ఎండలో అనేక అవస్థలు పడ్డాను. యజమాని తీవ్ర చిత్రహింసలకు గురిచేశాడు. నేను తీసిన వీడియో నా భార్యకు పంపడంతో ఆమె వేరే వారికి పంపింది. కొద్ది రోజుల తర్వాత ఫోన్ కూడా లాగేసుకున్నారు. నా వీడియోకు స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి నన్ను ఇక్కడికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నాడు. సార్‌కు నా ధన్యవాదాలు.. అక్కడే ఉంటే చనిపోయేవాడిని.. నామ్‌దేవ్‌ను స్వదేశానికి తీసుకొచ్చే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించిందని కాంగ్రెస్ పార్టీ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి తెలిపారు.

విదేశీ విద్యకు ప్రయత్నించడం
అభినందనీయం

- విద్యార్థులకు అడ్మిషన్ లెటర్స్ అందించిన శృతిహాసన్



సాక్షి, సిటీబ్యూరో: లండన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ రోహామ్టన్ లో పీజీ, డిప్లొమా కోర్సులు చేయనున్న విద్యార్థులకు ప్రముఖ సినీ తార శృతిహాసన్ చేతులమీదుగా అడ్మిషన్ లెటర్స్ అందించారు. సోమాజిగూడ ది పార్క్ హోటల్ వేదికగా నిర్వహించిన వర్సిటీ ఆఫ్ రోహామ్టన్ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో సినీనటి శృతిహాసన్ సందడి చేశారు. ఈ సందర్భంగా విదేశాల్లో చదువుకోవాలి అనే లక్ష్యంతో ఉన్న విద్యార్థులను శృతి హాసన్ అభినందించారు. యూనివర్సిటీ ఆఫ్ రోహామ్టన్, సావరియ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సంయుక్తంగా యుజీ, పీజీ కోర్సులను అందిస్తున్నట్టు సావరీయ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నిర్వాహకులు రాజేష్ గోయెల్ తెలిపారు. పీజీ కోర్సులు చేయాలనుకున్న విద్యార్థులకు టోఫెల్, ఐఈఎల్టీఎస్ ఎంట్రన్స్ టెస్ట్ లేకుండా డిగ్రీ మార్కులతో అడ్మిషన్ పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో కేయల్ డిప్యూటీ వైస్ ఛాన్సలర్ రిచర్డ్, గిల్లామే రిచర్డ్, నీల్ హాడాక్, విధి మిస్త్రీ పాల్గొన్నారు.

నగరంలో నేడు

- గాంధీ జయంతి సందర్భంగా లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద పలువురు ప్రముఖులు నివాళులర్పించనున్నారు.
- శ్రీశృంగేరి జగద్గురు మహాసంస్థానం ఆధ్వర్యంలో ముషీరాబాద్ గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతాయి. తొలిరోజు అమ్మవారు జగత్ ప్రసూతిక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు.
- న్యూ మలక్‌పేట్ జడ్జి కాలనీలోని ఇండో–యుఎస్ హాస్పిటల్‌లో ఉదయం 11 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం జరుగుతుంది.
- సూత్ర ఆధ్వర్యంలో ఇండియన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

బధిరులకు వైద్య సేవలు మరింత సులభం

కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు



టెలిమెడిసిన్ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం పరిశీలిస్తున్న డాక్టర్ భాస్కర్‌రావు

రాంగోపాల్‌పేట్: కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెలిమెడిసిన్ సెంటర్‌తో బధిరులకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులకు మరింత సులభమవుతుందని కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. పీజీ రోడ్‌లోని పాత కిమ్స్–సన్‌షైన్ భవనంలో టెలి మెడిసిన్ కేంద్రాన్ని బొల్లినేని రాజ్యశ్రీతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బధిరులు గతంలో వారికి వచ్చే ఆరోగ్య సమస్యల గురించి వైద్యులకు చెప్పడం చాలా ఇబ్బందులు పడేవారని కనీసం అపాయింట్మెంట్లు ఖరారు చేసుకోవడం కష్టమయ్యేదని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు దేశంలోనే మొట్టమొదటి సారిగా డెఫ్ ఎనబుల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ అత్యాధునికి సేవలు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. ఈ టెలిమెడిసిన్ కేంద్రం ద్వారా ప్రత్యక్షంగా వైద్యులు, బధిరులకు మధ్య సర్టిఫైడ్ ఐఎస్ఎల్ ఇంటర్‌ప్రెటర్ల ద్వారా వర్చువల్ కమ్యూనికేషన్ ద్వారా ఇది సాధ్యమవుతుందన్నారు. దీని ద్వారా బధిరులు ఇంటివద్ద ఉండి కూడా చికిత్సను పొందవచ్చని చెప్పారు. ఈ కేంద్రం ద్వారా కమ్యూనికేషన్ అడ్డంకులు తొలగిపోవడంతో పాటు ఐఎస్ఎల్ ఇంటర్‌ప్రెటర్లకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో పాటు సమగ్ర సేవలు అందుతాయని అన్నారు. తమ ఫౌండేషన్ అత్యాధునిక కమ్యూనికేషన్ సాంకేతికతో పాటు రియల్ టైంలో చేతిసైగలను టెక్స్ రూపంలోకి మార్చగల అత్యాధునిక వ్యవస్థలను రూపొందించడంలో చురుగ్గా పరిశోధనలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో డెఫ్ ఎనబుల్డ్ ఫౌండేషన్ వ్యవస్థాప అధ్యక్షులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియాను సందర్శించిన వైద్యాధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల నగరవ్యాప్తంగా ప్రజలు జ్వరాలతో బాధపడుతున్న నేపథ్యంలో పలు ప్రభుత్వ ఆస్పత్రులను వైద్యశాఖ అధికారులు సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి తదితరులు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు, మందులపై ఆరా తీశారు. వారికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్, ఆర్ఎంవో డాక్టర్ జయకృష్ణ రోగులకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఆస్పత్రిలో నమోదైన ఫీవర్ కేసులు, ముఖ్యంగా డెంగీ కేసుల గురించి ప్రొఫెసర్ డాక్టర్ ప్రేమ్‌సాగర్ తెలిపారు.



మెట్రో రైల్ ఫేజ్–2 విస్తరణలో..
కుత్బుల్లాపూర్ ప్రాంతానికి ప్రాధాన్యం ఇవ్వాలి



మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

కుత్బుల్లాపూర్: మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) ఫేజ్–2లో కుత్బుల్లాపూర్‌కు మెట్రో సేవలను విస్తరించాలని కోరుతూ ఎమ్మెల్యే వివేకానంద్ మంకళవారం బేగంపేట్‌లోని హైదరాబాద్ మెట్రో రైల్ భవన్‌లో మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ఎంతోమంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరుస్తూ దేశంలోనే మూడవ అతిపెద్ద మెట్రో రైల్ సంస్థగా నిలిచిన హైదరాబాద్ మెట్రో రైల్‌ను విస్తరించాలని భావిస్తున్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మెట్రో రైల్ ఫేజ్–2 విస్తరణలో కుత్బుల్లాపూర్ ప్రాంతానికి ప్రాధాన్యత ఇవ్వాలని, కుత్బుల్లాపూర్, సుచిత్ర, కొంపల్లి ప్రాంతాలతో పాటు ఐడీపీఎల్, చింతల్, షాపూర్‌నగర్, జీడిమెట్ల, సూరారం, దుండిగల్ ప్రాంతాల నుంచి నిత్యం లక్షలాది మంది నగరంలోని పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణలో భాగంగా రూట్–1 గండి మైసమ్మ నుంచి సూరారం, జీడిమెట్ల, షాపూర్‌నగర్, చింతల్, బాలానగర్ చౌరస్తా మీదుగా భరత్‌నగర్ మెట్రో స్టేషన్ వరకు, అదేవిధంగా రూట్–2లో మేడ్చల్ నుంచి కొంపల్లి, సుచిత్ర, బోయిన్‌పల్లి మీదుగా సికింద్రాబాద్‌కు మెట్రో రైల్‌ను ఏర్పాటు చేస్తూ నూతన మెట్రో లైన్లను ఏర్పాటు చేయాలన్నారు. దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజుయాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్‌యాదవ్, జీహెచ్ఎంసీ డివిజన్ల అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో ప్రొఫెసర్ కోదండరామ్, జస్టిస్ నవీన్‌రావ్

సుల్తాన్‌బజార్: వయోవృద్ధులు, అంధుల అవసరాలను గుర్తించి వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో మంగళవారం కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు చొక్కారావు అధ్యక్షతన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ పానుగంటి నవీన్‌రావు, ఎమ్మెల్సీ కోదండరామ్ హాజరై ప్రసంగించారు. అంతకుముందు సంఘం ఆధ్వర్యంలో వారికి ఆత్మీయ సత్కారం చేశారు. కోదండరామ్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ప్రతి వర్గానికి తమదైన హక్కులు ఉంటాయన్నారు. ఆ హక్కులను గౌరవవించడం మన అందరి బాధ్యత అన్నారు. ఈ విషయం రాజ్యాంగం, చట్టాలు ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత మనుషులంతా సమానమేనని భావించే సంస్కృతి ఏర్పడిందన్నారు. ఈ సమానత్వ భావనలను కాపాడుకోవాల్సి అవసరం ఉందన్నారు. అంధులు అన్నిరంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం మరింత సదుపాయాలు కల్పించాలని, వారి సామర్థ్యాలను గుర్తించి వారికి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం బాధ్యతగా ఉండాలని కోదండరామ్ సూచించారు. జస్టిస్ నవిన్‌రావు మాట్లాడుతూ.. అంధులు, వృద్ధుల అభ్యున్నతికి చొక్కారావు చేస్తున్న కార్యక్రమాల పట్ల ఆయన అభినందనలు తెలిపారు. సాంఘికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని వారి అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు. జీవితాంతం తమ పిల్లల అభివృద్ధి కోసం కష్టపడిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పిల్లలు వారి సంరక్షణను విస్మరించడం బాధాకరమన్నారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్వేతా, సుధాకర్‌రావు, అనిత, సాయన్న, ప్రభాకర్, రామకృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్‌లో పెయిడ్ పార్కింగ్ అమలు వద్దు



మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎఫ్‌డీవై నాయకులు

మియాపూర్: మియాపూర్, నాగోల్ మెట్రో స్టేషన్లలో పెయిడ్ పార్కింగ్ అమలు విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎఫ్‌డీవై డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో భవన్ కార్యాలయంలో మెట్రో మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ రెడ్డికి ఏఐఎఫ్‌డీవై గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ డి.మధుసూదన్ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6 నుంచి మియాపూర్, నాగోల్ మెట్రో స్టేషన్లలో పెయిడ్ పార్కింగ్ విధానాన్ని తీసుకురావాలని ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో విభాగాలు చేసిన నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ రూపాల్లో ప్రయాణికులకు అందిస్తున్న స్కీములు పొడిగిస్తున్నామని చెబుతూనే మరో పక్క మెట్రో చార్జీలను పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. మెట్రో రవాణా చార్జీల భారాన్ని, వాహనాల పార్కింగ్ చార్జీల భారంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న పార్కింగ్ స్థలాల్లో వాహనాలకు భద్రత లేకపోవడం, సరైన సౌకర్యాలు కల్పించకపోవడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్న తరుణంలో ప్రయాణికుల నుంచి పార్కింగ్ చార్జీలు వసూలు చేయడానికి మెట్రో రైల్ సంస్థలు చేస్తున్న ప్రణాళికను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సభ్యులు దశరథ్ నాయక్, డి.శ్రీనివాసులు తదితరులున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ

- ప్రజాభవన్ వద్ద ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన
- సమస్యలను పరిష్కరిస్తామన్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు

లక్డీకాపూల్: రాష్ట్రంలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి నేరుగా ప్రభుత్వం జీతాలు చెల్లించాలంటూ తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ ప్రజాభవన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య నేతృత్వంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారిణి దివ్యను కలిసి సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ కమిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ నుంచి రాష్ట్ర స్థాయి వరకు పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1.50లక్షల మందికి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పిస్తూ హెల్త్ కార్డులను మంజూరు చేసి ఆయా కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. ముఖ్యంగా ఉద్యోగులను వేధిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఈ ఏజెన్సీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు అందించాలన్నారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చిన్నారెడ్డి భరోసా ఇచ్చారు. త్వరలో జేఏసీ కమిటీ ప్రతినిధులతో ముఖ్యమంత్రిని కలిసి సమస్యలను వివరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, ఉపాధ్యక్షులు దోయిపడి శ్రీధర్, వినోద్, విజయలక్ష్మి, కోశాధికారి సంతోష్ పాల్గొన్నారు.

మహిళల్లో వ్యవస్థాపకత పెంచే ప్లాట్‌ఫాంగా రాష్ట్రం

రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్



టీఐఈ విమెన్ రీజనల్ ఫైనల్స్‌లో పాల్గొన్న స్టార్టప్‌ల ప్రతినిధులు

గచ్చిబౌలి: నీతి ఆయోగ్ మహిళా వ్యవస్థాపకత ప్లాట్‌ఫారమ్ అధ్యాయాన్ని పొందిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ అన్నారు. గచ్చిబౌలిలోని జయభేరి ఎన్‌క్లేవ్‌లోని క్లబ్ బొటానికాలో టైఐఈ విమెన్ రీజనల్ ఫైనల్స్–2024 మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గుర్తింపుతో రాష్ట్రం ఎన్నో అవకాశాలను అందుకుంటుందన్నారు. ఈ ప్లాట్‌ఫారమ్ సహాయంతో ప్రతి సమస్యను పరిష్కరించవచ్చన్నారు. మద్దతు, సేవలను అందించడం ద్వారా మహిళల్లో వ్యవస్థాపకతను పెంపొందించడానికి ప్లాట్‌ఫారమ్ దోహదపడుతుందన్నారు. టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో నమోదైన 63 మిలియన్ల వ్యాపారాల్లో 21 శాతం వ్యాపారాలు మహిళల సొంతమని, వీటిలో ఒక శాతం వ్యాపారాలు 10 మంది కంటే ఎక్కువ మందికి ఉపాధి కల్పించాయని గుర్తు చేశారు. ఎక్కువ మంది మహిళలు స్టార్టప్‌లను నడిపితే 130 మిలియన్ల అదనపు ఉద్యోగాలు సృష్టించబడతాయన్నారు. దేశంలో 1800 వెంచర్ క్యాపిటలిస్టులు ఉన్నారని, వారిలో 14 శాతం మంది తమ బోర్డుల్లో కనీసం ఒక మహిళా ప్రతినిధిని కలిగి ఉన్నారన్నారు. టీఐఈ గ్లోబల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ వైస్ చైర్మన్ మురళీ బుక్కపట్నం, టీఐఈ హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీనివాస్ చందుపట్ల పాల్గొన్నారు.

విజేతగా క్రియుష్, రన్నరప్‌లుగా ఈజీలైఫ్, ఆస్టియోఫోర్జ్

ఈటీఐఈ విమెన్ రీజనల్ ఫైనల్స్–2024లో 142 మందిలో 10 మంది మహిళలతో కూడిన జట్లు షార్ట్‌లిస్ట్ చేసి ఫైనల్‌కు ఎంపిక చేశారు. విజేత, రన్నరప్‌లకు నగదు బహుమతులు అందించారు. విజేతగా క్రియుష్ నిలవగా, మొదటి రన్నరప్‌గా ఈజీలైఫ్, రెండో రన్నరప్‌గా ఆస్టియోఫోర్జ్ నిలిచింది. క్రియూష్ తరపున సంస్థ సీఈఓ డాక్టర్ నీతిక అశ్వని రూ.25వేల నగదు బహుమతి అందుకున్నారు. మొదటి రన్నరప్‌కు రూ.15వేలు, రెండో రన్నరప్‌కు రూ.10వేల నగదు పురస్కారాలను అందజేశారు. మొదటిస్థానంలో నిలిచిన క్రియుష్ స్టార్టప్ డిసెంబర్‌లో బెంగళూరులో జరగనున్న గ్లోబల్ పిచ్ పోటీల్లో పాల్గొంటుంది.

ఏ ఇంటినీ అక్రమంగా కూల్చరు..

టీపీసీసీ ప్రచార కార్యదర్శి మధుయాష్కిగౌడ్




మూసీ నిర్వాసితులతో మాట్లాడుతున్న మధుయాష్కిగౌడ్

చైతన్యపురి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఇంటినీ అక్రమంగా కూల్చదని, పిల్లాపాపలతో ప్రశాంతంగా నిద్రపోండి.. నాది గ్యారంటీ అని టీపీసీసీ ప్రచార కార్యదర్శి మధుయాష్కిగౌడ్ హామీ ఇచ్చారు. చైతన్యపురి, కొత్తపేట డివిజన్లలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. మీ ఇంటిపై ఒక్క గడ్డపార వేటు పడదని, అన్యాయంగా ఇళ్లు కూలగొడితే మీ సోదరుడు, న్యాయవాదిగా పైసా ఖర్చు భారం పడకుండా కోర్టులో న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అంటేనే పేదలకు ఇళ్లు ఇచ్చే ప్రభుత్వం అని, పేదల సంక్షేమమే ముఖ్యం అన్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా సమీప కాలనీల్లోని ఇళ్లు కూలగొడతారని, మార్కింగులు ఇచ్చారని ప్రజలు గందరగోళానికి గురికావాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. కాంగ్రెస్‌కు అధిష్టానం ఉందని, అన్యాయంగా ప్రజల ఇళ్లను కూలగొడితే జోక్యం చేసుకుంటుందన్నారు. అవసరమైతే తాను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వార్థం కోసం మూసీ సుందరీకరణ చేపట్టలేదని, మూసీలో ప్రవహించే మురుగు కంపు తొలగించి, మంచినీటిని ప్రవహించేలా చేసేందుకే అన్నారు. ఎల్‌బీనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, నాయకులు మూసీ పరివాహక ప్రాంతాలు, చెరువులు, కుంటలను కబ్జా చేసి అక్రమంగా సంపాదించారని, ఇప్పుడు ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. అక్రమార్కులను వదిలిపెట్టే పరిస్థితి లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, సీనియర్ నాయకులు ఎస్‌వీ కృష్ణప్రసాద్, లింగా కిషోర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, బుధవారం, 2, అక్టోబర్, 2024

మహాత్ముని జ్ఞాపకం.. మన భాగ్యనగరం..



నగరంలో మహాత్ముడి పాదముద్రలు	సభలు, సమావేశాలు, పర్యటనలు

గోల్డెన్ త్రెషోల్డ్‌లోనే బస, కర్బలామైదానంలో సభ

భాగ్యనగరంలో మహాత్ముడి పాదముద్రలు పదిలంగానే ఉన్నాయి. చెదరని జ్ఞాపకాలుగా నగరవాసుల హృదయాల్లో నిలిచిపోయాయి. పలు మార్లు గాంధీజీ సభలు, సమావేశాల్లో పాల్గొన్నారు. భాగ్యనగరవాసులను స్వాతంత్రోద్యమానికి కార్యోన్ముఖులను చేశారు. విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. హరిజనోద్ధరణకు పిలుపునిచ్చారు. దీనికి వేలాది మంది యువకిషోరాలు ఉద్యమబాటలో నడిచారు. స్వచ్ఛందంగా విరాళాలను అందజేశారు. దేశవ్యాప్తంగా ప్రజలను ఉత్తేజపరిచిన బాపూజీ ప్రసంగాలు హైదరాబాద్‌లోనూ చైతన్యాన్ని నింపాయి. గాంధీజీ జ్ఞాపకాల సమాహారమే ఈ ప్రత్యేక కథనం..

– సాక్షి, సిటీబ్యూరో

అది 1929, ఏప్రిల్ మొదటి వారం గాంధీజీ హైదరాబాద్‌కు వచ్చారు. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు నగరవాసులు పెద్ద ఎత్తున నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. గాంధీజీని దగ్గర నుంచి చూడాలనే కుతూహలం కొద్దీ చాలామంది అక్కడికి చేరుకున్నారు. నాటి జాతీయోద్యమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మొదలుకొని పిల్లలు, పెద్దలు, మహిళలు ఇలా అన్ని వర్గా



లకు చెందిన వారు తరలివచ్చారు. 'గాంధీజీకి జై'.. 'బోలో స్వంత్ర భారత్‌కీ జై..' భారత యూనియన్ వర్థిల్లాలి'.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ వేలాదిగా ఆయన వెంట నడిచారు. నిజాం నియంతృత్వంలో మగ్గుతున్న హైదరాబాద్ ప్రజల్లో గాంధీ రాక స్వరాజ్యకాంక్షను రగిలించింది. భారీగా తరలివచ్చిన జనసందోహంలోంచి బయటకొచ్చి అబిడ్స్‌లో ఉన్న సరోజినీనాయుడు, గోవిందరాజులు నాయుడు దంపతుల నివాసం 'గోల్డెన్ త్రెషోల్డ్'కు చేరుకోడానికి గంటకు పైగా సమయం పట్టింది. గాంధీ హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా అక్కడే బస చేసేవారు. రెండెకరాల సువిశాల స్థలంలో అద్భుత వాస్తు శిల్ప నైపుణ్యంతో పెద్ద పెద్ద చెట్లు, పచ్చిక బయళ్లు, ప్రశాంతమైన వాతావరణంతో ఆకట్టుకుంటుంది. గాంధీజీ విడిది చేసిన గదితో పాటు మరి కొన్ని గదులు ఉన్నాయి. సరోజినీనాయుడు తన 13వ ఏట ఆంగ్లంలో రాసిన సుదీర్ఘ కవిత 'గోల్డెన్ త్రెషోల్డ్'. అంటే బంగారు వాకిలి. వారి నివాస భవనానికీ అదే పేరు పెట్టారు. అనంతరం జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాల్లో ఆమె చురుగ్గా పాల్గొన్నారు. వివేకవర్ధిని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో, సర్వమత ప్రార్థనల్లోనూ పాల్గొన్నారు. ఆ సమయంలోనే గాంధీ అక్కడ ఒక మామిడి మొక్కను నాటారు.

జనసముద్రం కర్బలామైదానం..

అది 1934 మార్చి 9వ తేదీ. కర్బలా మైదానం జనసముద్రమైంది. సాయంత్రం 4 గంటలకు మహా సభ నిర్వహించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి భారీ ఊరేగింపుతో గాంధీజీ సభాప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికే హరిజనోద్ధరణపై దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న గాంధీ ఆ పర్యటనలో భాగంగానే సికింద్రాబాద్‌కు వచ్చారు. ఆయన రాకకోసం ఎదురు చూస్తున్న వేలాది మంది దేశభక్తులతో మైదానం నిండిపోయింది. ఆ సందర్భంగా గాంధీ హరిజన నిధి కోసం విరాళాలను సేకరించారు. గడియారాలు, బంగారం, వెండి ఆభరణాలు కూడా ఇచ్చేశారు. 'కులనిర్మూలన కోసం అందరూ ఒక్కటి కావాలని, హరిజనులంతా దేవుని బిడ్డలని' గాంధీ తన ప్రసంగంలో ప్రజలకు బోధించారు. ఆ సభలోనే ఒక పిల్లవాడు తాను వేసిన గాంధీ పెయింటింగ్‌ను అందజేశాడు. ఆ చిత్రాన్ని సైతం మహాత్ముడు వేలం వేశాడు. 17 రూపాయలొచ్చాయి. సరోజినీనాయుడు, మదన్‌మోహన్ మాలవ్య గాంధీతో పాటు ఆ సభలో పాల్గొన్నారు. సభ అనంతరం కారులో వెళ్లేటపుడు కుతూహలం కొద్దీ కొందరు పిల్లలు కారు ఫుట్‌బోర్డుపైకి ఎక్కారు, వారిని గాంధీజీ వారించారు. 'బచ్చే ఉత్రో ఉత్రో' అంటూ దిగి వెళ్లాలని కోరారు. క్విట్ ఇండియా ఉద్యమం నాటికి ప్రజల పోరాటాలు తారాస్థాయికి చేరుకొన్నాయి. సికింద్రాబాద్ అంతటా నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి. స్కూళ్లు, కాలేజీలు మూతపడ్డాయి. నిజాం ప్రభుత్వం ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేసింది. అయినా ఉద్యమం ఆగలేదు. మూడు రోజుల పాటు సికింద్రాబాద్ స్తంభించింది. ఆ తర్వాత కొద్ది రోజులకు లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ కూడా కర్బలా మైదానంలో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు.

బ్యూటిఫుల్ బోన్సాయ్

BONSAI

“బోన్సాయ్.. మరుగుజ్జు వృక్షాలు.. వామన వృక్షాలు.. పేరేదైనా ఇంటికి అలంకరణ తేవడంలో రారాజు మొక్కలు అని చెప్పొచ్చు. చిన్ని చిన్ని కుండీల్లో మహా వృక్షాలను తలపిస్తూ రాజసంతో నిలబడినట్టు ఉంటాయి. ఇంటికి అందం, ఆహ్లాదంతో పాటు హుందాతనం ఉట్టిపడేలా చేస్తాయనడంలో మరో సందేహం లేదు. అలాంటి బోన్సాయ్ మొక్కలను పెంచుకునేందుకు నగరంలో అనేక మంది ఉత్సాహం చూపిస్తున్నారు. బోన్సాయ్ మొక్కలు ఇంట్లో పెంచుకోవడం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది.”

– సాక్షి, సిటీబ్యూరో

- మరుగుజ్జు మొక్కలకు పెరుగుతున్న డిమాండ్
- ఇంటికి అందంతో పాటు హుందాతనం
- అపురూపంగా పెంచుకుంటున్న మహిళలు
- రకరకాల బోన్సాయ్‌లను విక్రయిస్తున్న నర్సరీలు
- పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న నిపుణులు





అంత ఈజీ కాదు గురూ..

బోన్సాయ్ మొక్కలను పెంచడం అంత సులవైన పనేం కాదు. చాలా జాగ్రత్తలు తీసుకుంటేనే వీటిని కొంతకాలం కాపాడుకోగలం.. ఏ ప్రదేశంలో ఉంచాలి.. నీళ్లు వారానికి ఎన్నిసార్లు పోయాలి.. ఏ రకమైన ఎరువులు వాడాలి.. ఇలా అనేక అంశాలపై అవగాహన తెచ్చుకోవాల్సి ఉంటుంది.



బోన్సాయ్ మొక్కలను కొందరు ఇష్టంగా పెంచుకుంటుండగా.. మరికొందరు మహిళలు వీటి పెంపకంపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు. విద్యావంతులైన మహిళలు, గృహిణులు ఇంట్లో ఈ మొక్కల పెంపకాన్ని వ్యాపకంగా చేసుకుంటున్నారు. వీటిని సంరక్షించుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. చాలా మంది వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకూ ఈ బోన్సాయ్ మొక్కలను కొనుగోలు చేస్తుంటారు. బోన్సాయ్ మొక్కలు ఇంట్లో పెంపుడు జంతువు లాంటివి. కాస్త అశ్రద్ధ చేసినా కూడా వాటిని మనం దూరం చేసుకోవాల్సి వస్తుంది. అందుకే అగ్రికల్చర్, హార్టీకల్చర్ సొసైటీలు బోన్సాయ్ మొక్కల పెంపకంపై నిపుణులతో అప్పుడప్పుడూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

బహుమతులుగా...

సాధారణంగా పెళ్లిళ్లు, ఫంక్షన్లు, రిటైర్‌మెంట్ ప్రోగ్రామ్స్‌కు వెళ్లినప్పుడు ఏదో ఒక గిఫ్ట్ లేదా పూల బొకేలు తీసుకెళ్తుంటాం. కానీ ఇటీవల కాలంలో బోన్సాయ్ మొక్కలను బహుమతులుగా అందజేస్తున్నారు. ఈ మొక్కలను గిఫ్ట్ అందుకున్న వారు కూడా చాలా జాగ్రత్తగా, అపురూపంగా పెంచుకుంటున్నారు. దీంతో నగరంలోని చాలా నర్సరీల్లో బోన్సాయ్ మొక్కలను భారీగా అమ్ముతున్నారు. ఇటీవల కాలంలో ఈ మొక్కలకు గిరాకీ పెరిగిపోయిందని నర్సరీ యజమానులు చెబుతున్నారు. రకాన్ని బట్టి కనీసం రూ.600 నుంచి బోన్సాయ్ మొక్కల ధర ప్రారంభం అవుతుందని పేర్కొంటున్నారు.







మట్టి ప్రధానం..

బోన్సాయ్ మొక్కల పెంపకం చాలా పెద్ద సబ్జెక్ట్. వీటి పెంపకానికి మట్టి, నీరు చాలా ప్రధానం. స్థానిక జాతి మొక్కలను బోన్సాయ్ మొక్కలుగా మలచడం కాస్త సులువు. కాకపోతే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. మా ఇంట్లో దాదాపు 10 రకాల బోన్సాయ్ మొక్కలు ఉన్నాయి. ఫైకస్ మొక్కలు పెంచడం చాలా సులువు. వర్మి కంపోస్టు వాడితే మంచిది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే మొక్కల పెంపకంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

– విష్ణు వందన, మొక్కల ప్రేమికురాలు

సూచనలివిగో..

- సాధారణంగా బోన్సాయ్ మొక్కలు ఇండోర్‌లో పెంచుతుంటారు. కొందరేమో బయట వాతావరణంలో కూడా పెంచుకుంటుంటారు. ఎండ నేరుగా మొక్కకు తగిలేలా ఉంచకూడదని నిపుణులు చెబుతున్నారు. ఇండోర్‌లో పెంచినా కూడా అప్పుడప్పుడూ వాటిని సూర్యరశ్మి తగిలే ప్రాంతంలో పెడితే మంచిది.
- నీటి విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు మొక్క చుట్టుపక్కల ఉన్న మట్టిని గమనిస్తుండాలి. కాస్త ఎండిపోయినట్టు అనిపించినా నీరు పోయాలి. ఎక్కువ నీరు పోసినా కూడా మొక్క వేర్లు కుళ్లిపోయే అవకాశం ఉంటుంది. పైగా మధ్యాహ్నం కాకుండా సాయంత్రం సమయంలోనే నీళ్లు పోయాలి.
- నీటిని ఎక్కువగా అందిస్తుండటం వల్ల మట్టిలోని ఎరువుల్లో ఉండే నత్రజని, పొటాషియం, పాస్ఫేట్ ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉంటుంది.
- సాధారణ సమయంలో 45 రోజులకు ఒకసారి ఎరువులు వాడితే వేసవిలో మాత్రం 20 రోజులకు ఒకసారి వాడటం మంచిది.
- బోన్సాయ్ మొక్కలకు తేమ అత్యంత కీలకం. తేమ విషయంలో చాలా కేర్‌ఫుల్‌గా ఉండాలి. చాలా రకాల బోన్సాయ్ మొక్కల జాతులకు 40 శాతం నుంచి 70 శాతం తేమ ఉండేలా చూసుకోవాలి. అంతకన్నా తక్కువగా ఉంటే ఆకులు ఎండిపోతాయి. మరీ ఎక్కువ తేమ ఉంటే మాత్రం వేర్లు కుళ్లిపోతాయి.
- బోన్సాయ్ మొక్కలను తరచూ వేరే వేరే కుండీలకు మారుస్తుండాలి. ఒకే రకమైన మట్టిలో ఎక్కువ కాలం ఉంటే పోషకాలు అందకుండా ఉండే ప్రమాదం ఉంది.
- తరచూ కుండీలు, మట్టి మారుస్తుంటే కొత్త రకం పోషకాలు మొక్కకు అందుతాయి.
- చిన్న మొక్కలను వేరొక చోటుకు తరలించడం సులభమే. కాకపోతే పెద్ద సైజు మొక్కలను తరలించడంలో ఇబ్బంది ఎదురవుతుంది. అందుకే గోనె సంచిని తడిపి బోన్సాయ్ వేర్లు ఉన్న మట్టిని కప్పి వేరే ప్రాంతానికి తరలిస్తే మొక్కకు ఎలాంటి నష్టం జరగదు.
- తరచూ బోన్సాయ్ మొక్కల పొడైన కొమ్మలను కట్ చేస్తుండాలి. ఏ కొమ్మ అయినా ఎక్కువగా పెరుగుతుంటే కట్ చేసి పెరుగుదలను నియంత్రిస్తుండాలి.

సంధ్యాలో డోలా రే డోలా

- అక్టోబర్ 3 నుంచి 12 వరకు
- ఎంట్రీ ఫీజు రోజుకు రూ.299

గచ్చిబౌలి: పది రోజుల పాటు డోలా రే డోలా పేరిట నవరాత్రి కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు ముప్పా ప్రాజెక్ట్స్ అసిస్టెంట వైస్‌ప్రెసిడెంట్ కెడటి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్ సెంటర్‌లో డోలా రే డోలా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంధ్యా కన్వెన్షన్, ముప్పా ప్రాజెక్ట్స్ సంయుక్తంగా నవరాత్రి కార్నివాల్ అక్టోబర్ 3 నుంచి 12 వరకూ సంధ్యా కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాండియా, గార్బా సంప్రదాయ నృత్యాలు, తెలంగాణ బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందులో స్థానిక వంటకాలను రుచి చూసేందుకు 20 ఫుడ్‌స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ముంబై నుంచి డీజేలు ప్లోజా చౌదరీ, కిమ్ ప్రతి రోజు ప్రదర్శనలు చేస్తారని చెప్పారు. గ్రాండ్ రావణ దహనం ఉంటుందన్నారు. దీనికి రోజుకు ఒక్కరికి రూ.299 చెల్లించాల్సి ఉంటుందని, 9010404040 లో సంప్రదిచాలని నిర్వాహకులు తెలిపారు. ముప్పా ప్రాజెక్ట్స్ సేల్స్, మార్కెటింగ్ హెడ్ కాకర్ల సతీష్, కుంకుమ ఈవెంట్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీకాంత్ నాథాని పాల్గొన్నారు.



ఆగమన్‌లో కొత్త పుంతలు..

ఆధ్యాత్మికతలో కొత్తదనానికి శ్రీకారం



ఘట్‌కేసర్‌లో అమ్మవారి ఆగమన్ సంబరాలు

ఘట్‌కేసర్: నేటి యువత సరికొత్త ఆధ్యాత్మికతకు శ్రీకారం చుడుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ట్రెండ్ మార్చుకోవడంలో ముందున్నారు. సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూనే పండుగ నిర్వహణలో కొత్త పుంతలు తొక్కుతున్నారు. గతంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో బుర్రకథలు, భజనలు, నాటికలు, పాతతరం కళాకారుల ప్రదర్శనలు ఉండేవి. అనంతరం ఆర్కెస్ట్రా, డీజేలు, డ్యాన్స్‌లు, బ్యాండ్ మేళాలు, సంగీత వాయిద్యాలు వంటివి కన్నుల పండువగా నిర్వహించేవారు. నిమజ్జనమే కాకుండా ఆగమన్‌లోనూ ఎంజాయ్ చేస్తున్నారు. వినాయక విగ్రహాలు, అమ్మవారి ఘటాలు తీసుకొచ్చే సమయంలో స్వాగతం పలకడంలోనూ కొత్తదనాన్ని పరిచయం చెస్తున్నారు. మహరాష్ట్రలో ప్రారంభమైన ఆగమన్ నేడు రాష్ట్రాలు దాటి నగరానికీ, పట్టణాలకూ చేరుకుంది. ఘట్‌కేసర్ పట్టణంలో శ్రీ భవానీ నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఆగమన్ వైభవంగా జరిగింది. 60 మంది పూణే కళాకారుల బ్యాండ్ ప్రదర్శన, భాణాసంచ వెలుగులు, రంగు రంగుల లైట్ల మధ్య అమ్మవారి ఊరేగింపు చూపరులను ఆకట్టుకుంది.

అమెజాన్ సూపర్ వేల్యూ డేస్

సాక్షి,సిటీబ్యూరో: ఆన్‌లైన్ విపణి అమెజాన్ ఫ్రెష్.. పండుగల సీజన్‌ను పురస్కరించుకుని సూపర్ వేల్యూ డేస్‌ను మంగళవారం ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. తాజా పండ్లు, కూరగాయలు, స్నాక్స్, పానీయాలు, నిత్యావసరాలు సహా పలు ఉత్పత్తులపై కస్టమర్లు 50% పైనే రాయితీలను అందుకోవచ్చన్నారు. ఈ సూపర్ వేల్యూ డేస్ ఈ నెల 7 వరకూ కొనసాగుతుందన్నారు.

శాఖాహారంపై పెటా అవగాహన

పెటా ఇండియా ఆధ్వర్యంలో వినూత్న ప్రచారం



బంజారాహిల్స్: 'మాంసాహారం అంటే ప్రాణం ఉన్న జీవులను హత్య చేసి రక్త మాంసాలను తిన్నట్లే..' మనుషులకు ఏ విధంగా అయితే గాయం ఏర్పడితే బాధ కలుగుతుందో అదే విధంగా మన ఆహారం కోసం బలయ్యే జీవులూ బాధ అనుభవిస్తాయి.. ప్రజలు శాఖాహారం వైపు మారలాలంటూ 'పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్మెంట్ ఆఫ్ ఆనిమల్ (పెటా) సంస్థ ప్రతినిధులు బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద మంగళవారం వినూత్న రీతిలో అవగాహన కల్పించారు. ప్రపంచ శాఖాహార అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఉత్కర్ష్ గార్గ్, పెటా ఇండియా బందం సభ్యురాలు భావన పేర్కొన్నారు.



ప్రతినెలా అవగాహన..

రోడ్డు పక్కన ఎవరైనా రక్త మోడుతున్న శరీరంతో పడి ఉంటే మనందరం ఎంతో ఆవేదన వ్యక్తం చేస్తుంటాం.. అనేక రకాల భావోద్వేగాలకు లోనవుతాం.. అయితే మన ఆహారం కోసం జంతువులను నిర్దాక్షిణ్యంగా చంపడం వల్ల వాటికి ఎంత బాధ కలుగుతుందో గుర్తించము. అందుకే అందరూ శాఖాహారం వైపు మరలేలా హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ప్రతినెలా వినూత్న రీతిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం.

– ఉత్కర్ష్ గార్గ్, ప్రోగ్రాం కో– ఆర్డినేటర్, పెటా ఇండియా

రెండున్నర ఏళ్లుగా శాఖాహారమే..



రెండున్నర ఏళ్ల క్రితం శాఖాహారిగా మారాను. అప్పటి నుంచి మాంసం కానీ జంతువుల ద్వారా వచ్చే పాల ఉత్పత్తులను కానీ వాడడం మానేశాను. మన ఆహారపు అలవాట్ల వల్ల మూగజీవాలను హింసకు గురి చేస్తున్నాము. అందుకే వేగన్‌గా మారిన మేము మాంసాహారంతో పాటు పాలను కూడా ఆహారంగా ఉపయోగించడం లేదు.

– భావన, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

శాఖాహారం శ్రేయస్కరం..

మనిషి జీవించడానికి ఆహారం కావాలి. జీవించడానికి అవసరమైన ఆహారం ఎలా ఉండాలనే విషయం మనిషి నిర్ణయించుకుంటున్నాడు. అందుకే ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రకృతికి హాని చేయకుండా శాఖాహారాన్నే తినేలా ప్రోత్సహించాలనేదే మా లక్ష్యం..

– సూరజ్ సీతారామ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

క్లుప్తంగా...

600 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి



సాక్షి, హైదరాబాద్: ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టరేట్ పరిధిలో ఖాళీగా ఉన్న 600 పోస్టులు భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఈ పోస్టులను నింపేందుకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు అనుమతి ఇస్తూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇవీ పోస్టుల వివరాలు

పోస్టు	సంఖ్య
సివిల్ అసిస్టెంట్ సర్జన్	124
డెంటల్ అసిస్టెంట్ సర్జన్	7
స్టాఫ్ నర్స్	272
ఫార్మసిస్ట్ గ్రేడ్–2	99
ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్- 2	34
ఏఎన్ఎం	54
రేడియోగ్రాఫర్	5
డెంటల్ హైజినిస్ట్	1
ఆడోమెట్రిక్ టెక్నీషియన్	1
డెంటల్ టెక్నీషియన్	3

బయో ఏషియా లోగో ఆవిష్కరణ

ఫిబ్రవరి 25, 26 తేదీల్లో బయో ఏషియా సదస్సు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్న బయో ఏషియా–2025 సదస్సు లోగోను ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఫిబ్రవరి 25, 26 తేదీల్లో హైటెక్స్‌లో జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సులో 50 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. లైఫ్ సైన్సెస్, ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్య సాంకేతిక రంగాల్లో వస్తున్న పరిణామాలను పునర్నిర్వచించే విధానాలపై చర్చలు జరుగుతాయి. గ్లోబల్ హెల్త్‌కేర్ రంగంలో నూతన ఆవిష్కరణల ద్వారా తెలంగాణ కీలకపాత్ర పోషిస్తుందని శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. బయోఫార్మాస్యూటికల్స్, డిజిటల్ హెల్త్, మెడికల్ డివైసెస్, అడ్వాన్స్‌డ్ థెరప్యూటిక్స్ వంటి టెక్నాలజీలపై అర్థవంతమైన చర్చలు జరుగుతాయి. కృత్రిమ మేధ, డేటా అనలిటిక్స్, ప్రెసిషన్ మెడిసిన్ వంటి ఆధునిక పరిజ్ఞానాల ద్వారా వస్తున్న అవకాశాలను రాష్ట్రం ఏవిధంగా అందిపుచ్చుకోవచ్చో నిపుణులు సూచిస్తారని ఆయన వివరించారు. కార్యక్రమంలో బయోసైన్సెస్, ఫార్మా డైరెక్టర్ శక్తి నాగప్పన్, ఐటీ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు 20 శాతం వేతన సవరణ

2026–27 నుంచి వర్తింపు

ఈఆర్సీకి డిస్కంల వివరణ

సాక్షి,హైదరాబాద్: రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులకు 2026–27 ఆర్థిక సంవత్సరం నుంచి 20% కొత్త వేతన సవరణ అమలు చేసే అవకాశముందని దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్/టీజీఎన్పీడీసీఎల్)లు వెల్లడించాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి ఇటీవల సమర్పించిన తమ వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్) 2024–25లో ఉద్యోగుల వేతన సవరణపై ఈ మేరకు సమాచారమిచ్చాయి. ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్ల ఖర్చు ఏడాదికేడాది 7% పెరుగుతుండటంపై ఈఆర్సీ వివరణ కోరగా, తమ వేతన సవరణ ప్రణాళికలను డిస్కంలు తెలియజేశాయి. డీఏలు, ఇంక్రిమెంట్లు కలిపి ఏటా ఈ మేరకు జీతభత్యాల వ్యయం పెరుగుతోందని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

21 వేల మంది విద్యార్థినులకు మలబార్ గ్రూప్ ఉపకార వేతనాలు



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ వజ్ర స్వర్ణాభరణాల తయారీ విక్రయ సంస్థ మలబార్ గ్రూప్ దేశవ్యాప్తంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద 21 వేలమంది విద్యార్థినులకు 2024 ఏడాదికి గాను రూ.16కోట్ల ఉపకారవేతనాలను ప్రకటించింది. ఇటీవల ముంబైలోని భారత్ డైమండ్ బౌర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమానికి కేంద్రమంత్రి పీయూష్ గోయెల్, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్, మలబార్ గ్రూప్ ఎండీ (భారత్) ఆషర్ ఓ, సంస్థ వైస్ చైర్మన్ అబ్దుల్ సలామ్ కేపీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చగలిగే చోదక శక్తి కేవలం విద్య మాత్రమేనన్నారు. విద్యలో బాలికలు ప్రతిభ కనబరుస్తూ ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు ఆగిపోకుండా ఉండేందుకు కొంతైనా సాయపడాలనే ఈ ఉపకారవేతనాలను ప్రకటించామని చెప్పారు. బాలికలు చదువులో రాణించడం ద్వారా మహిళా సాధికారతను సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు.

'పీఎం ఈ-డ్రైవ్' కింద 2,500 బస్సులు

- కేంద్రానికి ఆర్టీసీ ప్రతిపాదన
- మంగళవారమే ప్రారంభమైన కొత్త పథకం
- హైదరాబాద్‌లో మొత్తం ఈ-బస్సులు నడపాలన్న ఆలోచనకు వీలుగా ముందడుగు



సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రిక్ బస్సులను పెద్ద మొత్తంలో సమకూర్చుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది. పీఎం ఈ-డ్రైవ్ పథకంలో హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంది. నరేంద్రమోదీ తొలి దఫా ప్రభుత్వం అమలు చేసిన 'ది ఫాస్టర్ అడాప్షన్ అండ్ మ్యాన్యుఫాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఫేమ్) పథకంలో భాగంగా తెలంగాణ తొలిసారి ఎలక్ట్రిక్ బస్సులను పొందింది. వాటిని విమానాశ్రయానికి నడుపుతున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత ఫేమ్–2లో కూడా కొన్ని ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకుంది. వాటిని దూర ప్రాంతాలతోపాటు హైదరాబాద్‌లో సిటీ బస్సులుగా తిప్పుతోంది. ఈ రెండు పథకాలను నిలిపేసిన కేంద్రం పీఎం ఈ-డ్రైవ్ పేరుతో కొత్త పథకాన్ని మంగళవారం ప్రారంభించింది. దీని మార్గదర్శకాలు వెల్లడి కావటంతోనే, టీజీఎస్ ఆర్టీసీ ఈ పథకానికి ప్రతిపాదనలు పంపింది. ఈ పథకం అక్టోబర్ 1 నుంచి 2026 మార్చి వరకు కొనసాగుతుందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ వెల్లడించింది. ఈ పథకాన్ని ఆ శాఖ ద్వారానే కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతోంది. ఈ పథకానికి రూ.10,900 కోట్లు కేటాయించింది. ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు, ఈ-రిక్షా/ఈ-కార్టులు, ఎలక్ట్రిక్ అంబులెన్సులు, ఈ-ట్రక్కులు, ఎలక్ట్రిక్ బస్సులు, ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు, టెస్టింగ్ ఏజెన్సీల బలోపేతానికి ఈ నిధులు వినియోగిస్తారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 40 లక్షల జనాభా దాటిన నగరాలకు ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలని నిర్ణయించారు. మొత్తంగా 14,028 బస్సులు సమకూర్చడానికి రూ.4391 కోట్లు కేటాయించారు. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలను రెండు రోజుల క్రితమే వెల్లడిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ వెంటనే తెలంగాణ ఆర్టీసీ హైదరాబాద్ నగరానికి 2,500 బస్సులు కేటాయించాలని ప్రతిపాదిస్తూ దరఖాస్తు చేసింది.

వీలైనన్ని ఎక్కువ బస్సులు వచ్చేలా..

హైదరాబాద్‌లో వాహన కాలుష్యం తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇక్కడ డీజిల్ బస్సులను నడపొద్దని ప్రభుత్వం ఆర్టీసీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఉన్న బస్సులను తొలగించి వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకోవాలని పేర్కొంది. ప్రస్తుతం ఒక్కో ఎలక్ట్రిక్ బస్సు ధర రూ.1.85 కోట్ల వరకు ఉంది. అంత ఖర్చు భరించే పరిస్థితి లేనందున, గ్రాస్ కాస్ట్ మోడల్ పద్ధతిలో అద్దెకు తీసుకోవాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం కొత్త పథకం ద్వారా హైదరాబాద్‌కు ఎన్ని బస్సులు మంజూరు చేస్తుందో తేలిన తర్వాత, అన్ని బస్సులు జీసీసీ పద్ధతిలో నిర్వహించేందుకు వీలుగా టెండర్లు పిలవనుంది. ఒక్కో కిలోమీటరుకు తక్కువ అద్దెను ప్రతిపాదించే సంస్థను ఎంపిక చేస్తుంది. ఆ కంపెనీ అన్ని బస్సులను ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన నిర్వహించాల్సి ఉంటుంది.

ఒక్కో బస్సుకు రూ.30 లక్షల రాయితీ..

పీఎం ఈ-డ్రైవ్‌లో భాగంగా ఒక్కో బస్సు కొనుగోలుపై కేంద్రం రూ.30 లక్షల వరకు సబ్సిడీ ఇస్తుంది. గతంలో ఫేమ్–1లో ఆ మొత్తం రూ.50 లక్షలుండేది. గతంతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల తయారీ కొంత సులభతరం కావటం, బ్యాటరీ ధరలు తగ్గటం, ఇప్పుడు మన దేశంలో కూడా బ్యాటరీలను తయారు చేస్తున్నందున సబ్సిడీ మొత్తాన్ని కేంద్రం తగ్గించినట్టు సమాచారం. సబ్సిడీ అమలు చేస్తున్నందున బస్సులు సమకూర్చేందుకు తయారీ సంస్థలు పోటీ పడతాయని భావిస్తున్నారు.

కొత్తగా పది డిపోల ఏర్పాటు..

ఈ బస్సులకు ప్రస్తుతమున్న డిపోలు సరిపోవని ఆర్టీసీ భావిస్తోంది. వాటి చార్జింగ్ వ్యవస్థ ఏర్పాటుకు చాలా స్థలం అవసరమవుతున్నందున కొత్తగా పది డిపోలను ఏర్పాటు చేయనున్నారు.

3.16 లక్షల ర్యాంకుకూ ఎంబీబీఎస్ కన్వీనర్ సీటు

ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో బీసీ ఏ కేటగిరీలో కేటాయింపు

- మొదటి జాబితా విడుదల చేసిన కాళోజీ వర్సిటీ
- జనరల్ కేటగిరీలో 1.65 లక్షల ర్యాంకుకు సీటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా నీట్‌లో ఎక్కువ ర్యాంకు వచ్చిన విద్యార్థికి ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాలో సీటు లభించింది. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా మొదటి విడత జాబితాను కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం వెల్లడించింది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఉన్న కన్వీనర్ సీట్లలో దాదాపు 4,760 సీట్లను విద్యార్థులకు కేటాయిస్తూ జాబితా విడుదల చేసింది. ఏ కాలేజీలో ఏ ర్యాంకుకు ఎవరికి సీట్లు వచ్చాయో విద్యార్థులకు సమాచారం పంపించింది. గతేడాది అత్యధికంగా నీట్‌లో 2.38 లక్షల ర్యాంకు వచ్చిన ఒక ఎస్సీ విద్యార్థికి ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో సీటు లభించగా.. ఈసారి బీసీ ఏ కేటగిరీలోనే 3,16,657 ర్యాంకర్‌కు సీటు లభించడం విశేషం. గత ఏడాది మొదటి విడతలో 1.31 లక్షల ర్యాంకుకు జనరల్ కేటగిరీలో సీటు వచ్చింది. ఈసారి మొదటి విడతలో 1.65 లక్షల ర్యాంకర్‌కు సీటు లభించింది. బీసీ బీ కేటగిరీలో గతేడాది మొదటి విడతలో 1.40 లక్షల ర్యాంకర్‌కు సీటు రాగా, ఈసారి 1.94 లక్షల ర్యాంకర్‌కు సీటు లభించింది. అలాగే గతేడాది బీసీ డీ కేటగిరీలో 1.35 లక్షల ర్యాంకర్‌కు సీటు రాగా, ఈసారి 1.80 లక్షల ర్యాంకర్‌కు వచ్చింది. కన్వీనర్ కోటా సీట్లకు ఇంకా మూడు నుంచి నాలుగు విడతల కౌన్సెలింగ్ జరగనుంది. బీసీ ఈ కేటగిరీలో ప్రస్తుతం 2.03 లక్షల ర్యాంకుకు సీటు లభించింది. ఎస్సీ కేటగిరీలో 2.90 లక్షల ర్యాంకుకు, ఎస్టీ కేటగిరీలో 2.87 లక్షల ర్యాంకుకు సీటు లభించడం గమనార్హం. నిజామాబాద్ మెడికల్ కాలేజీలో దివ్యాంగ రిజర్వేషన్ కింద 13.41 లక్షల ర్యాంకుకు సీటు లభించింది. ఇలావుండగా జాతీయ స్థాయిలో 8 లక్షల నుంచి 9 లక్షల వరకు ర్యాంకులు వచ్చిన వారికి కూడా మన దగ్గర ప్రైవేటు కాలేజీల్లో బీ కేటగిరీలో ఎంబీబీఎస్ సీటు వస్తుందని అంటున్నారు.

ప్రాథమిక సమాచారం ప్రకారం మొదటి రౌండ్‌లో కటాఫ్ మార్కులు

కేటగిరీ	కటాఫ్ మార్కులు
ఓపెన్	528
బీసీ ఏ	430
బీసీ బీ	507
బీసీ సీ	444
బీసీ డీ	520
బీసీ ఈ	501
ఎస్సీ	445
ఎస్టీ	447

పెరిగిన సీట్లతో విస్తృత అవకాశాలు

రాష్ట్రంలో వైద్య విద్య అవకాశాలు భారీగా పెరిగాయి. గతేడాది కంటే ఈసారి ప్రభుత్వ కాలేజీలు పెరిగాయి. అలాగే కొన్ని ప్రైవేట్ కాలేజీల్లోనూ సీట్లు పెరిగాయి. దీంతో అధిక ర్యాంకర్లకు కూడా కన్వీనర్ కోటాలో సీట్లు లభిస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 64 ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో మల్లారెడ్డికి చెందిన రెండు, నీలిమ మెడికల్ కాలేజీలు డీమ్డ్ వర్సిటీలయ్యాయి. వీటితో పాటు ఎయిమ్స్ మెడికల్ కాలేజీని మినహాయించి 60 మెడికల్ కాలేజీల్లోని సీట్లకు ఇప్పుడు కన్వీనర్ కోటా కింద సీట్ల కేటాయింపు జరిపారు. 2024–25 వైద్య విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో కొత్తగా 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా అదనంగా 400 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వంలోని అన్ని సీట్లను, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లల్లో 15 శాతం అఖిల భారత కోటా కింద భర్తీ చేస్తారు. వాటిల్లో రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత సీట్లు మిగిలితే తిరిగి వాటిని రాష్ట్రానికే ఇస్తారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల్లో ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.

కొన్ని ముఖ్యమైన మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో మొదటి జాబితాలో వివిధ కేటగిరీల్లో ఎంత ర్యాంకుకు సీటు వచ్చిందనే వివరాలు

కాలేజీ	ఓసీ	ఈడబ్ల్యూఎస్	బీసీ ఏ	బీసీ బీ	బీసీ సీ	బీసీ డీ	ఎస్సీ	ఎస్టీ
ఉస్మానియా, హైదరాబాద్	20,132	20,237	80,025	29,353	32,168	41,057	1,05,794	1,11,846
గాంధీ, హైదరాబాద్	11,299	36,291	43,324	21,775	26,662	19,633	77,168	98,866
రిమ్స్, ఆదిలాబాద్	55,752	92,208	1,59,642	72,921	57,751	78,377	1,69,736	1,69,701
నిజామాబాద్	37,347	69,472	1,32,252	48,370	1,15,859	63,468	1,48,564	1,48,832
కాకతీయ, వరంగల్	29,590	63,489	1,16,834	41,727	1,11,755	56,982	1,33,375	1,35,770
అపోలో, హైదరాబాద్	35,677	-	1,49,969	47,319	79,448	62,418	1,82,979	1,88,862

పేద, ధనిక తేడా లేదు

- తెలంగాణలోని ప్రతి కుటుంబానికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు
- దసరాలోగా లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు
- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ పేద, ధనిక అనే తేడా లేకుండా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు అందిస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రతి కుటుంబానికీ ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించి యునిక్ నంబర్‌తో స్మార్ట్ కార్డ్ ఇవ్వడమే ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఉద్దేశమని చెప్పారు. 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ప్రతి నియోజకవర్గం నుంచి రెండేసి ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న కుటుంబాల వివరాల నమోదులో పొరపాట్లకు తావివ్వరాదని.. ఈ విషయంలో కలెక్టర్లు శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పలువురు ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం సచివాలయం నుంచి మంత్రి పొంగులేటి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులతోపాటు పట్టణాభివృద్ధి సంస్థలు, ఎల్ఆర్ఎస్, డబుల్ బెడ్రూం ఇళ్లు, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై సమీక్షించారు.

యుద్ధప్రాతిపదికన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం..

భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కారం కోసం లక్షలాది మంది ప్రజలు నాలుగేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారని, అందువల్ల యుద్ధప్రాతిపదికన ఈ దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను మంత్రి పొంగులేటి ఆదేశించారు. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఈ ప్రక్రియ ముందుకు సాగట్లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణాభివృద్ధి సంస్థల పరిధి పెంపుతోపాటు కొత్త యూడీఏల ఏర్పాటు ప్రతిపాదనలను తక్షణమే పంపాలన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు కోసం కమిటీలు

గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్లను అరకొరగా నిర్మించారని మంత్రి పొంగులేటి విమర్శించారు. అయితే ఇప్పటికే పూర్తయిన ఇళ్ల కేటాయింపు కోసం లబ్ధిదారులను ఎంపిక చేసి దసరాలోగా అప్పగించాలని ఆదేశించారు. ఇందుకోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా, జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా కొందరు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసినందున ప్రభుత్వ పాఠశాలలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాధాన్యత ఇచ్చి మరమ్మతులు చేపట్టాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి

సన్న, దొడ్డు ధాన్యానికి వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు

ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 35 సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇచ్చే కార్యక్రమాన్ని ఈ ఖరీఫ్ సీజన్ నుంచి అమలు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. ఈసారి ధాన్యం కొనుగోళ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 7,144 కేంద్రాలను ఏర్పాటు చేయాలని.. సన్న, దొడ్డు రకాల ధాన్యానికి వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం వస్తుందన్న అంచనాతో ఏర్పాట్లు చేయాలని.. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు సమస్యలు తలెత్తకుండా కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించారు.

తప్పుడు ప్రశ్నలు తొలగించాలి

'గ్రూప్–1' పిటిషన్‌లో పిటిషనర్ల వాదనలు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితా ప్రకటించేలా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ను ఆదేశించాలని హైకోర్టును పలువురు పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. మొత్తం 7 ప్రశ్నలు తొలగించాలని కోరారు. 2011లో నిర్వహించిన గ్రూప్–1లో ఇలాగే తప్పుడు ప్రశ్నలు ఇస్తే వాటిని తొలగించాలని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేశారు. పిటిషనర్ల తరఫున వాదనలు ముగియడంతో కమిషన్ వాదనల కోసం తదుపరి విచారణను న్యాయస్థానం రేపటికి వాయిదా వేసింది. అంతకుముందు ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్ మంగళవారం విచారణ చేపట్టగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది శివ వాదనలు వినిపించారు. టీఎస్‌పీఎస్సీ పారదర్శకత, నిష్పాక్షితను ఉల్లంఘించిందని.. అక్టోబర్ 21 నుంచి మెయిన్స్ ఉన్న నేపథ్యంలో వీలైనంత త్వరగా కోర్టు నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం పిటిషనర్ల తరఫున మరో న్యాయవాది సుధీర్ వాదనలు వినిపించారు.

వేధిస్తే మిల్లింగ్ చేయలేం

కొత్త నిబంధనల పేరుతో

- క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల సన్న బియ్యం కష్టమే
- టెస్ట్ మిల్లింగ్ చేసి సరైన లెక్కలు నిర్ధారించాలి
- పౌరసరఫరాల కమిషనర్ సమావేశంలో మిల్లర్ల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కొత్త నిబంధనల పేరుతో వేధిస్తే మిల్లింగ్ చేయలేమని మిల్లర్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్‌కు తేల్చి చెప్పారు. ఈ నెలలో ప్రారంభం కానున్న 2024–25 ఖరీఫ్ ధాన్యం సేకరణ నేపథ్యంలో మంగళవారం పౌరసరఫరాల భవన్‌లో రైస్‌మిల్లర్ల ప్రతినిధులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మిల్లర్లు ఖరీఫ్ సీజన్ సీఎంఆర్‌కు సంబంధించి పలు డిమాండ్లను డీఎస్ చౌహాన్ ముందుంచారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొత్త మార్గదర్శకాల ముసాయిదాలో మిల్లర్లపై విధించిన ఆంక్షలతో సీఎంఆర్ చేయలేమని స్పష్టం చేశారు. మిల్లులకు కేటాయించే ధాన్యానికి 25 శాతం బ్యాంక్ గ్యారంటీ , 75 శాతం ఆస్తుల తనఖా తరహా ఆంక్షలు విధించాలని నిర్ణయించడంపై అభ్యంతరం తెలిపారు. 75 రోజుల్లో సీఎంఆర్ ఇవ్వడం కుదరదని, రాష్ట్రంలో ఉన్న మిల్లుల కెపాసిటీ, మిల్లింగ్ కోసం వచ్చే ధాన్యం పరిణామం మధ్య చాలా తేడా ఉందన్నారు.

ఆ నిబంధనలు సవరించాలి

క్వింటాల్ సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 67 కిలోల బియ్యం రాదని మిల్లర్లు కమిషనర్‌కు వివరించారు. సన్న బియ్యం క్వింటాల్ ధాన్యానికి 54 నుంచి 60 శాతమే వస్తుందని తెలిపారు. జిల్లాల వారీగా టెస్ట్ మిల్లింగ్ చేసి క్వింటాల్‌కు ఎంత ఇవ్వాలో నిర్ణయించాలని కోరారు. ఈ నేపథ్యంలో 14 శాతం తేమ ఉండేలా నిబంధనలు సవరించాలని కోరారు. గన్నీ బ్యాగుల ధర రూ.18 వరకు ఉందని, దీనిని రూ.9 నుంచి రూ.12 వరకు ప్రకటించాలన్నారు. గతంలో మిల్లింగ్ లాస్ భరిస్తామని చెప్పి అమలు చేయలేదని, ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరారు. సెప్టెంబర్ నెలాఖరుతో 2023–24 ఖరీఫ్, రబీ సీఎంఆర్ గడువు ముగిసిందని, దానిని పెంచాలని కోరారు. మిల్లర్ల డిమాండ్లపై కమిషనర్ డీఎస్.చౌహాన్ స్పందిస్తూ వచ్చే వారం రోజుల్లో ప్రభుత్వ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. తదనుగుణంగా ప్రభుత్వ నిర్ణయం ప్రకటిస్తుందని స్పష్టం చేశారు.

అడిగింది రూ.10,320 కోట్లు.. ఇచ్చింది 416 కోట్లే

- రాష్ట్రానికి నామమాత్రంగా వరద సాయం నిధులు విడుదల చేసిన కేంద్రం
- బీజేపీపాలిత రాష్ట్రాలకు భారీ సాయం.. విపక్షాలపాలిత రాష్ట్రాలకు రిక్తహస్తం
- మొత్తంగా రూ. 5,858.6 కోట్ల ఎన్డీఆర్ఎఫ్ నిధులు విడుదల చేసిన కేంద్ర హోంశాఖ



సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో ఇటీవలి భారీ వర్షాలు, వరదల వల్ల రూ. 10,320.72 కోట్ల భారీ నష్టం జరగ్గా కేంద్రం మాత్రం జాతీయ విపత్తుల సహాయ నిధి (ఎన్డీఆర్ఎఫ్) నుంచి కేవలం రూ. 416.8 కోట్ల అత్తెసరు నిధులనే విడుదల చేసింది. కేంద్రం కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర చరిత్రలో ఈ స్థాయిలో భీకర వరదలు ఎన్నడూ రాలేదని, తగిన రీతిలో నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా కేంద్రం నామమాత్రంగా నిధుల కేటాయింపులు జరిపిందని విమర్శిస్తున్నాయి. ఇటీవల వరదల బారిన పడిన 14 రాష్ట్రాలకు సంబంధించిన రాష్ట్ర విపత్తుల సహాయ నిధి (ఎస్డీఆర్ఎఫ్)లో కేంద్రం వాటా కింద మొత్తం రూ. 5,858.6 కోట్లను ఎన్డీఆర్ఎఫ్ నుంచి కేంద్ర హోంశాఖ మంగళవారం విడుదల చేసింది. బీజేపీ, ఎన్డీయేపాలిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఏపీ, అస్సాం, బిహార్, గుజరాత్‌కు అధిక నిధులు అందించింది. విపక్షాల పాలనలో ఉన్న తెలంగాణ, కేరళ, హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాలకు కేంద్రం మొండిచేయి చూపిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రాలవారీగా కేంద్రం విడుదల చేసిన ఎన్డీఆర్ఎఫ్ నిధులు..

రాష్ట్రం	నిధులు (రూ. కోట్లలో)
మహారాష్ట్ర	1,492
ఏపీ	1036
అస్సాం	716
బిహార్	655.60
గుజరాత్	600
త్రిపుర	468
పశ్చిమ బెంగాల్	468
తెలంగాణ	416.8
హిమాచల్‌ప్రదేశ్	189.2
కేరళ	145.6
మణిపూర్	50
మిజోరం	21.6
నాగాలాండ్	19.2
సిక్కిం	23.60

కొత్త ఎలైట్ బార్లు లేనట్టే!

- ఇప్పటివరకు ఇచ్చిన 88 బార్లతోనే సరి
- త్వరలోనే ఎలైట్ వైన్స్....
- ప్రతిపాదనలపై ప్రభుత్వం సమాలోచనలు

సాక్షి, హైదరాబాద్: ఇక నుంచి కొత్త ఎలైట్ బార్లకు అనుమతులు ఇవ్వకూడదని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఎలైట్ బార్ల విధానం ద్వారా ఇప్పటివరకు రాష్ట్రంలో 88 బార్లు ఏర్పాటు కాగా, ఇక వాటితోనే సరిపెట్టాలని, భవిష్యత్తులో కొత్త ఎలైట్ బార్లకు పర్మిషన్ ఇవ్వొద్దని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎలైట్ బార్ల ఏర్పాటు కోసం ఎక్సైజ్ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ రద్దు చేయాలని కూడా నిర్ణయించింది. అయితే, ఎలైట్ బార్ల స్థానంలో ఎలైట్ వైన్‌షాపులను ఏర్పాటు చేసే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలుస్తోంది. ఈ ఎలైట్ వైన్స్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ఎక్సైజ్ శాఖ ప్రభుత్వానికి పంపిందని, దీనిపై నిర్ణయం తీసుకునేందుకు సమాలోచనలు జరుగుతున్నాయని తెలిసింది. కాగా, రాష్ట్రంలో మద్యం ధరలు పెరిగే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు కాకపోయినా నవంబర్ లేదా డిసెంబర్‌లో ధరలు పెరుగుతాయని ఎక్సైజ్ వర్గాలంటున్నాయి. గత ఏడాదితో పోలిస్తే తొలి అర్ధ సంవత్సరంలో ఎక్సైజ్ ఆదాయం రూ.2 వేల కోట్లు తక్కువ వచ్చిందని, అయితే అమ్మకాల్లో ఎలాంటి తగ్గుదల లేదని తెలుస్తోంది. అయినా, ఈ ఆర్థిక సంవత్సరంలో పెట్టుకున్న ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవాలంటే 10–20 శాతం మేర మద్యం ధరలు పెంచాల్సి వస్తుందనే ఆలోచనలో ఎక్సైజ్ వర్గాలున్నాయి. అయితే, దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.


గ్రామీణ రహదారుల మరమ్మతులకు రూ.25.95 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామీణ రహదారుల మరమ్మతుల కోసం రూ.25.95 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ నుంచి నిధులు విడుదల చేస్తూ ఈ మేరకు ఆదేశాలిచ్చింది. రహదారుల మరమ్మతుల కోసం రూ.25.95 కోట్లు కోరుతూ ప్రభుత్వానికి గత నెలలో పీఆర్ ఆర్డీ శాఖ మంత్రి సీతక్క ప్రతిపాదనలు పంపించారు. ఇందుకు అనుగుణంగా రూ.25.95 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.

కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

డేటా సైన్స్, బిగ్ డేటా, ఏఐ సాఫ్ట్‌వేర్

దరఖాస్తులు ఆహ్వానించిన నేషనల్ స్కిల్ అకాడమీ



సాక్షి, హైదరాబాద్: నేషనల్ స్కిల్ అకాడమీ (ఎన్ఎస్ఏ) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆమోదిత డేటా సైన్స్, బిగ్ డేటా, ఏఐ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ విధానంలో శిక్షణ ఇస్తున్నట్లు ఎన్ ఎస్ఏ ప్రోగ్రాం డైరెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీటితోపాటు 100కి పైగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, డిప్లొమా, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఎథికల్ హ్యాకింగ్, పైథాన్, మెషీన్ లెర్నింగ్, బిజినెస్ అనలిటిక్స్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బ్లాక్‌చెయిన్, డీప్ లెర్నింగ్, సెలీనియం, సేల్స్‌ఫోర్స్, జావా, ఒరాకిల్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, వెబ్ డిజైన్ మొదలైన కోర్సులలో అర్హతను బట్టి ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కోర్సుల్లో ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు, దివ్యాంగులు, మాజీ సైనికులు, వారి పిల్లలకు స్వర్ణ భారత్ జాతీయస్థాయి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ద్వారా 80% మేర ఫీజు రాయితీ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.nationalskillacademy.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని, ఇతర వివరాలకు 9505800050, 9505800047 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 2-10-2024



నేటినుంచి పూల పండుగ

ఇల్లిల్లూ ఓ గుడి... వీధంతా సింగిడి

తెలంగాణ అంతటా గ్రామ గ్రామాల్లో సంబరంగా చేసుకునే పండగ బతుకమ్మ పండుగ. ఆటపాటలతో, ఆనందంగా ప్రజలు తమ సంతోషాన్ని ఇతరులతో పంచుకునే ఒక సామాజిక జీవన సంరంభం ఈ పండుగ. వానాకాలం వెళ్లేముందు తెలంగాణ ప్రాంతంలో విరబూసే తంగేడు పూలతో సింగారించుకున్న పల్లె పడుచులతో ఎటు చూసినా చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎక్కడ చూసినా అలుగులు పారే చెరువులూ, నిండుగా ఉన్న కుంటలూ, ఆపైన గట్లమీద పూసే వెండి జిలుగుల గునుగుతో పల్లెలు అందాలు సంతరించుకుకుంటాయి. పూరిగుడిసెలమీద, పందిరి మీద, పొదలమీద, పెరట్లోనూ, విరగబూసిన బీర పూలూ, గుమ్మడిపూలు, కట్లపూలు, బంతిపూలతో పసిడి పూసినట్లుగా హరివిల్లులా– కనిపిస్తాయి గ్రామీణ కుటీరాలు. ఇంద్రధనుస్సు దిగివచ్చిందా అన్నట్లు బతుకమ్మ పూలతో నిండుగా నవ్వుతూ స్వాగతం పలుకుతాయి పాలంగట్లు. పూలు కోసుకు రావడం ఒక్కటే మగవారి వంతు. ఇక ఆ తర్వాత హడావుడి అంతా ఆడవాళ్లదే. పుట్టినపిల్లలు పురిటిలోనే చనిపోతుంటే 'బతుకమ్మ' అంటూ ఆ జగన్మాత పేరు పెడితే పిల్లలు బతుకుతారన్న విశ్వాసం ఈనాటికీ తెలంగాణలో ఉంది.

తెలంగాణ సంస్కృతికీ, వైభవానికీ ప్రతీకగా నిలిచే ఈ తొమ్మిదిరోజుల పండుగ మహాలయ పక్ష అమావాస్యతో ఆరంభం అవుతుంది. కొన్నిచోట్ల పితృ అమావాస్య రోజు మట్టితో చేసిన బొడ్డెమ్మలను సాగనంపి, ఆ తెల్లవారినుంచి, ప్రతిరోజూ సాయంత్రం అందంగా అలంకరించుకున్న ఆడపడచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి లయబద్ధంగా ఆడతారు. ఆ పాటలు లక్ష్మీదేవి, గౌరమ్మ, పార్వతి, శివుడు, బతుకమ్మ మీదనే ఎక్కువగా ఉంటాయి. అత్తగారింట్లో ఎలా నడుచుకోవాలో తెలియజేయడంతోపాటు ఆడపిల్లలకు సంబంధించిన అనేక విషయాలమీదే ఉంటాయి. ధనిక, పేద అనే భేదాలు లేకుండా అందరూ కలిసి మెలిసి ఆడుకునే పాడుకునే ఒక అద్భుతమైన పండుగ.


భాద్రపద అమావాస్య అక్టోబరు 2న ప్రారంభమయ్యే బతుకమ్మ వేడుకలు తొమ్మిది రోజుల పాటూ వైభవంగా సాగి, అక్టోబరు 10న సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

– డి.వి.ఆర్.

నేడు గాంధీ జయంతి

బాపూ సమరం తెరపై చూపుదాం


'రక్త మాంసాల దేహంతో అలా ఓ మనిషి ఈ నేలమీద నడయాడాడని చెబితే, ముందు తరాల వారు నమ్మరు' అన్నాడు ఐన్‌స్టీన్. టాల్ స్టాయ్, జోసెఫ్ స్టాలిన్, విన్‌స్టన్ చర్చిల్, జె.ఎఫ్. కెన్నెడీ, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా దాకా... ఎందరో గాంధీజీ వల్ల ప్రభావితం అయ్యారు. గాంధీజీ ఆత్మకథ పిల్లలందరూ చదవాలి. లేదా కనీసం ఆయన పై వచ్చిన సినిమాలు చూడాలి. గాంధీపై వచ్చిన కొన్ని సినిమాలు. అలాగే గాంధీ గారి వల్ల వచ్చిన సినిమాలు



మోడర్న్ టైమ్స్: 1936లో వచ్చిన ఈ సినిమా నేటికీ గొప్ప క్లాసిక్‌గా నిలిచి ఉంది. యంత్రం కంటే మానవుడే గొప్పవాడు అని చెప్పే సినిమా అది. చార్లి చాప్లిన్ ఈ సినిమా తీసి నటించడానికి కారణం గాంధీ మహాత్ముడు. రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి గాంధీజీ లండన్ వెళ్లినప్పుడు అక్కడ చార్లీ చాప్లిన్‌ను కలిశాడు. అప్పటి వరకూ చార్లీ చాప్లిన్ యంత్రాలు మనుషులను శ్రమ నుంచి విముక్తి చేస్తాయని భావించాడు. కాని గాంధీజీ చెప్పిన మాటల వల్ల యంత్రాలు మనిషికి సహాయం చేయడం కంటే అతడికి పని కోల్పోయేలా చేయడమే గాక బానిసగా చేసుకుంటున్నాయని అర్థం చేసుకున్నాడు. ఆ ప్రభావంతోనే చాప్లిన్ మోడర్న్ టైమ్స్ తీశాడు.




ది మేకింగ్ ఆఫ్ ది మహాత్మ: భారతదేశంలో గాంధీ అడుగు పెట్టి బ్రిటిష్ వారిపై పోరాడక ముందు దక్షిణాఫ్రికాలో ఆయన వర్ణ వివక్షపై పోరాడాడు. గాంధీలోని పోరాటగుణం, అన్యాయానికి వ్యతిరేకంగా నిలిచే సాహసం దక్షిణాఫ్రికాలోనే రూపుదిద్దుకున్నాయి. అక్కడ ఒక చలిరాత్రి ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ నుంచి గాంధీని కిందకు దించి అవమానించారు, ఆయన దగ్గర టికెట్ ఉన్నా, నల్లవాళ్లు ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణించకూడదని. ప్రతి వ్యక్తికీ ఆత్మగౌరవంతో, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో, సమాన భావనతో జీవించే హక్కు ఉందని చాటడమే గాంధీజీ జీవన సందేశం. అది 'ది మేకింగ్ ఆఫ్ ది మహాత్మా'లో చూడవచ్చు. శ్యామ్ బెనగళ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 1996లో విడుదలైంది. రజత్ కపూర్ గాంధీగా నటించాడు.




లగే రహో మున్నాభాయ్: గాంధీజీ అంటే చౌరస్తాలో కనిపించే ఒక విగ్రహం కాదు, గాంధీ జయంతి రోజు స్కూళ్ల సెలవుకు కారణమయ్యే ఒక వ్యక్తి కాదు... గాంధీజీ అంటే జీవన మార్గదర్శి. జీవితం నిర్భయంగా సాగాలంటే గాంధీజీ అనుసరించిన మార్గంలో నడిస్తే చాలు. ఆశ, దురాశ, అవినీతి, ఆడంబరం... ఇవన్నీ లేకపోతే జీవితం సులభంగా ఉంటుందని చెప్పే సినిమా 'లగే రహో మున్నాభాయ్'. 2006లో వచ్చిన ఈ సినిమా గాంధీజీని కొత్త తరానికి మరోసారి పరిచయం చేసింది. అద్భుతమైన విజయాన్ని సాధించిన ఈ సినిమాను రాజ్ కుమార్ హిరాణి సాధించాడు. వీధి రౌడీగా ఉండే ఒక వ్యక్తి గాంధీ ప్రభావంతో ఎలా మారాడనేది కథ. సంజయ్ దత్ హీరో.





గాంధీ మై ఫాదర్: ఇది మొదట తల్లిదండ్రులు చూడాల్సిన సినిమా. మహాత్ములు విశాల ప్రజానీకం కోసం ఎన్ని త్యాగాలు చేసినా కుటుంబం దృష్టికోణంలో వాళ్లేమిటి అనేది కూడా ముఖ్యమే. మహాత్మునిగా గాంధీజీ ఆరాధ్యనీయుడు. కాని సొంత కొడుకు దృష్టిలో ఆయన గొప్ప తండ్రిగా ఉన్నాడా? గాంధీ కుమారుడు హరిలాల్ తన తండ్రి గాంధీలా లేదా గాంధీ అనుయాయుల్లా ఏనాడూ వెలుగులోకి రాలేదు. తండ్రి మీద ఎన్నో ఫిర్యాదులు పెట్టుకున్నాడు. అతని ఆత్మకథ ఆధారంగా తీసిన సినిమా 'గాంధీ మై ఫాదర్'. 2007లో వచ్చిన ఈ సినిమాలో గాంధీ కుమారుడు హరిలాల్‌గా అక్షయ్ ఖన్నా నటించాడు.

గాంధీ: మన మహాత్ముని సినిమాను మన దర్శకులు తీయలేకపోయినా బ్రిటిష్ డైరెక్టర్ తీశాడు. ఏ బ్రిటిషర్ల మీద గాంధీజీ పోరాడారో ఆ బ్రిటిష్ జాతి నుంచి అటెన్ బరో వచ్చి ఈ సినిమా తీసి ప్రాయశ్చిత్తం చేసుకున్నాడని భావించాలి. గాంధీ జీవితంపై సినిమా తీసేందుకు 1952 తర్వాత నుంచి ప్రయత్నాలు జరిగాయి. రిచర్డ్ అటెన్‌బరోనే 1960ల్లోనే ప్రయత్నించినా సాధ్యం కాలేదు. చివరకు 1980 నవంబర్‌లో అటెన్‌బరో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించారు. 1981 మే నెలలో షూటింగ్ పూర్తి అయింది. గాంధీ పాత్రను బెన్ కింగ్‌స్లే పోషించారు. నెహ్రూ పాత్రలో రోషన్ సేథ్, గాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సే పాత్రలో హర్ష్ నాయర్ నటించారు. 1982 నవంబర్ 30న ఢిల్లీలో విడుదలైంది. ఆ తర్వాత ఈ సినిమాను అమెరికా, బ్రిటన్‌లలో కూడా విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు, విమర్శకుల నుంచి ఈ సినిమాకు గొప్ప స్పందన వచ్చింది. గొప్ప కలెక్షన్లు సాధించింది. ఆస్కార్ పురస్కారాలను గెలుచుకుంది. మహాత్మాగాంధీని తెరపై కళ్లకు కట్టినట్లు చూపిన బెన్ కింగ్‌స్లేకి ఆస్కార్ అవార్డు లభించింది.



మహిళకు నెట్టిల్లు మేలు

'ఇంటర్నెట్ అందుబాటులో లేకపోతే ఏమవుతుంది?' అనే ప్రశ్న ఒకప్పుడైతే అంత తీవ్రంగా ఆలోచించాల్సినంత ప్రశ్న కాకపోవచ్చు. ఇప్పుడు మాత్రం ఈ ప్రశ్నకు అధ్యయనకర్తలు అనేక కోణాలలో జవాబులు అన్వేషిస్తున్నారు...



ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా దక్షిణాసియా కీలక దశలో ఉంది. మధ్యతరగతి అభివృద్ధిపథంలో ఉంది. అయితే ఈ పురోగతికి ఒక ఆటంకం ఉంది. అదే... డిజిటల్ జెండర్ డివైడ్. ఇంటర్‌నెట్‌ను ఉపయోగించడంలో స్త్రీ, పురుషుల మధ్య భారీ అంతరం ఉండడమే డిజిటల్ జెండర్ డివైడ్.

ఇంటర్‌నెట్ అందుబాటులో లేని 260 కోట్ల మందిలో ఎక్కువగా మహిళలు, బాలికలే ఉన్నారు. దీనివల్ల మహిళలు ఉద్యోగ శిక్షణకు దూరం అవుతున్నారు. ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు అందుకోలేకపోతున్నారు. ఆరోగ్య, ఆర్థిక సేవలకు దూరం అవుతున్నారు.

గత 25 ఏళ్లలో దక్షిణాసియా అంతటా డిజిటల్ యాక్సెస్ విపరీతంగా పెరిగింది. మన దేశం విషయానికి వస్తే గత దశాబ్దకాలంలో ఇంటర్నెట్ వినియోగం నాలుగు రెట్లు పెరిగింది. అయితే స్త్రీ, పురుషుల విషయంలో ఈ పురోగతి ఒకేరకంగా లేదు. కట్టుబాట్లు మొదలుకొని వ్యవస్థాగత కారణాలు, పేదరికం వరకు రకరకాల కారణాల వల్ల మహిళలు, బాలికలు ఇంటర్నెట్‌కు దూరం అవుతున్నారు.

ప్రపంచంలోని మిగిలిన దేశాలతో పోలిస్తే దక్షిణాసియా దేశాలలో మహిళలు విద్య, ఉద్యోగాలలో వెనకబడిపోతున్నారు. ఇంటర్నెట్‌కు దూరం కావడం అనేది మహిళల కెరీర్ అవకాశాలను పరిమితం చేస్తుంది. మన దేశంలో 20–25 శాతం వ్యాపారాలు మహిళలు నిర్వహిస్తున్నప్పటికీ 2 శాతం కంటే తక్కువ మంది మాత్రమే మూలధనాన్ని సమీకరించుకోగలుగుతున్నారు.

ఇక 'స్టెమ్' విషయానికి వస్తే దక్షిణాసియా అంతటా కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో మహిళలు 25 శాతం మాత్రమే ఉన్నారు. 'స్టెమ్' ఫీల్డ్‌కు సంబంధించిన ఉద్యోగాలలో కూడా మహిళలకు తక్కువ ప్రాతినిధ్యం ఉంది.

'డిజిటల్ జెండర్ డివైడ్ అనేది కేవలం సామాజిక సమస్య కాదు ఆర్థిక సమస్య కూడా' అంటున్నారు నిపుణులు. ప్రపంచవ్యాప్తంగా 600 మిలియన్‌ల మంది బాలికలకు ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే కేవలం మూడేళ్లలో ఆయా దేశాల జీడీపీలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

'మహిళలు ఇంటర్‌నెట్‌కు దగ్గరైతే ఉద్యోగ రంగంలో అవకాశాలు పెరుగుతాయి. ఉద్యోగాల వల్ల కుటుంబ ఆదాయం పెరుగుతుంది. ఇది మహిళలకు వారి కుటుంబాల మెరుగైన జీవన నాణ్యత(క్వాలిటీ ఆఫ్ లైఫ్)కు దారి తీస్తుంది. మహిళలకు ఇంటర్నెట్ అందుబాటులో ఉండడం అనేది లాంగ్ టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్. తరతరాలకు ఉపయోగపడే ఫలాలు ఇస్తుంది' అంటున్నారు వరల్డ్ ఎకనామిక్ ఫోరం డిజిటల్ ఇన్‌క్లూజన్ హెడ్ కెల్లీ ఓముడ్సెన్.

2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ ఉద్యోగాల సంఖ్య 9.2 కోట్లకు చేరుకుంటుందని అంచనా. ఆ ఉద్యోగాలలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలంటే వారు ఇంటర్నెట్ అందుబాటులో ఉండడం అనేది అనివార్యం.

లీగల్

మీ పిల్లల పాస్‌పోర్ట్‌ను తిరస్కరించేందుకు వీలు లేదు

నాకు ఇద్దరు పిల్లలు. నేను, నా భర్త విడిపోయి 2 సంవత్సరాలు అవుతోంది. అయితే ఇంకా విడాకులు తీసుకోలేదు. నా పిల్లలకి పాస్‌పోర్ట్ ఇవ్వడానికి వీలు లేదు అంటూ మా ఆయన పాస్‌పోర్ట్ ఆఫీసుకి ఫిర్యాదు చేశారు. పాస్‌పోర్ట్ అధికారులు నా పిల్లలకి పాస్‌పోర్ట్‌ను తిరస్కరించారు. ఏం చేయాలి?
– ఒక సోదరి, హైదరాబాద్

మైనర్ పిల్లలు అయినప్పటికీ పాస్‌పోర్ట్ తీసుకోవడం, విదేశీ ప్రయాణాలు చేయడం వారి ప్రాథమిక హక్కులు. ఎన్నో కేసులలో వివిధ రాష్ట్రాల హైకోర్టులు, అత్యున్నత న్యాయస్థానం కూడా మైనర్లకు పాస్‌పోర్ట్ ఇవ్వాల్సిందే అంటూ తీర్పులు వెలువరించాయి. అయితే మైనర్ పిల్లల కస్టడీ అంశంలో ఏవైనా కోర్టు కేసులు పెండింగ్‌లో ఉంటే మాత్రం కొంతవరకు ఇబ్బంది కలుగుతుంది. ఎందుకంటే మైనర్ పాస్‌పోర్ట్ పొందడానికి తల్లిదండ్రుల ఇద్దరి అంగీకారం అవసరం కాబట్టి. అంతమాత్రాన పాస్‌పోర్ట్ అధికారులు మీ దరఖాస్తును తిరస్కరించే వీలు లేదు. పాస్‌పోర్ట్ నిబంధనలు 1980, పాస్‌పోర్ట్ దరఖాస్తుల నిబంధనలు 2020, అనెక్షర్–సి ప్రకారం మీరు పాస్‌పోర్ట్ అధికారులకు ఒక అఫిడవిట్ ఇవ్వవలసి ఉంటుంది. ఆ అఫిడవిట్‌ను పరిగణిస్తూ పాస్‌పోర్ట్ అధికారులు మైనర్ బాలుర పాస్‌పోర్ట్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇలాంటి ఒక కేసులో తన కూతురికి పాస్‌పోర్ట్ ఇవ్వవద్దు అంటూ పాస్‌పోర్ట్ అధికారులకు కంప్లయింట్ చేసిన ఒక తండ్రి ఫిర్యాదును పరిగణించి అధికారులు మైనర్ బాలికకు పాస్‌పోర్ట్‌ను తిరస్కరించారు. ఆ కేసులో మైనర్ బాలిక తల్లి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం మైనర్ బాలికకు పాస్‌పోర్ట్ ఇవ్వ వలసిందే అంటూ స్పష్టంగా తేల్చి చెప్పింది. అంతేకాక, కావాలని తండ్రి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లుగా న్యాయస్థానం భావించి, అతణ్ణి మందలించింది. కాబట్టి మీరు నిబంధనల ప్రకారం అఫిడవిట్ ఇచ్చి అప్పటికీ పాస్‌పోర్ట్ అధికారులు స్పందించకపోతే, హైకోర్టును ఆశ్రయించడం ఉత్తమం. మీకు వీలయినంత తొందరలోనే ఉపశమనం లభించేందుకు అవకాశం ఉంది.



– శ్రీకాంత్ చింతల హైకోర్టు న్యాయవాది

మట్టింట్లో బంగారు పంటలు

నేల మీద పెట్టుకున్న నమ్మకం వమ్ముకాదని నిరూపించారీ మహిళలు. మగవాళ్లు సులువైన కెమికల్ ఫార్మింగ్‌ను వదలడానికి తటపటాయిస్తుంటే మహిళలు మాత్రం నాచురల్ ఫార్మింగ్ అవసరాన్ని గుర్తించి ముందుతరాలకు మంచి బాట వేయడానికి శ్రమిస్తున్నారు.

సావిత్రి విజయవంతమైన రైతు. ఆమెది మహారాష్ట్ర, లాతూర్ జిల్లా, గంగాపూర్ గ్రామం. ఆమెకున్నది ముప్పావు ఎకరా మాత్రమే. అందులోనే ఏడాదికి రెండు లక్షల రూపాయల ఆదాయాన్ని చూస్తోందామె. భర్త ఆరోగ్యం దెబ్బతినడంతో అతడికి వైద్యం చేయించడానికి ఇద్దరు పిల్లలను పోషించుకోవడానికి పొలంలో అడుగు పెట్టింది సావిత్రి.

'మొదట్లో నా పొలంలో జొన్న, గోధుమ పండించేదాన్ని. ఆర్ట్ ఆఫ్ లివింగ్స్ నేచురల్ ఫార్మింగ్ అనే స్వచ్ఛంద సంస్థ వాళ్లు మా ఊరికి వచ్చి నాచురల్ ఫార్మింగ్ గురించి చెప్పి 350 జామ మొక్కలిచ్చారు. నిజానికి వాటి పెంపకం కోసం పెద్దగా శ్రమించాల్సిందేమీ లేదు. పాదులు చేసి తగినంత నీరు పెడితే చాలు. ఇక అంతర పంటలుగా వేరు శనగ, వంకాయ వంటి కూరగాయలు పండిస్తున్నాను. మా అమ్మాయి పన్నెండవ తరగతి వరకు చదివి సొంతంగా టైలరింగ్ షాపు నడుపుకుంటోంది. ఉద్యోగం వెతుక్కోవడానికి ముంబయికెళ్లిన మా అబ్బాయి కూడా చిన్న ఉద్యోగాల అవసరం లేదని మా ఊరికి తిరిగి వచ్చేశాడు. మా కుటుంబం స్వయం సమృద్ధి సాధించిందనడానికి నిదర్శనం ఇంకేం కావాలి' అంటోంది సావిత్రి. ఆమె సక్సెస్‌తో ఆమె కొడుకు ఉద్యోగం వదిలి పొలం బాట పడితే తెలుగు రాష్ట్రాల్లో ఓ లెక్చరర్ సునంద మూడేళ్ల కిందట నేచురల్ ఫార్మింగ్‌లో అడుగుపెట్టి ఇప్పుడు పాతిక ఎకరాలు సాగుచేస్తోంది.


సావిత్రి

పాఠాల నుంచి పంటలకు...

కడప జిల్లా రామాపురానికి చెందిన యువతి సునంద. ఆమె ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసి తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో లెక్చరర్‌గా మూడేళ్లు పని చేసింది. తర్వాత పెళ్లి చేసుకుని భర్త ఉద్యోగ రీత్యా ముంబయి వెళ్లిపోయింది. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత తిరిగి హైదరాబాద్‌కి వచ్చారు. లయోలా కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. కానీ తన అభిరుచిని సంతృప్తి పరుచుకోవడం ముఖ్యమనే అభిప్రాయానికి వచ్చింది. అప్పటికే నైట్‌షిఫ్టులు, వర్క్ ప్రెషర్‌తో భర్త ఆరోగ్యం దెబ్బతిన్నది. నేచురల్ ఫుడ్‌తోనే అతడి ఆరోగ్యానికి స్వస్థత చేకూరింది. అదే సమయంలో భర్త స్నేహితుని హఠాన్మరణం ఆమెను ఆలోచింపచేసింది. మంచి ఆహారం లేనప్పుడు ఎంత డబ్బు సంపాదించినా ఏం లాభం అనుకుంది. ఇక ఉద్యోగమా, వ్యవసాయమా అనే ఊగిసలాట నుంచి బయటపడి అత్తగారి ఊరు ఆదిలాబాద్, కౌటాల మండలంలోని విజయనగరం బాట పట్టింది. ఎనిమిది ఎకరాలతో భార్యాభర్తలిద్దరూ సేంద్రియ సేద్యం మొదలు పెట్టారు. అప్పటి వరకు సుభాష్ పాలేకర్, సీవీఆర్ వ్యవసాయ పద్ధతులను చదివి ఆకళింపు చేసుకున్న జ్ఞానమే ఆమెది. మామగారి సూచనలతో మొక్క నాటడం నుంచి ప్రతి పనినీ నేర్చుకుంది. సేంద్రియ సేద్యం చేసే రైతు నిలదొక్కుకోవాలంటే మార్కెటింగ్ ప్రధాన సమస్య అని గుర్తించింది. కొనుగోలు దారులకు అందుబాటులో ఉండడమూ అవసరమే అని గుర్తించింది.


సునంద

అభిరుచి పండింది

మా అత్తగారి ఊరిలో వ్యవసాయం చేస్తున్నప్పుడు మాకు సమాజ ఆమోదం లభించలేదనే చెప్పాలి. కషాయం తయారు చేసుకోవడం, గోమయం, గోమూత్రం సేకరించి పంచగవ్యం తయారు చేయడాన్ని చూపిస్తే సాటి వ్యవసాయదారులు కూడా నేర్చుకుంటారు కదా అనుకున్నాం. వాళ్లు మాత్రం ఉద్యోగాలు చేసుకోక ఈ పనులు మీకెందుకు అన్నారు. కంది, మిల్లెట్స్, సోయాబీన్స్, ఆయిల్ సీడ్స్, కూరగాయలు పండించాను. ఇప్పుడు హైదరాబాద్ సమీపంలో పెద్ద మామిడి తోట కౌలుకు తీసుకుని అంతర పంటలుగా పండ్లు, కూరగాయల సాగుతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ కూడా చేస్తున్నాను. నేచురల్ ఫార్మింగ్ పట్ల ఆసక్తి ఉన్న వారికి శిక్షణనిస్తున్నాను. నా అభిరుచిని కెరీర్‌గా తీసుకోవడంతోపాటు అందులో రాణిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– సునంద, ఉమన్ ఫార్మర్.

ఇప్పుడు శంషాబాద్ దగ్గర షాబాద్ మండలం పెదవేడు గ్రామంలో పాతిక ఎకరాలు కౌలుకి తీసుకుని వ్యవసాయం చేస్తోంది. దళారీ దోపిడీ బారిన పడకుండా సొంతంగా మార్కెటింగ్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుంది.

– వాకా మంజులారెడ్డి
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

బ్యూటిప్స్

ఒత్తయిన జుట్టు కోసం... ● వారంలో ఒకరోజు కొబ్బరినీటితో గాని కొబ్బరిపాలతో జుట్టుని కడిగితే మంచి ఫలితం ఉంటుంది. ● కరివేపాకు పేస్ట్‌లో శీకాకాయ పొడిని కలిపిన మిశ్రమంతో తలస్నానం చేయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే జుట్టు రాలడం తగ్గుముఖం పడుతుంది. ● ఎండబెట్టిన తులసి ఆకులు, వేపాకు, బిర్యానీ ఆకులు ఒకే మోతాదులో తీసుకుని, పొడి చేయాలి. ఒక టీ స్పూన్ పొడిని రెండు, మూడు టేబుల్ స్పూన్ల నీటిలో కలిపి పేస్ట్ చేసి జుట్టుకు పట్టించి అరగంట ఉంచి తలస్నానం చేస్తే జుట్టు రాలడం తగ్గడమే కాకుండా ఒత్తయిన జుట్టు సొంతమవుతుంది.





దక్షిణాఫ్రికాపై భారత్ విజయం

మహిళల టి20 వరల్డ్‌కప్ సన్నాహాల్లో భాగంగా దుబాయ్‌లో దక్షిణాఫ్రికాతో మంగళవారం జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత జట్టు 28 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 144 పరుగులు చేసింది. దీప్తి శర్మ (35 నాటౌట్; 2 ఫోర్లు), రిచా ఘోష్ (36; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), జెమీమా రోడ్రిగ్స్ (30; 3 ఫోర్లు) రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో అయబొంగా ఖాక 25 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టింది. 145 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది.

చెన్నైయిన్‌తో హైదరాబాద్ మ్యాచ్ 'డ్రా'

ఇండియన్ సూపర్ లీగ్‌లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) పాయింట్ల ఖాతా తెరిచింది. చెన్నైయిన్ ఎఫ్‌సీ జట్టుతో గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం రాత్రి జరిగిన మ్యాచ్‌ను హైదరాబాద్ జట్టు 0–0తో 'డ్రా' చేసుకుంది. ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ రెండు మ్యాచ్‌ల్లో ఓడి, ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకొని ఒక పాయింట్‌తో 12వ స్థానంలో ఉంది.





> నాలుగో రోజు ఆట మొదలవడానికి ముందు బంగ్లాదేశ్‌ను సాధ్యమైనంత తొందరగా ఆలౌట్ చేసి ఆ తర్వాత బ్యాటింగ్‌తో ఏం చేయగలమా అని ఆలోచించాం. మేం పరుగులు సాధించడంకంటే వారిని పడగొట్టేందుకు ఎన్ని ఓవర్లు అవసరం అవుతాయి అన్నట్లుగానే మా లెక్క సాగింది. పిచ్ బౌలింగ్‌కు పెద్దగా అనుకూలించకున్నా మా బౌలర్లు మంచి ఫలితం సాధించారు. రెండున్నర రోజుల ఆట కోల్పోయాం కాబట్టి ఇకపై సాహసోపేతంగా ఆడి ఫలితాన్ని రాబట్టేందుకు బ్యాటర్లంతా సై అన్నారు. ఇలాంటప్పుడు జట్టు కుప్పకూలే అవకాశం కూడా ఉంటుంది. అయినా సరే 100–120 పరుగులకు ఆలౌట్ అయ్యేందుకు కూడా సిద్ధపడే దూకుడు ప్రదర్శించాం. కోచ్ గంభీర్‌తో గతంలో కలిసి ఆడిన అనుభవం ఉంది కాబట్టి అతని శైలి గురించి బాగా తెలుసు. ఇప్పటి వరకు అంతా బాగుంది. ద్రవిడ్ ఉన్నప్పుడు కూడా చక్కగా కలిసి పని చేశాం. అయితే జీవితం సాగిపోతూ ఉంటుంది. అలాగే జట్టు కూడా ముందుకు సాగిపోవాలి.
>
> – రోహిత్ శర్మ, భారత కెప్టెన్

ధనాధన్ గెలుపు

భారత జట్టు లెక్క తప్పలేదు. చివరి రోజు బంగ్లాదేశ్‌ను సాధ్యమైనంత వేగంగా ఆలౌట్ చేసి స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు సిద్ధమైన టీమిండియా సరిగ్గా అదే చేసి చూపించింది. భారత బౌలింగ్ దెబ్బకు నిలబడలేకపోయిన బంగ్లా ఆట ఒక్క సెషన్‌లోనే ముగియగా... లంచ్ విరామం తర్వాత గంట వ్యవధిలో రోహిత్ బృందం పని పూర్తి చేసింది. వర్షంతో ఏకంగా ఎనిమిది సెషన్ల పాటు ఆట తుడిచి పెట్టుకుపోయినా... ఆరు సెషన్ల ఆటలోనే ఫలితం రాబట్టి భారత్ తమ స్థాయిని ప్రదర్శించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ విజయం కోసమే ఆడతామంటూ నిరూపించిన జట్టు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో తమ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.

రెండో టెస్టులోనూ భారత్ ఘన విజయం
- 7 వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు
- రాణించిన బౌలర్లు, జైస్వాల్
- సిరీస్ 2–0తో టీమిండియా సొంతం
- ఆదివారం గ్వాలియర్‌లో తొలి టి20 మ్యాచ్

కాన్పూర్: బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఫలితం వచ్చే అవకాశం కనిపించని మ్యాచ్‌నూ తమ సాహసోపేత ఆటతో మలుపు తిప్పిన జట్టు చివరకు తాము అనుకున్న ఫలితం సాధించింది. మంగళవారం ముగిసిన రెండో టెస్టులో భారత్ 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 26/2తో తమ రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 47 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. షాద్‌మన్ ఇస్లామ్ (101 బంతుల్లో 50; 10 ఫోర్లు), ముష్ఫికర్ రహీమ్ (63 బంతుల్లో 37; 7 ఫోర్లు) మాత్రమే ఫర్వాలేదనిపించారు. బుమ్రా, జడేజా, అశ్విన్ తలా 3 వికెట్లు పడగొట్టారు. 52 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని మినహాయించి భారత్ ముందు 95 పరుగుల విజయలక్ష్యం నిలిచింది. 17.2 ఓవర్లలో 3 వికెట్లకు 98 పరుగులు చేసి భారత్ విజయాన్నందుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశస్వి జైస్వాల్ (45 బంతుల్లో 51; 8 ఫోర్లు, 1 సిక్స్), విరాట్ కోహ్లి (37 బంతుల్లో 29 నాటౌట్; 4 ఫోర్లు) సునాయాసంగా జట్టును గెలిపించారు. అశ్విన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఆదివారం నుంచి 3 మ్యాచ్‌ల టి20 సిరీస్ జరుగుతుంది. తొలి టి20 మ్యాచ్‌కు గ్వాలియర్ ఆతిథ్యమిస్తుంది.

సమష్టి వైఫల్యం...

నాలుగో రోజు బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌ను ముగించేందుకు భారత్‌కు 36 ఓవర్లు సరిపోయాయి. షాద్‌మన్, నజ్ముల్ హసన్ (19) నాలుగో వికెట్‌కు 55 పరుగులు జోడించి కొద్దిసేపు ప్రతిఘటించడం మినహా బంగ్లా బ్యాటర్లు ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. ఆట మొదలయ్యాక మూడో ఓవర్లోనే తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో మోమినుల్ హక్ (2)ను అశ్విన్ అవుట్ చేయడంతో జట్టు పతనం మొదలైంది. ఈ దశలో షాద్‌మన్ కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. అశ్విన్, సిరాజ్ ఓవర్లలో అతను రెండేసి ఫోర్లు కొట్టాడు. అయితే జడేజా తన తొలి ఓవర్లోనే నజ్ముల్‌ను వెనక్కి పంపి ఈ జోడీని విడదీశాడు. అదే ఓవర్లో 97 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న షాద్‌మన్ తర్వాతి ఆకాశ్‌దీప్ వేసిన తర్వాతి ఓవర్లో పెవిలియన్ చేరాడు. అంతే... ఆ తర్వాత మిగిలిన ఐదు వికెట్లు టపటపా పడిపోయాయి. బంగ్లా ఆశలు పెట్టుకున్న ప్రధాన బ్యాటర్లు లిటన్ దాస్ (1), షకీబ్ (0) ఒకే స్కోరు వద్ద అవుటయ్యారు. జడేజా తాను వేసిన తొలి మూడు ఓవర్లలో ఒక్కో వికెట్ చొప్పున తీయడం విశేషం. మిరాజ్ (9), తైజుల్ (0) విఫలం కాగా... మరో ఎండ్‌లో ముష్ఫికర్ చివరి వరకు పోరాడాడు. అయితే బుమ్రా అద్భుత బంతితో ముష్ఫికర్ స్టంప్స్‌ను ఎగరగొట్టడంతో బంగ్లా ఇన్నింగ్స్ ముగిసింది.

జైస్వాల్ జోరు...

ముగ్గురు స్పిన్నర్లతోనే బౌలింగ్ చేయించి బంగ్లా తమ వంతుగా కొంత ప్రయత్నం చేసినా భారత్ ముందు అది పనికి రాలేదు. స్వల్ప ఛేదనలో రోహిత్ శర్మ (8), శుబ్‌మన్ గిల్ (6) విఫలమైనా... జైస్వాల్ మరోసారి తనదైన శైలిలో బౌండరీలతో దూసుకుపోయాడు. షకీబ్, మిరాజ్ ఓవర్లలో రెండేసి ఫోర్లతో అతను జోరు ప్రదర్శించాడు. మరో ఎండ్‌లో కోహ్లి అతనికి అండగా నిలిచాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 58 పరుగులు జత చేశారు. 43 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన జైస్వాల్ విజయానికి మూడు పరుగుల దూరంలో వెనుదిరిగాడు. తైజుల్ వేసిన బంతిని మిడాన్ దిశగా ఫోర్ కొట్టి రిషభ్ పంత్ (4 నాటౌట్) మ్యాచ్‌ను ముగించాడు.

18 సొంతగడ్డపై భారత్‌కు ఇది వరుసగా 18వ టెస్టు సిరీస్ విజయం. 2013లో ఆస్ట్రేలియాను 4–0తో క్లీన్‌స్వీప్ చేయడంతో ఇది మొదలైంది. చివరిసారి భారత జట్టు 2012లో స్వదేశంలో ఇంగ్లండ్ చేతిలో సిరీస్‌ను కోల్పోయింది.

13 బంగ్లాదేశ్‌పై ఆడిన 15 టెస్టుల్లో భారత్‌కు ఇది 13వ విజయం. మిగిలిన 2 మ్యాచ్‌లు 'డ్రా' కాగా, భారత్ ఒక్క టెస్టు కూడా ఓడలేదు.

11 టెస్టుల్లో అశ్విన్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'ల సంఖ్య. మురళీధరన్ (11)తో సమంగా అతను అగ్రస్థానంలో నిలిచాడు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 233; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 285/9 డిక్లేర్డ్; **బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్:** షాద్‌మన్ (సి) జైస్వాల్ (బి) ఆకాశ్‌దీప్ 50; జాకీర్ (ఎల్బీ) (బి) అశ్విన్ 10; మహమూద్ (బి) అశ్విన్ 4; మోమినుల్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 2; నజ్ముల్ హసన్ (బి) జడేజా 19; ముష్ఫికర్ (బి) బుమ్రా 37; లిటన్ దాస్ (సి) పంత్ (బి) జడేజా 1; షకీబ్ (సి అండ్ బి) జడేజా 0; మిరాజ్ (సి) పంత్ (బి) బుమ్రా 9; తైజుల్ (ఎల్బీ) (బి) బుమ్రా 0; ఖాలెద్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (47 ఓవర్లలో ఆలౌట్) 146. వికెట్ల పతనం**: 1–18, 2–26, 3–36, 4–91, 5–93, 6–94, 7–94, 8–118, 9–130, 10–146. **బౌలింగ్:** బుమ్రా 10–5–17–3, అశ్విన్ 15–3–50–3, ఆకాశ్‌దీప్ 8–3–20–1, సిరాజ్ 4–0–19–0, జడేజా 10–2–34–3. **భారత్ రెండో ఇన్నింగ్స్:** రోహిత్ (సి) మహమూద్ (బి) మిరాజ్ 8; జైస్వాల్ (సి) షకీబ్ (బి) తైజుల్ 51; గిల్ (ఎల్బీ) (బి) మిరాజ్ 6; కోహ్లి (నాటౌట్) 29; పంత్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (17.2 ఓవర్లలో 3 వికెట్లకు) 98. వికెట్ల పతనం:** 1–18, 2–34, 3–92. **బౌలింగ్:** మెహదీ హసన్ మిరాజ్ 9–0–44–2, షకీబ్ 3–0–18–0, తైజుల్ 5.2–0–36–1.

షకీబ్‌కు కోహ్లి బ్యాట్ బహుమతి



కాన్పూర్: త్వరలో రిటైరవుతున్న బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ షకీబుల్ హసన్‌కు భారత స్టార్ విరాట్ కోహ్లి తన బ్యాట్‌ను కానుకగా అందజేశాడు. షకీబ్ టెస్టు ఫార్మాట్‌పై ఇది వరకే తన వీడ్కోలు నిర్ణయాన్ని ప్రకటించాడు. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్ తర్వాత టెస్టులకు గుడ్‌బై చెబుతానన్నాడు. వచ్చే ఏడాది చాంపియన్స్ ట్రోఫీ అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌కు బైబై చెప్పే యోచనలో ఉన్నాడు. రెండో టెస్టు ముగిసిన తర్వాత కోహ్లి స్వయంగా బంగ్లాదేశ్ జట్టు వద్దకు వెళ్లి తన గుర్తుగా బంగ్లా మేటి క్రికెటర్ అయిన షకీబ్‌కు బ్యాట్‌ను బహూకరించాడు. ఈ సందర్భంగా ఇరు జట్ల హేమాహేమీలు కాసేపు సరదాగా ముచ్చటించుకున్నారు. షకీబ్ స్టార్ ఆల్‌రౌండర్. బంగ్లాదేశ్‌కే కాదు... మన ఐపీఎల్ అభిమానులకు చిరపరిచితుడు. అతను కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల తరఫున 71 మ్యాచ్‌లాడాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా



సెలవులు కలిసొచ్చేలా...

వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. వైర ఎంటర్‌టైన్మెంట్స్, ఎస్‌ఆర్‌టీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీని నవంబరు 14న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, వరుణ్ తేజ్ కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'మట్కా' రూపొందుతోంది. కరుణ కుమార్ పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను తయారు చేశారు. 1958 నుంచి 1982 వరకు 24 ఏళ్ల బ్యాక్‌డ్రాప్‌ని ఎంచుకున్నారాయన. వరుణ్ తేజ్‌ని నాలుగు డిఫరెంట్ లుక్స్‌లో అద్భుతంగా చూపిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. వరుణ్ తేజ్, ఫైటర్స్‌పై సినిమాకి కీలకమైన, ఇంటెన్స్ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తున్నాం. మరోవైపు నిర్మాణానంతర పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. కార్తీక పౌర్ణమికి ముందుగా నవంబర్ 14న విడుదల కానున్న మా సినిమాకి లాంగ్ వీకెండ్ కలిసొస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. నవీన్ చంద్ర, సలోని, అజయ్ ఘోష్, పి. రవిశంకర్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: ఎ. కిశోర్ కుమార్.



తనుశ్రీ దత్తా

అందుకే ఆ దర్శకుల సినిమాలు వదులుకున్నా!

సినిమా ఇండస్ట్రీలో నటీమణులపై లైంగిక వేధింపుల గురించి ఈ మధ్య కొందరు తారలు బాహాటంగానే మాట్లాడుతున్న విషయం తెలిసిందే. అయితే ఆరేళ్ల క్రితమే బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా వేధింపుల విషయమై చాలా ధైర్యంగా ముందుకొచ్చి మాట్లాడారు. నటుడు నానా పటేకర్ తనని వేధించారని ఆమె ఆరోపించిన విషయం గుర్తుండే ఉంటుంది.. ఆరేళ్ల తర్వాత మళ్లీ తనుశ్రీ తాజాగా 'మీటూ' గురించి మాట్లాడారు. ఓ ఇంటర్వ్యూలో ఈ విషయం గురించి ఆమె మాట్లాడుతూ – ''2018 డిసెంబరులో ఓ పెద్ద నిర్మాత నాకో సినిమా ఆఫర్ చేశారు. ఆయన చాలా పెద్ద పెద్ద సినిమాలు నిర్మించారు. అయితే ఆ సినిమా దర్శకుడు 'మీ టూ' ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. దాంతో ఆ సినిమాని వదులుకున్నాను. అప్పటికి నేను కొన్ని ఉత్పత్తులకు సంబంధించిన ఈవెంట్స్‌లో పాల్గొంటున్నాను. మహిళా సాధికారత అంశంపై రూపొందే సినిమాల్లో లీడ్ రోల్‌లో నటించాలని అనుకున్నాను. కానీ ఆ దర్శకుడి పై ఆరోపణలు ఉన్నాయి కాబట్టి నేను ఆ సినిమా వదులుకున్నాను. ఆ తర్వాత కొన్నేళ్లకు మళ్లీ ఓ ఆఫర్ వచ్చింది. ఈ గ్యాప్‌లో కొంచెం హుందాగా అనిపించే సినిమాలు ఒప్పుకున్నాను. కానీ నన్ను టార్గెట్ చేసి, ఆ సినిమాలు సాధ్యం కాకుండా చేశారు. ఇక నాకు వచ్చిన మరో ఆఫర్ గురించి చెప్పాలంటే... అది బెంగాలీ సినిమా. ఆ చిత్రకథ, నా పాత్ర బాగా నచ్చడంతో చేయాలనుకున్నాను. కొన్ని నిబంధనలు పెట్టాను... వారు ఒప్పుకున్నారు కూడా. నా పాత్ర ప్రాధాన్యం పెరిగేలా కథను మలచాలనుకోవడంతో చాలా ఆనందపడ్డాను. అయితే ఓ వారం తర్వాత ఆ సినిమా డైరెక్టర్‌పై 'మీటూ' ఆరోపణలు ఉన్నట్లు తెలిసింది. దాంతో ఆ సినిమా కూడా చేయకూడదనుకున్నాను. ఇంతకీ నాకు సినిమా ఆఫర్ చేయడానికి ఆ డైరెక్టర్‌కి ఓ కారణం ఉంది. నాతో సినిమా చేయడం ద్వారా తనపై ఉన్న లైంగిక వేధింపుల ఆరోపణ ఇమేజ్‌ని మార్చుకోవాలన్నది అతని అభిప్రాయం. అతనితో సినిమాలు చేయడానికి బెంగాల్ ఇండస్ట్రీలో ఎవరూ ముందుకు రాకపోవడంతో ఒక బాలీవుడ్ నటితో సినిమా చేసి, తన ప్రొఫైల్ పెద్దగా చేసుకోవాలన్న ఆలోచన కూడా అతనికి ఉండి ఉండొచ్చు. ఇలాంటివారితో సినిమా చేస్తే ఓ 'మీటూ' నిందితుడ్ని సపోర్ట్ చేసినట్లే'' అని పేర్కొన్నారు తనుశ్రీ దత్తా. ఇక సినిమాలు వదులుకోవాలనే నిర్ణయం తీసుకున్నప్పుడు తన తండ్రి అభిప్రాయం అడిగానని అన్నారామె. ''ఒక నిందితుడితో సినిమా చేయడం నైతికంగా సరికాదు'' అని మా నాన్న అన్నారు అని తనుశ్రీ పేర్కొన్నారు. మన గౌరవాన్ని, సమగ్రతను కాపాడుకోవడానికి మనం ధైర్యంగా ముందుకొచ్చి మాట్లాడాలని నటీమణులను ఉద్దేశించి అన్నారామె. సినిమాలు ఇష్టమైనప్పటికీ త్యాగం చేయాల్సి రావడం బాధాకరం అని కూడా పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... తనుశ్రీ దత్తా తెలుగులో బాలకృష్ణ సరసన 'వీరభద్ర' (2006) చిత్రంలో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

నాలుగు పాత్రలు చేయడం సవాల్‌గా అనిపించింది – శ్రీవిష్ణు



''నా కెరీర్‌లో ఎప్పుడూ ద్విపాత్రాభినయం చేయలేదు. అలాంటిది 'శ్వాగ్' సినిమాలో నాలుగు పాత్రలు చేశాను. అందరూ ఒకే పోలికతో ఉండే ఒకే వంశస్తులే. నాలుగు పాత్రలు ఉన్నప్పుడు ఎలా చేయాలనేది సవాల్‌గా అనిపించింది. ఒక్కసారి గెటప్స్ అన్నీ సెట్ అయ్యాక చాలా బాగా కుదిరింది'' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. హసిత్ గోలి దర్శకత్వంలో శ్రీవిష్ణు, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'శ్వాగ్'. మీరా జాస్మిన్, దక్ష నగార్కర్ ఇతర కీలక పాత్రలు పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు పంచుకున్న విశేషాలు.

- 'శ్వాగ్' ఒక వంశానికి సంబంధించిన కథ. మాతృ, పితృస్వామ్యం అనే క్లాష్ నుంచి 1500 సంవత్సరంలో మొదలయ్యే కథ. పురుషులు గొప్పా? మహిళలు గొప్పా? అనే అంశంపై వినోదాత్మకంగా ఈ కథ సాగుతుంది. శ్వాగ్ అంటే శ్వాగనిక వంశానికి సుస్వాగతం. అంత పెద్ద టైటిల్‌ని పలకడానికి ఇబ్బందిగా ఉంటుందని 'శ్వాగ్' అని పెట్టాం. కొత్త తరహా కథల్ని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. అదే ధైర్యంతో సరికొత్త కథాంశంతో మా సినిమా చేశాం. ఈ మూవీలో నా పాత్రకి మేకప్ వేసుకోవడానికి రోజుకి నాలుగున్నర గంటలు పట్టేది... తీయడానికి రెండు గంటలు పట్టేది.. ఇదంతా చాలా కష్టంగా అనిపించింది.
- కుటుంబమంతా కలిసి చూడదగ్గ సినిమా ఇది. పెద్దవాళ్లకి ఈ చిత్రం విపరీతంగా నచ్చుతుంది. అలాగే యువ ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు ఉన్నాయి. నేటి యువత తెలుసుకోవాల్సిన చాలా విషయాల్ని చూపించాం. మన వంశంతో పాటు పెద్దల గురించి, తాతల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఏంటి? అనేది హసిత్ చాలా చక్కగా తెరకెక్కించాడు. చాలా పెద్ద కథ ఇది. రెండున్నర గంటల్లో ఇంత పెద్ద కథ చెప్పారా? అని సినిమా చూసిన తర్వాత డైరెక్టర్‌ని ప్రేక్షకులు అభినందిస్తారు. కథలో భాగంగానే వినోదం ఉంటుంది. నా కెరీర్‌లో పెద్ద హిట్‌గా నిలిచే చిత్రాల్లో 'శ్వాగ్' ఒకటిగా నిలుస్తుందనే నమ్మకం ఉంది.
- పీపుల్ మీడియా ఫ్యాక్టరీ టీజీ విశ్వప్రసాద్‌గారు నన్ను, హసిత్‌ని నమ్మి తొలిసారి 'రాజ రాజ చోర' సినిమా అవకాశం ఇచ్చి, చాలా ప్రోత్సహించారు. ఇప్పుడు 'శ్వాగ్' చేసే అవకాశం కల్పించారు. ఈ సినిమా పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి మంచి సక్సెస్ ఇస్తుంది. ఈ సినిమా చూశాక మహిళలను ఒక మెట్టు ఎక్కువ అభిమానం, గౌరవంతో చూస్తాం. ఈ సినిమా చూస్తున్నంత సేపు నటీనటులు కాకుండా పాత్రలే గుర్తుంటాయి. ప్రస్తుతం ఓ థ్రిల్లర్ మూవీ చేస్తున్నా. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో ఓ వినోదాత్మక చిత్రం చేస్తున్నాను.

రామ్‌నగర్ బన్నీ ఇద్దరికీ హిట్ ఇవ్వాలి

– రామ్‌గోపాల్ వర్మ



● చంద్రహాస్, రామ్‌గోపాల్ వర్మ, ప్రభాకర్, వెలిగొండ శ్రీనివాస్

''రామ్‌నగర్ బన్నీ' సినిమా టీజర్, ట్రైలర్ చూస్తే మంచి కంటెంట్‌తో వస్తున్నట్లు తెలుస్తోంది. చంద్రహాస్ ఎనర్జిటిక్‌గా కనిపిస్తున్నాడు. బాగా నటించాడు కూడా. ఈ చిత్రం చంద్రహాస్‌తో పాటు ప్రభాకర్‌కు పెద్ద విజయం ఇవ్వాలి'' అని డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ అన్నారు. చంద్రహాస్ హీరోగా శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వం వహించిన చిత్రం 'రామ్‌నగర్ బన్నీ'. విస్మయ శ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రితూ మంత్ర హీరోయిన్లుగా నటించారు. దివిజ ప్రభాకర్ సమర్పణలో మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీనివాస్ మహత్ మాట్లాడుతూ– ''రామ్‌నగర్ బన్నీ' ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది. థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు. ''మా అన్నయ్య చంద్రహాస్‌కు 'రామ్‌నగర్ బన్నీ' పెద్ద సక్సెస్ ఇవ్వాలి'' అని దివిజ ప్రభాకర్ చెప్పారు. ''మా మూవీని రిలీజ్ చేస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ వారికి థ్యాంక్స్'' అని మలయజ ప్రభాకర్ పేర్కొన్నారు. ''నన్ను ఇంతకాలం ఆదరించిన తల్లులు, అక్కా చెల్లెళ్లు మా 'రామ్‌నగర్ బన్నీ' సినిమా చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు ప్రభాకర్ పొడకండ. ''మా 'రామ్‌నగర్ బన్నీ' సినిమా నచ్చని ప్రేక్షకులు మీ టికెట్‌ని ఫొటో తీసి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నాకు పంపితే మీ డబ్బులు వెనక్కి ఇచ్చేస్తాను'' అని చంద్రహాస్ తెలిపారు. ఈ వేడుకలో నిర్మాతలు దామోదర ప్రసాద్, కరాటే రాజు, హీరోయిన్లు రిచా జోషి, రీతు మంత్ర, అంబికా వాణి, విస్మయ శ్రీ, సంగీత దర్శకుడు అశ్విన్ హేమంత్, నటులు సమీర్, సలీమ్ ఫేకు, ఫైట్ మాస్టర్ రాము, లిరిక్ రైటర్స్ అవినాష్, సాగర్ తదితరులు మాట్లాడారు.

దీక్ష ఉంటే...



● అక్సా ఖాన్, ప్రతాని రామకృష్ణ గౌడ్

కిరణ్‌కుమార్, అలేఖ్య రెడ్డి జంటగా నటించిన చిత్రం 'దీక్ష'. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించారు. ఆర్.కె. ఫిలింస్, స్నిగ్ధ క్రియేషన్స్‌పై పినిశెట్టి అశోక్ కుమార్, ప్రతాని రామకృష్ణ గౌడ్ నిర్మించిన ఈ సినిమా నిర్మాణానంతర పనులు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''కృషి, పట్టుదల, దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం అనే పాయింట్‌తో మా సినిమాని రూపొందించాం. ఈ పాయింట్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. ఎందుకంటే మన లైఫ్‌లో కూడా ఏదో ఒకటి సాధించాలనే తపనతో ఉంటాం. కిరణ్ నటన ఆకట్టుకుంటుంది. గ్రాఫిక్స్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. రాజ్ కిరణ్ అద్భుతమైన సంగీతం అందించారు'' అన్నారు. ''ఈ చిత్రంలో మంచి పాత్ర చేశాను'' అని అక్సా ఖాన్ తెలిపారు. ''ఈ సినిమాలో ప్రిన్సిపాల్‌గా నటించాను'' అని నటుడు జేవీఆర్ చెప్పారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్

సుగి విజయ్, జుఫ్సీ భద్ర జంటగా నటిస్తున్న చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్'. పరమేష్ రేణుకుంట్ల దర్శకత్వంలో ఆర్య సినిమా పతాకంపై ఎం. దయానంద్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సుకుమార్ అన్నయ్య, రచయిత, నిర్మాత విజయ్ కుమార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, చిత్ర సంగీత దర్శకుడు వరికుప్పల యాదగిరి గౌరవ దర్శకత్వం వహించారు. పరమేష్ రేణుకుంట్ల మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్'. నేటి యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులకు నచ్చే భావోద్వేగాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నాం'' అన్నారు. ''రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాం. డిసెంబరు వరకు జరిగే షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది'' అని ఎం. దయానంద్ తెలిపారు.



● సుగి విజయ్, జుఫ్సీ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
33	14
84,266	25,796

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,874	▽	316
డోజోన్స్	42,134	▽	196
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,277	△	40
డాక్స్	19,213	▽	112
షాంఘై సోమవారం ముగింపు	3,337	△	249
నికాయ్	38,652	△	732

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
75,515	△	318
బంగారం (99.5 స్వచ్ఛత)		
75,213	△	319
వెండి (కేజీ)		
89,882	▽	482

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.41	84.43
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	109.90	114.80
€	యూరో	ఎస్‌బీఐ	92.27	94.67
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.55	58.87
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.06	59.03
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.82	67.46
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.45	23.01
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.93	23.71
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.07	12.89

కార్ల విక్రయాలకు బ్రేకులు

మూడో నెలా తగ్గుముఖం

- పెరిగిన ద్విచక్ర వాహన అమ్మకాలు
- వాణిజ్య వాహనాలకు కొనసాగిన డిమాండ్



కంపెనీ	సెప్టెంబర్ 2024	సెప్టెంబర్ 2023	(%లో)
మారుతీ సుజుకీ	1,44,962	1,50,812	(-)4
హ్యుందాయ్ మోటార్స్	64,201	71,641	(-)10
టాటా మోటార్స్	41,063	44,809	(-)8
ఎంజీ మోటార్స్	4,588	5,003	(-)8
టయోటా కిర్లోస్కర్	26,847	23,590	(+)14
కియా మోటార్స్	23,523	20,022	(+)17
ఎంఅండ్‌ఎం	51,062	41,267	(+)24
ద్విచక్ర వాహనాలు			
హీరో మోటోకార్ప్	6,37,050	5,36,499	(+)19
బజాజ్ ఆటో	4,69,531	3,92,558	(+)20
టీవీఎస్ మోటార్స్	4,82,495	4,02,553	(+)20
హోండా మోటార్‌సైకిల్	5,36,391	4,91,802	(+)9
వాణిజ్య వాహనాలు			
అశోక్ లేలాండ్	17,233	19,202	(-)10
వీఈ కమర్షియల్	7,609	7,198	(+)6
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	12,380	12,081	(+)2.5
మహీంద్రా	44,256	43,210	(+)2

ముంబై: దేశీయ కార్ల విక్రయాలు వరుసగా మూడో నెలా నెమ్మదించాయి. డిమాండ్ క్షీణతతో వాహన నిల్వలు పెరిగాయి. వీటిని తగ్గించుకునేందుకు వీలుగా ఆటో కంపెనీలు డీలర్లకు వాహన పంపిణీ (డిస్పాచ్) తగ్గించాయి. దీంతో ఈ సెప్టెంబర్‌లోనూ ఆటో అమ్మకాలు అంతంత మాత్రంగా జరిగాయి. కార్ల దిగ్గజ సంస్థలు మారుతీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, ఎంజీ మోటార్స్ విక్రయాలు తగ్గాయి. ఇక ద్విచక్ర వాహనాలకొస్తే... ఈ విభాగంలోని అగ్ర కంపెనీలైన టీవీఎస్ మోటోకార్ప్, బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్స్ విక్రయాల్లో రెండంకెల వృద్ధి నమోదైంది. వాణిజ్య, ట్రాకర్ల అమ్మకాలూ పెరిగాయి. పండుగ సీజన్ ప్రారంభం కావడంతో వాహన విక్రయాలు అమ్మకాలు పుంజుకునే వీలుందని ఆటో తయారీ సంస్థలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

మూడోరోజూ నష్టాలు



ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్

ముంబై: ఆద్యంతం ఒడిదుడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 33 పాయింట్లు నష్టపోయి 84,266 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 14 పాయింట్లు కోల్పోయి 25,796 వద్ద నిలిచింది. సూచీలకిది వరుసగా మూడోరోజూ నష్టాల ముగింపు. ఆయిల్‌అండ్‌గ్యాస్, ఎఫ్ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకరణ, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సూచీలు రోజంతా ఒడిదుడుకులతో సాగాయి. సెన్సెక్స్ 549 పాయింట్లు పరిధిలో 84,099 వద్ద కనిష్టాన్ని 84,648 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 25,908 - 25,739 శ్రేణిలో ట్రేడైంది. ఐటీ, టెక్, కమోడిటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున లాభపడ్డాయి. రిలయన్స్ (-1%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(-0.50%) షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచగా.. ఇన్ఫీ (1.50%), ఎస్‌బీఐ(1%), ఐసీఐసీఐ (0.50%) షేర్లు రాణించి నష్టాలు పరిమితం చేశాయి. సెప్టెంబర్ ఎస్‌యూవీ అమ్మకాల్లో 16% వృద్ధి చెందడంతో ఎంఅండ్‌ఎం షేరు 2.50 పెరిగి రూ.3166 వద్ద ముగిసింది.

గాంధీ జయంతి సందర్భంగా నేడు (బుధవారం) బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. బులియన్, కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు.

స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌కు చెక్

- ఎఫ్అండ్‌వో నిబంధనలు కఠినతరం
- తాజాగా సర్క్యులర్ జారీ చేసిన సెబీ



న్యూఢిల్లీ: స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌కు చెక్ పెట్టే బాటలో క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్అండ్‌వో) నిబంధనలను కఠినతరం చేసింది. ఈక్విటీ ఇండెక్స్ డెరివేటివ్స్‌లో కనీస కాంట్రాక్ట్ పరిమాణాన్ని పెంచడంతోపాటు.. ఆప్షన్స్ ప్రీమియంల ముందస్తు వసూళ్లను తప్పనిసరి చేసింది. ఇన్వెస్టర్ల పరిరక్షణార్థం పొజిషన్ లిమిట్స్‌పై ఇంట్రాడే పర్యవేక్షణ, ఎక్స్‌పైరీ రోజున కేలండర్ స్ప్రెడ్ లబ్ధి రద్దు, వీక్లీ ఇండెక్స్ డెరివేటివ్స్‌ను క్రమబద్ధీకరించడం, టెయిల్ రిస్క్ కవరేజీ పెంపు తదితర పలు ఇతర చర్యలను సైతం తీసుకుంది. ఈ చర్యలన్నీ వచ్చే నెల (నవంబర్) 20 నుంచి దశలవారీగా అమల్లోకిరానున్నట్లు తాజాగా విడుదల చేసిన సర్క్యులర్‌లో సెబీ పేర్కొంది. ఇటీవల పరిశీలన ప్రకారం ఎఫ్అండ్‌వో విభాగంలో వ్యక్తిగత ఇన్వెస్టర్లు 2022-24 మధ్య కాలంలో సగటున రూ. 2 లక్షలు చొప్పున నష్టపోయినట్లు సెబీ గుర్తించింది. కోటిమంది వ్యక్తిగత ఇన్వెస్టర్లలో 93% మందికి నష్టాలు వాటిల్లినట్లు ఇప్పటికే రిటైలర్లను హెచ్చరించింది. ఈ కాలంలో వ్యక్తిగత ట్రేడర్లకు ఉమ్మడిగా రూ. 1.8 లక్షల కోట్లమేర నష్టాలు నమోదైనట్లు పేర్కొనడం తెలిసిందే.

నిబంధనల తీరిదీ...

తాజా సర్క్యులర్‌లో సెబీ ఎఫ్అండ్‌వో నిబంధనల సవరణలను వెల్లడించింది. వీటి ప్రకారం ఇండెక్స్ డెరివేటివ్స్‌లో కనీస కాంట్రాక్ట్ పరిమాణాన్ని 2015లో నిర్ణయించిన రూ. 5-10 లక్షల నుంచి రూ. 15-20 లక్షలకు పెంచింది. ఇందుకు అనుగుణంగానే లాట్ సైజ్‌ను కూడా నిర్ధారిస్తారు. వీక్లీ ఇండెక్స్ డెరివేటివ్స్‌ను ఒకేఒక ప్రామాణిక ఇండెక్స్‌కు పరిమితం చేస్తారు. షార్ట్ ఆప్షన్స్ కాంట్రాక్టులపై ఎక్స్‌పైరీ రోజున 2 శాతం అదనపు మార్జిన్ (ఈఎల్‌ఎం)ను విధిస్తారు. ఆప్షన్ కొనుగోలుదారులు ముందస్తుగా పూర్తి ప్రీమియంను చెల్లించవలసి ఉంటుంది. దీంతో అధిక లెవరేజీను నివారిస్తారు.

మునిసిపల్ బాండ్లకు పన్ను రాయితీలు

మౌలిక రంగ అభివృద్ధికి వినియోగించగల నిధుల సమీకరణకు వీలుగా మునిసిపల్ బాండ్లకు పన్ను రాయితీలు ప్రకటించాలని సెబీ తాజాగా ప్రభుత్వాన్ని కోరింది. వీటి సబ్‌స్క్రయిబర్లకు పన్ను మినహాయింపులను అందించాలని అభ్యర్థించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
సెప్టెంబర్‌లో 'తయారీ' పేలవం
ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో హైడ్రా ట్రేడింగ్ వాటా విక్రయం

జీఎస్‌టీ వసూళ్లు 1.73 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు సెప్టెంబర్‌లో రూ.1.73 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2023 సెప్టెంబర్‌తో పోల్చితే ఇవి 6.5% అధికం. 2024 ఆగస్టుకన్నా (రూ.1.75 లక్షల కోట్లు) వసూళ్లు తగ్గాయి. కాగా, రిఫండ్స్ సెప్టెంబర్‌లో రూ.20,458 కోట్లు. వార్షికంగా 31% అధికం. ఇవి తీసేస్తే, నికర జీఎస్‌టీ ఆదాయం సెప్టెంబర్‌లో 3.9% వృద్ధితో రూ.1.53 లక్షల కోట్లుగా నమోదైంది.

అన్‌లిమిటెడ్ 'ఫెస్టివ్‌ఫ్యాషన్‌ఫ్లెక్స్' ఆఫర్

UN LIMIT ED

హైదరాబాద్: ప్రముఖ ఫ్యాషన్ దుస్తుల విక్రయ సంస్థ అన్‌లిమిటెడ్ స్టోర్స్ 'ఫెస్టివ్ ఫ్యాషన్‌ఫ్లెక్స్' పేరుతో దసరా సంబరాలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా రూ.5,999 కొనుగోలుపై పిజియన్ మిక్సర్ గ్రైండర్‌ను రూ.399లకే అందిస్తోంది. అలాగే రూ.2999 కొనుగోలుపై సౌండ్‌బార్ లేదా చక్రాలు కలిగిన డఫిల్ బ్యాగ్ రూ.199లకే పొందొచ్చు. 'పండుగ సందర్భంగా జీన్స్, కుర్తా, షేర్వానీ సహా చిన్నారులు, మహిళల కోసం సరికొత్త డిజైన్లను అందుబాటులోకి తెచ్చాము. ఈ గొప్ప అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి' అని కంపెనీ సీఓఓ వినీత్ జైన్ తెలిపారు.

ఈ-టూవీలర్‌కు సబ్సిడీ
రూ. 10,000

- కిలోవాట్ అవర్‌కు రూ.5,000
- పీఎం ఈ-డ్రైవ్‌కు రూ.10,900 కోట్లు
- 2026 మార్చి 31 వరకు స్కీమ్ అమలు



న్యూఢిల్లీ: పీఎం ఈ-డ్రైవ్ పథకం మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈ పథకం కింద ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీలు) కొనుగోలుపై రూ.10,900 కోట్ల మేర సబ్సిడీలను కేంద్రం అందించనుంది. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడమే ఈ పథకం ఉద్దేశ్యం. 2024 అక్టోబర్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు ఈ పథకం అమల్లో ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్ (ఈఎంపీఎస్) కింద సబ్సిడీలను అందించగా.. దీని స్థానంలో పీఎం ఈ-డ్రైవ్‌ను కేంద్రం తీసుకొచ్చింది. 24.79 లక్షల ద్విచక్ర వాహనాలు, 3.16 లక్షల త్రిచక్ర వాహనాలు, 14,208 ఈ-బస్సులకు సబ్సిడీలు అందనున్నాయి.

సబ్సిడీలు ఇలా..

ఈ పథకం కింద తొలి ఏడాది కాలంలో.. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం కిలోవాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యంపై రూ.5,000 చొప్పున సబ్సిడీ లభిస్తుంది. బ్యాటరీ సామర్థ్యం రెండు కిలోవాట్ అవర్‌కు మించి ఉన్నా కానీ, ఒక ఎలక్ట్రిక్ టూవీలర్‌కు గరిష్ఠంగా రూ.10,000 వరకే సబ్సిడీ ప్రయోజనం లభిస్తుంది. రెండో ఏడాది కిలోవాట్ అవర్‌కు రూ.2,500కు (ఒక టూవీలర్‌కు గరిష్ఠంగా రూ.5,000) తగ్గిపోతుంది. ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనం (ఈ రిక్షాలు సైతం) కొనుగోలుపై మొదటి ఏడాది రూ.25,000, రెండో ఏడాది రూ.12,500 చొప్పున సబ్సిడీ లభిస్తుంది. ఎల్5 కేటగిరీ త్రిచక్ర వాహనాలపై మొదటి ఏడాది రూ.50,000, రెండో ఏడాది రూ.25,000 చొప్పున సబ్సిడీ అందుతుంది. ఈ-ట్రక్కులకు రూ. 500 కోట్ల సబ్సిడీ కేటాయించారు. ఎలక్ట్రిక్ 4 చక్రాల వాహనాల కోసం 22,100 ఫాస్ట్ చార్జర్లు, ఈ బస్సుల కోసం 1,800 ఫాస్ట్ చార్జర్లు, ద్విచక్ర/త్రిచక్ర వాహనాల కోసం 48,400 ఫాస్ట్ చార్జర్లను ఈ పథకం కింద ఏర్పాటు చేయనున్నారు.

ఓచర్ల రూపంలో..

పథకం ఆవిష్కరణ సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సెక్రటరీ హనీఫ్ ఖురేషీ మాట్లాడుతూ.. సబ్సిడీ పొందేందుకు మొబైల్ యాప్‌ను తీసుకొస్తామని, దీని ద్వారా సబ్సిడీ ఈ-ఓచర్లు జారీ అవుతాయని ప్రకటించారు. ఒక ఆధార్ నంబర్‌పై ఒక వాహనాన్నే సబ్సిడీ ప్రయోజనానికి అనుమతిస్తున్నట్టు చెప్పారు. వాహనం కొనుగోలు చేసిన వెంటనే ఆధార్ ఆధారిత ఈ-ఓచర్ కొనుగోలుదారుకు జారీ అవుతుంది. ఈ-ఓచర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, దానిపై కొనుగోలుదారు సంతకం చేసి డీలర్‌కు ఇవ్వాలి. డీలర్ సైతం దీనిపై సంతకం పెట్టి పీఎం ఈ-డ్రైవ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఓఈఎం (వాహన తయారీ సంస్థ) రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌కు ఈ-ఓచర్ అవసరం.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

బ్యాంక్ కొలువుకు అప్రెంటిస్

బ్యాంకింగ్ రంగంలో.. కెరీర్ కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! ప్రభుత్వ రంగ బ్యాంకులో శిక్షణతోపాటు, ప్రతి నెలా స్టయిఫండ్ పేరిట ఆర్థిక ప్రోత్సాహకం అందుకోవచ్చు. అందుకు మార్గం.. కెనరా బ్యాంక్ అప్రెంటిస్ శిక్షణ. అప్రెంటీస్ యాక్ట్ అమలులో భాగంగా దేశ వ్యాప్తంగా 3000 అప్రెంటీస్ ట్రైనీ నియామకాలకు కెనరా బ్యాంక్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. కెనరా బ్యాంక్ అప్రెంటీస్ నోటిఫికేషన్ సమాచారం, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, ప్రయోజనాలు తదితర వివరాలు..

బ్యాంకింగ్ రంగంలో కెరీర్‌కు అనుభవం ఎంతో కీలకంగా మారింది. ముఖ్యంగా బ్యాచిలర్ డిగ్రీ తర్వాత ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పలు పోస్టులకు, అదే విధంగా ప్రైవేట్ రంగంలోని బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్ స్థాయి పోస్టులకు.. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కెనరా బ్యాంక్ అప్రెంటీస్ ట్రైనీ శిక్షణ బ్యాంకింగ్ రంగంలో కెరీర్ కోరుకునే అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది

మొత్తం 3,000 ఖాళీలు

కెనరా బ్యాంక్ తాజాగా విడుదల చేసిన అప్రెంటీస్ ట్రైనీ నోటిఫికేషన్ ద్వారా దేశ వ్యాప్తంగా మొత్తం 3,000 ట్రైనీలను నియమించుకోనుంది. రాష్ట్రాల వారీగా ఈ ఖాళీలను పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 200 ఖాళీలు, తెలంగాణలో 120 ఖాళీలు ఉన్నాయి. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న రాష్ట్రం/జిల్లా ప్రాథమ్యాలను పేర్కొనాల్సి ఉంటుంది. దానికి అనుగుణంగా మెరిట్ జాబితా రూపొందించి, నియామకం ఖరారు చేస్తారు.

అర్హతలు

- సెప్టెంబర్ 1, 2024 నాటికి ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.

» కెనరా బ్యాంక్‌లో అప్రెంటీస్ నియామకాలు
» దేశ వ్యాప్తంగా మొత్తం 3000 ట్రైనీ పోస్టులు
» ఏపీలో 200, తెలంగాణలో 120 ఖాళీలు
» శిక్షణతోపాటు నెలకు రూ.15,000 స్టైఫండ్

- **వయసు:** సెప్టెంబర్ 1, 2024 నాటికి 20-28 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఏడాది శిక్షణ

అప్రెంటీస్ ట్రైనీగా నియామకం ఖరారు చేసుకున్న వారికి ఏడాది పాటు ఆన్ జాబ్ ట్రైనింగ్ ఉంటుంది. బ్యాంకు శాఖల్లో ఆయా విభాగాల విధుల్లో క్షేత్ర స్థాయి శిక్షణనిస్తారు. ఆ సందర్భంగా బ్యాంకులో వివిధ విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఇంటర్/డిప్లొమాలో మెరిట్

కెనరా బ్యాంక్ అప్రెంటీస్ ఎంపిక ప్రక్రియలో భాగంగా ఎలాంటి రాత పరీక్షలు ఉండవు. కేవలం అకడమిక్ మెరిట్ ఆధారంగానే నియామకాలు ఖరారు చేయనున్నారు. ఈ పోస్టులకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతను అర్హతగా పేర్కొన్నప్పటికీ.. మెరిట్ జాబితా రూపకల్పనలో.. ఇంటర్మీడియెట్/డిప్లొమా మార్కులను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేస్తారు. వీరికి తదుపరి దశలో డాక్యుమెంట్ వెరిఫికేషన్ చేసి నియామకం ఖరారు చేస్తారు.



లాంగ్వేజ్ టెస్ట్

- ఎంపిక ప్రక్రియలో ఇంటర్మీడియెట్/డిప్లొమా మార్కులను ప్రాతిపదికగా తీసుకుంటామని పేర్కొన్నప్పటికీ.. అవసరమైతే డాక్యుమెంట్ వెరిఫికేషన్ సమయంలో లాంగ్వేజ్ టెస్ట్ నిర్వహిస్తారు. బ్యాంక్ నిబంధనల మేరకు అభ్యర్థులు తమ రాష్ట్రానికి సంబంధించిన భాషను ఒక సబ్జెక్ట్‌గా పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లలో ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. అలా చదవని వారికి స్థానిక భాషపై ఉన్న అవగాహనను తెలుసుకునేలా లోకల్ లాంగ్వేజ్ టెస్ట్ ఉంటుంది. ఈ లాంగ్వేజ్ టెస్ట్‌లో భాగంగా.. సంబంధిత స్థానిక భాషలో జనరల్ ఎస్సే, లెటర్ రైటింగ్ పరీక్షలను నిర్వహిస్తారు. ఈ పరీక్షను అరగంట వ్యవధిలో 50 మార్కులకు నిర్వహించే అవకాశం ఉంది.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి తెలుగు/ఉర్దూ భాషను ఒక సబ్జెక్ట్‌గా పదో తరగతి / ఇంటర్మీడియెట్‌లో చదివిన వారికి లాంగ్వేజ్ టెస్ట్ నుంచి మినహాయింపు ఉంటుంది.

నెలకు రూ.15 వేల స్టయిఫండ్

అప్రెంటీస్ ట్రైనీగా శిక్షణ సమయంలో నెలకు రూ.15 వేల స్టయిఫండ్ అందిస్తారు. ఇందులో రూ.10,500ను బ్యాంక్ చెల్లిస్తుంది. మిగతా రూ.4,500ను అప్రెంటీస్ ప్రమోషన్ స్కీమ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నేరుగా అప్రెంటీస్ ట్రైనీ బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. బ్యాంకు అవసరాల మేరకు ఫీల్డ్ వర్క్‌కు వెళితే నిబంధనలను అనుసరించి టీఏ, డీఏ కూడా చెల్లిస్తారు. అధిక శాతం అప్రెంటీస్ ట్రైనీలకు ఫీల్డ్ వర్క్ లేకుండా.. బ్యాంకు శాఖ కార్యాలయంలోనే విధులు నిర్వర్తించేలా నియమావళి ఉంటుంది. అప్రెంటీస్ ట్రైనీలుగా నియమితులైన అభ్యర్థులు.. క్లరికల్ కేడర్‌లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వినియోగదారులతో సంప్రదింపులు, బ్యాంకుల్లో రోజువారీ విధులైన లెడ్జర్ మేనేజ్‌మెంట్, లావాదేవీల నమోదు, బ్యాంకు ప్రొడక్ట్‌ల మార్కెటింగ్ వంటి విధులు ఉంటాయి.

ఎన్ఏటీఎస్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

కెనరా బ్యాంక్ అప్రెంటీస్ ట్రైనీ నియామకాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు.. తప్పనిసరిగా ముందుగా నేషనల్ అప్రెంటీస్ ట్రైనింగ్ స్కీమ్ పోర్టల్‌లో తమ ప్రొఫైల్ నమోదు చేసుకోవాలి. ఆ రిజిస్ట్రేషన్ వివరాల ఆధారంగానే(రిజిస్ట్రేషన్ నెంబర్).. బ్యాంకు నోటిఫికేషన్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అదే విధంగా దరఖాస్తు సమయంలో అభ్యర్థులు తమ రాష్ట్రానికి సంబంధించి జిల్లాల వారీగా ఉన్న ఖాళీలను గుర్తించి.. అన్ని జిల్లాలను తమ ప్రాథమ్య క్రమంలో పేర్కొనే వెసులుబాటు కూడా కల్పించారు. తుది నియామకాలు, పోస్టింగ్ మాత్రం బ్యాంక్ నిబంధనల మేరకు ఉంటాయి.

క్షేత్ర నైపుణ్యాలకు మార్గం

బ్యాంక్‌లో అప్రెంటీస్ ట్రైనీగా విధులు నిర్వర్తించడం ద్వారా బ్యాంకింగ్ రంగంలోని క్షేత్ర నైపుణ్యాలు సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది. దీనికోసమే నేషనల్ అప్రెంటీస్ యాక్ట్-1961లో మార్పులు చేసి.. బ్యాంకుల్లో సైతం అప్రెంటీస్ నియామకాలు చేపట్టే విధంగా నిబంధనలు రూపొందించారు. దీంతో.. పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇటీవల కాలంలో అప్రెంటీస్ నియామకాలను చేపడుతున్నాయి.

భవిష్యత్తు అవకాశాలు

ఇటీవల కాలంలో పలు బ్యాంకులు అనుభవం ఆధారంగా నియామకాలు చేపడుతున్నాయి. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో సాగే అప్రెంటీస్ ట్రైనింగ్ పూర్తి చేసుకుంటే.. ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో పీఓ, సీఆర్ఎం వంటి ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు.

లాంగ్వేజ్ టెస్ట్‌లో రాణించేలా

అభ్యర్థులు లోకల్ లాంగ్వేజ్ టెస్ట్‌లో రాణించేందుకు.. ఆయా భాషల్లోని న్యూస్ పేపర్లను చదవడం, ఎడిటోరియల్స్ చదవడం, వాటిని తిరిగి సొంతంగా రాయడం వంటివి ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా లెటర్ రైటింగ్‌కు సంబంధించి ఫార్మాట్స్, బిజినెస్, వ్యక్తిగత, అధికారిక లెటర్స్ రాసే విధానాలపై పట్టు సాధించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎన్ఏటీఎస్ పోర్టల్‌లో ప్రొఫైల్ రిజిస్ట్రేషన్:** 2024, సెప్టెంబర్ 18 నుంచి
- **బ్యాంక్ వెబ్‌సైట్‌లో దరఖాస్తుకు చివరి తేదీ:** 2024, అక్టోబర్ 4
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://canarabank.com/pages/career**

డీఆర్‌డీవోలో 200 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)కు చెందిన రీసెర్చ్ సెంటర్ ఇమారత్(ఆర్‌సీఐ)లో అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 200. అప్రెంటిస్‌షిప్ కాల వ్యవధి: ఒక సంవత్సరం.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-40, టెక్నీషియన్ అప్రెంటిస్-40, ట్రేడ్ అప్రెంటిస్-120.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్,కంప్యూటర్ సైన్స్, మెకానికల్, కెమికల్, కమర్షియల్,ఫిట్టర్, ఎలక్ట్రీషియన్,ఎలక్ట్రానిక్ మెకానిక్,వెల్డర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.08.2024 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, సర్టిఫికేట్ల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేది:** ప్రకటన వెలువడిన 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://www.drdo.gov.in

కేజీబీవీల్లో 604 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా (పాఠశాల విద్యాశాఖ) ఆధ్వర్యంలో నిర్వహించే కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏడాది కాలానికి బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 604.
» **పోస్టుల వివరాలు:** ప్రిన్సిపల్-10, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)-165.



» కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్(సీఆర్‌టీ)-163.
» **సబ్జెక్టులు:**తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్,బయలాజికల్ సైన్స్,సోషల్ స్టడీస్.
» ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ)-04, పార్ట్ టైమ్ టీచర్(పీటీటీ)-165, వార్డెన్-53, అకౌంటెంట్-44.
» **సబ్జెక్టులు:** ఇంగ్లిష్, సివిక్స్, కామర్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఒకేషనల్.
» **అర్హత:**పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ, యూజీడీపీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.



» **వేతనం:** నెలకు ప్రిన్సిపల్‌కు రూ.34,139, పీజీటీకి రూ.26,759, సీఆర్టీకి రూ.26,759, పీఈటీకి రూ.26,759, అకౌంటెంట్‌కు రూ.18,500, వార్డెన్‌కు రూ.18,500, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.18,500.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, సర్వీస్ వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.10.2024.
» **వెబ్‌సైట్:** https://apkgbv.apcfss.in


ఏవీఎన్‌ఎల్(ఎంటీపీఎఫ్), అంబర్‌నాథ్ యూనిట్‌లో 81 పోస్టులు

థానే(మహారాష్ట్ర) జిల్లాలోని అంబర్‌నాథ్ యూనిట్‌లో ఆర్మ్‌ర్డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్(ఏవీఎన్‌ఎల్)-మెషిన్ టూల్ ప్రోటైప్ ఫ్యాక్టరీ(ఎంటీపీఎఫ్) ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 81.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ మేనేజర్-26, డిప్లొమా టెక్నీషియన్-34, అసిస్టెంట్-02, జూనియర్ టెక్నీషియన్-19.
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైనాన్స్-అకౌంట్స్, మార్కెటింగ్-ఎక్స్‌పోర్ట్, ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్,సీఎన్‌సీ ఆపరేటర్,క్వాలిటీ-ఇన్‌స్పెక్షన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,స్టోర్/ఎంఎం / ప్రొక్యూర్‌మెంట్, ఎలక్ట్రీషియన్, గ్రైండర్, మిల్‌రైట్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** జూనియర్ మేనేజర్ పోస్టులకు నెలకు రూ.47,610, జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు రూ.34,227, జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు రూ.37,201.
» **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆర్మ్‌ర్డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్, మెషిన్ టూల్ ప్రోటైప్ ఫ్యాక్టరీ, ఆర్డినెన్స్ ఎస్టేట్, అంబర్‌నాథ్, థానే జిల్లా, మహారాష్ట్ర చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.10.2024.
» **వెబ్‌సైట్:** https://avnl.co.in



ప్రకృతి గీసే చిత్రాలు అద్భుతంగా ఉంటాయి. ఇది కూడా అలాంటిదే. నిప్పులు కక్కుతున్న డ్రాగన్‌లాగా కనిపిస్తోంది కదూ.. ఐస్‌ల్యాండ్‌లో ఓ అగ్ని పర్వతం బద్దలై లావా ప్రవహించినప్పుడు అదిలా డ్రాగన్ రూపంలో కనిపించింది.

గవర్నర్, సీఎం బతుకమ్మ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆడబిడ్డలందరికీ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పూలను పూజిస్తూ.. ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మగా పేర్కొన్నారు. పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతిక జీవనానికి బతుకమ్మ ప్రతీకని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. ప్రకృతిని, పూలను దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ ప్రపంచ సంస్కృతి సంప్రదాయాల్లోనే ప్రత్యేక తను చాటుకుందన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డలు, రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా జరుపుకోవాలి: సీతక్క, సురేఖ

సాక్షి, హైదరాబాద్: బుధవారం నుంచి ప్రారంభమవుతున్న పూల పండుగ బతుకమ్మ సందర్భంగా మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖ వేర్వేరు ప్రకటనల్లో రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల సామూహిక జీవన విధానం నుంచి పుట్టిన ప్రకృతి పండుగను ఘనంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ప్రకృతిలో దొరికే పూలతో బతుకమ్మలను పేర్చాలని, కొలనులు, చెరువులను సహజస్థితిలో కొనసాగేలా పర్యావరణహితంగా బతుకమ్మ పండుగను జరుపుకోవాలన్నారు.

ఉపాధ్యాయినికి అరుదైన గౌరవం

ఉద్యోగ విరమణ సందర్భంగా గుర్రపు బగ్గీలో ఊరేగింపు



సనత్‌నగర్ (హైదరాబాద్): ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయినిని ఊరేగించి ఆమెపై గౌరవాన్ని చాటుకున్నారు ఆ పాఠశాల విద్యార్థులు. అశోక్‌కాలనీలో సనత్‌నగర్ ఓల్డ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయిని మనోరమ ఉద్యోగ విరమణ సందర్భంగా సహచర ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. 2009 నుంచి చదువుకున్న వారంతా హాజరై మనోరమను సత్కరించారు. మనోరమ దంపతులను గుర్రపు బగ్గీలో కూర్చోబెట్టి.. మేళతాళాలతో ఊరేగించారు. బాలానగర్ ఎంఈఓ హరిచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

1,746 మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం



డిగ్రీ పట్టాను ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో జస్టిస్ నరసింహారెడ్డి, వీసీ ప్రొఫెసర్ బీజేరావు

చందానగర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 24వ స్నాతకోత్సవం అట్టహాసంగా సాగింది. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌సీయూ చాన్స్‌లర్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, వీసీ ప్రొఫెసర్ బీజేరావు సమక్షంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ.సీతారామ్ చేతుల మీదుగా 1,746 మంది విద్యార్థులకు డిగ్రీలు అందించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 164 మంది విద్యార్థులకు మెడల్స్ కూడా ప్రదానం చేశారు. స్నాతకోత్సవంలో ఆనవాయితీ ప్రకారం అందరూ ఖాదీ, చేనేత దుస్తులనే ధరించారు. అతిథులు, చాన్స్‌లర్, వీసీ, ఫ్యాకల్టీ ప్రతినిధులు ప్రతి స్నాతకోత్సవంలో తెల్లటి కుర్తా ధరించేవారు కానీ ఈసారి ప్రత్యేకంగా లైట్ బ్లూ రంగు కుర్తా ధరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెడల్స్, పట్టాలు అందుకున్న విద్యార్థులు వారి కుటుంబసభ్యులతో ఫొటోలు దిగుతూ మురిసిపోయారు.

57 ఏళ్ల వయసులో పీహెచ్‌డీ



ఎల్ అండ్ టీ కంపెనీలో సీఎఫ్‌వోగా పనిచేసిన డాక్టర్ వాసుదేవ్ చివుకుల హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. 57 ఏళ్ల వయసులో పీహెచ్‌డీ పట్టా అందుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు.

15 రోజుల ఆపరేషన్.. 27 మంది సైబర్ క్రిమినల్స్ అరెస్ట్

- తొలిసారి అంతర్రాష్ట్ర ఆపరేషన్ చేపట్టాం
- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి
- బయటి రాష్ట్రాల్లో ఆపరేషన్స్‌కు స్పెషల్ టీం ఏర్పాటు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న శిఖాగోయల్. చిత్రంలో డీఎస్పీలు సూర్యప్రకాష్, వేణుగోపాల్‌రెడ్డి, కేవీఎం ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాల్లో కొల్లగొట్టిన సొమ్ము లావాదేవీలు చేసేందుకు తమ బ్యాంకు ఖాతాలను కమీషన్ల కోసం ఇస్తున్న (మ్యూల్ బ్యాంక్ ఖాతాలు) 27 మంది నిందితులను టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. టీజీసీఎస్‌బీ అధికారులు తొలిసారిగా చేపట్టిన అంతర్రాష్ట్ర ఆపరేషన్‌లో భాగంగా ఈ నిందితులను రాజస్తాన్‌లోని 3 ప్రాంతాల్లో అరెస్టు చేసినట్టు బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో టీజీసీఎస్‌బీ ఎస్పీ దేవేందర్‌సింగ్, ఇతర అధికారులతో కలిసి ఆమె మాట్లాడారు.

తెలంగాణలో 189 సైబర్ నేరాలతో వీరికి సంబంధం..

'అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లను పట్టుకోవడానికి మొదటిసారిగా స్పెషల్ ఆపరేషన్ చేపట్టాం. రాజస్తాన్‌లోని జైపూర్, జోథ్‌పూర్, నాగ్‌పూర్‌లలో 15 రోజులపాటు చేసిన ఈ ఆపరేషన్‌లో 27 మందిని అరెస్ట్ చేశాం. దేశవ్యాప్తంగా జరిగిన 2,223 సైబర్ నేరాలలో వీరు నిందితులుగా ఉన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 189 సైబర్ నేరాల్లో వీరికి సంబంధం ఉంది. పట్టుబడిన వారిలో నిరుద్యోగులతోపాటు కాంట్రాక్టర్లు, వ్యాపారాలు చేస్తున్నవారు..ప్రైవేటు ఉద్యోగులు కూడా ఉన్నారు. నిందితులు అందరూ విద్యావంతులే. వీరంతా 29 మ్యూల్ బ్యాంక్ ఖాతాల ద్వారా రూ. 11.01 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు చేసినట్టు గుర్తించాం. తెలంగాణకు సంబంధించిన 189 కేసులలో కొల్లగొట్టిన రూ.9 కోట్లు వీరి బ్యాంకు ఖాతాల ద్వారానే పలు బ్యాంకు ఖాతాలకు మళ్లించారు. ఈ బ్యాంకు ఖాతాలను వినియోగించి చేసిన మోసాలలో ప్రధానంగా వ్యాపార పెట్టుబడులు, ట్రేడింగ్‌తోపాటు డిజిటల్ అరెస్టు వంటి నేరాలు ఉన్నాయి' అని శిఖాగోయల్ వెల్లడించారు. సైబర్ మోసగాళ్ల పనిపట్టేందుకు టీజీ సీఎస్‌బీ ఆధ్వర్యంలో ఇకపైన కూడా అంతర్రాష్ట్ర ఆపరేషన్లు కొనసాగుతాయని, ఇందుకు స్పెషల్ టీంను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పట్టుబడిన 27 మంది వద్ద నుంచి 31 మొబైల్ ఫోన్లు, 37 సిమ్ కార్డులు, రెండు హార్డ్‌డిస్కులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితులను పోలీస్ కస్టడీకి తీసుకుని విచారిస్తే మరికొన్ని కీలక విషయాలు తెలుస్తాయన్నారు. కమీషన్ల కోసం తమ బ్యాంకు ఖాతాలను, వ్యక్తిగత వివరాలు ఇతరులకు ఇచ్చి చిక్కులు కొనితెచ్చుకోవద్దని ప్రజలను శిఖాగోయల్ హెచ్చరించారు. కాగా, స్పెషల్ ఆపరేషన్‌లో పాల్గొన్న డీఎస్పీలు కేవీ సూర్యప్రకాశ్, ఫణీందర్, వేణుగోపాల్‌రెడ్డి, హరికృష్ణ, కేవీఎం ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు రమేశ్, ఆశిష్‌రెడ్డి, రవికుమార్, శ్రీను నాయక్, సునీల్, ఇతర సిబ్బందిని శిఖాగోయల్ ప్రత్యేకంగా అభినందించారు.

మంగళసూత్రాల కథ కంచికి!

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కొన్నేళ్లుగా నడుస్తున్న అమ్మవారి మంగళసూత్రాల కథ కంచికి చేరినట్లుగా తెలుస్తోంది. కోవిడ్‌కు ముందు ఆలయంలోని సీతమ్మ వారి మంగళసూత్రాలను కొందరు మాయం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయం బహిర్గతం కావడంతో.. గుట్టుచప్పుడు కాకుండా మళ్లీ తయారు చేయించి వాటి స్థానంలో ఉంచారన్న ప్రచారం అప్పుడు సాగింది. దీంతోపాటు పలు అంశాలపై ఓ భక్తుడు కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి కోర్టులో కేసు సాగుతుండగా.. ఇటీవల జరిగిన లోక్‌అదాలత్‌లో సదరు పిటిషనర్ కేసు ఉపసంహరించుకున్నట్టు సమాచారం. కాగా, ఇది కోర్టు పరిధిలోని అంశం కావడంతో ఆలయ వర్గాలు సైతం దీనిపై స్పందించడానికి నిరాకరిస్తున్నాయి.

వయో వృద్ధుల సంక్షేమానికి కృషి: మంత్రి సీతక్క



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న పలువురు ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: సొంత బిడ్డలా వయోవృద్ధుల సంక్షేమ బాధ్యతను ప్రజా ప్రభుత్వం నిర్వర్తిస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రవీంద్ర భారతిలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంత ర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పాటు పిల్లల ప్రేమకు నోచుకోని తల్లిదండ్రు లకు తిరిగి ఆస్తిని అప్పగించే చర్యలు చేపడుతామన్నారు. వృద్ధాప్య పెన్షన్ల చట్టాన్ని కేంద్రం పెంచాలని డిమాండ్ చేశారు. వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత టోల్ ఫ్రీ సేవలను మరింత పటిష్టం చేస్తామని హామీనిచ్చారు. వయోవృద్ధులకు బస్సుల్లో ప్రయాణ రాయితీలు కల్పించే అంశాన్ని సీఎం, మంత్రి దృష్టికి తీసుకు వెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

యాప్ ప్రారంభించిన మంత్రి

వయోవృద్ధుల ఫిర్యాదుల నమోదు కోసం రూపొందించిన యాప్‌ను సీతక్క ప్రారంభించారు. మీసేవ కేంద్రాలలో వయోవృద్ధులు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఈసందర్భంగా వయోవృద్ధులను సన్మానించారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్న హైదరా బాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని అభినందించారు. ఉన్నతాధికారులు వాకాటి కరుణ, శైలజ పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పత్తితీత పనులకు ఆంధ్రా కూలీలు


యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని జనగాం గ్రామంలో పత్తి తీస్తున్న ఆంధ్రా కూలీలు

ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాల నుంచి రాక

కూలి గిట్టుబాటు అవుతుందంటున్న వలస కూలీలు

డిసెంబర్ వరకు ఇక్కడే ఆవాసం

సంస్థాన్ నారాయణపురం: పత్తి చేలలో పత్తి తీత పనులకు ఆంధ్రా ప్రాంతం నుంచి కూలీలు వస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఆంధ్రా కూలీలు కుటుంబసభ్యులతో బృందాలుగా వచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,18,765 ఎకరాలలో సుమారు 60 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పంట చేతికొచ్చే సమయంలో ఇక్కడ కూలీల కొరత ఏర్పడడంతో చాలామంది రైతులు పత్తి తీయలేకపోయారు. చేలపైనే పత్తి ఉండడంతో ఇటీవల వర్షాలకు దెబ్బతిని రైతులు నష్టపోయారు. వివిధ చోట్ల నుంచి కూలీలను తీసుకొచ్చే ప్రయత్నంలో ఆంధ్రా కూలీలపై దృష్టి సారించారు. ఎప్పటి నుంచో స్థానికంగా ఉంటున్న ఆంధ్రాప్రాంతానికి చెందిన వారి ఆధారంగా ఇక్కడ పెద్ద రైతులందరూ ఆంధ్రా కూలీలను ఆశ్రయించారు. తమకు తెలిసిన వాళ్లతో ఫోన్ల ద్వారా సంప్రదించి ఆంధ్రా ప్రాంతంలోని ప్రకాశం, గుంటూరు, కర్నూలు ప్రాంతాలకు చెందిన కూలీలను రప్పిస్తున్నారు. వారం రోజుల క్రితం వచ్చిన ఆంధ్రా కూలీలు డిసెంబర్ రెండో వారం వరకు పత్తి తీసేందుకుగానూ ఇక్కడే ఉండనున్నారు. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లను స్థానిక రైతులే చూస్తున్నారు. కిలో పత్తి తీసినందుకు రూ.12 చొప్పున చెల్లిస్తున్నారు. ఒక్కో కూలీ రోజుకు 50కిలోల నుంచి 60కిలోల వరకు పత్తి తీస్తున్నారు. రూ.600 నుంచి రూ.720కుపైగా కూలి గిట్టుబాటు అవుతుంది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోనే సుమారు 2వేల మందికిపైగా ఆంధ్ర కూలీలు పత్తి తీసే పనుల్లో నిమగ్నమయ్యారు.

అక్కడ పనుల్లేక వచ్చాం...



మా దగ్గర మే నెల నుంచి జనవరి నెల వరకు అంతగా పనులు ఉండవు. పనులు లేకపోవడంతో, తెలిసిన వారి ద్వారా పత్తితీత పనుల కోసం ఇక్కడికి వస్తున్నాం. కూలీ మంచిగానే గిట్టుబాటు అవుతోంది. ఇక్కడ పని దొరికినందుకు సంతోషంగా ఉంది.

– సలోమి, వలస కూలీ త్రిపురాంతకం, ప్రకాశం జిల్లా

కూలి గిట్టుబాటు అవుతుంది...



ఇక్కడ పత్తితీస్తే రూ.600 నుంచి 700 వరకు వస్తున్నాయి. రోజుకు అన్ని ఖర్చులు పోను రూ.500 గిట్టుబాటు అవుతుంది. వారం క్రితం పత్తి తీత పనులకు వచ్చాను. ఇక్కడి రైతులు ఫోన్ చేయడంతో, మా బంధువులు, పరిచయస్తులతో కలిసి మొత్తం 17మందిమి వచ్చాం.

– ఉప్పులపాటి మార్క్, వలస కూలీ ప్రకాశం జిల్లా

మానవత్వం నేర్పిన మహాత్ముడు

సాక్షి, హైదరాబాద్: అహింసనే ఆయుధంగా మలచిన సమర యోధుడు, మానవాళికి మానవత్వం నేర్పిన మహనీయుడు మహాత్మా గాంధీ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. స్వాతంత్ర్య పోరాట దిక్సూచి, భరతజాతి మౌలిక స్ఫూర్తి అని కొనియాడారు. అంతర్జాతీయ సత్యాగ్రహ దినోత్సవంగా పాటించే జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించారు.



లాల్ బహదూర్ అరుదైన నేత: సీఎం

సాక్షి, హైదరాబాద్: 'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో రైతులు, సైనికుల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి ఔన్నత్యాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. స్వతంత్ర భారత రెండో ప్రధానమంత్రిగా లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలను అక్టోబర్ 2న ఆయన జయంతి సందర్భంగా సీఎం స్మరించుకున్నారు. లాల్ బహదూర్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

గాంధీజీ స్ఫూర్తితోనే తెలంగాణ: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశ స్వాతంత్ర్య సాధనకు సాగిన పోరాటాన్ని శాంతియుతంగా నడిపించి గమ్యాన్ని చేరుకున్న జాతిపిత మహాత్మాగాంధీ ప్రజాస్వామిక స్ఫూర్తి.. తెలంగాణ సాధన కోసం తాను సాగించిన మలిదశ పోరాటంలో ఇమిడి ఉందని తెలంగాణ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా.. దేశం కోసం మహాత్ముడు చేసిన కృషిని, త్యాగాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. గాంధీజీ బోధనలు అన్ని కాలాలు, వర్గాలకు ఆచరణీయమని పునరుద్ఘాటించారు.



ఎవరు అడ్డొచ్చినా మూసీ ప్రక్షాళన ఆగదు

కాంగ్రెస్ ఎమ్మెల్యే సామేల్

సాక్షి, హైదరాబాద్ : ఎవరు అడ్డుపడినా మూసీ ప్రక్షాళన జరిగి తీరుతుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ స్పష్టం చేశారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూసీని పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే మాత్రం అడ్డుపడుతోందని ధ్వజమెత్తారు. మూసీ నీళ్లతోనే వేలాది ఎకరాల్లో పంటలు పండుతున్నాయని, పెద్ద విపత్తు వస్తే హైదరాబాద్‌కు పెనుముప్పు ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళనయితే హైదరాబాద్‌కు పర్యాటకులు పెరుగుతారని అభిప్రాయపడ్డారు. ప్రక్షాళన చేస్తామంటే కేటీఆర్, హరీశ్‌రావులు ఎగిరెగిరి పడుతున్నారని, మూసీపై కేటీఆర్ మతిలేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు.




నగరం మంచికే 'హైడ్రా': చామల

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరం మంచి కోసమే 'హైడ్రా' ఏర్పాటైందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లా డారు. భావితరాలకు హైదరాబాద్‌ను మంచి నగరంగా చూపించాలంటే త్యాగం చేయక తప్పదని స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చేసే కార్యక్రమానికి ప్రతిపక్షాలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాల్ని ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే అక్కసుతో హైడ్రా, మూసీపై విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా 28 వేల అక్రమ కట్టడాలున్నాయని చెప్పారని, వాటి కూల్చివేతకు మీడియాతో పాటు ప్రజలు సహకరించాలని కోరారు.



కూల్చివేతలు ఆపకుంటే ప్రజలే ప్రభుత్వాన్ని కూల్చివేస్తారు: ఎంపీ.కె.లక్ష్మణ్

హైడ్రా పేరుతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారంటూ ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో హైడ్రా చేపట్టిన కూల్చివేతలు ఆపకుంటే ప్రజలే రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చేస్తారని బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ హెచ్చరించారు. హైడ్రా పేరుతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని తన నివాసంలో మంగళవారం లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకుముందు అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అటకెక్కించిన రేవంత్ సర్కార్..అరచేతిలో వైకుంఠం, ఓట్లు వేసిన ప్రజలకు చుక్కలు చూపిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కదానినీ అమలు చేయలేదని మండిపడ్డారు. కుటుంబం, బంధుప్రీతి, మైనార్టీల బుజ్జగింపులు, దేశ విచ్ఛిన్నకర శక్తులకు కాంగ్రెస్ గ్యారంటీ అని విమర్శించారు. తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో మోసపోయిన ప్రజలు కాంగ్రెస్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హరియాణాలో కాంగ్రెస్ ఇచ్చిన ఏడు గ్యారంటీలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని బ్యూటిఫికేషన్ పేరుతో పేదల ఇళ్లు కూల్చడం సరికాదని హితవు పలికారు.


ట్యాపింగ్ కేసులో వివరాలు సేకరించాల్సి ఉంది

- ఈ దశలో బెయిల్ ఇవ్వడం సరికాదన్న హైకోర్టు
- నిందితుడు తిరుపతన్న బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుల నుంచి సేకరించిన ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల నుంచి ఇంకా డేటాను సేకరించాల్సి ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ దశలో నిందితుడు తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను అనుమతించలేంటూ కొట్టేసింది. విచారణ కొనసాగుతున్న దశలో బెయిల్ ఇవ్వడం సరికాదని అభిప్రాయపడింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో హైదరాబాద్ నగర భద్రతా విభాగం అదనపు డీసీపీగా పనిచేస్తున్న మేకల తిరుపతన్నను మార్చిలో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో బెయిల్ కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టారు. సాక్ష్యాధారాలు మాయం చేయడంలో పిటిషనర్ కీలకంగా వ్యవహరించారని ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5 (2)ని ఉల్లంఘించి బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో గెలిపించడమే ధ్యేయంగా పనిచేయడంలో ఆయన పాత్ర కూడా ఉందన్నారు. పీపీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. 'ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత ఎఫ్ఎస్ఎల్ నివేదిక అందినట్లు స్పష్టమవుతోంది. ఎఫ్ఎస్ఎల్ నివేదికలో పిటిషనర్ మొబైల్ ఫోన్ సహా ఇతర నిందితులు ఉపయోగించిన మొబైల్ ఫోన్‌లు/ల్యాప్‌టాప్‌లకు సంబంధించిన సమాచారం ఉంది. తదుపరి విచారణ కోసం పిటిషనర్ ఫోన్ నుంచి సేకరించిన డేటాను విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇద్దరు నిందితులు ఏ–1 (ప్రభాకర్‌రావు), ఏ–6 (శ్రవణ్‌కుమార్) ఇంకా పరారీలో ఉన్నారు. నిందితులు ఉన్నత స్థానాల్లో ఉన్న పోలీసులు. ఇంకా డేటా విశ్లేషించాల్సి ఉంది. అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయాలి. ఈ దశలో పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేయడం సరైంది కాదన్న పీపీ వాదనను పరిగణనలోకి తీసుకుంటున్నాం' అని తీర్పునిచ్చారు.

అత్యాచార నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోండి

సిద్దిపేట సీపీకి దత్తాత్రేయ ఫోన్



సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధతో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్‌లో మాట్లాడారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బాధిత బాలికకు పునరావాస ఏర్పాట్లు చేయాలని, కస్తూరిబా గాంధీ పాఠశాలలో చదువుకునేందుకు ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపి నిందితుడు షరీఫుద్దీన్‌ని కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. బాలిక ఉన్నత చదువులకోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, అలాగే నిందితునిపై కఠిన చర్యలు తీసుకుంటామని దత్తాత్రేయకు పోలీస్ కమిషనర్ హామీ ఇచ్చారు.

ఎన్‌హెచ్ఆర్సీ చైర్‌పర్సన్‌కు శిల్పారెడ్డి ఫిర్యాదు...

సిద్దిపేట జిల్లాలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) చైర్‌పర్సన్‌కు బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ఫిర్యాదు చేశారు. గత ఆరు నెలలుగా హిందూ అమ్మాయిలపై హిందూయేతర వ్యక్తుల అత్యాచారాలు పెరిగిపోయినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆమె కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు.

రేపు నీటి భద్రతకు చతుర్విధ జలప్రక్రియపై సమావేశం

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'తెలంగాణలో నీటి భద్రత కోసం టి.హనుమంతరావు చతుర్విధ జల ప్రక్రియే ఏకైక మార్గం'అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణ, రాజస్తాన్‌లో గత వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాల లబ్ధిదారులు, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాస్త్రవేత్తలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు ఇస్తారని తెలియజేశారు. కృష్ణా నదిపై తెలంగాణలోని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎక్కువగా వరద జలాలపైనే ఆధారపడి ఉన్నాయి తప్ప నికర జలాలపై కాదని తెలిపారు. గోదావరి నదిపై ఎత్తిపోతల నీటిపారుదల ప్రాజెక్టులు, అధిక వార్షిక పునరావృత చార్జీల వలన అంచనా వేసిన నీటిపారుదల లక్ష్యాలను చేరుకునే విశ్వాసం పూర్తిస్థాయిలో లేదన్నారు. ఈ కీలక దశలో రాష్ట్ర ప్రభుత్వం నీటి భద్రతను సాధించేందుకు వినూత్న చర్యలను చేపట్టాలన్నారు. అందుకే టి.హనుమంతరావు చతుర్విధ జల ప్రక్రియ ఆధారంగా వాటర్ షెడ్ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే ఇప్పుడు ఏకైక మార్గమని సూచించారు. ఇది లిఫ్ట్ ప్రాజెక్టులకయ్యే ఖర్చుతో పోలిస్తే చాలా తక్కువని ఏడాదిలో మూడు పంటలకు సాగునీరు అందించవచ్చని తెలిపారు.

మూసీ నిర్వాసితులను రెచ్చగొడుతున్నారు

బీఆర్ఎస్ నాయకులపై ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ మండిపాటు



సాక్షి, హైదరాబాద్: మూసీ నిర్వాసితులను బీఆర్ఎస్ నాయకులు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కేసీఆర్ హయాంలో భూ నిర్వాసితులను పట్టించుకోలేదని, హైదరాబాద్ నాలాలపైన 28వేల అక్రమ కట్టడాలున్నాయని నాడు కేసీఆర్ చెప్పిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నాయకత్వం కోసం హరీశ్‌రావు, కేటీఆర్ పోటీ పడి హడావుడి చేస్తున్నారని, ఆక్రమణదారులు పేదలను ముందు పెట్టిమాట్లాడిస్తు న్నారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్రూంపై చర్చకు వచ్చే దమ్ము కేటీఆర్‌కు ఉందా అని నిలదీశారు. మూసీలో నివాసం ఏర్పాటు చేసుకున్న వారు స్వచ్ఛందంగా ఖాళీ చేస్తున్నారని, వారికి డబుల్ బెడ్రూంలు ఇస్తున్నామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు దగ్గరకు ప్రతిపక్షాలు, మీడియా వెళ్లకుండా తాళాలు వేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని మండిపడ్డారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను ఎక్కడా అడ్డుకోవడంలేదని, బీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులకు రక్షణ కల్పించే బాధ్యత మా ప్రభుత్వానికి ఉందని, సీఎం రేవంత్‌రెడ్డికి కక్ష సాధింపు చర్యలకు దిగరని స్పష్టం చేశారు.

100 రోజులన్నారు... 9 నెలలు గడిచాయి..!

- గొర్రెల పంపిణీ ఊసెత్తని కాంగ్రెస్ సర్కార్
- అవినీతి కేసుల సాకుతో పథకం అమలు నిలిపివేత
- 3 లక్షలకు పైగా గొల్ల కురుమల ఎదురుచూపులు
- రూ.43 వేల చొప్పన డీడీలు కూడా చెల్లించిన 80 వేల మంది
- డీడీలు వాపస్ తీసుకోవాలని చెబుతున్న అధికారులు
- పథకం తక్షణమే అమలు చేయాలంటూ పెరుగుతున్న డిమాండ్లు



సాక్షి, హైదరాబాద్: 'అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రెండోదశ గొర్రెల పంపిణీ'.. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సందర్భంగా వివిధ సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీల్లో భాగంగా గొల్ల కురుమలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీ ఇది. కాగా ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటిపోయాయి కానీ, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ గొర్రెల పథకం ఊసే ఎత్తడం లేదు. పైగా ఏసీబీ కేసులు, ఈడీ దర్యాప్తుల సాకుతో గొల్ల కురుమలు కట్టిన డీడీలను సైతం వెనక్కు ఇచ్చేస్తుండడం గమనార్హం.

కురుమల జీవన ప్రమాణాలు పెంచే ఆలోచనతో..

గొర్రెలను సబ్సిడీపై అందజేయడం ద్వారా రాష్ట్రంలో జీవాల సంఖ్య, మాంసం ఉత్పత్తిని పెంచడంతో పాటు గొల్ల కురుమల జీవన ప్రమాణాలను పెంచాలన్న ఆలోచనతో గత ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. 2017లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 4 లక్షల మంది గొల్ల కురుమలకు సబ్సిడీ గొర్రెలు అందించగా, మలి విడత కింద రాష్ట్రంలోని 3,37,816 మందికి గొర్రెలు రావాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికలు రావడం, కాంగ్రెస్ పార్టీ కూడా గొర్రెలు పంపిణీ చేస్తామని చెప్పడంతో రెండో విడత లబ్ధిదారులు వీటిపై ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 వేల మంది తమ వాటా కింద రూ.43,750 చొప్పున డీడీలు తీసి మరీ ఎదురుచూస్తున్నారు. కానీ ఈ పథకం అమలు ప్రస్తుతం సందిగ్ధంలో పడిపోయింది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ, ఈడీలు రంగంలోకి దిగి నలుగురు అధికారులను అరెస్టు చేశాయి. వారు జైలుకెళ్లి బెయిల్‌పై విడుదల కూడా అయ్యారు. మరోవైపు ఈడీ అధికారులు ఒక్కరోజు హడావుడి చేసి వివరాలు తీసుకెళ్లేందుకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి వస్తామని సమాచారమిచ్చి రాలేదు. దీంతో కేసు దర్యాప్తు ఇసుమంతైనా ముందుకు కదలడం లేదు. ఇంకోపక్క ఈ కేసుతో సంబంధాలున్న ముఖ్య దళారీని ఇంతవరకు అరెస్టు చేయకపోగా, మరో కీలకపాత్రధారి విదేశాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ కేసుల దర్యాప్తు ఎప్పుడు ముగిస్తారో, ఎప్పుడు గొర్రెల పంపిణీ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తారో అన్నదానిపై స్పష్టత లేకుండా పోయింది.

ప్రభుత్వం తక్షణమే పథకం అమలు చేయాలి

గత ప్రభుత్వ హయాంలో ఏదో జరిగిందని, ఈ ప్రభుత్వం చేయాల్సిన కార్యక్రమాన్ని పక్కన పెట్టడం దారుణం. గొల్ల కురుమలకు జీవాల పెంపకమే ప్రధాన జీవనాధారం. వారి జీవన ప్రమాణాలు పెరిగేందుకు గత ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చినా అవినీతి విచ్చలవిడిగా జరగడంతో దాని స్ఫూర్తి నిర్వీర్యమయింది. అవినీతిపై దర్యాప్తు చేయడం వల్ల మాకేమీ ఇబ్బంది లేదు. కానీ పథకాన్ని నిలిపివేయడం, కట్టిన డీడీలు వెనక్కు ఇవ్వడం సమంజసం కాదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చి యూనిట్ కాస్ట్‌ను నేరుగా గొర్రెల కాపరుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయాలి. డీడీల వాపస్ ప్రక్రియను నిలిపివేయాలి.

– ఉడుత రవీందర్, తెలంగాణ గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అయ్యో.. వైజాగ్ తాజ్



రాణి చంద్రమతి దేవి స్మృతి చిహ్నంగా నిర్మించిన ఈ సుందర కట్టడాన్ని విశాఖ వాసులు విశాఖ తాజ్‌మహల్‌గా పిలుచుకుంటారు. అద్భుతమైన ఈ కట్టడం పట్టించుకునేవారు లేకపోవడంతో ఇలా శిథిలావస్థకు చేరుకుంది. బీచ్ రోడ్డులోని ఈ కట్టడాన్ని పురావస్తుశాఖ సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అలుసిస్తే అల్లేస్తాం..



పిచ్చిమొక్కల్ని ఎప్పటికప్పుడు తొలగించకపోతే పరిస్థితి ఇలాగే ఉంటుంది. నెల్లూరు వెంకటేశ్వరపురం టిడ్కో గృహాల మధ్య ప్రదేశాన్ని శుభ్రపరచకుండా వదిలేయడంతో తీగజాతి మొక్కలు ఇలా ఇళ్లపై అల్లుకుంటూపోయాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

గుత్తులు గుత్తుల పంట..గిట్టుబాటు ధరేదంట?



పందిరి నిండా వేలాడిన ద్రాక్ష గుత్తులు చూసి రైతుకు కడుపు నిండిపోతుంది. కానీ.. పంట అమ్మకానికి పెట్టినప్పుడు గిట్టుబాటు ధర రాకపోతే ప్రాణం విలవిల్లాడిపోతుంది. అనంతపురం జిల్లా తిమ్మంపేటకి చెందిన వెంకట శివారెడ్డి ద్రాక్ష తోట ఇది. ఫలసాయం బాగున్నా ధర లేకపోవడంతో ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతు కోరుతున్నాడు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

కొలిక్కివస్తున్న పోలవరం

డిస్ట్రిబ్యూటరీల వ్యయ ఆమోదం

పోలవరం డిస్ట్రిబ్యూటరీల అంచనా వ్యయం రూ.5,338.9 కోట్లు

- కేంద్ర జల్ శక్తి శాఖకు 8 నెలల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిపాదన
- దీనిపై సీడబ్ల్యూసీ సందేహాలను నివృత్తి చేసిన అధికారులు
- వ్యయం ఆమోదంపై సీడబ్ల్యూసీ కసరత్తు కొలిక్కి
- అనంతరం భూసేకరణ, పనులు ప్రారంభం
- జలాశయం పూర్తయ్యేలోగా డిస్ట్రిబ్యూటరీలు నిర్మించాలంటున్న నిపుణులు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద 7.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేసేందుకు బ్రాంచ్ కాలువలు, పిల్ల కాలువల (డిస్ట్రిబ్యూటరీలు) తవ్వడానికి రూ.5,338.9 కోట్లు వ్యయం అవుతుందని జలవనరుల శాఖ అధికారవర్గాలు తేల్చాయి. జలాశయం పనులు పూర్తయ్యేలోగా కాలువలతోపాటు డిస్ట్రిబ్యూటరీలను కూడా పూర్తి చేసి సత్వరమే ఆయకట్టుకు నీళ్లందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రణాళిక రచించింది. దీని ప్రకారం కుడి కాలువ కింద 3.20 లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఏర్పాటుకు రూ.2,248.89 కోట్లు, ఎడమ కాలువ కింద 4 లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఏర్పాటుకు రూ.3,090.01 కోట్లు ఖర్చవుతుందని లెక్క కట్టారు. ఆ మేరకు నిధులు కోరుతూ పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ద్వారా కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర జల్ శక్తి శాఖకు 8 నెలల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. వాటిపై సీడబ్ల్యూసీ అధికారులు పలు మార్లు లేవనెత్తిన సందేహాలను రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులు నివృత్తి చేశారు. దీంతో డిస్ట్రిబ్యూటరీల అంచనా వ్యయాన్ని ఆమోదించే ప్రక్రియను కొలిక్కి తెచ్చారు. ఆ ప్రక్రియను పూర్తి చేసి, డిస్ట్రిబ్యూటరీలకు భూసేకరణ చేసి, పనులకు టెండర్లు పిలవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే జలాశయం నిర్మాణం పూర్తయ్యేలోగా డిస్ట్రిబ్యూటరీలను పూర్తి చేసేందుకు ఆస్కారం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

ఇప్పటికే జలాశయం పనులు కొలిక్కి..

గోదావరి వరదను మళ్లించేలా స్పిల్ వేను పూర్తి చేయకుండానే అప్పటి చంద్రబాబు సర్కారు ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్ నిర్మించడం ద్వారా చేసిన చారిత్రక తప్పిదం పోలవరం ప్రాజెక్టులో విధ్వంసానికి కారణమైంది. వైఎస్ జగన్ ప్రభుత్వం చంద్రబాబు సర్కారు చేసిన తప్పులను సరిదిద్దుతూ.. స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11నే గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా 6.1 కిలోమీటర్ల పొడవున మళ్లించింది. కుడి కాలువలో మిగిలిన పనులతో పాటు ఎడమ కాలువలలో కీలకమైన నిర్మాణాలు, జలాశయంతో కాలువల అనుసంధానం



పనులు పూర్తి చేసింది. **దెబ్బతిన్న డయాఫ్రం వాల్** భవితవ్యాన్ని తేల్చితే శరవేగంగా ప్రాజెక్టును పూర్తి చేస్తామని 2022 డిసెంబర్ నుంచి కేంద్రాన్ని కోరుతూ వచ్చింది. అంతర్జాతీయ నిపుణుల సహకారం తీసుకుని డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చి, ప్రాజెక్టును పూర్తి చేసే విధానాన్ని ఖరారు చేస్తామని అప్పట్లో కేంద్రం చెప్పింది. ఇటీవల పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన అంతర్జాతీయ **నిపుణుల** బృందం.. **డయాఫ్రం వాల్ దెబ్బతిం**దని, సమాంతరంగా కొత్తది నిర్మించాలని చెప్పింది. ఇప్పటికే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తయిన నేపథ్యంలో వరదల్లోనూ డయాఫ్రం వాల్ పనులు చేపట్టి, ఈసీఆర్‌ఎఫ్ డ్యాంను పూర్తి చేయడానికి అవకాశం ఏర్పడిందని సాగునీటి రంగ నిపుణులు చెబుతున్నారు.

కేంద్ర ప్రాయోజిత పథకాలను ముందుకు తీసుకెళ్లాలి..

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అమలు జరుగుతున్న పలు కేంద్ర ప్రాయోజిత పథకాలను యుద్ధ ప్రాతిపదికన ముందుకు తీసుకెళ్లడం ద్వారా కేంద్రం నుంచి మరిన్ని పథకాలు, నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఆక్వా రంగంలో మంజూరైన వివిధ సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్‌లను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు మరిన్ని నిధులు, పథకాలను రాష్ట్రానికి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. చేపల, రొయ్యల చెరువుల వివరాలన్నింటినీ నూరు శాతం కంప్యూటరీకరించడంతో పాటు ఆయా ఉత్పత్తులకు తగిన పరీక్షల నిర్వహణకు ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రం నుంచి నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులు పెద్ద ఎత్తున ఎగుమతయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇదిలా ఉండగా, టిడ్కో గృహాల ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకూ రూ.16,900 కోట్ల పనులు పూర్తి చేశామని, మిగతా పనులు పూర్తి చేసేందుకు మరో రూ.7,000 కోట్లు అవసరమని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ సీఎస్ దృష్టికి తెచ్చారు. వివిధ శాఖల్లో జరుగుతున్న పనుల గురించి ఆయా శాఖ ప్రత్యేక కార్యదర్శులు వివరించారు. ఢిల్లీ నుంచి ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ వర్చువల్‌గా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర పథకాలకు సంబంధించి నిర్వహించిన పనులకు సకాలంలో యూసీలు సమర్పిస్తేనే కేంద్రం నుంచి తదుపరి నిధులు మంజూరు చేయించుకునేందుకు అవకాశం ఉందన్నారు.

చంద్రబాబు హిందువు కాదు.. నాస్తికుడు

- లడ్డూపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలి
- కేఏ పాల్ డిమాండ్
- లడ్డూ వివాదంపై సుప్రీం కోర్టులో పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హిందువు కాదని, వాస్తవానికి ఆయన నాస్తికుడని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ చెప్పారు. తాను నిర్వహించిన శాంతి సమావేశాల్లో దేవుడిని నమ్మనని చంద్రబాబు చెప్పారని, ఆయనే ఇప్పుడు టీటీడీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. పాల్ మంగళవారం ఢిల్లీలోని ఏపీ, తెలంగాణ భవన్‌లో విలేకరుతో మాట్లాడారు. తిరుమల తిరుపతిని కేంద్ర పాలిత ప్రాంతం చేయాలని, లడ్డూ వివాదాంపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ లడ్డూ కేసును దర్యాప్తు చేస్తే.. దొంగే కేసును దర్యాప్తు చేసినట్లుంటుందని ఎద్దేవా చేశారు. లడ్డూ వివాదం ద్వారా హిందువులకు, క్రైస్తవులకు మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని, దీనిని అడ్డుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయించానని తెలిపారు. లడ్డూలో కల్తీ జరగకుండానే జరిగిందని చెబుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రజలు, భక్తుల్లో గందరగోళం సృష్టిస్తున్నారని, ఈ వివాదంపై వారు మాట్లాడకుండా గ్యాగ్ ఆర్డర్ కోరానని తెలిపారు.

కార్మికుల పొట్టకొట్టకండి

తిరుపతి అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసి వేలాదిమంది కార్మికులు పొట్టకొట్టకండి అంటూ విద్యార్థి సంఘం నేతలు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతిలోని ఆర్డీవో కార్యాలయం వద్ద నేతలు పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కత్తి రవి, ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఒక విధంగా, అధికారం వచ్చిన తర్వాత మరోలా చిన్నబాబు,పెద్దబాబులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుతామని చెప్పి...అధికారంలో ఉన్న చోద్యం చూస్తున్నారని ఆవేదన చెందారు.

పార్టీ ఎమ్మెల్యేలు, నేతలను కలెక్టర్లు గౌరవించాలి

రెవెన్యూ మంత్రి అనగాని

సాక్షి, అమరావతి: పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కలెక్టర్లు తగిన గౌరవం ఇవ్వాలని, వారు తెచ్చిన సమస్యలను నిబంధనలకు అనుగుణంగా ఉంటే వెంటనే పరిష్కరించాలని, పొలిటికల్ గవర్నెన్స్ కూడా ముఖ్యమని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కలెక్టర్లకు సూచించారు. మంగళగిరిలోని సీసీఎల్ఎ కార్యాయలంలో మంగళవారం జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా, సీసీఎల్ఎ జయలక్ష్మి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఐజీ శేషగిరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్, రిజిస్టర్డ్ ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్, ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు పరిష్కారం, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సీఎంవో, రెవెన్యూ మంత్రి కార్యాయలం, తన కార్యాలయాల నుంచి వచ్చిన అర్జీలకు సరైన సమయంలో స్పందించకుంటే ఆయా కలెక్టర్లపై చర్యలుంటాయని హెచ్చరించారు.

మీడియా కో-ఆర్డినేటర్ పోస్టులు భర్తీ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి కార్యాలయంలో రెండు మీడియా కో-ఆర్డినేటర్లను నియమిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంట్రాక్టు విధానంలో రెండు సంవత్సరాల కాల వ్యవధితో గుమ్మడి ప్రభాకర్, నూర్బాషా అజీ బాబును నియమించారు. నెలకు రూ.90 వేలు వేతనంగా నిర్ణయించారు. సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ నివేదిక ప్రకారం ఈ రెండు పోస్టులను భర్తీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా బ్రహ్మారెడ్డి



నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా గుంటూరుకు చెందిన వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి నియమితులయ్యారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ చైర్మన్ ఎస్.ద్వారకానాథ్‌రెడ్డి ఈమేరకు నియమాక ఉత్తర్వులు జారీ చేసినట్ల బ్రహ్మారెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని న్యాయవాదులపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, సాక్షులను విచారించనున్నామని చెప్పారు. బాధితుల ఫిర్యాదులకు సంఘం పక్షాన పరిష్కారం చూపుతామన్నారు. బార్ కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగినంత వరకు చైర్మన్‌గా ఉంటానని తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా బ్రహ్మారెడ్డిని ది గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందించారు.

క్లుప్తంగా...

వరదల్లో వృద్ధులు, పిల్లల్ని కాపాడిన వారికి సత్కారం



సాక్షి, అమరావతి: ప్రాణాలను పణంగా పెట్టి ముంపు నీటిలో చిక్కుకున్న వందలాది మందికి సాయం అందించి అందరికీ ఆదర్శంగా నిలిచిన సాయిరాం కేటరింగ్ బృందాన్ని వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ అభినందించారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో 15 ఏళ్లుగా సాయిరాం కేటరింగ్ నిర్వహిస్తున్న రవికుమార్, కర్రి పోసయ్య, కర్రి నాని, మలాది చరణ్, వినోద్ బృందం ఇటీవల వరదల్లో చిక్కుకున్న వృద్ధ మహిళలు, పిల్లలను రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారని కొనియాడారు. వ్యవసాయశాఖ తరపున వారికి దుశ్శాలువాలు కప్పి సత్కరించారు.

కృత్తివెంటికి ప్రచురణ మిత్ర పురస్కారం




డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు అవార్డు అందజేస్తున్న జస్టిస్ హిమా కోహ్లీ, కేంద్ర మాజీ మంత్రి స్మృతీ ఇరానీ

సాక్షి, అమరావతి: కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు ప్రతిష్ఠాత్మక ఫ్రెండ్స్ ఆఫ్ పబ్లిషింగ్ అవార్డు లభించింది. పుస్తక ప్రచురణ రంగంలో విశేషంగా కృషి చేసిన వారికి భారత ప్రచురణకర్తల సమాఖ్య ఏటా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తుంది. శ్రీనివాసరావు ప్రచురణ పరిశ్రమకు చేసిన సేవలకు న్యూఢిల్లీలో ప్రచురణకర్తల సమాఖ్య నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ప్రచురణ మిత్ర పురస్కారాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లీ, కేంద్ర మాజీ మంత్రి స్మృతీ ఇరానీ అందజేశారు. ఇందులో భాగంగానే సాహిత్య అకాడమీ ప్రచురిస్తున్న సంస్కృత పత్రిక ×సంస్కృత్ ప్రతిభా×కు ప్రథమ బహుమతి, అకాడమీ హిందీ పత్రిక ×సమకాలీన భారతీయ సాహిత్య×కు, బాలసాహిత్య విభాగంలోనూ సాహిత్య అకాడమీకి ద్వితీయ బహుమతులు లభించాయి.

మహాత్మా మన్నించు!

- గాంధీ మండపంలో క్లీనింగ్
- మద్యం బాటిళ్ల లభ్యం కావడంతో తమిళనాడు గవర్నర్ రవి ఆవేదన



సాక్షి, చెన్నై: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం చెన్నై గిండిలోని గాంధీ మండపం పరిసరాలను గవర్నర్ ఆర్‌ఎన్ రవి శుభ్రం చేశారు. అయితే, అక్కడ మద్యం ఖాళీ బాటిళ్ల లభించడంతో ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు.. బుధవారం గాంధీ జయంతిని జరుపుకునేందుకు తమిళనాడు సిద్ధమైంది. ఈ పరిస్థితుల్లో గిండిలోని గాంధీ మండపం పరిసరాలను గవర్నర్ ఆర్‌ఎన్ రవి నేతృత్వంలో శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఇక్కడ తనకు కనిపించిన దృశ్యాలు తీవ్ర మనోవేదనకు గురిచేశాయని పేర్కొన్నారు.

పెద్దేరు వాగుపై రోప్‌వే బ్రిడ్జి నిర్మిస్తాం: మంత్రి సంధ్యారాణి

సాక్షి, అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం సుందరికొండలో పెద్దేరు వాగుపై రోప్‌వే బ్రిడ్జి నిర్మిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు. గత వారం ఒక బాలింతను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు గిరిజన కుటుంబం పడ్డ అవస్థలకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో మంత్రి స్పందించారు. రూ.70 లక్షలతో రోప్‌వే బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, వర్షాలు తగ్గగానే పనులు ప్రారంభిస్తామని మంగళవారం నాడు మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. భక్తులు టీబీసీ వరకు బారులు తీరారు. సోమవారం అర్ధరాత్రి వరకు 66,986 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 26,163 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.5.05 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.2.15 కోట్లు



కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. ఈ లెక్కింపులో హుండీ ద్వారా రూ.2,15,30,322 భక్తులు కానుక రూపంలో సమర్పించుకున్నారు. అలాగే బంగారం 90 గ్రాములు, వెండి 1.295 కిలోలున్నాయి. గో సంరక్షణ హుండీ లెక్కించగా రూ.29,513, నిత్యాన్నదానం హుండీ నుంచి రూ.44,159, విదేశీ కరెన్సీ యూఎస్‌ఏవీ 947 డాలర్లు, యూఏఈ 120 దిర్హామ్, మలేషియావి 406 రింగిట్, ఆస్ట్రేలియావి 10 డాలర్లు, యూరోప్‌వి 150 యూరోలు, ఇంగ్లాడ్‌వి 55 పౌండ్స్, కెనడా 110 డాలర్స్ వచ్చినట్లు ఆలయ ఈఓ గురుప్రసాద్ తెలిపారు.

అప్పన్నకు విశేషంగా గరుడసేవ



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఈసేవని ఉదయం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారి శేషవస్త్రాలను అందజేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



డాబాగార్డెన్స్: విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు తిరుపతిరావు వేదపండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. తర్వాత స్వామికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పరిశోధనల్లోనూ పోటీతత్వం ఉండాలి

రాజానగరం: నేటి ఆధునిక సమాజంలో అన్నింటిలోనూ పోటీతత్వం పెరుగుతోందని, ఇదే క్రమంలో పరిశోధనల్లో కూడా పోటీతత్వాన్ని అలవర్చుకుని, నూతనావిష్కరణలో ముందడుగు వేయాలని తూర్పుగోదావరి జిల్లాలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. యూనివర్సిటీలో పీహెచ్‌డీ మొదటి బ్యాచ్ అడ్మిషన్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌డీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భావితరాలకు, సమాజానికి ప్రయోజనం చేకూర్చే విధంగా పరిశోధనలు ఉండాలని సూచించారు.

విద్యా సమాచారం

ఎంఈడీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జూలైలో నిర్వహించిన ఎంఈడీ 4వ సెమిస్టర్ ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం దామ్లానాయక్ తెలిపారు. ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

'వరల్డ్ బెస్ట్ టీచర్' అవార్డుకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్ : ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ బెస్ట్ టీచర్ ఇంటర్నేషనల్ అవార్డ్స్-2024 ప్రదానం చేయనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అవార్డు కోసం అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తమ దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, బోధన, శిక్షణ అనుభవాలతో పూర్తి వివరాలు గల సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలను పంపాలని కోరారు. దరఖాస్తులను ఈనెల 5వ తేదీలోపు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబర్ : 1-20-164, గోకుల్ నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపించాలని సూచించారు. ఇతర వివరాలకు 9652347207 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బిజినెస్ రీల్

గిఫ్ట్ సిటీలో కాగ్నిజెంట్
టెక్‌ఫిన్ సెంటర్ ఏర్పాటుకు రెడీ



అహ్మదాబాద్: గ్లోబల్ దిగ్గజం కాగ్నిజెంట్ గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ(గిఫ్ట్ సిటీ) గాంధీనగర్‌లో టెక్‌ఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. 2025 ఫిబ్రవరిలో ప్రారంభించనున్న ఈ సెంటర్‌ను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సొల్యూషన్ల వ్యూహాత్మక కేంద్రంగా వినియోగించనున్నట్లు పేర్కొంది. ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, ఇన్సూరెన్స్(బీఎఫ్‌ఎస్‌ఐ) పరిశ్రమలకు సంబంధించిన క్లయింట్లకు ఆధునిక సాంకేతిక సొల్యూషన్లు సమకూర్చనున్నట్లు తెలియజేసింది. ప్రాథమికంగా ఈ సెంటర్‌లో 500 మంది ఉద్యోగులకు ఉపాధి కల్పించనుంది. రానున్న మూడేళ్లలో ఈ సంఖ్యను 2,000కు పెంచనుంది. ప్రపంచస్థాయి కంపెనీలను ఆకట్టుకోవడంలో రాష్ట్రానికున్న పటిష్టతను గిఫ్ట్ సిటీలో కాగ్నిజెంట్ కొత్త కేంద్రం ప్రతిబింబిస్తున్నట్లు గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలు, అభివృద్ధికి అత్యుత్తమ వాతావారణాన్ని కల్పిస్తున్నట్లు తెలియజేశారు. కాగా.. టెక్‌ఫిన్ సెంటర్ ద్వారా బీఎఫ్‌ఎస్‌ఐ క్లయింట్లకు డిజిటల్ పరివర్తనలో తోడ్పాటునివ్వనున్నట్లు కాగ్నిజెంట్ పేర్కొంది.

ఆర్‌ఐఎల్ గ్యాస్ ధర పెంపు
ఒక్కో ఎంఎంబీటీయూకి 10.16 డాలర్లు



న్యూఢిల్లీ: లోతైన సముద్ర జలాల నుంచి వెలికితీసే సహజవాయు(నేచురల్ గ్యాస్) ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. దీంతో కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ కేజీ- డీ6 బ్లాకు నుంచి వెలికితీసే గ్యాస్ ధర స్వల్పంగా బలపడింది. ఒక్కో ఎంఎంబీటీయూ 9.87 డాలర్ల నుంచి 10.16 డాలర్లకు పెరిగింది. అయితే సీఎన్‌జీ తయారీకి వినియోగించే గ్యాస్ ధరల్లో మార్పులేదని ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీంతో పాటు పైప్‌డ్ గ్యాస్, వంట గ్యాస్ ధరల్లోనూ మార్పులుండవని స్పష్టం చేసింది. మార్కెట్ ధర కంటే 30 శాతం తక్కువగా వీటికి ధరల పరిమితిని అమలు చేయడం కారణమని తెలియజేసింది. అక్టోబర్ 1 మొదలు ఆరు నెలల పాటు పెంచిన గ్యాస్ ధరలు అమలుకానున్నట్లు చమురు శాఖకు చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్(పీపీఏసీ) వెల్లడించింది. స్థానికంగా ఉత్పత్తి చేసే నేచురల్ గ్యాస్ ధరలను ప్రభుత్వం ఆరు నెలలకు ఒకసారి సవరించే సంగతి తెలిసిందే. లోతైన సముద్ర జలాల నుంచి వెలికితీసే ఇంధనాలు, పురాతన చమురు క్షేత్రాలకు ధరల నిర్ణయంలో ప్రభుత్వం విభిన్న పద్ధతులను అవలంబిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/ 100కు రూ.లలో)

2-10-2024	
విశాఖ	535-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,623.00	2.9
M&M	3,168.00	2.36
BRITANNIA	6,452.15	1.8
INFY	1,906.00	1.62
ADANIENT	3,183.00	1.5

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	1,409.15	-2.66
ONGC	292.4	-1.75
ASIANPAINT	3,275.00	-1.63
BAJAJ-AUTO	12,175.75	-1.38
TATASTEEL	166.7	-1.1

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	7,914
ఎన్‌ఎస్‌ఈ	1,04,772
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,02,413
ఎఫ్‌ఐఐ	- 5,579
డీఐఐ	+ 4,610

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.94	$ 68.17
బ్రెంట్	73.60	$ 71.07



ప్రణయ్ రాయ్, రాధిక రాయ్‌లకు
సీబీఐ క్లీన్‌చిట్!

న్యూఢిల్లీ: ఎన్‌డీటీవీ వ్యవస్థాపకులు ప్రణయ్ రాయ్, రాధిక రాయ్‌లపై 2017 దర్యాప్తును సీబీఐ ముగించింది. ఈ కేసులో వారికి క్లీన్‌చిట్ ఇస్తూ, 2009లో తీసుకున్న రుణ సెటిల్‌మెంట్‌లో ఎన్‌డీటీవీ, దాని అప్పటి ప్రమోటర్లు ఐసీఐసీఐ బ్యాంకుకు రూ. 48 కోట్ల నష్టం కలిగించారని సూచించడానికి చట్టబద్ధంగా ఎటువంటి ఆధారాలు లభించలేదని తన క్లోజర్ నివేదికలో సీబీఐ పేర్కొందని సంబంధిత వర్గాలు తెలిపాయి. డిసెంబర్ 2022లో అదానీ గ్రూప్ ఓపెన్ ఆఫర్ ద్వారా ఎన్‌డీటీవీలో అతిపెద్ద వాటాదారుగా మారిన సంగతి తెలిసిందే.

సెప్టెంబర్‌లో 'తయారీ' పేలవం
ఎనిమిది నెలల కనిష్టానికి సూచీ



న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం సెప్టెంబర్‌లో పేలవ పనితనాన్ని ప్రదర్శించింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56.5కు తగ్గింది. గడచిన ఎనిమిది నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో సూచీ నమోదుకావడం ఇదే తొలిసారి. ఆగస్టులో సూచీ 57.5 వద్ద ఉంది. అయితే ఈ సూచీ 50పైన ఉంటే దీనిని వృద్ధి ధోరణిగానే పరిగణించడం జరుగుతుంది. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. ఉత్పత్తి, అమ్మకాలు, కొత్త ఎగుమతుల ఆర్డర్లు సెప్టెంబర్‌లో తగ్గినట్లు సర్వే నివేదిక తెలిపింది. దాదాపు 400 తయారీ సంస్థల ప్యానల్‌లోని పర్చేజింగ్ మేనేజర్‌లకు పంపబడిన ప్రశ్నపత్రాల ప్రతిస్పందనలను అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మదింపుచేసి, హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పీఎంఐని రూపొందిస్తుంది.

ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో వాటా విక్రయం
1.24 % అమ్మిన హైడ్రా ట్రేడింగ్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా హైడ్రా ట్రేడింగ్ 1.24 శాతం వాటాను విక్రయించింది. బ్యాంక్ పబ్లిక్ వాటాదారులలో ఒకటైన హైడ్రా షేరుకి రూ. 203 సగటు ధరలో 75.11 లక్షల షేర్లను అమ్మివేసింది. వీటి విలువ రూ. 152.5 కోట్లుకాగా.. క్రోనస్ మెర్కండైజ్ ఎల్‌ఎల్‌పీ కొనుగోలు చేసింది. 2024 జూన్‌కల్లా ఆర్‌బీఎల్‌లో హైడ్రా వాటా 1.25 శాతంగా నమోదైంది.

సైయెంట్ డీఎల్‌ఎం, స్పైస్‌జెట్‌లో..
బీఎస్‌ఈ వివరాల ప్రకారం మరో లావాదేవీలో ప్లూటస్ వెల్త్ మేనేజ్‌మెంట్ స్పైస్‌జెట్‌లో 0.66 శాతం వాటా(85 లక్షల షేర్లు)ను కొనుగోలు చేసింది. షేరుకి రూ. 60 సగటు ధరలో వీటిని దాదాపు రూ. 51 కోట్లకు సొంతం చేసుకుంది. స్పైస్‌జెట్ షేర్ల విక్రయదారుల వివరాలు వెల్లడికాలేదు. ఎన్‌ఎస్‌ఈ గణాంకాల ప్రకారం మోర్గాన్ స్టాన్లీ సైయెంట్ డీఎల్‌ఎంలో 4.34 లక్షల షేర్లను విక్రయించింది. షేరుకి రూ. 667 సగటు ధరలో వీటిని రూ. 29 కోట్లకు అమ్మివేసింది. హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ 0.5 శాతం వాటాకు సమానమైన 4 లక్షల షేర్లను కొనుగోలు చేసింది. దీంతో సైయెంట్ డీఎల్‌ఎంలో హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ వాటా 4.79 శాతం నుంచి 5.29 శాతానికి బలపడింది.

బీఎస్‌ఈలో ఆర్‌బీఎల్ బ్యాంక్ షేరు 1.6 % క్షీణించి రూ. 204 వద్ద నిలవగా.. స్పైస్‌జెట్ షేరు 8% జంప్‌చేసి రూ. 63.7 వద్ద ముగిసింది. సైయెంట్ డీఎల్‌ఎం షేరు 0.6% నీరసించి ఎన్‌ఎస్‌ఈలో రూ. 668 వద్ద ముగిసింది.

ఆఫీస్ స్పేస్ మార్కెట్లో జోరు



- జూలై-సెప్టెంబర్ కాలంలో 31 శాతం వృద్ధి
- 17.3 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీ లీజింగ్
- హైదరాబాద్‌లో 16 శాతం అధికం
- కొలియర్స్ ఇండియా డేటా విడుదల

న్యూఢిల్లీ: కార్యాలయ వసతులకు (ఆఫీస్ స్పేస్) డిమాండ్ బలంగా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా ఆరు ప్రముఖ పట్టణాల్లో జూలై-సెప్టెంబర్ మధ్య 17.3 మిలియన్ చదరపు అడుగుల (ఎస్‌ఎఫ్‌టీ) స్థూల లీజింగ్ నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ పరిమాణం 13.2 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీ కంటే 31 శాతం పెరిగినట్టు కొలియర్స్ ఇండియా విడుదల చేసిన డేటా స్పష్టం చేసింది. బెంగళూరు, హైదరాబాద్ మార్కెట్లలోనే సగం మేర లీజింగ్ నమోదు కావడం గమనార్హం.

పట్టణాల వారీగా లీజింగ్
- హైదరాబాద్ మార్కెట్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ సెప్టెంబర్ క్వార్టర్‌లో 16 శాతం పెరిగి రూ.2.9 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో స్థూల లీజింగ్ 2.5 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా ఉంది.
- బెంగళూరులో 6.3 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీ లీజింగ్ జరిగింది. ఒక త్రైమాసికం వారీగా అత్యధిక లీజింగ్ ఇదే కావడం గమనించొచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 3.4 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీతో పోలిస్తే 85 శాతం పెరిగింది.
- పుణెలో స్థూల ఆఫీస్ స్పేస్ లీజింగ్ 2.6 మిలియన్ ఎ స్‌ఎఫ్‌టీగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఒ క మిలియన్ ఎస్‌ఎఫ్‌టీ లీజింగ్ నమోదైంది.
- ముంబైలో 1.7 మిలియన్, చెన్నైలో 1.4 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీ చొప్పున స్థూల లీజింగ్ జరిగింది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో ఆఫీస్ లీజింగ్ క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 25%పెరిగి 2.4 మిలి యన్ ఎస్‌ఎఫ్‌టీకి చేరుకుంది. స్థూల లీజింగ్‌లో రెన్యువల్స్, ఆసక్తి వ్యక్తీకరణ లావాదేవీలను కలపలేదు.

జూలై-సెప్టెంబర్ కాలంలో నమోదైన స్థూల లీజింగ్‌లో 25 శాతం మేర టెక్నాలజీ రంగం నుంచే ఉన్నట్టు కొలియర్స్ ఇండియా డేటా తెలియజేసింది. ఆ తర్వాత బీఎఫ్‌ఎస్‌ఐ కంపెనీలు, ఫ్లెక్స్ స్పేస్ ఆపరేటర్ల నుంచి లీజ్ ఒప్పందాలు అధికంగా జరిగాయి.

టెక్నాలజీ రంగం నుంచి డిమాండ్

''గడిచిన 2-3 ఏళ్లలో వివిధ రంగాలు, విభిన్న మార్కెట్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. లీజింగ్ మార్కెట్ ఏటేటా కొత్త గరిష్టాలకు చేరుకుంటోంది. 2024లోనూ అధిక డిమాండ్, సరఫరా కనిపిస్తోంది'' అని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర్వీసెస్ ఎండీ అర్పితా మల్హోత్రా తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, ముంబై మార్కెట్లలో ఈ ఏడాది మొదటి మూడు త్రైమాసికాల్లో (జనవరి-సెప్టెంబర్) ఆఫీస్ స్పేస్ డిమాండ్ 2023 మొత్తం డిమాండ్‌ను అధిగమించినట్టు చెప్పారు. సెప్టెంబర్ క్వార్టర్‌లో లీజు లావాదేవీల్లో రూ.లక్ష ఎస్‌ఎఫ్‌టీకి మింపడించినవే 65 శాతంగా ఉన్నట్టు తెలిపారు.





సామర్థ్యం పెంచుకున్న జేఎస్‌డబ్ల్యు సిమెంట్

న్యూఢిల్లీ: సిమెంట్ తయారీ సంస్థ జేఎస్‌డబ్ల్యు సిమెంట్ కర్నాటకలోని విజయనగర్ ప్లాంటుకు అదనంగా 2 మిలియన్ టన్నుల సామర్థ్యాన్ని జోడించింది. దీంతో ఈ కేంద్రం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 6 మిలియన్ టన్నులకు చేరుకున్నట్లు కంపెనీ మంగళవారం ప్రకటించింది. విస్తరణ కోసం రూ.461 కోట్లు పెట్టుబడి పెట్టామని, మొత్తం గ్రైండింగ్ సామర్థ్యం 20.6 మిలియన్ టన్నులకు చేరిందని వెల్లడించింది. కొత్త ప్లాంట్ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న కేంద్రాల సామర్థ్యం పెంచడం ద్వారా సమీప భవిష్యత్తులో మొత్తం గ్రైండింగ్ సామర్థ్యాన్ని 40.85 మిలియన్ టన్నులకు చేర్చాలని సంస్థ లక్ష్యంగా చేసుకున్నట్టు జేఎస్‌డబ్ల్యు సిమెంట్ సీఈవో నీలేశ్ నార్వేకర్ తెలిపారు. రాజస్తాన్, పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో నూతనంగా ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ ఇప్పటికే ప్రకటించింది.

ఎన్‌సీసీకి రూ.2,327 కోట్ల ఆర్డర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ సంస్థ ఎన్‌సీసీ సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.2,327 కోట్ల విలువైన ఆర్డర్లను దక్కించుకుంది. ట్రాన్స్‌పోర్టేషన్ విభాగం రూ.1,417 కోట్లు, ఎలక్ట్రికల్ రూ.520 కోట్లు, బిల్డింగ్స్ విభాగం రూ.390 కోట్ల ఆర్డర్లను వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల నుంచి సాధించిందని కంపెనీ మంగళవారం తెలిపింది.

ఏఐ ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్ విలీనం

న్యూఢిల్లీ: దేశీ విమానయాన రంగంలో కీలక కన్సాలిడేషన్‌కు తెరలేచింది. తాజాగా ఎయిరిండియా గ్రూప్ రెండు సంస్థలు విలీనమయ్యాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌తో చౌక ధరల సంస్థ ఏఐఎక్స్ కనెక్ట్ విలీనం పూర్తయినట్లు ఎయిరిండియా పేర్కొంది. దీంతో విలీన సంస్థ వచ్చే మార్చికల్లా 100కుపైగా విమానాలతో సర్వీసులను నిర్వహించనున్నట్లు అంచనా వేసింది. ప్రస్తుతం ఉమ్మడిగా 88 విమానాలను కలిగి ఉన్నాయి. ఏడాదికంటే ముందుగానే విలీన ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడించింది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పేరు(ఐఎక్స్ కోడ్)తో సర్వీసులను నిర్వహించనున్నట్లు పేర్కొంది. 2024 అక్టోబర్ 1నుంచి ఏఐఎక్స్ కనెక్ట్‌కు చెందిన అన్ని విమానాలు ఏఐఎక్స్(ఏవోసీ)కు బదిలీ అవుతాయని డీజీసీఏ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ రెండు సంస్థలు టాటా గ్రూప్‌నకు చెందినవేకాగా.. వచ్చే నెలలో ఎయిరిండియాతో విస్తారాను సైతం విలీనం చేస్తున్న విషయం విదితమే.

చిన్న బ్యాంకుల్లో దారుణ వడ్డీ రేట్లు
ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్



ముంబై: కొన్ని స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు (ఎస్‌ఎఫ్‌బీలు) విపరీత పోకడలు పోతూ.. అట్టడుగు వర్గాలకు చెందిన రుణ గ్రహీతల నుంచి భారీ వడ్డీ రేట్లను వసూలు చేస్తుండడం నిరుత్సాహకరమని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ వ్యాఖ్యానించారు. కొన్ని ఎస్‌ఎఫ్‌బీలు ముందస్తుగానే కొన్ని వాయిదాల మొత్తాన్ని రుణ గ్రహీతల నుంచి తీసుకుని, వాటిని రుణంలో సర్దుబాటు చేయడం లేదన్నారు. పైగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు చెప్పారు. వ్యాపార వృద్ధి కోసం స్థిరమైన, బాధ్యతాయుత వ్యాపార విధానాలను పాటించాలని స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లకు సూచించారు. ఎస్‌ఎఫ్‌బీలపై బెంగళూరులో ఆర్‌బీఐ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా స్వామినాథన్ మాట్లాడారు. కొన్ని ఎస్‌ఎఫ్‌బీలు బోర్డులో కనీసం ఇద్దరు హోల్‌టైమ్ డైరెక్టర్లను కూడా లేకపోవడాన్ని ఆర్‌బీఐ గుర్తించినట్టు చెప్పారు. కేవలం ఒకే ఒక్క పూర్తి కాల డైరెక్టర్ కలిగి ఉండడం కొన్ని సందర్భాల్లో సమస్యలకు దారితీయవచ్చంటూ.. మరింత మంది హోల్‌టైమ్ డైరెక్టర్ల నియామకంపై దృష్టి పెట్టాలని సూచించారు.

డిపాజిట్ల విషయంలో జాగ్రత్త..
అధిక వ్యయంతో కూడిన టర్మ్ డిపాజిట్లపై ఆధారపడడం లేదంటే కేవలం కొన్ని సంస్థల బల్క్ డిపాజిట్లపై ఆధారపడడం పట్ల ఎస్‌ఎఫ్‌బీలను స్వామినాథన్ హెచ్చరించారు. ఇలా ఏదో ఒక విభాగంలో ఎక్కువ డిపాజిట్లు తీసుకోవడం పట్ల ఉండే రిస్క్‌ను మదింపు వేయాలని సూచించారు.

సామాజిక బాధ్యత..
సమాజంలో అట్టడుగు వర్గాల వారికి ఆర్థిక సేవల విస్తరణకు, యువ పారిశ్రామికవేత్తల సాకారానికి ఎస్‌బీఎఫ్‌లు కీలక పాత్ర పోషించాలని స్వామినాథన్ సూచించారు. సమ్మిళిత వృద్ధి దేశ ఆర్థిక పురోగతికి ఎంతో అవసరమన్నారు. సమాజంలోని బలహీన వర్గాలకు అందుబాటు ధరలకే రుణాలను కేంద్ర ప్రభుత్వ పథకాల కింద అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

బంధన్ బ్యాంక్‌తో బంధన్ లైఫ్ భాగస్వామ్యం

- జీవిత బీమా ఉత్పత్తుల విక్రయాలు
- మరిన్ని బ్యాంకులతో ఇదే తరహా ఒప్పందాలు
- సంస్థ ఎండీ, సీఈవో సతీశ్వర్



కోల్‌కతా: బంధన్ బ్యాంక్‌తో బంధన్ లైఫ్ ఇన్సూరెన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఏడాది ఆరంభంలో ఏగాన్ లైఫ్‌ను కొనుగోలు చేసిన బంధన్ లైఫ్ నూతన వ్యాపార అవకాశాల్లో భాగంగా ఈ కీలక ఒప్పందానికి వచ్చింది. దీంతో 1,700 బంధన్ బ్యాంక్ శాఖల పరిధిలో కస్టమర్లకు జీవిత బీమా ఉత్పత్తులను విక్రయించనుంది. బ్యాంకుల పంపిణీ చానల్‌ను మరింత బలోపేతం చేసుకుంటామని, ఇందులో భాగంగా మరిన్ని బ్యాంకులతో సమీప భవిష్యత్తులో ఇదే తరహా ఒప్పందాలను కుదుర్చుకుంటామని సంస్థ ప్రకటించింది. ''మొదట బంధన్ బ్యాంక్ ద్వారా మా బీమా ఉత్పత్తుల పంపిణీపై దృష్టి సారిస్తాం. మరో 2-3 బ్యాంక్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలన్నది మా లక్ష్యం. అలాగే, ఇతర బహుళ చానళ్ల పంపిణీ అవకాశాలనూ అన్వేషిస్తాం'' అని బంధన్ లైఫ్ ఎండీ, సీఈవో సతీశ్వర్ బి తెలిపారు. ఏగాన్ లైఫ్ ప్రధాన వ్యాపారం ఆన్‌లైన్ ద్వారానే కేంద్రీకృతమై ఉందంటూ, ఆఫ్‌లైన్ పంపిణీ చానళ్ల నిర్మాణంపై దృష్టి సారిస్తామని ప్రకటించారు. తొలుత 550 బంధన్ బ్యాంక్ శాఖల పరిధిలో బీమా ఉత్పత్తుల విక్రయాలు మొదలు పెట్టి, తర్వాత 1,700 శాఖలకు విస్తరిస్తామని చెప్పారు. పూర్తి లాభాల్లోకి ప్రవేశించడానికి 4-5 ఏళ్ల సమయం తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం తమ నిర్వహణలో రూ.4,500 కోట్ల ఆస్తులున్నాయని, మొదటి ఏడాది రూ.300 కోట్ల ప్రీమియంను సాధిస్తామని చెప్పారు.

9 శాతం వృద్ధి మన లక్ష్యం కావాలి

- పరిశ్రమల వృద్ధి వేగవంతం
- నీతిఆయోగ్ సీఈవో సుబ్రమణ్యం



న్యూఢిల్లీ: దేశ పారిశ్రామిక రంగం ఎంతో వేగంగా వృద్ధి చెందుతోందని.. కనుక 9 శాతం జీడీపీ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం పేర్కొన్నారు. పరిశ్రమలపై గణాంకాలు, ప్రణాళికల అమలు శాఖ నిర్వహించిన వార్షిక సర్వే వివరాలను విడుదల చేసిన సందర్భంగా సుబ్రమణ్యం మీడియాతో మాట్లాడారు. ఏఎస్ఐ డేటా ప్రకారం తయారీ పరిశ్రమల్లో ఉపాధి పొందిన వారి సంఖ్య 2022-23లో 7.5 శాతం పెరిగి 1.85 కోట్ల మందికి చేరింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2021-22) ఈ సంఖ్య 1.72 కోట్లుగానే ఉంది. 2020-21లో 1.60 కోట్లు, 2019-20లో 1.66 కోట్లు, 2018-19లో 1.62 కోట్లుగా ఉండడం గమనించాలి. కరోనా ముందు నాటి 2018-19 ఆర్థిక సంవత్సరంలో గణాంకాలో పోల్చి చూస్తే 22 లక్షల మందికి పైగా అదనంగా ఉపాధి లభించింది. 2022-23లో ఈ రంగంలో సగటున ఒక్కో ఉద్యోగి పారితోషికం 6.3 శాతం మేర పెరిగింది. ప్రాథమిక లోహాలు, కోక్, రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తులు, ఆహారోత్పత్తులు, కెమికల్, కెమికల్ ఉత్పత్తులు, మోటారు వాహనాలు పారిశ్రామిక వృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాయి. వీటి నుంచే 58 శాతం ఉత్పత్తి సమకూరింది. ఉత్పత్తి వృద్ధిలో 24.5 శాతం, స్థూల అదనపు విలువ (జీవీఏ) వృద్ధిలో 2.6 శాతం సమకూరింది. పారిశ్రామిక రంగం వేగంగా వృద్ధి సాధిస్తున్నప్పటికీ కొందరు అనవసరంగా విమర్శిస్తున్నట్టు సుబ్రమణ్యం అన్నారు. తయారీ వృద్ధి విస్తృతంగా, అన్ని రంగాల నుంచి ఉన్నట్టు చెప్పారు. చాలా సంస్థలు భారత వృద్ధి రేటును ఎగువవైపునకు సవరిస్తున్నట్టు గుర్తు చేశారు.

ఈ రాష్ట్రాల వాటా ఎక్కువ
అత్యధిక తయారీ జీవీఏ మహారాష్ట్ర నుంచి ఉంటే, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, యూపీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. తయారీ రంగంలో ఉపాధి కల్పన పరంగా తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, యూపీ, కర్ణాటక అగ్రస్థానంలో ఉన్నాయి.

ఈ ఏడాది రూ.8,500 కోట్ల టర్నోవర్

- సోనీ ఇండియా లక్ష్యం ఇదే
- 2024 ఏఐ సిరీస్ విడుదల
- అంబాసిడర్‌గా ఎస్.ఎస్.రాజమౌళి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం సోనీ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.8,500 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా చేసుకుంది. 2023-24లో కంపెనీ రూ.6,353 కోట్లు సాధించింది. ఎక్స్‌పీరియా స్మార్ట్‌ఫోన్స్, వయో ల్యాప్‌టాప్స్ విభాగాలతో కలిపి 2014-15లో సోనీ ఇండియా రూ.11,000 కోట్ల ఆదాయం సముపార్జించింది. సంస్థకు అతిపెద్ద మార్కెట్ల పరంగా యూఎస్, చైనా, జపాన్ తర్వాత నాల్గవ స్థానంలో భారత్ నిలిచింది. స్మార్ట్ టీవీ, ఆడియో, డిజిటల్ ఇమేజింగ్ ఉత్పత్తులు ప్రస్తుత వృద్ధిని నడిపిస్తున్నాయని సోనీ ఇండియా ఎండీ సునీల్ నయ్యర్ తెలిపారు. వృద్ధి ఇలాగే కొనసాగితే భారత ర్యాంకు మరింత మెరుగుపడుతుందని చెప్పారు. సగటు విక్రయ ధరను పెంచే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వెల్లడించారు. ప్రీమియం ఉత్పత్తుల వైపు మార్కెట్ మళ్లుతున్న నేపథ్యంలో సోనీ ఇండియాకు ఈ అంశం కలిసి వస్తుందన్నారు. చిత్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి చేతుల మీదుగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత 2024 బ్రావియా 9, 8, 7, 3 సిరీస్‌ను సోమవారమిక్కడ విడుదల చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈ సిరీస్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా రాజమౌళి వ్యవహరిస్తారని కంపెనీ ప్రకటించింది. స్మార్ట్ టీవీల విభాగంలో 20% విలువ వృద్ధి ఆశిస్తున్నట్టు తెలిపారు. 55 అంగుళాలు ఆపైన విభాగంలో ఆధిపత్యం కొనసాగిస్తున్నామని అన్నారు. 75 అంగుళాలు ఆపైన సెగ్మెంట్లో 50% పైన వృద్ధి సాధిస్తున్నామని వివరించారు. టీవీల వ్యాపారంలో మార్కెటింగ్‌పైన రూ.300 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రూ.15,000లకుపైగా ఖరీదు చేసే సౌండ్‌బార్స్ విభాగంలో 53% వాటాతో అగ్రస్థానంలో ఉన్నట్టు తెలిపారు.

ఫ్యాషన్ రిటైలర్స్ 15% ఆదాయ వృద్ధి



న్యూఢిల్లీ: ఫ్యాషన్ రిటైలర్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15 శాతం వరకు ఆదాయ వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉంది. నెట్‌వర్క్ విస్తరణ ఇందుకు కారణమని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా నివేదిక వెల్లడించింది. 'ద్రవ్యోల్బణం ఎదురుగాలులు ఉన్నప్పటికీ ఫ్యాషన్ రిటైలర్ల నెట్‌వర్క్ విస్తరణ 2024-25లో రాబడి పెరుగుదలకు తోడ్పడుతుంది. సర్వేలో పాలుపంచుకున్న కంపెనీల నిర్వహణ లాభాల మార్జిన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 13-14 శాతం శ్రేణిలో ఉండే అవకాశం ఉంది. ఏప్రిల్-జూన్‌లో ఫ్యాషన్ రిటైలర్లు స్టోర్ నెట్‌వర్క్ విస్తరణ, కొత్త ఉత్పత్తుల శ్రేణిని ప్రవేశపెట్టడం ద్వారా 18 శాతం వృద్ధిని నమోదు చేశాయి. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఈ రంగ కంపెనీలు మోస్తరు వృద్ధి నమోదు చేస్తాయి. పండుగ సీజన్‌లో ఆదాయ వృద్ధి పుంజుకునే అవకాశం ఉంది. దీని ఫలితంగా అంత క్రితంతో పోలిస్తే 2024-25లో ఆదాయం 14-15 శాతం పెరుగుతుందని అంచనా' అని ఇక్రా తెలిపింది.

పరిమితంగానే డిస్కౌంట్లు..
'చదరపు అడుగుకు సగటు అమ్మకాల్లో జూన్ త్రైమాసికంలో ప్రీమియం సెగ్మెంట్ 3 శాతం క్షీణించింది. అయినప్పటికీ వాల్యూ ఫ్యాషన్ విభాగాలు కొంత సానుకూల ప్రభావాన్ని చూపించాయి. ఈ విభాగం మహమ్మారి ముందస్తు స్థాయిని మొదటిసారి తాకింది. కొత్త స్టోర్స్ రాక, ప్రారంభించిన నూతన కేటగిరీల కోసం పెరిగిన ప్రకటనలు, ప్రమోషనల్ ఖర్చుల కారణంగా తగిన రాబడి కంటే తక్కువగా గతేడాదితో పోలిస్తే ఫ్యాషన్ రిటైలర్ల మార్జిన్లు స్థిరంగా ఉన్నాయి. 2023-24 రెండవ త్రైమాసికం నుండి డిస్కౌంట్లు పరిమితంగానే ఉన్నాయి. ఎందుకంటే కంపెనీలు తమ స్థూల మార్జిన్లను రక్షించుకోవడంపై దృష్టి సారిస్తున్నాయి. ముఖ్యంగా పండుగల సీజన్‌తో ప్రకటనలు, ప్రమోషన్లపై రిటైలర్లు దూకుడుగా ఖర్చు చేస్తూనే ఉన్నారు' అని ఇక్రా నివేదిక వెల్లడించింది.

షిప్‌మెంట్లపై చార్జీలను పెంచిన బ్లూడార్ట్



ముంబై: కొరియర్ సేవలను ఆఫర్ చేసే బ్లూడార్ట్ ఎక్స్‌ప్రెస్ షిప్‌మెంట్లపై చార్జీలను 9-12 శాతం మేర పెంచింది. 2025 జనవరి 1 నుంచి ఈ రేట్లు అమల్లోకి వస్తాయని ప్రకటించింది. ద్రవ్యోల్బణం పరమైన సర్దుబాట్లు, పెరిగిపోయిన వ్యయాలకు (నిర్వహణ, ఎయిర్‌లైన్, మౌలిక వసతుల వ్యయాలు) అనుగుణంగా ధరలను సర్దుబాటు చేసినట్టు తెలిపింది. నిర్వహణ పరంగా అత్యుత్తమ, నాణ్యమైన సేవలను ఇక ముందూ అందించేందుకు ధరల సర్దుబాటు తప్పనిసరి అని పేర్కొంది.

మంచి తరుణం

- మహిళల టి20 ప్రపంచకప్‌లో టీమిండియా అవకాశాలపై స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వ్యాఖ్య
- మెగా ఈవెంట్‌కు సర్వసన్నద్ధం
- అన్ని జట్లపై హోంవర్క్ చేసి బరిలోకి



ఎన్నో ఏళ్లుగా ఊరిస్తోన్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ట్రోఫీ చేజిక్కించుకోవాలని తహతహలాడుతున్న భారత మహిళల క్రికెట్ జట్టు టి20 ప్రపంచకప్‌లో మెరుగైన ప్రదర్శన చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని భారత టాపార్డర్ ప్లేయర్ జెమీమా రోడ్రిగ్స్ పేర్కొంది. ఈసారి అందుకు తగ్గ అనుకూలతలు ఉన్నాయని...కప్ గెలిచేందుకు ఇదే మంచి తరుణమని ఆమె వెల్లడించింది. ప్లేయర్లందరికీ జట్టు ప్రయోజనాలే ముఖ్యమన్న జెమీమా... మెగా టోర్నీ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నట్లు తెలిపింది. అనుభవజ్ఞులు, యంగ్ ప్లేయర్లతో టీమిండియా సమతూకంగా ఉందని... ఆస్ట్రేలియా వంటి ప్రత్యర్థులపై కూడా విజయాలు సాధించగలమనే నమ్మకముందని పేర్కొంది. రేపటి నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో మహిళల టి20 ప్రపంచకప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో జెమీమా రోడ్రిగ్స్ పంచుకున్న వివరాలు ఆమె మాటల్లోనే...

తొలిసారి మహిళల టి20 ప్రపంచకప్ చేజిక్కించుకోవడానికి భారత జట్టుకు అన్ని అనుకూలతలు ఉన్నాయి. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం కంటే పెద్ద ఘనత ఏదీ లేదు. వరల్డ్‌కప్ బరిలోకి దిగుతున్న భారత మహిళల జట్టులో ప్రస్తుతం అందరి పరిస్థితి ఇదే. జట్టుకు అవసరమైన సమయంలో రాణించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారు. నా వరకైతే టీమిండియాకు ఆడే సమయంలో సర్వశక్తుల ఒడ్డేందుకు ప్రయత్నిస్తా. జట్టు గెలవడమనే నాకు ఎక్కువ సంతృప్తినిస్తుంది. రేపటి నుంచి ప్రారంభం కానున్న టి20 వరల్డ్‌కప్ కోసం మెరుగ్గా సిద్ధమయ్యా. ప్రత్యేకంగా ఒక బౌలర్‌ను లక్ష్యంగా చేసుకోలేదు. పరిస్థితులపై పైచేయి సాధించాలనుకుంటున్నా. ఎవరిని బౌలింగ్‌లో భారీ షాట్లు ఆడాలి... ఎలాంటి బంతులను గౌరవించాలి అనే దానిపై సాధన చేశా. నా ప్రదర్శన జట్టు విజయానికి తోడ్పడాలని కోరుకుంటా.

సమతూకంగా జట్టు...

అటు అనుభవజ్ఞులు ఇటు యంగ్ ప్లేయర్లతో జట్టు సమతూకంగా ఉంది. రిచా ఘోష్, షఫాలీ వర్మతో పాటు నాకూ గతంలో ఐసీసీ ప్రపంచకప్‌లు ఆడిన అనుభవం ఉంది. మేము యువ క్రీడాకారిణులమే అయినా... అవసరమైనంత అనుభవం ఉంది. ఇక జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన రూపంలో ఇద్దరు సీనియర్ ప్లేయర్లు ఉన్నారు. వారికి ప్రపంచకప్‌లలో ఆడిన అపార అనుభవం ఉంది. ఆటగాళ్లంతా ట్రోఫీ చేజిక్కించుకోవాలనే ఉత్సాహంతో ఉన్నాం. జట్టు సమావేశాల్లో ఎక్కువ శాతం చర్చ దీని గురించే జరుగుతుంది. 2020 ప్రపంచకప్ ఫైనల్లో పరాజయం పాలయ్యాం. ఇప్పుడు తొమ్మిదో ఎడిషన్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తామనే నమ్మకముంది. వార్మప్ మ్యాచ్‌లో రాణించడం ఆనందంగా ఉంది. ప్రధాన పోటీలకు ముందు చక్కటి ఇన్నింగ్స్ ఆడటం నా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ సోఫీ డివైన్ ఆటకు నేను అభిమానిని. మొదటిసారి అండర్-19 క్యాంప్‌లో ఉన్న సమయంలో చిన్నస్వామి స్టేడియంలో సోఫీ డివైన్ వరుసగా ఐదు బంతుల్లో సిక్సర్లు బాదింది. ఆ సందర్భాన్ని మరవలేను. ఆమె కోసం మా బౌలర్ల వద్ద ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయి.

ఆస్ట్రేలియాతో పోటీని ఆస్వాదిస్తా...

ఈ నెల 13న ఆస్ట్రేలియాతో మ్యాచ్ ఆడనున్నాం. ఆసీస్‌తో ఆడటాన్ని ఎంతో ఆస్వాదిస్తా. మెరుగైన ప్రత్యర్థితో తలపడ్డప్పుడు అత్యుత్తమ ఆట బయటకు వస్తుంది. చాన్నాళ్లుగా కంగారూ జట్టుతో మ్యాచ్‌లు ఆడుతున్నాం. ఈసారి మైదానంలో మా ప్రణాళికలను పక్కాగా అమలు చేస్తాం. జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఆటను బాగా అర్థం చేసుకుంటుంది. పరిస్థితులకు తగ్గట్టు ఆటతీరును మార్చుకుంటుంది. అందుకే గొప్ప ప్లేయర్‌గా ఎదిగింది. అవసరమైనప్పుడు చక్కటి సలహాలు ఇస్తుంది. ఇక కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పెద్ద మ్యాచ్‌ల్లో మెరుగ్గా రాణిస్తుంది. కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడిని తట్టుకొని ఎలా నిలబడాలో ఆమె ఆట ద్వారా నేర్చుకున్నా. ఇప్పటి వరకు జరిగిన ఎనిమిది టి20 ప్రపంచకప్‌లలోనూ హర్మన్‌ప్రీత్ పాల్గొంది. ఈ టోర్నీ ఆమెకు ఎంత ముఖ్యమో జట్టులో ప్రతి ఒక్కరికీ తెలుసు. దేశంతో పాటు ఆమె కోసం కప్పు గెలవాలని అనుకుంటున్నాం. ఆమె ట్రోఫీ చేజిక్కించుకోవడం చూడాలని ఆశిస్తున్నా.

ప్రపంచ మూడో ర్యాంకర్‌గా అర్జున్

ఐదో స్థానంలో గుకేశ్ ● మహిళల విభాగంలో భారత రెండో ర్యాంకర్‌గా దివ్య


అర్జున్ గుకేశ్


దివ్య

చెన్నై: చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలతో అదరగొట్టిన భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్, దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చెస్ సమాఖ్య (ఫిడే) స్టాండర్డ్ ఫార్మాట్ ర్యాంకింగ్స్‌లోనూ ముందుకు దూసుకొచ్చారు. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో తెలంగాణకు చెందిన అర్జున్ ఒక స్థానం మెరుగుపర్చుకొని కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌కు చేరుకోగా... గుకేశ్ రెండు స్థానాలు పురోగతి సాధించి కెరీర్ బెస్ట్ ఐదో ర్యాంక్‌ను అందుకున్నాడు. అర్జున్ ఖాతాలో 2797 ఎలో రేటింగ్ పాయింట్లు, గుకేశ్ ఖాతాలో 2794 ఎలో రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. 2831 రేటింగ్ పాయింట్లతో నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ వరల్డ్ నంబర్‌వన్ ర్యాంకర్‌గా కొనసాగుతుండగా... హికారు నకమురా (అమెరికా; 2802 పాయింట్లు) రెండో స్థానంలో ఉన్నాడు. టాప్-100లో భారత్ నుంచి ఏకంగా తొమ్మిది మంది గ్రాండ్‌మాస్టర్లు ఉన్నారు. ఐదుసార్లు ప్రపంచ మాజీ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ 11వ స్థానంలో, ప్రజ్ఞానంద 12వ స్థానంలో ఉన్నారు. విదిత్ సంతోష్ గుజరాతీ 22వ ర్యాంక్‌లో, అరవింద్ చిదంబరం 33వ ర్యాంక్‌లో, పెంటేల హరికృష్ణ 42వ ర్యాంక్‌లో, నిహాల్ సరీన్ 58వ ర్యాంక్‌లో, రౌనక్ సాధ్వాని 66వ ర్యాంక్‌లో, శ్రీనాథ్ నారాయణన్ 95వ ర్యాంక్‌లో, అభిమన్యు పురాణిక్ 98వ ర్యాంక్‌లో నిలిచారు.

నంబర్‌వన్‌గా హంపి

మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తన ఆరో ర్యాంక్‌ను నిలబెట్టుకొని భారత నంబర్‌వన్‌గా కొనసాగుతోంది. చెస్ ఒలింపియాడ్‌కు హంపి దూరంగా ఉన్నా ఆమె ర్యాంక్‌లో మార్పు రాలేదు. భారత రెండో ర్యాంకర్‌గా మహారాష్ట్రకు చెందిన జూనియర్ ప్రపంచ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ అవతరించింది. ఇన్నాళ్లు భారత రెండో ర్యాంకర్‌గా ద్రోణవల్లి హారిక కొనసాగింది. చెస్ ఒలింపియాడ్‌లో టీమ్ స్వర్ణ పతకంతోపాటు వ్యక్తిగత పసిడి పతకం నెగ్గిన దివ్య నాలుగు స్థానాలు పురోగతి సాధించి 11వ ర్యాంక్‌కు చేరుకుంది. హారిక 14వ ర్యాంక్‌లో, వైశాలి 15వ ర్యాంక్‌లో, తానియా సచ్‌దేవ్ 54వ ర్యాంక్‌లో, వంతిక అగర్వాల్ 58వ ర్యాంక్‌లో ఉన్నారు. తెలంగాణ అమ్మాయి వేల్పుల సరయు 76వ ర్యాంక్‌లో, భక్తి కులకర్ణి 82వ ర్యాంక్‌లో, సవితాశ్రీ 99వ ర్యాంక్‌లో నిలిచారు.

భారత షూటర్ల పసిడి గురి


పార్థ్

లిమా (పెరూ): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. మూడో రోజు భారత్ ఖాతాలో మూడు స్వర్ణ పతకాలు చేరాయి. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో పార్థ్ రాకేశ్ మానె విజేతగా నిలిచాడు. ఫైనల్లో 16 ఏళ్ల పార్థ్ 250.7 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. హువాంగ్ లివాన్లిన్ (చైనా) రజతం, బ్రాడెన్ పీసెర్ (అమెరికా) కాంస్యం సాధించారు. భారత్‌కే చెందిన అజయ్ మలిక్ ఐదో స్థానంలో, అభినవ్ షా ఏడో స్థానంలో నిలిచారు. పార్థ్, అజయ్, అభినవ్‌లతో కూడిన భారత జట్టు 1883.5 పాయింట్లతో ఇదే ఈవెంట్ టీమ్ విభాగంలో బంగారు పతకం గెల్చుకుంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలోనూ భారత జట్టుకు పసిడి పతకం లభించింది. గౌతమి భానోత్, శాంభవి క్షీరసాగర్, ఓజస్వీ ఠాకూర్‌లతో కూడిన భారత జట్టు 1894.8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలో మాత్రం గౌతమి నాలుగో స్థానంలో, శాంభవి ఐదో స్థానంలో, ఓజస్వీ ఏడో స్థానంలో నిలిచారు. ప్రస్తుతం భారత్ ఐదు స్వర్ణాలు, మూడు కాంస్యాలతో కలిపి ఎనిమిది పతకాలతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది.



ఏడేళ్ల తర్వాత...

మాస్టర్స్ టోర్నీ మెయిన్ 'డ్రా'కు రామ్‌కుమార్ అర్హత

షాంఘై: ఏడేళ్ల తర్వాత భారత టెన్నిస్ స్టార్ రామ్‌కుమార్ రామనాథన్ ప్రతిష్టాత్మక మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో మెయిన్ 'డ్రా'లోకి అడుగు పెట్టాడు. చివరి నిమిషంలో షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 క్వాలిఫయింగ్ టోర్నీలో ఆడే అవకాశం దక్కించుకున్న రామ్‌కుమార్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచాడు. తద్వారా షాంఘై మాస్టర్స్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగం మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 335వ ర్యాంకర్ రామ్‌కుమార్ 6-2, 6-4తో ప్రపంచ 282వ ర్యాంకర్ ఫాజింగ్ సన్‌పై విజయం సాధించాడు. 75 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ ఏకంగా 16 ఏస్‌లు సంధించాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 29 విన్నర్స్ కొట్టిన రామ్ 16 అనవసర తప్పిదాలు చేశాడు. 2017లో రామ్‌కుమార్ ఏకైకసారి సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్ టోర్నీలో మెయిన్ 'డ్రా'కు అర్హత పొంది రెండో రౌండ్‌లో ఓడిపోయాడు. ఆ తర్వాత రామ్ ఎనిమిదిసార్లు మాస్టర్స్ టోర్నీలో పోటీపడ్డా క్వాలిఫయింగ్‌ను దాటలేకపోయాడు.

రాణించిన రహానే, సర్ఫరాజ్


రహానే


సర్ఫరాజ్

- ముంబై 237/4
- రెస్ట్ ఆఫ్ ఇండియాతో ఇరానీ కప్

లక్నో: సీనియర్ ఆటగాడు అజింక్యా రహానే (197 బంతుల్లో 86 బ్యాటింగ్; 6 ఫోర్లు, ఒక సిక్సర్) అజేయ అర్ధసెంచరీతో రాణించాడు. రెస్ట్ ఆఫ్ ఇండియా, రంజీ చాంపియన్ ముంబై జట్ల మధ్య మంగళవారం ప్రారంభమైన ఇరానీ కప్ మ్యాచ్‌లో ముంబై సారథి రహానే కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. రహానేతో పాటు టీమిండియా ఆటగాళ్లు శ్రేయస్ అయ్యర్ (84 బంతుల్లో 57; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), సర్ఫరాజ్ ఖాన్ (88 బంతుల్లో 54 బ్యాటింగ్; 6 ఫోర్లు) కూడా అర్ధ శతకాలతో మెరిశారు. ఫలితంగా టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. భారత టెస్టు జట్టులో చోటు కోల్పోయిన రహానే చక్కటి ఇన్నింగ్స్ ఆడగా... ఓపెనర్ పృథ్వీ షా (4), ఆయుష్ మాత్రే (19), హార్దిక్ తమోర్ (0) విఫలమయ్యారు. రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు బౌలర్లలో ముకేశ్ కుమార్ 3 వికెట్లు తీయగా, యశ్ దయాళ్ ఒక వికెట్ పడగొట్టాడు. రహానేతో పాటు సర్ఫరాజ్ ఖాన్ క్రీజులో ఉన్నాడు. వీరిద్దరూ అబేధ్యమైన ఐదో వికెట్‌కు 98 పరుగులు జోడించారు.

వైభవ్ సూర్యవంశీ సెంచరీ

- భారత అండర్
- 19 జట్టు 296 ఆలౌట్
- ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 110/4



చెన్నై: ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (62 బంతుల్లో 104; 14 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు శతకం సాధించడంతో భారత అండర్-19 జట్టు మెరుగైన ప్రదర్శన చేసింది. ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో యువ భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 62.4 ఓవర్లలో 296 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 103/0తో మంగళవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత జట్టు ఆరంభంలో దక్కిన జోరును చివరి వరకు కొనసాగించలేకపోయింది. తొలి వికెట్‌కు విహాన్ మల్హోత్రాతో కలిసి వైభవ్ 133 పరుగులు జోడించగా.. 163 పరుగుల వ్యవధిలో తక్కిన తొమ్మిది వికెట్లు కోల్పోయింది. నిత్య పాండ్యా (9), కార్తికేయ (0), నిఖిల్ కుమార్ (20) విఫలమయ్యారు. కెప్టెన్ సోహమ్ పట్వర్ధన్ (33), వికెట్ కీపర్ అభిజ్ఞాన్ కుందు (32) ఫర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో విశ్వ రామ్‌కుమార్ 4, థామస్ బ్రౌన్ మూడు వికెట్లు పడగొట్టారు. దీంతో భారత జట్టుకు 3 పరుగుల స్వల్ప తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా అండర్-19 జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. ఓపెనర్ రిలీ కింగ్‌సెల్ (57 బంతుల్లో 48; 7 ఫోర్లు, ఒక సిక్సర్), ఒలీవర్ పీక్ (32) రాణించారు. యువ భారత బౌలర్లలో లెగ్ స్పిన్నర్ మహమ్మద్ ఇనాన్ రెండు వికెట్లు పడగొట్టాడు. కెప్టెన్ సిమాన్ బడ్జ్ (4 బ్యాటింగ్), క్రిస్టియన్ హౌ (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో ఆరు వికెట్లు ఉన్న ఆస్ట్రేలియా అండర్-19 జట్టు... యువ భారత్ కంటే 107 పరుగుల ఆధిక్యంలో ఉంది.

ప్రొఫెషనల్ క్రికెట్‌లో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కుడిగా వైభవ్ గుర్తింపు పొందాడు. 13 ఏళ్ల 188 రోజుల వయసులో వైభవ్ ఈ ఘనత సాధించాడు. గతంలో ఈ రికార్డు బంగ్లాదేశ్ ప్లేయర్ నజ్ముల్ హసన్ షంటో (14 ఏళ్ల 241 రోజులు) పేరిట ఉంది. 2013లో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో నజ్ముల్ ఈ ఘనత సాధించాడు.


అల్‌కరాజ్


సినెర్

అల్‌కరాజ్ X సినెర్

చైనా ఓపెన్ టైటిల్ కోసం అమీతుమీ

బీజింగ్: ఈ సీజన్‌లో ఏడో టైటిల్ సాధించేందుకు ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ)... నాలుగో టైటిల్‌ను దక్కించుకునేందుకు ప్రపంచ మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్) విజయం దూరంలో నిలిచారు. చైనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో వీరిద్దరు ఫైనల్లోకి దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో సినెర్ 6-3, 7-6 (7/3)తో యుంచాకెటె బు (చైనా)పై, అల్‌కరాజ్ 7-5, 6-3తో మెద్వెదెవ్ (రష్యా)పై నెగ్గారు. ఈ ఏడాది సినెర్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. 59 మ్యాచ్‌ల్లో గెలిచి, కేవలం 5 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించడంతోపాటు మరో నాలుగు టోర్నీల్లో విజేతగా నిలిచాడు. అల్‌కరాజ్ ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సొంతం చేసుకోవడంతోపాటు ఇండియన్ వెల్స్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో చాంపియన్‌గా నిలిచాడు. సినెర్, అల్‌కరాజ్ ముఖాముఖిగా ఇప్పటి వరకు 9 సార్లు తలపడ్డారు. 4 సార్లు సినెర్, 5 సార్లు అల్‌కరాజ్ గెలిచారు.

నేడు పాక్‌కు ఇంగ్లండ్ క్రికెట్ జట్టు

ఈనెల 7 నుంచి మూడు టెస్టుల సిరీస్


స్టోక్స్

కరాచీ: పాకిస్తాన్ పర్యటన కోసం బెన్ స్టోక్స్ నేతృత్వంలోని ఇంగ్లండ్ క్రికెట్ జట్టు బుధవారం ఇక్కడికి చేరుకోనుంది. ఇరు జట్ల మధ్య మూడు టెస్టుల సిరీస్ జరుగుతుంది. ఈ నెల 7 నుంచి ముల్తాన్‌లో జరిగే తొలి టెస్టుతో సిరీస్ మొదలవుతుంది. రెండో టెస్టు వేదిక కూడా ముల్తానే! 15 నుంచి ఈ మ్యాచ్ జరుగుతుంది. రావల్పిండిలో 24 నుంచి 28 వరకు జరిగే ఆఖరి టెస్టుతో ఇంగ్లండ్ పర్యటన ముగుస్తుంది. ఈ సిరీస్‌లో పరిమిత ఓవర్ల మ్యాచ్‌లేమీ నిర్వహించడం లేదు. కాగా పాకిస్తాన్ క్రికెట్ చరిత్రలో సొంతగడ్డపై తొలిసారి బంగ్లాదేశ్ చేతిలో భంగపడటంతో కెప్టెన్ షాన్ మసూద్‌పై విమర్శల వాడి ఇంకా తగ్గడం లేదు. ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలోనూ అందరి లక్ష్యం అతనే అయ్యాడు. జర్నలిస్టులు ఓ పట్టాన విడిచిపెట్టడం లేదు. ఒకరైతే ఏకంగా కెప్టెన్సీ వదులుకోవచ్చుగా అని పరుష పదజాలంతో ప్రశ్నించారు. 'పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నియామకం ప్రకారం సారథిగా కొనసాగుతానని మీరన్నారు. అత్యంత పేలవంగా జట్టు ఆడి ఓటమి పాలైనా కనీసం నైతిక బాధ్యత వహించరా? ఆత్మాభిమానం గురించి ఆలోచించరా? లేదంటే హుందాగా తప్పుకునే ఉద్దేశమేదీ మీకు లేదా? అని ప్రశ్నల వర్షం కురిపించాడు. పక్కనే ఉన్న పీసీబీ మీడియా డైరెక్టర్ వెంటనే కల్పించుకొని పాక్ జాతీయ జట్టు కెప్టెన్‌ను గౌరవించాలని సదరు జర్నలిస్టుకు సూచించారు. ఇటీవల పీసీబీ నిర్ణయాలపై కూడా పలువురు మండిపడుతున్నారు. కనీస జవాబుదారీతనం లేకుండా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు.

హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా తిలక్ వర్మ



సాక్షి, హైదరాబాద్: దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీలోని తొలి రెండు మ్యాచ్‌ల్లో పాల్గొనే హైదరాబాద్ జట్టును ప్రకటించారు. భారత జట్టు సభ్యుడు ఠాకూర్ తిలక్ వర్మ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. వైస్ కెప్టెన్‌గా రాహుల్ సింగ్‌ను నియమించారు. గ్రూప్ 'బి'లో ఉన్న హైదరాబాద్ జట్టు తమ తొలి మ్యాచ్‌ను హైదరాబాద్‌లో అక్టోబర్ 11 నుంచి గుజరాత్ జట్టుతో... రెండో మ్యాచ్‌ను డెహ్రాడూన్‌లో అక్టోబర్ 18 నుంచి ఉత్తరాఖండ్‌తో ఆడుతుంది.

హైదరాబాద్ రంజీ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), రాహుల్ సింగ్ (వైస్ కెప్టెన్), సీవీ మిలింద్, తన్మయ్ అగర్వాల్, రోహిత్ రాయుడు, తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డి, కన్నాల నితేశ్, అభిరత్ రెడ్డి, హిమతేజ, రాహుల్ రాధేశ్, రక్షణ్ రెడ్డి, కార్తికేయ కక్, శరణు నిశాంత్, ధీరజ్ గౌడ్. **స్టాండ్ బైస్:** బుద్ధి రాహుల్, వరుణ్ గౌడ్, రిషబ్ బస్లాస్, భగత్ వర్మ, అజయ్‌దేవ్ గౌడ్. **హెడ్ కోచ్:** వినీత్ సక్సేనా. **అసిస్టెంట్ కోచ్:** ఎస్‌ఎన్ అమీత్, **ఫీల్డింగ్, స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్:** అర్జున్ హోయ్‌సాలా. **ఫిజియో:** సవ్యసాచి. **వీడియో ఎనలిస్ట్:** కృష్ణా రెడ్డి. **మసాజర్:** సయ్యద్ సాజిద్.


రెండో రౌండ్‌లో తీర్థ శశాంక్

న్యూఢిల్లీ: ఫెనెస్టా ఓపెన్ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ప్లేయర్ తీర్థ శశాంక్ రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శశాంక్ 6-4, 6-2తో ఢిల్లీకి చెందిన శివాంక్ భట్నాగర్‌పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో తెలంగాణ అమ్మాయి నిరాలి పదానియా 3-6, 1-6తో పూజా ఇంగాలె (మహారాష్ట్ర) చేతిలో ఓడిపోయింది.

బొగ్గుకు బ్రిటన్ బై బై

చివరి బొగ్గు ఆధారిత విద్యుత్కేంద్రం మూత

పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో తొలి దేశంగా రికార్డు


రాట్‌క్లిఫ్ విద్యుత్ కేంద్రం

250 ఏళ్ల కింద పారిశ్రామిక విప్లవానికి నాంది పలికిన బ్రిటన్ కర్బన ఉద్గారాల కట్టడి దిశగా కీలక ముందడుగు వేసింది. దేశంలో 142 ఏళ్లుగా జరుగుతున్న బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తికి పూర్తిగా ముగింపు పలికింది. తన చిట్టచివరి బొగ్గు ఆధారిత విద్యుత్కేంద్రాన్ని సోమవారం మూసేసింది. 1967 నుంచి నడుస్తున్న రాట్‌క్లిఫ్-ఆన్-సోర్ స్టేషన్ సోమవారం అర్ధరాత్రి చివరి షిఫ్టును ముగించింది. దీంతో ఏడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో బొగ్గుకు పూర్తిగా గుడ్‌బై చెప్పిన తొలి దేశంగా బ్రిటన్ నిలిచింది. వాతావరణ కాలుష్యానికి చెక్ పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. 1990 దాకా బ్రిటన్ మొత్తం విద్యుదుత్పత్తిలో ఏకంగా 80 శాతం బొగ్గు ఆధారితమే! 2012 నాటికి దాన్ని 39 శాతానికి తగ్గించుకుంది. 2023 నాటికి కేవలం ఒక్క శాతానికి పరిమితం చేయగా తాజాగా మొత్తానికే గుడ్‌బై చెప్పేసింది. ప్రస్తుతం బ్రిటన్ విద్యుదుత్పత్తిలో సగానికి పైగా పునరుత్పాదక పవన, సౌర వనరుల ద్వారా జరుగుతోంది. సహజవాయువు, అణు శక్తి ద్వారా వస్తోంది. స్వీడన్, బెల్జియం వంటి యూరప్ దేశాలు బొగ్గు వాడకాన్ని ఇప్పటికే పూర్తిగా నిలిపేశాయి. ప్రపంచంలోనే తొలి బొగ్గు ఆధారిత విద్యుత్కేంద్రం 1882లో లండన్‌లోనే మొదలైంది. తాజాగా మూసేసిన రాట్‌క్లిఫ్ విద్యుత్కేంద్రం 1967లో ప్రారంభమైంది.

శకం ముగిసింది

రాట్‌క్లిఫ్ ప్లాంట్ మూసివేతతో ఒక శకం ముగిసిందని బ్రిటన్ ఇంధన మంత్రి మైఖేల్ షాంక్స్ అన్నారు. ''మన దేశానికి 140 ఏళ్లకు పైగా వెలుగులు పంచిన కార్మికుల కృషి గర్వించదగినది. వారికి మనమెప్పటికీ రుణపడి ఉంటాం. బొగ్గు శకం ముగిసినా మన దేశానికి మంచి ఇంధన ఉద్యోగాల కొత్త యుగం ఇప్పుడే ప్రారంభమవుతోంది'' అన్నారు. తమకిది ఎంతో భావోద్వేగభరితమైన రోజని రాట్‌క్లిఫ్ ప్లాంట్ మేనేజర్ పీటర్ ఓ గ్రేడీ అన్నారు.

పోర్ట్ టాల్బోట్‌లో సంప్రదాయ పద్ధతికి ముగింపు..

మరోవైపు దక్షిణ వేల్స్‌లో ఉక్కు తయారీ సంస్థ పోర్ట్ టాల్బోట్ కూడా బొగ్గు వాడకానికి ముగింపు పలికింది. టాటా స్టీల్ యాజమాన్యంలోని ఈ సంస్థలోని ఫర్నేస్-4లో సోమవారం మధ్యాహ్నం చిట్టచివరిసారిగా బొగ్గు వాడారు. కర్బన ఉద్గారాలను కట్టడి చేసేందుకు ఇకపై ఎలక్ట్రిక్ ఫర్నేస్‌ను వాడనున్నట్టు టాటా స్టీల్ ప్రకటించింది. దీనివల్ల 2,800 ఉద్యోగాలకు కోత పడనుంది. టాల్బోట్ స్టీల్‌వర్క్స్‌లో ఒకప్పుడు 18,000 మందికి పైగా పని చేసేవారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఓన్లీ చాయిస్.. కమలా హారిస్

హారిస్‌కు న్యూయార్క్ టైమ్స్ మద్దతు



న్యూయార్క్: డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు న్యూయార్క్ టైమ్స్ ఎడిటోరియల్ బోర్డు మద్దతు తెలిపింది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కంటే హారిస్ దేశభక్తురాలని పేర్కొంది. పత్రిక ఈ మేరకు సోమవారం రాతపూర్వక ఆమోదం ప్రకటించింది. అధ్యక్ష పదవికి ట్రంప్ నైతికంగా, మానసికంగా అనర్హుడని పేర్కొంది. అమెరికా స్థిరత్వం, స్వభావంపై కొనసాగుతున్న దాడికి రిపబ్లికన్ పార్టీ ప్రాతినిధ్యం వహిస్తోందని పత్రిక సంపాదకులు పేర్కొన్నారు. ''హారిస్ సరైన అభ్యర్థని ప్రతి ఓటరుకు అనిపించకపోవచ్చు, ప్రత్యర్థి రికార్డుతో పోల్చినప్పుడు ఆమె మాత్రమే సరైన ప్రత్యామ్నాయం. ఈ ఎన్నికలు పోటీ రాజకీయాలు, సిద్ధాంతాల కంటే మరింత మౌలికాంశాలతో కూడుకున్నవి. అమెరికా ఓటర్లు హారిస్‌కు అండగా నిలవకపోతే ప్రజాస్వామ్యానికి తీవ్ర, శాశ్వత హాని కలిగించే శక్తి ట్రంప్‌కు ఉంది. రిపబ్లికన్ పార్టీ తిరిగి అధికారాన్ని పొందితే ట్రంప్ మొదటి పదవీకాలం కంటే పరిస్థితి మరింత హానికరంగా, విచ్ఛిన్నకరంగా ఉంటుంది. కనుక హారిస్ ఎంపిక ఒక్కటే సరైన నిర్ణయం'' అని ఆ పత్రిక పేర్కొంది.

ట్రంప్ వల్ల నా తండ్రి దూరమయ్యారు

- ఇప్పుడు దేశాన్ని అతని చేతుల్లో పెట్టలేం
- ట్రంప్ మాజీ లాయర్ గిలియానీ కుమార్తె



వాషింగ్టన్: రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మాజీ న్యాయవాది రూడీ గిలియానీ కుమార్తె కరోలిన్ రోజ్ డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌కు మద్దతు తెలిపారు. ట్రంప్ వల్ల తనకు తండ్రి దూరమయ్యారన్నారు. ''దేశాన్ని ట్రంప్ చేతిలో పెట్టలేం. ఆయన ప్రమాదకరమైన వ్యక్తి'' అని ఓ మ్యాగజైన్‌కు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. ''ట్రంప్‌తో చేతులు కలిపినప్పటి నుంచి నా తండ్రి జీవితం కుప్పకూలింది. ఆయన మరోసారి అమెరికాను కబళించజూస్తున్నారు'' అని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ విధ్వంసాల **జాడలెన్నో ఉన్నాయన్నారు. 2020 ఎన్నికల్లో ట్రంప్ ఓటాక ఫలితాల్లో అవకతవకలు జరిగాయంటూ అధికార మార్పిడిని నిరోధించడానికి ప్రయత్నించినందుకు వాషింగ్టన్‌లో లా ప్రాక్టీస్ చేయకుండా గిలియానీని ఫెడరల్ అప్పీల్స్ కోర్టు శాశ్వతంగా నిషేధించింది.**

జపాన్ ప్రధానమంత్రిగా షిగెరు ఇషిబా


లాంఛనంగా ఎన్నుకున్న పార్లమెంట్



టోక్యో: జపాన్ నూతన ప్రధానమంత్రిగా షిగెరు ఇషిబా ఎన్నికయ్యారు. మంగళవారం జపాన్ పార్లమెంట్ ఆయనను లాంఛనంగా ప్రధానిగా ఎన్నుకుంది. అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడిగా ఫుమియో కిషిదా స్థానంలో శుక్రవారం ఇషిబా ఎన్నికైన సంగతి తెలిసిందే. అధికార పార్టీ అధ్యక్షుడే ప్రధానమంత్రి కావడం జపాన్‌లో ఆనవాయితీ. వాస్తవానికి ప్రధానిగా ఇషిబా పదవీ కాలం మరో ఏడాదిపాటు మాత్రమే ఉంది. వచ్చే సంవత్సరం జపాన్ పార్లమెంట్ ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ, పార్లమెంట్‌ను రద్దుచేసి, ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని ఇషిబా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. సాధ్యమైనంత త్వరగా ప్రజా తీర్పును కోరాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. అయితే, ముందస్తు ఎన్నికల ప్రతిపాదనను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

అమెరికా మాజీ అధ్యక్షుడు కార్టర్ 100వ బర్త్‌డే

సొంత పట్టణం ప్లెయిన్స్‌లో ఘనంగా వేడుకలు



అట్లాంటా: అమెరికా 39వ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ 100వ పుట్టిన రోజు వేడుకలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. ఆయన సొంత పట్టణం జార్జియా రాష్ట్రం ప్లెయిన్స్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. అమెరికా అధ్యక్షుల్లో పూర్తి కాలం 100 ఏళ్లు జీవించింది జిమ్మీ కార్టర్ ఒక్కరే. 1924 అక్టోబర్ ఒకటో తేదీన జార్జియాలోని ప్లెయిన్స్‌లో సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. 1977–1981 సంవత్సరాల్లో అమెరికా అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం భార్య రోసలిన్‌తో కలిసి కార్టర్ సెంటర్‌ను నెలకొల్పి, ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తున్నారు. నోబెల్ శాంతి బహుమతిని అందుకున్న మానవతా వాది. ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడే నేతగా ఆయనకు పేరుంది. గతేడాది తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన కార్టర్ అనంతరం 19 నెలలుగా ఇంట్లోనే ఉంటున్నారు. జిమ్మీ కార్టర్‌కు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రత్యేకంగా పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.


గతేడాది ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో దాడి చేసి ఇద్దరిని చంపడంతో పాటు మరో ముగ్గురిని గాయపరిచిన మగ చిరుత ఇది. ఇటీవల ఈ చిరుతను బంధించిన అధికారులు.. సంబల్‌పూర్ జూకు తరలించారు. ఎన్‌క్లోజర్‌లో ఉన్న చిరుతను సందర్శకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఐ ఫోన్ కోసం డెలివరీ ఏజెంట్ హత్య

లక్నో: ఐ ఫోన్ కోసం డెలివరీ ఏజెంట్‌ను చంపాడో యువకుడు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్హాట్‌కు చెందిన గజేంద్ర ఫ్లిప్‌కార్ట్‌లో ఆఫర్ సేల్‌లో లక్షన్నర రూపాయల ఐ ఫోన్ ఆర్డర్ చేశాడు. క్యాష్ ఆన్ డెలివరీ పెట్టాడు. సెప్టెంబర్ 28న ఆర్డర్ ఇవ్వడానికి డెలివరీ ఏజెంట్ భరత్ సాహు వచ్చాడు. ఫోన్ తీసుకున్న గజేంద్ర, డబ్బులిస్తానంటూ ఇంట్లోకి తీసుకెళ్లాడు. ఫ్రెండ్‌తో కలిసి చంపేశాడు. మృతదేహాన్ని కాల్వలో పడేశారు. కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. లాస్ట్ డెలివరీ గజేంద్రకు చేశాడని విచారణలో తేలింది. ఫోన్ నంబర్ ఆధారంగా ఆకాశ్‌ను పట్టుకున్నారు. అతన్ని విచారించగా విషయం తెలిసింది.

నిలకడగానే.. కానీ, సాధారణం కాదు

ఎల్‌ఏసీ వద్ద పరిస్థితిపై చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్

న్యూఢిల్లీ: భారత్–చైనా మధ్య వివాదాస్పద సరిహద్దు అయిన వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి తూర్పు లద్దాఖ్‌లో పరిస్థితి ప్రస్తుతానికి నిలకడగానే ఉన్నప్పటికీ.. సాధారణంగా మాత్రం లేదని భారత చీఫ్ ఆర్మీ ఆఫ్ స్టాఫ్ ఉపేంద్ర ద్వివేది చెప్పారు. ప్రస్తుతం అక్కడ సున్నితమైన పరిస్థితులు కొనసాగుతున్నాయని వివరించారు. సరిహద్దుల్లో సాధారణ పరిస్థితులు నెలకొల్పడమే లక్ష్యంగా భారత్, చైనా మధ్య దౌత్యపరమైన చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ చర్చల్లో సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయని తెలిపారు. మంగళవారం ఢిల్లీలో ఓ కార్యక్రమంలో ఉపేంద్ర ద్వివేది మాట్లాడారు. తూర్పు లద్దాఖ్‌లో ఎల్‌ఏసీ వెంబడి 2020 ఏప్రిల్ ముందు నాటి పరిస్థితులు మళ్లీ రావాలని కోరుకుంటున్నామని, ఆ దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సరిహద్దుల్లో ఎలాంటి ప్రతికూల పరిణామాలు ఎదురైనా దీటుగా బదులిచ్చేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు.

డేరా బాబాకు షరతులతో పెరోల్

చండీగఢ్: వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు, డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రాం రహీమ్ అలియాస్ డేరా బాబాకు హరియాణా ప్రభుత్వం షరతులతో కూడిన పెరోల్ మంజూరు చేసింది. హరియాణాలో బస చేయరాదని, ఎన్నికల సంబంధ ఎలాంటి కార్యక్రమాల్లోనూ పాలుపంచుకోరాదని ఆంక్షలు విధించింది. 2017నాటి ఇద్దరు శిష్యురాళ్లపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల శిక్ష పడిన బాబా రొహతక్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ఆయన వినతి మేరకు ప్రభుత్వం తాజాగా 20 రోజుల పెరోల్ మంజూరు చేసింది. హరియాణాలో ఈ నెల 5న అసెంబ్లీ ఎన్నికలున్నందున నిబంధనావళికి లోబడి ఈసీ అంగీకారంతో ఈ మేరకు ఆదేశాలిచ్చింది. పెరోల్ సమయంలో యూపీలోని బర్నావా ఆశ్రమంలో ఉంటానని డేరా బాబా చెప్పారు. ఈయనకు గతంలోనూ పలుమార్లు పెరోల్ ఇచ్చారు. పంజాబ్, హరియాణాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల సమయంలోనే ఆయనకు ఈ వెసులుబాట్లు దక్కడం గమనార్హం.

ఇంజనీర్ రషీద్ బెయిల్ 12 దాకా పొడిగింపు

న్యూఢిల్లీ: బారాముల్లా ఎంపీ ఇంజనీర్ రషీద్ మధ్యంతర బెయిల్‌ను ఢిల్లీ కోర్టు ఈనెల 12 దాకా పొడిగించింది. అక్టోబరు 13న జైలు అధికారులకు లొంగిపోవాలని అడిషనల్ సెషన్స్ జడ్జి చందర్‌జిత్ సింగ్ మంగళవారం ఆదేశించారు. అవామీ ఇత్తెహాద్ పార్టీ అధ్యక్షుడైన షేక్ అబ్దుల్ రషీద్ (ఇంజనీర్ రషీద్) జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో ప్రచారం నిమిత్తం మధ్యంతర బెయిల్‌ను కోరగా.. కోర్టు సెప్టెంబరు 10న మంజూరు చేసింది. అక్టోబరు 2 దాకా బెయిల్ ఇచ్చింది. దీన్ని పెంచాలని కోరగా కోర్టు 12వ తేదీదాకా మధ్యంతర బెయిల్‌ను పొడిగించింది. ఉగ్రవాదులకు నిధుల అందించిన కేసులో ఇంజనీర్ రషీద్ 2019 నుంచి తీహార్ జైలులో ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో జైలు నుంచే స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి మాజీ సీఎం ఒమర్‌అబ్దుల్లాపై ఘనవిజయం సాధించారు.

ఎఫ్‌సీఐ డిపోల్లో ఆధునిక నిఘా

మొత్తం 561 డిపోల్లో 23,750 సీసీటీవీ కెమెరాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆహార ధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణీలో కీలకమైన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) డిపోల్లో నిఘా వ్యవస్థ కట్టుదిట్టం కానుంది. దేశవ్యాప్తంగా ఉన్న 561 డిపోల్లోని కార్యకలాపాలపై సమర్థవంతమైన నిఘా కోసం ప్రస్తుతం ఉన్న అనలాగ్ సీసీటీవీ నిఘా వ్యవస్థను ఆధునిక ఐపీ–ఆధారితంగా అప్‌గ్రేడ్ చేస్తోంది. కొత్తగా ఏర్పాటయ్యే 23,750 కెమెరాలతో హై–రిజల్యూషన్ ఇమేజింగ్, మెరుగైన స్కేలబిలిటీ, రిమోట్ యాక్సెస్ ద్వారా పర్యవేక్షణ సామర్థ్యాలు గణనీయంగా మెరుగుపడతాయని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ పేర్కొంది. 2013–14లో 61 డిపోల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, 2014–15లో వాటి సంఖ్య 67కి పెరిగింది. 2018 నాటికి 446 డిపోలకు విస్తరించింది. ప్రస్తుతం మొత్తం 561 ఎఫ్‌సీఐ డిపోలు సీసీ కెమెరాల నిఘాలో ఉన్నాయి.

సావర్కర్‌పై వ్యాఖ్యలు.. పరువు నష్టం కేసు రాహుల్ గాంధీకి నాసిక్ కోర్టు సమన్లు

ముంబై: హిందుత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ దాఖలైన పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి నాసిక్ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దీపాలీ పరిమళ్ కదుస్కర్ సెప్టెంబర్ 27న సమన్లు జారీ చేశారు. 'దేశభక్తుడైన సావర్కర్‌కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు పరువునష్టం కలిగించేవిగా ఉన్నట్లు ప్రాథమికంగా తేలింది'అని అందులో పేర్కొన్నారు. రాహుల్ స్వయంగా గానీ లేదా న్యాయప్రతినిధి ద్వారా గానీ కేసు తదుపరి విచారణ రోజు హాజరు కావాల్సి ఉంటుంది. అయితే, మేజిస్ట్రేట్ తదుపరి విచారణ తేదీని నిర్ణయించలేదు. 2022 నవంబర్‌లో రాహుల్ గాంధీ హింగోలీలో జరిగిన సభలో ప్రసంగం, మీడియాతో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ఫిర్యాదు చేసినట్లు ఎన్‌జీవో డైరెక్టర్ అయిన పిటిషనర్ తెలిపారు. 'సావర్కర్ తనను జైలు నుంచి విడుదల చేయాలని బ్రిటిష్ పాలకులను చేతులెత్తి వేడుకున్నారు. విడుదలయ్యాక వలస పాలకులకు అనుకూలంగా సావర్కర్ పనిచేశారు'అంటూ రాహుల్ అభ్యంతరకర మాట్లాడారని పిటిషనర్ పేర్కొన్నారు.

'హ్యున్‌మూ' క్షిపణిని ప్రదర్శించిన దక్షిణ కొరియా

భూగర్భ బంకర్లను తుత్తునియలు చేసే సత్తా దీని సొంతం

సియోల్: వరుస క్షిపణి ప్రయోగాలతోపాటు, అణ్వాయుధాలను ప్రయోగిస్తామంటూ ఉత్తరకొరియా పాలకుడు కిమ్ తరచూ చేస్తున్న రెచ్చగొట్టే ప్రకటనలపై దక్షిణ కొరియా దీటుగా స్పందించింది. అణ్వాయుధ ప్రయోగానికి ప్రయత్నిస్తే అందుకు తగురీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించింది. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ డేను పురస్కరించుకుని మంగళవారం సియోల్‌లో అత్యంత శక్తివంతమైన బాలిస్టిక్ క్షిపణి హ్యున్‌మూ–5 సహా అధునాతన 340 రకాల ఆయుధాలు, ఆయుధ వ్యవస్థలను ప్రదర్శించింది. పరేడ్‌కు హాజరైన ప్రముఖులు, వేలాదిమంది జవాన్లను ఉద్దేశించి ఈ సందర్భంగా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ మాట్లాడారు. 'మాపై అణ్వాయుధాలను ప్రయోగించేందుకు ఉత్తరకొరియా ప్రయత్నించిన పక్షంలో మా సైన్యం, ఊహించని రీతిలో దీటైన జవాబిస్తుంది. ఉత్తరకొరియా పాలకులకు అదే చివరి రోజవుతుంది. తమను కాపాడేది అణ్వాయుధాలేనన్న భ్రమలను ఉత్తరకొరియా పాలకులు వదిలేయాలి'అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. హ్యున్‌మూ–5 క్షిపణి 8 టన్నుల భారీ సంప్రదాయ వార్‌హెడ్ కలిగి ఉంటుంది. భూమి లోపలి అండర్ గ్రౌండ్ బంకర్లను సైతం తుత్తునియలు చేసే సత్తా దీని సొంతం. ఈ క్షిపణిని మొట్టమొదటిసారిగా దక్షిణ కొరియా ప్రదర్శించింది. పరేడ్ సమయంలో అమెరికా లాంగ్ రేంజ్ బి–1బీ బాంబర్‌తోపాటు దక్షిణకొరియా అత్యాధునిక ఫైటర్ జట్లు ఆ ప్రాంతంలో చక్కర్లు కొట్టాయి. దక్షిణ కొరియా వద్ద అణ్వాయుధాలు లేవు. ఉత్తర కొరియా అణ్వాయుధ కార్యక్రమాన్ని దీటుగా ఎదుర్కొనే లక్ష్యంతో దక్షిణ కొరియా ప్రభుత్వం 'స్ట్రాటజిక్ కమాండ్' సెంటర్‌ను కూడా ప్రారంభించింది.

ఉక్రెయిన్ మార్కెట్‌పై దాడి.. ఏడుగురు మృతి

కీవ్: ఉక్రెయిన్‌లోని ఖెర్సన్ నగరంలోని మార్కెట్‌పై మంగళవారం రష్యా ఆర్మీ జరిపిన దాడిలో ఏడుగురు చనిపోగా ముగ్గురు గాయపడ్డారు. నగరం నడిబొడ్డున ఉన్న మార్కెట్‌లోని దుకాణాల నుంచి నడిచి వెళ్తున్న జనంపై ఫిరంగి దాడి జరిగిందని ప్రాంతీయ గవర్నర్ ప్రొకుడిన్ చెప్పారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను ఆయన విడుదల చేశారు. రవాణా శాఖ కార్యాలయానికి అతి సమీపంలో ఉందని, రష్యాయే ఈ దాడికి పాల్పడి ఉంటుందని ఆయన ఆరోపించారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దాడి మొదలుపెట్టిన తొలినాళ్లలోనే ఖెర్సన్‌ను రష్యా స్వాధీనం చేసుకుంది. రష్యా ఆక్రమించుకున్న నాలుగు రీజియన్లలో ఇదొకటి. ఇక్కడ పోరాటం జరుగుతున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం రష్యా దృష్టంతా డొనెట్స్క్‌పైనే ఉంది. రష్యా సైన్యాన్ని దళాలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి.

మళ్లీ బెంగాల్ డాక్టర్ల ఉద్యమబాట

- ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకపోవడంతో ఆగ్రహం
- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్తంభించిన వైద్య సేవలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్య, అత్యాచారం వ్యవహారంపై ఆందోళనలు మళ్లీ ప్రారంభమయ్యాయి. బాధితురాలి కుటుంబానికి ఇప్పటికీ న్యాయం జరగకపోవడం, తమ డిమాండ్ల పరిష్కారానికి బెంగాల్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆగ్రహంపై వ్యక్తం చేస్తూ వైద్యులు మరోసారి ఆందోళన బాటపట్టారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి రోడ్డెక్కారు. రాజధాని కోల్‌కతా సహా వివిధ నగరాలు, పట్టణాల్లో నిరసన ర్యాలీలు చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ మమతా బెనర్జీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. తమకు తగిన రక్షణ కల్పించాలని, ఆసుపత్రుల్లో భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరవధికంగా విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. అన్ని హాస్పిటళ్లలో ఇన్–పేషెండ్, ఔట్–పేషెంట్ విభాగాల్లో అత్యవసర విధులకు తప్పనిసరిగా హాజరుకావాలని సుప్రీంకోర్టు సూచించిన మరుసటి రోజే డాక్టర్లు తమ డిమాండ్లపై ఆందోళన ప్రారంభించడం గమనార్హం.

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆగస్టు 9న మహిళా వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. మహిళా డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, తమకు రక్షణకల్పించాలని డిమాండ్ చేస్తూ వైద్యులు ఆందోళన ప్రారంభించారు. క్రమంగా ఇదొక భారీ ఉద్యమంగా మారింది. దేశవ్యాప్తంగా పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు వారికి మద్దతు ప్రకటించాయి. బెంగాల్‌లో 42 రోజులపాటు డాక్టర్ల పోరాటం కొనసాగింది. సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడంతోపాటు బెంగాల్ ప్రభుత్వం పలు హామీలు ఇవ్వడంతో వైద్యులు పోరాటం విరమించారు. సెప్టెంబర్ 21న విధుల్లో చేరారు. కానీ, డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో వైద్యులు మండిపడుతున్నారు. మళ్లీ పోరాటానికి శ్రీకారం చుట్టారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల్లో వైద్య సేవలు దాదాపు స్తంభించిపోయాయి. రోగులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. బుధవారం నుంచి ఆందోళన ఉధృతం చేస్తామని డాక్టర్లు తేల్చిచెప్పారు.

జమైకా విశ్వసనీయ భాగస్వామి భారత్

ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ

- జమైకా ప్రధాని ఆండ్రూ హోల్‌నెస్‌తో సమావేశం
- భారత్–జమైకా మధ్య నాలుగు ఒప్పందాలు

న్యూఢిల్లీ: జమైకా అభివృద్ధి ప్రయాణంలో భారత్ ఎల్లప్పుడూ విశ్వసనీయమైన భాగస్వామిగా సహకరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జీవ ఇంధనం, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు తదితర కీలక రంగాల్లో తమ అనుభవాన్ని జమైకాతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జమైకా ప్రధానమంత్రి ఆండ్రూ హోల్‌నెస్, నరేంద్ర మోదీ మంగళవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారత్– జమైకా మధ్య నాలుగు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్‌కు చెందిన యూపీఐ చెల్లింపుల వ్యవస్థను జమైకాలోనూ ప్రారంభించే ఒప్పందం వీటిలో ఉంది. ఆండ్రూ హోల్‌నెస్, నరేంద్ర మోదీ విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. వేర్వేరు రంగాలపై తమ అభిప్రాయాలు పంచుకున్నారు. కలిసి పని చేయాలని నిర్ణయానికొచ్చారు. ప్రధానంగా రక్షణ, ఇంధన రంగాల్లో పరస్పర సహకారం మరింత పెంపొందించుకోవాలని తీర్మానించారు. సమావేశం అనంతరం ఇరువురు నేతలు ఒక ప్రకటన విడుదల చేశారు. జమైకా సైన్యానికి శిక్షణ ఇస్తామని ప్రధాని మోదీ తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఆండ్రూతో చర్చించానని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, రక్షణ కోసం భారత్, జమైకా కలిసి పనిచేస్తాయని ఉద్ఘాటించారు. సంఘర్షణలు, సంక్షోభాలను చర్చలు, దౌత్య మార్గాల్లో శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నదే తమ రెండు దేశాల విధానమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, భారత్, జమైకా సంబంధాలకు గుర్తుగా ఢిల్లీలో ఓ రహదారికి 'జమైకా మార్గ్'గా నామకరణం చేశారు. మరోవైపు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తోనూ ఆండ్రూ సమావేశమయ్యారు.


ఆండ్రూ హోల్‌నెస్‌తో ప్రధాని మోదీ

గాంధీజీ హాజరైన రౌండ్ టేబుల్ సమావేశం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ



భారత రాజ్యాంగం చారిత్రక నేపథ్యం

నెహ్రూ నివేదిక (1928)

భారత వ్యవహారాల కార్యదర్శి లార్డ్ బిర్కెన్ హెడ్ 1927 నవంబర్‌లో బ్రిటన్ ఎగువసభలో మాట్లాడుతూ 'అందరికీ సమ్మతమైన రాజ్యాంగాన్ని భారతీయులు రూపొందించగలరా?' అని సవాలు విసిరారు. ఈ సవాలును స్వీకరించిన భారత జాతీయ కాంగ్రెస్ 1928 మే 19న బొంబాయిలో అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించింది. 1928 ఆగస్టు 10న రాజ్యాంగ రచనకు మోతీలాల్ నెహ్రూ అధ్యక్షుడిగా 8 మంది సభ్యులతో కూడిన ఉపసంఘాన్ని నియమించింది. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దీనికి కార్యదర్శిగా పనిచేశారు.

ముఖ్యాంశాలు

- భారతదేశానికి డొమినియన్ (స్వయంప్రతిపత్తి) ఇవ్వడం.
- భాషాప్రయుక్త రాష్ట్రాలు, స్వయం ప్రతిపత్తి రాష్ట్రాలు అనే అంశాల ఆధారంగా దేశంలో సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేయడం.
- కార్యనిర్వాహక శాఖ.. శాసన శాఖకు బాధ్యత వహించడం.
- అల్పసంఖ్యాక వర్గాల వారికి శాసనమండళ్లలో కనీసం 10 సంవత్సరాల పాటు కొన్ని స్థానాలను కేటాయించడం.
- 19 ప్రాథమిక హక్కులను కల్పించడం.

గమనిక: మొదటిసారిగా ప్రాథమిక హక్కులను సూచించింది - నెహ్రూ రిపోర్టు.

1929లో బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సైమన్ కమిషన్ నివేదిక, భారత్‌లో రాజ్యాంగపరమైన సంస్కరణలపై చర్చించడానికి రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేశారు. నాటి బ్రిటన్ ప్రధానమంత్రి రామ్ సే మెక్‌డొనాల్డ్ చొరవతో రాజప్రతినిధి (వైస్రాయ్) ఇర్విన్‌ను ఇంగ్లండ్‌కు రప్పించారు. భారతీయుల సమస్యల గురించి చర్చించడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తుందని, ఇందులో పాల్గొనడానికి అన్ని పార్టీలు, వర్గాలకు ఆహ్వానం వస్తుందని మెక్‌డొనాల్డ్ ఒక ప్రకటన చేశారు.

మొదటి రౌండ్ టేబుల్ సమావేశం

1930 నవంబర్ 12 నుంచి 1931 జనవరి 19 వరకు మొదటి రౌండ్ టేబుల్ సమావేశం లండన్‌లో జరిగింది. ఇందులో 89 మంది ప్రముఖ రాజనీతిజ్ఞులు పాల్గొన్నారు. కానీ భారత జాతీయ కాంగ్రెస్ పాల్గొనలేదు. ఈ సమావేశంలో 'భావి భారత రాజ్యాంగం సమాఖ్యగా ఉండాలా? లేదా ఏక కేంద్రంగా ఉండాలా?' అనే అంశంపై చర్చించారు. కాంగ్రెస్ పాల్గొనకపోవడం వల్ల చర్చలో వాస్తవమైన ప్రగతి సాధ్యం కాలేదు. సమావేశంలో పాల్గొనని ప్రజా వర్గాల సహకారం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పి ప్రధానమంత్రి మెక్‌డొనాల్డ్ సమావేశాన్ని ముగించారు.

మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో ముస్లిం లీగ్ తరఫున జిన్నా, అగాఖాన్, మహ్మద్ అలీ, మహ్మద్ షా, ఫజల్ హక్; హిందూ మహాసభ తరఫున మూంజే, జయకర్; ఉదారవాదుల తరఫున తేజ్ బహదూర్ సప్రూ, చింతామణి, శ్రీనివాస శాస్త్రి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్; హైదరాబాద్ దివాన్ అక్బర్ హైదర్ పాల్గొన్నారు.

రెండో రౌండ్ టేబుల్ సమావేశం

1931 సెప్టెంబర్ 7 నుంచి డిసెంబర్ 7 వరకు లండన్‌లో రెండో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇర్విన్‌తో చేసుకున్న ఒడంబడిక ప్రకారం కాంగ్రెస్ తరఫున గాంధీజీ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇందులో అన్ని స్వదేశీ సంస్థానాధిపతులతో పాటు 107 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి మహిళా ప్రతినిధిగా సరోజినీ నాయుడు, బలహీన వర్గాల తరఫున డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ముస్లిం వర్గాలకు రెండు కొత్త ప్రావిన్సులను (నార్త్ వెస్టర్న్ ప్రావిన్స్, సింధ్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గాంధీజీ దీన్ని 'విభజించు, పాలించు' విధానంగా భావించి తీవ్రంగా వ్యతిరేకించారు. అల్పసంఖ్యాక వర్గాల సమస్యపై ఈ సమావేశం ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. బ్రిటిష్ ప్రధానమంత్రి, తాను దారులు వేరయ్యే చోటుకే వచ్చానని గాంధీజీ ప్రకటించారు.

కమ్యూనల్ అవార్డు (1932)

మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యానికి సంబంధించి నాటి బ్రిటన్ ప్రధాని రామ్‌సే మెక్‌డొనాల్డ్ 1932 ఆగస్టు 4న ఒక ప్రతిపాదన చేశారు. దీన్ని 'కమ్యూనల్ అవార్డు' అంటారు. దీని ప్రకారం ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లకే కాకుండా షెడ్యూల్డ్ కులాలకు కూడా ప్రత్యేక నియోజక గణాలను ప్రతిపాదించారు. దీన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమర్థించారు. మహాత్మాగాంధీ దీన్ని వ్యతిరేకిస్తూ పుణేలోని ఎరవాడ కారాగారంలో 1932 సెప్టెంబర్ 20న ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. రాజాజీ, మదన్‌మోహన్ మాలవ్య లాంటి నాయకులు చొరవ తీసుకొని అంబేద్కర్, గాంధీజీతో చర్చించి దీక్షను విరమింపజేశారు. 1932 సెప్టెంబర్‌లో 'పుణే ఒప్పందం' కుదిరింది. తద్వారా కమ్యూనల్ అవార్డు కంటే ఎక్కువగా షెడ్యూల్డ్ కులాలకు అవకాశాలు లభించాయి.

మూడో రౌండ్ టేబుల్ సమావేశం

1932 నవంబర్ 17 నుంచి డిసెంబర్ 24 వరకు లండన్‌లో మూడో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బ్రిటిష్ ప్రభుత్వం సమస్యలు సృష్టిస్తారని భావించిన వారెవరికీ ఆహ్వానం పంపలేదు. అందువల్ల కాంగ్రెస్ ప్రతినిధులు సమావేశానికి హాజరు కాలేదు. ఇంగ్లండ్‌లోని లేబర్ పార్టీ కూడా దీనికి సహకరించలేదు. ఇందులో అంతకు ముందు నియమించిన ఉపసంఘాల నివేదికలపై చర్చించారు. ఈ సమావేశంలో చేసిన సిఫార్సులకు సంబంధించిన అనేక అంశాలను 1935 భారత ప్రభుత్వ చట్టంలో పొందుపరిచారు. ఈ సమావేశానికి కేవలం 46 మంది ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు.

భారత ప్రభుత్వ చట్టం-1935

బ్రిటిషర్లు రూపొందించిన రాజ్యాంగ సంస్కరణ చట్టాలన్నింటిలో ఇది వివరణాత్మకమైంది, సుదీర్ఘమైంది. 1937 ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఈ చట్టంలో 321 ప్రకరణలు, 10 షెడ్యూళ్లు, 14 భాగాలు ఉన్నాయి.

ముఖ్యాంశాలు

- అఖిల భారత సమాఖ్య ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందులో 11 రాష్ట్రాలు, 6 చీఫ్ కమిషనర్ల ప్రాంతాలు, సమాఖ్యలో చేరడానికి అంగీకరించిన స్వదేశీ సంస్థానాలు ఉంటాయి.
- కేంద్రం, రాష్ట్రాల మధ్య 3 జాబితాల ప్రకారం అధికార విభజన ఉంటుంది. కేంద్ర జాబితాలో 59, రాష్ట్ర జాబితాలో 54, ఉమ్మడి జాబితాలో 36 అంశాలు ఉంటాయి.
- అవశిష్ట అధికారాలను వైస్రాయ్‌కి ఇచ్చారు. స్వదేశీ సంస్థానాలు ఈ సమాఖ్యలో చేరకపోవడం వల్ల ఇది అమల్లోకి రాలేదు.
- రాష్ట్రాల్లోని ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేసి కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రతిపాదించారు. కేంద్రంలో పాలనాంశాలను రిజర్వుడు, ట్రాన్స్‌ఫర్డ్ అంశాలుగా విభజించారు.
- గవర్నర్ జనరల్.. రిజర్వుడు అంశాలను తాను నియమించిన ముగ్గురు కౌన్సిలర్ల సహాయంతో పాలిస్తాడు. ట్రాన్స్‌ఫర్డ్ అంశాల కోసం ఒక మంత్రిమండలిని నియమించి, దీని సహాయంతో పాలనను పర్యవేక్షిస్తారు. ఈ మంత్రిమండలిలో సభ్యులు 10 మందికి మించకూడదు.
- రాష్ట్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు. దేశంలోని మొత్తం 11 రాష్ట్రాలకుగాను ఆరు (బెంగాల్, బొంబాయి, మద్రాసు, బిహార్, అస్సాం, యునైటెడ్ ప్రావిన్స్) రాష్ట్రాల్లో దీన్ని ప్రవేశపెట్టారు.
- భారత రాజ్య కార్యదర్శికి ఉన్న కౌన్సిల్‌ను రద్దుచేశారు. ఇతడికి సహాయకంగా ముగ్గురి కంటే తక్కువ కాకుండా, ఆరుగురికి మించకుండా సలహాదార్లను నియమించారు.
- కేంద్ర శాసనసభల పరిమాణాన్ని పెంచారు. సభ్యుల సంఖ్యను ఎగువసభ (కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్)లో 260కి, దిగువ సభ (లెజిస్లేటివ్ అసెంబ్లీ)లో 375కు పెంచారు.
- కమ్యూనల్ ప్రాతినిధ్యాన్ని కొనసాగించారు. ఈ సదుపాయాన్ని షెడ్యూల్డ్ కులాలవారికి, మహిళలకు వర్తింపజేశారు.
- ఓటు హక్కును విస్తృతపరిచారు. జనాభాలో 10 శాతం మందికి ఓటు హక్కు వర్తింపజేశారు.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య సమాఖ్య వివాదాలను పరిష్కరించడానికి ఫెడరల్ కోర్టు (సుప్రీం కోర్టు)ను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు ఇతర న్యాయమూర్తులు ఉంటారు. అయితే దీని తీర్పులే సర్వోన్నతం కాదు. వీటిపై ఇంగ్లండులో ఉండే ప్రివికౌన్సిల్‌కు అప్పీల్ చేసుకోవచ్చు.
- ఈ చట్టం ద్వారా బర్మాను భారతదేశం నుంచి వేరు చేశారు. అదేవిధంగా ఒరిస్సా, సింధ్ అనే రెండు కొత్త ప్రావిన్సులను ఏర్పాటు చేశారు. బ్రిటిష్ ఇండియాపై బ్రిటిష్ పార్లమెంట్ సర్వాధిపత్యాన్ని పునరుద్ఘాటించారు.
- కేంద్రంలో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్రాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటు చేశారు. భారతదేశంలో విత్త విధానం, రుణ నియంత్రణ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను స్థాపించారు.

చట్టం ప్రాముఖ్యత: ఈ చట్టం ద్వారా పొందుపరచిన అత్యంత ముఖ్యమైన అంశం 'ప్రాంతాల స్వయంప్రతిపత్తి'. దీని ద్వారా మొదటిసారిగా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ప్రాంతీయ పాలనాంశాలన్నింటినీ మంత్రుల ఆధీనంలోకి బదిలీ చేశారు. కేంద్రం నియంత్రణ చాలా వరకు తగ్గింది. గవర్నర్లను రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధమైన అధిపతులుగా పరిగణించారు.

ముఖ్యాంశాలు

- బానిసత్వానికి ఒక నూతన చట్టం, భారత దేశంపై బలవంతంగా రుద్దారు. ఇంజన్ లేకుండా కేవలం గట్టి బ్రేకులున్న యంత్రం. - జవహర్‌లాల్ నెహ్రూ
- భారతదేశంలో గోచరించే భూస్వామ్య వ్యవస్థను దృఢం చేయడానికి బ్రిటిష్ పాలకులు ఆడిన నాటకం. **- సుభాష్ చంద్రబోస్**
- కచ్చితంగా పిచ్చిది, సమూలంగా చెడ్డది, మొత్తానికి అనంగీకారమైంది. **- జిన్నా**
- ఈ చట్టాన్ని మా మీద బలవంతంగా రుద్దారు. బాహ్యంగా దీనికి కొంత ప్రజాస్వామ్య రూపం ఉన్నట్లు కనిపించినా లోపల మాత్రం అంతా శూన్యం. **- పండిట్ మదన్‌మోహన్ మాలవ్య**
- ఈ చట్టం ద్వారా వైస్రాయ్‌కి ముస్సోలిని, హిట్లర్‌ను తలపించే నియంతృత్వ అధికారాలు ఇచ్చారు. ఇది పొట్టి మనుషులు కట్టిన అవమానకరమైన గొప్ప కట్టడం. - విన్‌స్టన్ చర్చిల్

లిన్‌లిత్‌గో ఆగస్టు ప్రతిపాదనలు

భారత వైస్రాయ్ లార్డ్ లిన్‌లిత్‌గో 1940 ఆగస్టు 8న కొన్ని ప్రతిపాదనలను చేశాడు.

ముఖ్యాంశాలు

- రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత భారతదేశానికి డొమినియన్ ప్రతిపత్తి కల్పించే విషయాన్ని పరిశీలించడం. రాజకీయ పార్టీల ప్రాతినిధ్యంతో రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటు చేయడం.
- వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులకు గవర్నర్ జనరల్ కార్య నిర్వాహక మండలిలో సభ్యత్వం కల్పించి మండలిని విస్తృతం చేయడం.
- రాజ్యాంగ పరిషత్తులో అల్పసంఖ్యాక వర్గాల వారికి సముచిత ప్రాతినిధ్యం ఇవ్వడం.
- అన్ని రాజకీయ పార్టీలు, సంస్థానాల ప్రతినిధులతో కూడిన యుద్ధ సలహా మండలి ఏర్పాటు చేయడం.

ఈ ప్రతిపాదనలను రాజకీయ పార్టీలు తిరస్కరించాయి.

క్రిప్స్ ప్రతిపాదనలు (1942)

బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ 1942 మార్చి 11న ఒక ప్రకటన ద్వారా భారత రాజ్యాంగ సమస్య విషయంలో అక్కడి నాయకులతో సంప్రదింపుల నిమిత్తం కేబినెట్ మంత్రి సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌ను భారతదేశానికి పంపిస్తున్నట్లుగా పేర్కొన్నాడు. క్రిప్స్ 1942 మార్చి 22న భారతదేశానికి వచ్చాడు. ఇతడి ప్రతిపాదనల ప్రకారం బ్రిటిష్ ప్రభుత్వం రాజ్యాంగ పరిషత్తుకు సంబంధించి మొదటిసారిగా అధికారిక ప్రకటన చేసింది.

ముఖ్యాంశాలు

- భారత్‌కు అవసరమైన కొత్త రాజ్యాంగాన్ని నిర్మించడానికి ఎన్నుకున్న రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటవుతుంది. భారతదేశానికి వీలైనంత త్వరలో స్వయంప్రతిపత్తి లభిస్తుంది.
- రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం అమల్లో ఉన్న రాజ్యాంగాన్ని కలిగి ఉండవచ్చు లేదా నూతన రాజ్యాంగాన్ని రూపొందించుకోవచ్చు.
- గవర్నర్ జనరల్ కార్య నిర్వాహక మండలిలో ఒక భారతీయుడికి సభ్యత్వం ఇస్తారు.

క్రిప్స్ ప్రతిపాదనలను మహాత్మాగాంధీ తీవ్రంగా విమర్శించారు. ఇవి 'దివాళా తీస్తున్న బ్యాంకు మీద ముందస్తు తేదీ వేసిన ఒక చెక్కు లాంటివి' అని వ్యాఖ్యానించారు.

మాక్స్ ప్లాంక్ ప్రతిపాదించిన సిద్ధాంతం?

పరమాణు నిర్మాణం

ప్లాంక్ క్వాంటం సిద్ధాంతం ప్రకారం విద్యు దయస్కాంత వికిరణం ప్యాకెట్ రూపంలో ఉంటుంది. దీన్నే క్వాంటా అంటారు.

- ప్లాంక్ తన క్వాంటం సిద్ధాంతాన్ని ఉపయోగించి కృష్ణ వస్తువు వికిరణాన్ని విశదీకరించాడు.
- ప్లాంక్ స్థిరాంకం (h) విలువ = 6.625×10^{-27} ఎర్గ్ సెకన్ లేదా 6.625×10^{-34} జౌల్ సెకన్.
- బోర్ స్థిర కక్ష్యలను K, L, M, N అక్షరాలతో లేదా 1, 2, 3, 4 అంకెలతో సూచించాడు.
- బోర్ నమూనా హైడ్రోజన్ వర్ణ పటాన్ని, హైడ్రోజన్ వంటి He^{+} Li^{2+}...అయాన్‌ల వర్ణపటాలను విశదీకరించింది.
- అయస్కాంత క్షేత్రంలో వర్ణపటరేఖలు, చిన్న చిన్న ఉపరేఖలుగా విడిపోయాయి. దీన్నే జీమన్ ఫలితం అంటారు.
- ఒక స్థిర కక్ష్యలో తిరుగుతున్న ఎలక్ట్రాన్ కోణీయ ద్రవ్యవేగం $(mvr) = nh/2\pi$ పూర్ణాంకంగా ఉంటుంది. $(mvr) = nh/2\pi$
- దీర్ఘ వృత్తాకార కక్ష్యలను ప్రవేశపెట్టిన శాస్త్ర వేత్త ఆర్నాల్డ్ సోమర్‌ఫెల్డ్. ఎలక్ట్రాన్‌కు కణ స్వభావం, తరంగ స్వభావం ఉంటుందని పేర్కొన్న శాస్త్ర వేత్త డీబ్రోగ్లీ.

- **కేంద్రకంలోని ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌లను న్యూక్లియాన్‌లు అంటారు.**
- **మొట్టమొదటి పరమాణు నమూనాను ప్రతి పాదించిన శాస్త్రవేత్త జె.జె. థామ్సన్.**
- **రూథర్ ఫర్డ్ పరమాణు నమూనానే గ్రహమండల లేదా న్యూక్లియర్ నమూనా అంటారు.**

- జర్మనీ శాస్త్రవేత్త ఇర్విన్ శ్రోడింజర్ హైడ్రోజన్ పరమాణువులోని ఎలక్ట్రాన్‌కు తరంగ సమీకరణాన్ని ప్రతిపాదించాడు.
- ప్రధాన క్వాంటం సంఖ్య (n)ను ప్రతిపాదించిన శాస్త్రవేత్త నీల్స్‌బోర్. ప్రధాన క్వాంటం సంఖ్య (n) కక్ష్య పరిమాణం, శక్తిని సూచిస్తుంది.
- అజిముతల్ క్వాంటం సంఖ్య (l)ను ప్రతిపాదించిన శాస్త్రవేత్త సోమర్‌ఫెల్డ్. అజిముతల్ క్వాంటం సంఖ్యను కోణీయ ద్రవ్యవేగ క్వాంటం సంఖ్య అని కూడా అంటారు. l గరిష్ఠ విలువ $n-1$
- అజిముతల్ క్వాంటం సంఖ్య ఉప స్థిరకక్ష్య ఆకృతిని తెలియజేస్తుంది.
- l విలువ 0 అయితే s ఆర్బిటాల్, l విలువ 1 అయితే p ఆర్బిటాల్, l విలువ 2 అయితే d ఆర్బిటాల్, l విలువ 3 అయితే f ఆర్బిటాల్.
- అయస్కాంత క్వాంటం సంఖ్య (m)ను ప్రతిపాదించిన శాస్త్రవేత్త లాండే.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
కెమిస్ట్రీ

- ఒక 'l' విలువకు ఉన్న మొత్తం m విలువల సంఖ్య = $2l+1$
- సమాన శక్తి ఉన్న స్థాయిలను సమశక్తి స్థాయిలు అంటారు.
- అయస్కాంత క్వాంటం సంఖ్య (m) ఆర్బిటాల్ దృగ్విన్యాసాన్ని తెలియజేస్తుంది.
- స్పిన్ క్వాంటం సంఖ్యను ఉలెన్‌బెక్, గౌడ్‌స్మిత్‌లు ప్రతిపాదించారు.
- స్పిన్ క్వాంటంసంఖ్య (s) విలువలు +1/2, –1/2 మాత్రమే.
- ఎలక్ట్రాన్‌ను కనుగొనే సంభావ్యత ఉన్న ప్రాంతాన్ని పరమాణు / ఆర్బిటాల్ అంటారు.
- s – ఆర్బిటాల్ గోళాకారంగా ఉంటుంది. p – ఆర్బిటాల్ డంబెల్ ఆకారాన్ని, d – ఆర్బిటాల్ డబుల్ డంబెల్ ఆకారాన్ని కలిగి ఉంటాయి.
- p – ఆర్బిటాళ్లు L కర్పరం నుంచి, d – ఆర్బిటాళ్లు M కర్పరం నుంచి, f–ఆర్బిటాళ్లు N కర్పరం నుంచి ఉంటాయి.
- ఆఫ్ భౌ నియమం ప్రకారం ఎలక్ట్రాన్ తక్కువ శక్తి ఉన్న ఆర్బిటాల్‌ను ఆక్రమించుకొంటుంది.
- పౌలీ వర్జన నియమం ప్రకారం రెండు ఎలక్ట్రాన్‌లకు నాలుగు క్వాంటం సంఖ్యలు సమానం కావు.
- హుండ్ నియమం ప్రకారం సమశక్తి ఆర్బిటాళ్లలో ఒక్కొక్క ఎలక్ట్రాన్ నిండిన తర్వాతనే జతకూడుతాయి.
- పరమాణు కేంద్రకానికి, బాహ్య ఆర్బిటాల్‌కు మధ్య ఉండే దూరాన్ని పరమాణు వ్యాసార్ధం అని అంటారు. దీన్ని ఆంగ్‌స్ట్రాం యూనిట్స్‌లో కొలుస్తారు. ($1A^{\circ} = 10^{-8}$ సె.మీ.)
- వాయుస్థితిలో ఉన్న పరమాణు బాహ్య కర్పరం నుంచి ఎలక్ట్రాన్‌ను తీసి వేసేం దుకు కావాల్సిన శక్తి పరిమాణాన్ని అయనీకరణ శక్మం అంటారు.

అయనీకరణ శక్మం ప్రమాణాలు

- ఎలక్ట్రాన్ వోల్ట్ (ev) లేదా కి.కా. మోల్ లేదా కి.జౌ మోల్స్1
- అయనీకరణ శక్మం.. కేంద్రక ఆవేశం, పరమాణు సైజు, అయాన్ ఆవేశాలపై ఆధారపడి ఉంటుంది.
- వాయుస్థితిలో తటస్థ పరమాణువు భూస్థాయిలో ఉన్నప్పుడు ఒక ఎలక్ట్రాన్‌ను చేర్చితే విడుదలయ్యే శక్తిని ఎలక్ట్రాన్ అఫినిటీ అంటారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. క్రోమియం (Z=24) ఎలక్ట్రాన్ విన్యాసం? (డీఎస్సీ-2006)
   1) $[Ar]4s^1 3d^5$ 2) $[Ar]4s^2 3d^1$
   3) $[Ar]4s^2 3d^5$ 4) $[Ar]4s^2 3d^4$
2. పరమాణువులో వృత్తాకార కక్ష్య 'l' గరిష్ఠ విలువ? (డీఎస్సీ-2012)
   1) 0 2) 1 3) –1 4) 1/2
3. అతిచిన్న పరమాణు వ్యాసార్ధం ఉన్న మూలకం? (డీఎస్సీ-2003)
   1) లిథియం 2) సోడియం
   3) హీలియం 4) హైడ్రోజన్
4. ఒక పరమాణు ద్రవ్యరాశి ప్రమాణం విలువ గ్రాముల్లో? (డీఎస్సీ-2012)
   1) 1.64×10^{-24}
   2) 1.602×10^{-19}
   3) 1.602×10^{-23} 4) 6.023×10^{-23}
5. $1s^2\ 2s^2\ 2p^6\ 3s^2\ 3p^6\ 4s^2$ ఎలక్ట్రాన్ విన్యాసంగా గల మూలకం సంకేతం? (డీఎస్సీ-2003)
   1) Mn 2) Si 3) Mg 4) Ca
6. ఆర్బిటాళ్ల శక్తుల ఆధారంగా సరైన క్రమం? (డీఎస్సీ-2012)
   1) 3d, 4s, 4p, 4d
   2) 4s, 3d, 4p, 5s
   3) 3d, 4s, 4d, 4p
   4) 3d, 4s, 4p, 5s
7. కింది వాక్యాల్లో సరైనవి? (డీఎస్సీ-2008)
   ఎ) కేథోడ్ కిరణాలు పల్చని రేకుల ద్వారా చొచ్చుకుపోతాయి
   బి) X – కిరణాలు ప్రయాణ మార్గం లోని వాయువులను అయనీ కరిస్తాయి
   సి) కేథోడ్, X – కిరణాలు zns వంటి పదార్థాలపై పడినప్పుడు ప్రతి దీప్తిని కలిగిస్తాయి
   1) ఎ, బి, సి 2) బి, సి
   3) ఎ, బి 4) ఎ, సి

సమాధానాలు

1) 1; 2) 1; 3) 4; 4) 1; 5) 4; 6) 2; 7) 1.

మాదిరి ప్రశ్నలు

1. దీర్ఘ వృత్తాకార కక్ష్యలను ప్రవేశపెట్టిన శాస్త్రవేత్త?
   1) బోర్ 2) శ్రోడింజర్
   3) జీమన్ 4) సోమర్‌ఫెల్డ్
2. 3p, 4s, 3d, 4pలలో దేనికి అత్యల్ప శక్తి ఉంటుంది?
   1) 4s 2) 3p 3) 3d 4) 4p
3. p – ఆర్బిటాల్ ఆకృతి?
   1) గోళాకృతి
   2) సంక్లిష్టం
   3) డబుల్ డంబెల్
   4) డంబెల్
4. L కర్పరంలో ఉండే ఉపకర్పరాలు?
   1) s, d 2) s, p, d
   3) s, p 4) s, p, d, f
5. మాక్స్ ప్లాంక్ ప్రతిపాదించిన సిద్ధాంతం?
   1) తరంగ 2) విద్యుదయస్కాంత
   3) క్వాంటం 4) కణ సిద్ధాంతం
6. 3d ఆర్బిటాల్ n + l విలువ?
   1) 4 2) 5 3) 6 4) 8
7. పరమాణు వ్యాసార్థానికి ప్రమాణాలు?
   1) ఆంగ్‌స్ట్రాం యూనిట్స్
   2) కిలో కాలరీ
   3) ev
   4) ఫారడ్స్
8. పరమాణు సంఖ్య (Z) పరమాణువులోని ___ కు సమానం?
   1) న్యూట్రాన్ 2) న్యూట్రినో
   3) ఎలక్ట్రాన్ లేదా ప్రోటాన్
   4) పాజిట్రాన్
9. రూథర్ ఫర్డ్ పరమాణు నమూనాను ___ నమూనాగా వ్యవహరిస్తారు?
   1) పుచ్ఛకాయ 2) గ్రహమండల
   3) స్థిర కక్ష్య 4) దీర్ఘవృత్తాకార
10. ప్రోటాన్‌ల ద్రవ్యరాశి, ఎలక్ట్రాన్‌ల ద్రవ్యరాశి కంటే ఎన్ని రెట్లు ఎక్కువ?
    1) 2350 2) 1837
    3) 1950 4) 2000
11. పరమాణు కేంద్రక వ్యాసార్థం సుమారుగా?
    1) 10^{-8}cm 2) 10^{-15}mt
    3) ఒక ఫెర్మీ 4) 2, 3
12. న్యూక్లియాన్‌లు అంటే?
    1) ఎలక్ట్రాన్, ప్రోటాన్‌లు
    2) ఎలక్ట్రాన్, న్యూట్రాన్లు
    3) ప్రోటాన్లు, న్యూట్రాన్లు
    4) ఏవీ కావు
13. పరమాణువులోని తటస్థ కణాన్ని కనుగొన్న శాస్త్రవేత్త?
    1) రూథర్ ఫర్డ్ 2) జేమ్స్ చాడ్విక్
    3) గోల్డ్ స్టెయిన్ 4) జె.జె. థామ్సన్
14. ${}_{11}Na^{23}$లోని న్యూట్రాన్‌ల సంఖ్య?
    1) 11 2) 23 3) 12 4) 34
15. n విలువ పెరిగే కొద్దీ పెరిగేవి?
    1) కక్ష్య సైజు, శక్తి 2) కేంద్రకం సైజు
    3) కేంద్రకం ఆవేశం
    4) పరమాణు ద్రవ్యరాశి
16. కిందివాటిలో సరైన క్వాంటం సంఖ్యల విలువలను చూపనిది?
    1) n = 1 l = o m = o s = +1/2 2) n = 2 l = 1 m = –2 s = +1/2
    3) n = 1 l = 1 m = –1 s = –1 4) n = 2 l = 0 m = +1 s = –1/2
17. హాలోజన్‌ల ఎలక్ట్రాన్ ఎఫినిటీ క్రమం?
    1) F > Cl > Br > I 2) Cl > F > Br > I
    3) Br > F > I > Cl 4) I > Br > Cl > F
18. అయస్కాంత క్షేత్ర సమక్షంలో వర్ణపట రేఖలు చిన్నచిన్న ఉపరేఖలుగా విడి పోవడాన్ని ఏమంటారు?
    1) స్టార్క్ ఫలితం 2) కాంప్టన్ ఫలితం
    3) జీమన్ ఫలితం
    4) కాంతి-విద్యుత్ ఫలితం
19. కేంద్రకానికి దగ్గరగా ఉండేది?
    1) 4f 2) 6p 3) 5s 4) 5d
20. బోర్ పరమాణు సిద్ధాంతం తెలిపేది?
    1) క్వాంటం సంఖ్యలు 2) శక్తి స్థాయిలు
    3) ఉపశక్తి స్థాయిలు4) ఆర్బిటాళ్ల ఆకృతులు
21. పరమాణువులో ఎలక్ట్రాన్‌ను కనుగొనే సంభావ్యత అత్యధికంగా ఉన్న ప్రదేశం?
    1) స్థిర కక్ష్య 2) ఆర్బిట్
    3) ఆర్బిటాల్
    4) నోడల్ ప్రదేశం
22. N కక్ష్యలో ఉండే ఎలక్ట్రాన్‌ల గరిష్ఠ సంఖ్య?
    1) 2 2) 8 3) 16 4) 32
23. f ఆర్బిటాళ్లు ఏ కర్పరంలో ఉంటాయి?
    1) K 2) L 3) M 4) N
24. $3d^{10}\ 4s^1$ వేలన్సీ ఎలక్ట్రాన్ విన్యాసం ఉండే పరమాణువు?
    1) Ar 2) Cu 3) Cr 4) Zn
25. ప్లాంక్ సమీకరణం?
    1) $E = h/\upsilon$ 2) $E = mc^2$
    3) $mc^2 = h\upsilon$ 4) $E = h\upsilon$
26. ప్రధాన క్వాంటం సంఖ్య తెలిపే ధర్మం?
    1) కక్ష్యసైజు 2) కక్ష్య శక్తి
    3) 1, 2 4) కక్ష్య ఆకారం
27. బోర్ నమూనా వేటికి వర్తిస్తుంది?
    1) అన్ని పరమాణువులకు
    2) అన్ని ఆర్బిటాళ్లకు
    3) ఒకే ఎలక్ట్రాన్‌ను కలిగిన అయాన్ లేదా పరమాణువుకు
    4) అన్ని అయాన్‌లకు
28. n ప్రధాన క్వాంటం సంఖ్య అయితే అజిముతల్ క్వాంటం సంఖ్య 'l' గరిష్ఠ విలువ?
    1) n 2) n+1 3) n–1 4) n–2

సమాధానాలు

1) 4; 2) 2; 3) 4; 4) 3; 5) 3; 6) 2; 7) 1; 8) 3; 9) 2; 10) 2; 11) 4; 12) 3; 13) 2; 14) 3; 15) 1; 16) 3; 17) 2; 18) 3; 19) 1; 20) 2; 21) 3; 22) 4; 23) 4; 24) 2; 25) 4; 26) 3; 27) 3; 28) 3.

అతి తక్కువ కొవ్వు ఉన్న జీవి ఏది?

జీర్ణనాళంలోని ఏయే భాగాల్లో ఏ జీర్ణక్రియలు జరుగుతాయి? జీర్ణరసాల్లోని ఏ ఎంజైమ్‌లు ఈ చర్యలను నిర్వహిస్తాయి? జీర్ణ గ్రంథులు ఏమిటి? జీర్ణనాళాల క్రమం, నిర్మాణం మొదలైవాటి నుంచి దాదాపు అన్ని పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతున్నారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

జీర్ణ వ్యవస్థ

మనం తీసుకునే ఆహారంలో శోషణ చెందని సంక్లిష్ట అణువులను, శోషణ చెందే సరళ అణువులుగా మార్చే ప్రక్రియను 'జీర్ణక్రియ' అంటారు. ఇది జీర్ణ వ్యవస్థలో జరుగుతుంది. జీర్ణవ్యవస్థలో జీర్ణనాళం, దాని అనుబంధ గ్రంథులు ఉం టాయి. జీర్ణ గ్రంథులు విడుదల చేసే జీర్ణ రసాల్లోని ఎంజైమ్‌లు జీర్ణక్రియను నిర్వహిస్తాయి.

జీర్ణనాళం:

మానవునిలో జీర్ణనాళం నోటితో మొదలై పాయువుతో అంతమౌతుంది. నోరు నోటికుహరంలోకి తెరుచుకుంటుంది. ఇది మళ్లీ గ్రసనిలోకి, తర్వాత ఆహారవాహికలోకి; ఆహారవాహిక జీర్ణాశయంలోకి; జీర్ణాశయం చిన్నపేగులోకి తెరుచుకుంటుంది. చిన్నపేగులో ఆంత్రమూలం, జెజునం, ఇలియం అనే మూడు భాగాలు ఉంటాయి. చిన్నపేగు పెద్ద పేగులోకి తెరుచుకుంటుంది. చిన్నపేగు, పెద్దపేగు మధ్య ఉండూకం (అపెండిక్స్) అనే అవశేష అవయవం ఉంటుంది. పెద్దపేగులో కోలన్, పురీష నాళం అనే భాగాలుంటాయి. చివర్లో ఇది పాయువు అనే రంధ్రం ద్వారా తెరుచుకుంటుంది. ఈ జీర్ణనాళంలోని నోటి కుహరం జీర్ణాశయం, ఆంత్రమూలం, జెజునంలలో జీర్ణక్రియ లు జరుగుతాయి. ఇలియం అనే భాగంలో జీర్ణమైన ఆహారం రక్తంలోకి శోషణం చెందుతుంది. జీర్ణంకాని వ్యర్థమంతా పెద్దపేగు ద్వారా సాగుతూ మలంగా మారి విసర్జితమవుతుంది.

నోటి కుహరంలో జీర్ణక్రియ:

నోటి కుహరంలో మూడు జతల లాలాజల గ్రంథులు లాలాజలాన్ని విడుదల చేస్తాయి. లాలాజలం స్వల్ప ఆమ్లస్థితిలో ఉంటుంది. దీంట్లో అమైలేజ్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఆహారంలోని స్టార్చ్‌ను మాల్టోజ్‌గా మారుస్తుంది. క్షీరదాల్లో నాలుగు జతల లాలాజల గ్రంథు లు ఉంటాయి. నోటిలోని ఆహారం బోలస్ అనే ముద్దగా ఆహారవాహికలో చేరుతుంది. ఆహారవాహిక ప్రదర్శించే పెరిస్టాలిసిస్ అనే కదలికల ద్వారా ఆహారం జీర్ణాశయంలోకి చేరుతుంది.

జీర్ణాశయంలో జీర్ణక్రియ:

జీర్ణాశయం లోపలి తలంలో ఉన్న జఠర గ్రంథుల నుంచి జఠర రసం విడుదలవుతుంది. ఈ జీర్ణరసంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం, పెప్సిన్ ఉంటాయి. పెప్సిన్ అనే ఎంజైమ్ ఆహారంలోని ప్రోటీన్‌లను ప్రోటియేజెస్, పెప్టోన్స్‌గా విచ్ఛిన్నం చెందిస్తుంది.

జెజునంలో జీర్ణక్రియ:

జెజునం అనే చిన్నపేగు రెండో భాగంలో జీర్ణక్రియ పూర్తవుతుంది. జెజునం లోపలి తలంలో ఆంత్రగ్రంథులు విడుదల చేసే ఆంత్రరసంలోని ఎంజైమ్‌లు జీర్ణక్రియను పూర్తిచేస్తాయి. ఆంత్రరసంలోని మాల్టేజ్ అనే ఎంజైమ్ మాల్టోజ్‌ను రెండు గ్లూకోజ్‌లుగా విచ్ఛిన్నం చేస్తుంది. లాక్టేజ్ అనే ఎంజైమ్ లాక్టోజ్‌ను ఒక గ్లూకోజ్, ఒక గాలక్టోజ్‌గా విచ్ఛిన్నం చేస్తుంది. అదేవిధంగా సుక్రేజ్ సమక్షంలో సుక్రోజ్, ఒక గ్లూకోజ్, ఒక ఫ్రక్టోజ్‌గా విచ్ఛిన్నమవుతుంది. ఎరిప్సిన్ ఎంజైమ్ సమక్షంలో పెప్టైడ్‌లు, అమైనో ఆమ్లాలుగా విచ్ఛిన్నం అవుతాయి. ఆంత్రలైపేజ్ సమక్షంలో డైగ్లిసరైడ్స్ అన్నీ కొవ్వు ఆమ్లాలు, గ్లిసరాల్‌గా విచ్ఛిన్నమవుతాయి. ఈవిధంగా జీర్ణమైన ఆహారమంతా చిన్నపేగు మూడో భాగమైన ఇలియంలో రక్తంలోకి శోషణం చెందుతుంది. ఇందుకోసం ఇలియం ఉపరితలమంతా సూక్ష్మ చూషకాలు అనే వేళ్లాకార నిర్మాణాల్లోకి మడతలు పడి ఉంటుంది. ఇవి ఆహార శోషణ ఉపరితల వైశాల్యాన్ని పెంచుతాయి. జీర్ణం కాని వ్యర్థమంతా పాయువు ద్వారా విసర్జితమవుతుంది.

ఆంత్రమూలంలో జీర్ణక్రియ:

జీర్ణాశయంలో జీర్ణక్రియ పూర్తయిన తర్వాత ఆహారం ఆమ్లయుతంగా మారడానికి ఆంత్రమూలంలోకి చేరుతుంది. వెంటనే కాలేయం నుంచి పైత్యరసం, క్లోమం నుంచి క్లోమరసం ఆంత్రమూలంలోకి విడుదలవుతాయి. పైత్యరసంలో ఎంజైమ్‌లు ఉండవు. పైత్యరస వర్ణదాలు, పైత్యరస లవణాలు ఉంటాయి. బైలీరూబిన్, బైలీవర్డిన్ అనే విష రసాయనాలు మలం నుంచి విసర్జితమవుతాయి. సోడియం, పొటాషియంల టారోక్లోరేట్‌లు, గ్లైకోక్లోరేట్‌లు అనేవి పైత్యరస లవణాలు. ఆహారంలోని కొవ్వుల ఎమల్సిఫికేషన్‌ను నిర్వహిస్తుంది.

క్లోమరసంలోని ఎంజైమ్‌లు ఆంత్రమూలంలో జీర్ణక్రియను నిర్వహిస్తాయి. నోటి కుహరంలో జీర్ణం కాని స్టార్చ్‌ను అమిలోప్సిన్ అనే ఎంజైమ్ మాల్టోజ్‌గా విచ్ఛిన్నం చేస్తుంది. ట్రిప్సిన్, కైమోట్రిప్సిన్ అనే ఎంజైమ్‌లు ప్రోటియేజ్‌లు, పెప్టోన్‌లను పెప్టైడ్‌లుగా విచ్ఛిన్నం చేస్తుంది. అదేవిధంగా కొవ్వులను క్లోమరస లైపేజ్ (స్టియాప్సిన్) డైగ్లిజరైట్స్, కొవ్వు ఆమ్లంగా విచ్ఛిన్నం చేస్తుంది. ఈవిధంగా ఆహారం ఆంత్రమూలంలో జీర్ణమవుతూ క్లోమ, పైత్యరసాలతో కలిసి క్షారయుతంగా మారుతుంది.




దంతాలు:

దవడ ఎముకల్లోని ప్రత్యేక సంచుల లాంటి నిర్మాణాల్లో దంతాలు అమరి ఉంటాయి. క్షీరదాల్లో ఎక్కువగా అసమదంతాలు.. ముఖ్యంగా నాలుగు రకాల దంతాలు ఉంటాయి. కుంతకాలు కొరికే దంతాలు. రదనికలు చీల్చే దంతాలు. ఇవి మాంసాహార జీవుల్లో బాగా అభివృద్ధి చెందుతాయి. అగ్రచర్వణకాలు నమిలే దంతాలు. సాధారణంగా శిశువు పుట్టిన తర్వాత వచ్చేవి పాలదంతాలు. ఇవి 20 ఉంటాయి. ప్రతి దవడ అర్ధభాగంలో రెండు కుంతకాలు, ఒక రదనిక, రెండు చర్వణకాలు ఉంటాయి. ఇవన్నీ ఊడిపోయి మళ్లీ వస్తాయి. ఇలా రెండు సార్లు ఏర్పడే దంతాల సంఖ్య 20. ఆ తర్వాత ఒకే సారి ఏర్పడేవి 12. ఇవన్నీ చర్వణకాలు. ఇవి ప్రతి దవడ అర్ధభాగంలో మూడు ఉంటాయి. ఇలా శాశ్వత దంతాలు 32 ఉంటాయి. ప్రతి దవడ అర్ధ భాగంలో రెండు కుంతకాలు, ఒక రదనిక, రెండు అగ్రచర్వణకాలు, మూడు చర్వణకాలు ఉంటాయి. ప్రతి దవడ అర్ధభాగంలోని చివరి చర్వణం జ్ఞాన దంతం. ఇవి మొత్తం నాలుగు ఉంటాయి. 18 నుంచి 31 ఏళ్ల మధ్య ఇవి వస్తాయి. సాధారణంగా దంత నిర్మాణంలో వేరు, మెడ, కిరీటం అనే మూడు భాగాలు ఉంటాయి. బయటకు కన్పించే భాగం కిరీటం. మొత్తం దంతం డెంటిన్ అనే అస్థి పదార్థంతో తయారవుతుంది. కిరీటంపై మెరిసే పింగాణి ((ఎనామిల్) ఉంటుంది. ఇది శరీరంలో అత్యంత గట్టి పదార్థం. దంత విన్యాసాన్ని భిన్నం రూపంలో తెలియజేస్తారు. పైదవడ అర్ధ భాగంలోని దంతాలను కుంతకాలు, రదనికలు, అగ్రచర్వణకాలు, చర్వణకాల క్రమంలో లవంలో, కింది దవడలోని దంతాలను అదే క్రమంలో హారంలో చూపించడాన్నే 'దంతవిన్యాసం' అంటారు.

కాలేయం

శరీరంలోని వైవిధ్యమైన విధులను నిర్వహించే అవయవం కాలేయం.



- ఇది శరీరంలో అతి పెద్ద గ్రంథి.
- దీని బరువు 1560 గ్రాములు.
- ఇది విషనిర్మూలన అవయవంగా పనిచేస్తుంది.
- ప్రోత్రాంబిన్, ఫెబ్రినోజన్ అనే రక్త స్కంధన కారకాలు, హెపారిన్ అనే రక్తస్కంధన నివారిణి కాలేయంలోనే ఉత్పత్తి అవుతాయి.
- మూత్రంలో విసర్జించే యూరియా కాలేయంలోనే ఉత్పత్తి అవుతుంది.
- గ్లూకోనియోజెనిసిస్, గ్లైకోజెనిసిస్, గ్లైకోజెనోలైసిస్ ప్రక్రియలు కాలేయంలో జరుగుతాయి. కొవ్వులో కరిగే విటమిన్‌లు ఎ, డి, ఎఫ్, కెలతోపాటు మరికొన్ని బి-కాంప్లెక్స్ విటమిన్‌లు కాలేయంలో నిల్వ ఉంటాయి.
- మానవ కాలేయంలో నాలుగు లంబికలు ఉంటాయి. క్షీరదాల కాలేయంలో ఐదు లంబికలు ఉంటాయి.
- కాలేయానికి సంబంధించిన శాస్త్రీయ అధ్యయనాన్ని 'హెపటాలజీ' అంటారు.
- ఏకారణం వల్లనైనా కాలేయ విధులకు అవరోధం ఏర్పడితే కామర్లు (జాండిస్) సంభవించే ప్రమాదం ఉంటుంది.
- పిండాభివృద్ధి సమయంలో కాలేయం నుంచి రక్తం, రక్తకణాలు ఏర్పడతాయి.

మాదిరి ప్రశ్నలు

1. శరీరంలో పునరుత్పత్తి శక్తి ఉన్న అవయవం?
   1) క్లోమం 2) కాలేయం
   3) ఉండూకం 4) ప్లీహం
2. చిన్నపేగులోని పొడవైన భాగం?
   1) ఇలియం 2) జెజునం
   3) ఆంత్రమూలం 4) కోలన్
3. పొడవైన రదనికలు ఉన్న జీవి?
   1) సీల్ 2) ఆటర్
   3) వాల్‌రస్ 4) బీవర్
4. కిందివాటిలో అవశేష అవయవం ఏది?
   1) ఉండూకం 2) బాహ్య చెవి
   3) అనుత్రికం 4) పైవన్నీ
5. లాలాజలం pH విలువ?
   1) 5.2 2) 6.7
   3) 7.4 4) 8.0
6. అతి తక్కువ కొవ్వు ఉన్న జీవి?
   1) ఆవు 2) గేదె
   3) మేక 4) ఒంటె
7. పసి పిల్లల జఠర రసంలో ప్రత్యేకంగా కన్పించే ఎంజైమ్?
   1) కెసిన్ 2) రెనిన్
   3) పారాకెసిన్ 4) గ్యాస్ట్రిన్
8. కిందివాటిలో హార్మోన్‌ను గుర్తించండి.
   1) గ్యాస్ట్రిన్ 2) సెక్రిటిన్
   3) ప్యాంక్రియోజైమిన్ 4) పైవన్నీ
9. మానవుడు జీర్ణం చేసుకోలేని పదార్థమేది?
   1) సెల్యూలోజ్ 2) సుక్రోజ్
   3) స్టార్చ్ 4) పైవన్నీ
10. ఏ గ్రంథులను Krypts of Leber-kuhn అంటారు?
    1) లాలా జల గ్రంథులు 2) క్లోమం
    3) జఠర గ్రంథులు 4) ఆంత్ర గ్రంథులు
11. కిందివాటిలో టేబుల్ షుగర్ ఏది?
    1) మాల్టోజ్ 2) సుక్రోజ్
    3) లాక్టోజ్ 4) స్టార్చ్
12. చిన్న పేగు పొడవు ఎంత?
    1) 6.5 మీ. 2) 8.5 మీ.
    3) 12 మీ. 4) 2 మీ.
13. పిండి పదార్థాలను జీర్ణం చేసే ఎంజైమ్?
    1) ప్రోటియేజెస్ 2) లైపేజెస్
    3) అమైలేజెస్ 4) ఏదీకాదు
14. పిత్తాశయ సంకోచాన్ని ప్రేరేపించే హార్మోన్?
    1) సెక్రిటిన్ 2) గ్యాస్ట్రిన్
    3) ఎంటిరో గ్యాస్ట్రిన్
    4) కొలిసిస్టో కైనిన్

సమాధానాలు

1) 2 2) 1 3) 3 4) 4 5) 2
6) 4 7) 2 8) 4 9) 1 10) 4
11) 2 12) 1 13) 3 14) 4

విద్య, ఉద్యోగావకాశాలు

హాల్ బెంగళూరులో వివిధ ఉద్యోగాలు

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్)కు చెందిన రోటరీ వింగ్ అకాడమి(ఆర్‌డబ్ల్యూఏ)–హెలికాప్టర్ డివిజన్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- » **పోస్టుల వివరాలు:** ఫ్లైయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్–02, టెక్నికల్ ట్రేడ్స్‌మ్యాన్–01, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ/ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 65 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **వేతనం:** నెలకు ఫ్లైయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ పోస్టులకు రూ.1,64,560, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులకు రూ.82,280, టెక్నికల్ ట్రేడ్స్‌మ్యాన్ రూ.43,054.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్ల పరిశీలన, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డిప్యూటీ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్), హెలికాప్టర్ డివిజన్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, పోస్ట్ బాక్స్ నెం–1790, విమనపుర పోస్ట్, బెంగళూరు చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 12.10.2024.
- » **వెబ్‌సైట్:** http://hal-india.co.in

ఎస్ఎస్‌సీటీయూ, ములుగులో బీఏ కోర్సుల్లో ప్రవేశాలు

ములుగులోని సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ(ఎస్ఎస్‌టీయూ)లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- » **బీఏ ఇంగ్లిష్(ఆనర్స్):** **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ప్లస్ టూ(ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా), సీయూఈటీ–యూజీ 2024 ఉత్తీర్ణులై ఉండాలి.
- » **బీఏ ఎకనామిక్స్(ఆనర్స్):** **అర్హత:** ఏదైనా స్ట్రీమ్‌లో కనీసం 60 శాతం మార్కులతో ప్లస్ టూ(ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా), సీయూఈటీ–యూజీ 2024 ఉత్తీర్ణులై ఉండాలి. సెమిస్టర్లు: 08.
- » **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు.
- » **ప్రవేశ ప్రక్రియ:** మొదటి ప్రాధాన్యంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే సీయూఈటీ–యూజీ 2024 స్కోరు, రెండో ప్రాధాన్యంగా ఇంటర్ విద్యార్హత ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » **స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్:** 03.10.2024.
- » **వేదిక:**యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ భవనం), ట్రాన్సిట్ క్యాంపస్,జాకారం గ్రామం,ములుగు.
- » **వెబ్‌సైట్:** https://ssctu.ac.in

How is boy related to Reema?



BANK EXAMS

REASONING

Blood Relations

1. P is the brother of Q, M is sister of Q. T is brother of P. How is Q related to T?
   1) Brother 2) Sister
   3) Brother or sister
   4) Data inadequate
   5) None of these

Sol: T and P are brothers of Q
The sex of Q is not given
Therefore, Q is either brother or sister of T
Ans: 3

2. Pointing to a boy, Reema said "He is the son of my grandfather's only child". How is boy related to Reema?
   1) Brother 2) Cousin
   3) Sister
   4) Data inadequate
   5) None of these

Sol: Only child of Reema's grandfather means father or mother of Reema. Therefore, the boy is brother of Reema.
Ans: 1

3. If Ramesh's mother's brother is Alok's father's brother, then Ramesh's mother is Alok's?
   1) Grandmother 2) Aunt
   3) Cousin 4) Sister-in-law
   5) None of these

Sol: Aunt
Ans: 2

4. B is only child of C's grandfather's only daughter. How is C's father related to B?
   1) Maternal uncle
   2) Paternal Uncle
   3) Father
   4) Cannot be determined
   5) None of these

Sol: C's grandfather's only daughter is mother of B.
C is cousin of B. Therefore, C's father is maternal uncle of B.
Ans: 1

5. i) P is the sister of Q
   ii) R is the brother of S
   iii) Q is the mother of R
   iv) T is the father of S
   How is P related to S?
   1) Cousin 2) Maternal aunt
   3) Niece 4) Can't be decided
   5) None of these

Sol: P------Q ⟺ T
(f) (f)
R (m) S

P is Maternal Aunt of S.
Ans: 2

6. Pointing to boy Uma said, "He is the son of my mother-in-law's only child. How is the boy related to Uma?
   1) Grandson 2) Son
   3) Nephew 4) Data inadequate
   5) None of these

Sol: Boy is Son of Uma
Ans: 2

7. M is brother of K, P is sister of K, R is father of P. How is K related to R?
   1) Son 2) Daughter
   3) Son or Daughter
   4) Data inadequate
   5) None of these

Sol: R(m) ⟺
M(m) P(f) K(?)

The sex of K is not given
Therefore, K is either son or daughter of R
Ans: 3

8. Pointing to a girl, Mr. Suraj said "She is the only daughter of my father's son-in-law". How is the girl related to Mr. Suraj?
   1) Niece 2) Cousin
   3) Sister 4) Daughter
   5) Can't be determined

Sol: Only daughter of Suraj's brother-in-law is Suraj's niece.
Ans: 1

9. M is brother of K. T is sister of M. J is brother of T. H is father of J. How is K related to H?
   1) Niece 2) Son
   3) Brother 4) Sister
   5) Data inadequate

Sol: Either son or daughter
H(m)
J(m)---------T(f)------M(m)---K

Ans: 5

Directions (Q.10 & 11): These questions are based on the following information
'A × B' means 'A is mother of B'
'A ÷ B' means 'A is son B'
'A + B' means 'A is husband of B'
'A - B' means 'A is sister of B'.

10. Which of the following expressions indicate M is daughter of H?
    1) M – R ÷ H 2) M × R – H
    3) R ÷ M – H 4) H × R – M
    5) None of these

Sol: M – R ÷ H:
H ⟺
M(f)------R(m)

Clearly, M is daughter of H
Ans: 1

11. In F ÷ K × V - T, how is V related to F?
    1) Son 2) Niece 3) Nephew
    4) Can't be determined
    5) None of these

Sol: F ÷ K × V - T:
? ⟺ K(f)
F(m)------ V(f)-------T(?)

Clearly, V is Sister of F.
Ans: 5

Directions (Q.12 & 13): These questions are based on the following information
'P + Q' means 'P is brother of Q'
'P – Q' means 'P is wife of Q'
'P × Q' means 'P is father of Q'
'P ÷ Q' means 'P is daughter of Q'

12. Which of the following expressions indicate T is mother of L?
    1) T – H + L 2) T – H × L
    3) T ÷ H × L 4) T ÷ H + L
    5) None of these

Sol: 2) T – H × L:
H ⟺ T
(m) (f)
L

Ans: 2

13. In F + M × V ÷ R, How is V related to F?
    1) Daughter 2) Son
    3) Niece 4) Nephew
    5) None of these

Sol: F + M × V ÷ R:
F(m) -----------M(m) ⟺ R(f)
V(f)

Ans: 3

Directions (Q.14 & 15): Study the following information carefully and answer the questions given below?
'P × Q' means 'P is brother of Q'
'P – Q' means 'P is sister of Q'
'P ÷ Q' means 'P is father of Q'
'P + Q' means 'P is mother of Q'

14. Which of the following means 'D is nephew of R'?
    1) D × M ÷ R 2) R - M ÷ D
    3) R – M ÷ D × T
    4) R × M + D 5) None of these

Sol: R – M ÷ D × T:
R(f) -----------M(m) ⟺
D(m) T

Ans: 3
Clearly, D is nephew of R.

15. Which of the following means 'M is maternal uncle of T?
    1) M × R + T 2) M × R ÷ T
    3) T × J - N ÷ M 4) M – R + T
    5) None of these

Sol: M × R + T
M(m)-----------R(f) ⟺
T

Clearly, M is maternal uncle of T.
Ans: 1

Directions (Q.16 & 17): Read the following information carefully and answer the questions which follow:
'A × B' means 'A is wife of B'
'A + B' means 'A is brother of B'
'A ÷ B' means 'A is daughter of B'
'A – B' means 'A is son of B'

16. Which of the following means 'T is father of P'?
    1) P + Q × R – T
    2) P ÷ R - T × Q
    3) P + Q ÷ R × T
    4) P - Q + T ÷ R
    5) None of these

Sol:
R(f) ⟺ T(m)
Q(f) -------------- P(m)

Hence, T is father of P
Ans: 3

17. How is Y related to Z if Y × V + W ÷ Z?
    1) Daughter
    2) Father-in-law
    3) Wife
    4) Daughter - in - law
    5) Can't be determined

Sol: Y × V + W ÷ Z
Z ⟺
Y(f) ⟺ V(m) .... W(f)

Clearly, Y is daughter in law of Z.
Ans: 4

Directions (Q.18 & 19): Read the following information carefully and answer the following questions.
If 'A × B' means 'A is wife of B'
If 'A + B' means 'A is brother of B'
If 'A ÷ B' means 'A is daughter of B'
If 'A - B' means 'A is son of B'.

18. Which of the following means 'D is father of A'?
    1) A – B × C + D
    2) D ÷ C - B × A
    3) A + B ÷ C × D
    4) D + B × C - A
    5) None of these

Sol:
D(m) ⟺ C(f)
A(m) B(f)

Hence, D is father of A
Ans: 3

19. How is F related to J if 'F – G ÷ H × J'?
    1) Son 2) Grandson
    3) Son-in-law 4) Father
    5) Grandfather

Sol:
J(m) ⟺ H(f)
G(f)
F(m)

Ans: 2

Directions (Q.20 & 21): Study the following information and answer the questions that follow.
M, N, O, P, Q and R are members of a family. There are two married couples. Lawyer is father of Engineer. N is an engineer and is a father of Q. R is grandfather of O and is a lawyer. P is the grandmother of Q and is a housewife. There is one engineer, one lawyer, one teacher, one housewife and two students in the family.

20. Name the two married couples.
    1) NM, OP 2) NM, RP
    3) OP, MN 4) MN, QR
    5) MQ, OR
21. What is the profession of M?
    1) Engineer 2) Lawyer
    3) Housewife 4) Teacher
    5) Student

Sol: (20 & 21): The given information can be depicted as a family tree, which looks like
(Lawyer R(m) (House Sife) P(f)
(Teacher)M(f) N(m) (Engineer)
(Student) O(x) .... O(x)(Student)

20. NM, RP:
R is the grandfather of O; P is the grandmother of Q.
Therefore, one of the couples = RP
Obviously, O and Q are students
Therefore, another married couple must be NM.
Ans: 2
21. Teacher.
N is an engineer, R is a lawyer, P is a housewife, O and Q are students. Therefore, M is a teacher.
Ans: 4